# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక, మార్చి, 2018 ₹ 30

ISSN 2454–4329



రక్షకురాలు

# మిసిమి

మాసపత్రిక

**సంపుటి 29** **సంచిక 3**

**మార్చి 2018**

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

*సంపాదకుడు : వల్లభనేని అశ్వినీకుమార్*

*సహాయ సంపాదకుడు : కాండ్రేగుల నాగేశ్వర రావు*

*సహకార సంపాదకులు : వోలేటి పార్వతీశం,*
*కరుటూరి విజయ్ చౌదరి*

---

KALA JYOTHI — Since 1946 —

Printed & Published by

**BAPANNA ALAPATI**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,
**Hyderabad - 500 020.**
Ph: 040 - 27612436, 27645538.

---

పత్రిక ప్రతి నెలా ఒకటవ తేది మీ తలుపు తడుతుంది....

ప్రతి : ₹ 30/- సంవత్సరానికి : ₹ 360/-

విదేశాలకు ప్రతి : $ 3.00 సంవత్సరానికి : $ 36.00 (by Air Mail)

కార్యాలయ కార్యదర్శి : వేములు రాణి

ఫోన్ : 040 – 27645536. సెల్ : 994 951 6567.

---

LIBRARY OF CONGRESS

INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE

**LCCN 91-903060** **ISSN 2454-4329**

E-mail : misimi90monthly@gmail.com,
www.misimimonthly.com
e-magazine : www.kinige.com/misimi
facebook.com/misimimaasapathrika
https://twitter.com/MISIMIMONTHLY
YouTube **: Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

**అట్టతో కలిపి 100 పేజీలు**

# మిసిమి

## మార్చి 2018 నెల సూచికలు...


మనోశిల్పం : అందెశ్రీ... 5

కమ్మతెమ్మెరలు : ఉత్తరాలు... 6

మన తెలుగు – ఒక పరిశీలన : డా. ఎం. పురుషోత్తమాచార్య... 9

లలిత కళా అకాడెమీలు : మామిడిపూడి కృష్ణమూర్తి... 13

ఆవుల గోపాలకృష్ణ మూర్తి : కొసరాజు వెంకటేశ్వరరావు... 17

కూనలమ్మ పదాలు : ఆల్తి మోహనరావు... 22

తొలినాళ్ళలో తిరుమల : డా. దేవిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి... 26

అన్నమయ్య ఆధ్యాత్మికత : డా. ఎ. నరసింహ శాస్త్రి... 35

జానపద సామెతలు : జి. రాజా ... 42

అచ్చ తెలుగు రచనలు : జె. రాయమల్లు... 45

ఎడిటర్స్ డైరీ : అశ్వినీకుమార్... 51

సప్త సహోదరీల ప్రాంతం – ఈశాన్య భారతం : ముకుంద రామారావు... 55

గోదావరి కథ : దాట్ల దేవదానం రాజు.... 58

జ్ఞానపీఠ గ్రహీత – కృష్ణా సోబతీ : డా. వెన్నా వల్లభరావు... 69

నిత్య తత్త్వం : కన్నూరి అలెగ్జాండర్... 73

అడవి బతుకులు : డా. వై. సుభాషిణి... 77

వేదిక, పిప్పర : ఐ.వి. రామరాజు... 84... 85

లేఖాసాహిత్యం : సంజీవదేవ్... 86

ఓ తమాషా కుటుంబం : దావులూరి కృష్ణకుమారి... 88

నాగేశ్వరరావు సినిమాల ప్రభావం : ప్రొ. చందుసుబ్బారావు... 89

కవితారస 'పానశాల' : డా. కోడూరు ప్రభాకరరెడ్డి... 91



సిగ్గుల మొగ్గ


రక్షకురాలు

ముఖచిత్రం : సిగ్గుల మొగ్గ (ఫ్రెడరిగో ఆంద్రియోటి)

రెండవ అట్ట : రక్షకురాలు (ఎలర్ట్ జెల్డర్)

మూడవ అట్ట : నిన్నటి కల (మిలేస్)

నాల్గవ అట్ట : అమాయకత్వం (ఫ్రెడరిక్ లీటన్)


నిన్నటి కల


అమాయకత్వం

*వివరాలు 50వ పుటలో...*

# మనోశిల్పం

నా కనుపాపలు
నీ ప్రతిబింబాన్ని
ఎప్పుడో చిత్రీకరించుకున్నవి

నా హృదయాంతరాల
లోయలలో పాయలు పాయలుగా
ప్రవహించే నీ జ్ఞాపకాలను
నిక్షిప్తం చేసుకొన్నవి

నీవు విసిరిన ముసిముసి నవ్వులకు
ఊపిరి సలపకున్నదెందుకో

పిసరంత మిసిమి
పసరు ఛాయల ఉద్దీపన
రసిక శిఖర రాజసం
నా ఉద్గీతలో ఊయలలూగుతోంది

తేనె చినుకుల పాయసాన్ని
ఆస్వాదించినంత తియ్యగా
నీ పెదవులపై మొలకత్తే పదాలు
మసిబారిన నిశీధిని
అక్షర నక్షత్రాలై వెలిగిస్తున్నవి

నీవు నా తలపులలోకి
వస్తే చాలు–
మొగలి రేకుల మేని పరిమళం
ఏమదీ? ఆ స్పర్శ!
నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నదే!

నా మనస్సు ఎప్పుడు ఎప్పుడాయని
విరబూసిన ఇంద్రధనస్సులో
ఏడు రంగులను ఏరుకొంటోంది!

నీ క్రీగంటి చూపులు
విరచించిన రంగుల వలయంలో
బంగరు చేపనైపోదునా?
ప్రణవనాదమై రోదసిలో
పరివ్యాప్తి చెందుదునా??



అందెశ్రీ
ఫోన్: 984 856 0986.

# కమ్మతెమ్మెరలు

✧ "…. మీరు పంపిన పుస్తకాలు – అపురూప అక్షరమాలలు – నన్ను చేరాయి. మిమ్మల్ని విజయవాడ పుస్తక మహోత్సవంలో – ***మిసిమి*** నీడలో కలవటం నా అదృష్టం. మీ అందరితో గడిపిన ఆ క్షణాలు నాకు ఈ వయసులో జీవం పోశాయి – ఎలాగో చెప్పనా? ప్రతి నెలా ***మిసిమి*** నాకు కోదాడ గూటికి చేరుతుంది – పంచవన్నెల చిలుకలా. అందులో నన్ను బాగా ఆనందింపజేసే అక్షరాలను కళ్ళకద్దుకుంటాను. అలాగే కునుకు తీస్తాను. మీ బొమ్మలు నా కలలకు రంగులు పూస్తాయి. మీ అక్షరాలు నాలో ఎన్నో ఆశలు చిగురింపజేస్తాయి…. చిన్నప్పుడు దేవుళ్ళ పటాలు వరుసగా పెట్టి దణ్ణాలు పెట్టుకునేవాణ్ణి… రంగుల, కాదు బంగరు రంగుల హరివిల్లులాగా ***మిసిమి*** సంచికలు వరుసగా నిలబెట్టి ఇప్పుడు రోజూ అపురూపంగా చూసుకుంటాను – ఎందుకో తెలుసా? అవి నాకు ఈ వయసులో ఇంకా కొన్నేళ్ళు బ్రతకాలనే ఆశ కలిగిస్తున్నాయి. ఇంతకంటే ఏమిచెప్పను… నాలాగా ఎంతమంది తమ విశ్రాంత సమయాన్ని ఇంత విశ్రాంతిగా వినియోగిస్తున్నారో కదా – ***మిసిమి*** కలకాలం వర్ధిల్లాలి. ***మిసిమి*** కోసం – కాదు – మాకోసం మీరు వినియోగించే సమయానికి ఏమని విలువకట్టాలి… మాలాంటివాళ్ళకోసమైనా మీరు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ళు నడవాలని మరీమరీ కోరుకుంటూ మీ శ్రేయోభిలాషి…"

*– బంగారు రామాచారి, కోదాడ*

✧ "…. ***మిసిమి*** నాకో వరం. ఇప్పుడు ఆ మిసమిసలే నా ప్రపంచం. ఈ వయసులో మనసులో భావాలు పంచుకునే వేదిక 2014 నుంచి అన్ని సంచికలూ, నెలంతా చదువుతాను. మరొక సంచిక వచ్చేవరకూ చదువుతాను. నా తెలుగు పలుకులు విలువను పెంచుకోవటానికి ఆరాటపడతాను. నా విశ్రాంతి సమయానికి తోడును అందించిన మీకు సదా రుణగ్రస్తుణ్ణి….."

*– రాయవరపు సత్యనారాయణ, కాకినాడ*

✧ "…..నమస్తే! *అధ్యాపకత్రయం* నాటి, నేటి అధ్యాపకుల్లో వచ్చిన, వస్తున్న మార్పులను కళ్ళ ముందుంచినది. విషయపరిజ్ఞానం, అంకిత భావం, విద్యావ్యాప్తి ఎడల నిబద్ధత ఆనాటివారి సొత్తు. అందుకే ఉత్తమ విద్యార్థులు, అధ్యాపకులు పుట్టుకొచ్చారు. అధ్యాపక వృత్తిని ఇష్టపడి చేపట్టడం ముఖ్యకారణం. సమాజ సేవగా భావించడం మరోకారణం. నేటి అధ్యాపకులు చేస్తున్నది ఉద్యోగం. సేవా భావం ఏ కొందరిలోనో ఇంకా ఉన్నదిలెండి. అటువంటివారు ఉత్తమ అధ్యాపకుల శ్రేణికి చెందుతారు, పెద్దాడ రామస్వామిగారు తన ఉపన్యాస ఝరిలో విద్యార్థులను ముంచెత్తారని నేమాని వెంకట్‌రావుగారు చెప్పినట్టు చదివి నాకు ఒళ్ళంతా పులకరించింది. పి.ఆర్. కాలేజ్ అంటే పెద్దాడ రామస్వామి కాలేజ్ అని పిఠాపురం రాజావారు అనేవారని చదివి ఆనందడోలికల్లో విహరించాను. ఎందుకంటే.. నేనుకూడా అధ్యాపకుడంత కాకున్నా కొంత పేరుప్రతిష్టలున్నవాణ్ణి. అటువంటి అధ్యాపకులను ఢీకొన్న విద్యార్థులున్న రోజులవి. ఈ రోజుల్లో దొందు దొందే కదా!…."

*– ప్రొ. పంజాల నరసయ్య, హైదరాబాద్*

✧ "…. జనవరి ***మిసిమి*** పత్రికలోని *సప్తసహోదరీల ప్రాంతం ఈశాన్య భారతం* వ్యాసం చాలా బాగుంది. జీవిత విశేషాలు బాగున్నాయి. రచయితలకు అభినందనలు… *బాధపడిన కవిలో* వేగుంట మోహన్‌ప్రసాద్‌గారు చెప్పిన కొన్ని పచ్చి నిజాలు ఎందరికో బాధ కలిగించినా అవి వాస్తవాలేకదా! గొల్లపూడి మారుతీరావుగారి *మనసున్న వాళ్ళు* కొందరైనా ఇంకా అక్కడక్కడా ఉన్నారని తెలియచెప్పే వ్యాసం. సేవ చేయాలనే సంకల్పం, తదుపరి ఆచరణ, ఎన్నో గొప్ప పనులు చేయటానికి పురికొల్పిన సంఘటనలు బాగా చెప్పుకొచ్చారు. *సిగ్నేచర్ ట్యూన్* మృణాళినిగారు 'మో'గారి సంగీతాభిరుచిని, కవిత్వ గాఢతను చక్కగా చెప్పారు… *మోహనగీతంలో* అశ్వినీకుమార్‌గారు ప్రస్తావించిన మొజార్ట్ – బేతోవిన్… పేర్లు చూడగానే, మా అమ్మాయివాళ్ళు అమెరికాలో బోస్టన్ సమీపంలో ఉంటున్న వాల్‌పోల్ టౌన్‌లోకి వాళ్ళ కమ్యూనిటీ పేరు 'సింఫనీ పార్కు' 'బేతోవిన్

ఎవెన్యూ' – వీధులయితే మోజార్ట్ – హేడక్...' అలా వాళ్ళు ఎంతగా సంగీతాన్ని అభిమానించి ఆ పేర్లు పెట్టుకున్నారా అనిపిస్తుంది. అన్నట్లు 1990, ఆగస్టు **మిసిమి** సంచికలో *నాదబ్రహ్మ బెతోవెన్* అనే 6 పేజీల వ్యాసాన్ని మళ్ళీ చదివించేలా చేసింది. జనవరి సంచిక చాలా బాగుంది......"

*– డా. విజయ బక్ష్, మండపేట*

✧ "…. జనవరి **మిసిమి** పత్రికలోని *వేమన యోగం* నన్నెంతగానో ఆకట్టుకున్నది. రచయిత సిద్ధయ్యా నాయుడుకి అభినందనలు. వేమన పద్యాలపై ఆయన విశ్లేషణ చాలా బాగుంది. నిద్ర గురించి వారు చెప్పినది ఆలోచింపచేస్తుంది. నిద్ర గురించి మనకు తెలియని అనేక విషయాలను విపులంగా విశదీకరించారు. ముఖ్యంగా ముండకోపనిషత్తు గురించి తెలియజేసినందులకు ధన్యవాదాలు. వేమన ఏ ప్రాంతంవాడైనా, ఏ కులస్థుడైనా తర్కవితర్కాల జోలికి పోకుండా వారు చెప్పిన విషయాలను మనం గ్రహించి ఆదరిస్తే అదే మేలు. వేమన గొప్ప సంఘసంస్కర్త. నాటి దురాచారాలను, మూఢవిశ్వాసాలను నిశితంగా ఖండించిన ధీశాలి. విగ్రహారాధనను నిరసించి, తన భావాలను పద్యరూపంలో లోకానికి వెల్లడించిన ధీశాలి..." *– టి. చంద్రరేఖ, అనంతపురం*

✧ "…. జనవరి **మిసిమి**లోని వ్యాసాలు చాలా బాగున్నాయి. అందులో వేమన గురించినది గణనీయంగా ఉంది. వేమన పద్యాలలో ఇంత నిగూడార్థం ఇమిడి ఉన్నదని తేట పరచిన సిద్ధయ్యా నాయుడుగారికి మనసారా అభినందనలు. మరికొన్ని వేమన పద్యాలలోని ఇలాంటి అర్థాలతో వ్యాసాన్ని వారినుండి ఆశిస్తున్నాము. వేమన పద్యాలు సామాన్యంగా ఉన్నా అందులో ఇంత మహత్యం ఉందని తెలిసింది. సామాన్య మానవులకు అతి దగ్గరగా వీరి పద్యాలున్నందున జనబాహుళ్యంలోకి చొచ్చుకుపోయి నానుచున్నవి. ఆబాలగోపాలం వాటిని మనసారా ఆస్వాదించుచున్నారు. వారి రచనా శైలి పాఠకులను రంజింపజేయుచున్నదనుట నిస్సందేహం. **మిసిమి** పత్రిక స్థాయి సాహితీ లోకంలో చిరస్థాయిగా నిలిచిందనుటలో సందేహంలేదు....."

*– ఎ. మహతి, తిరుపతి*

✧ ".....ఈసారి **మిసిమి** కోయిల కూయక ముందే కూసింది. ఫిబ్రవరి సంచిక జనవరి నెలాఖరుకే చేరింది. ఈ సంచికలో రుక్మిణీదేవి అరుండేల్‌గారిపై వ్యాసం ప్రచురించినందుకు నాకెంతో సంతోషంగా ఉంది. నేను 1948–52 సంవత్సరాల మధ్య విజయనగరం మహారాజావారి కళాశాలలో విద్యార్థిగా ఉన్నాను. అప్పుడు బహుశా తొలి సంవత్సరాలలోనే రుక్మిణీదేవిగారు మా కళాశాల వార్షికోత్సవాలకు ముఖ్య అతిథిగా వచ్చారు. అప్పుడు ఆమె వయస్సు 40 సంవత్సరాలు పైబడే. ఆమె చాలా సాదా దుస్తులలోనే ఉన్నారు. ఉపన్యసిస్తూ, ఎటువంటి ఆహార్యము లేకున్నా మధ్యమధ్యలో భరతనాట్య ముద్రలనువేసి చూపిస్తుంటే కేలం మామూలు విద్యార్థులమైన మేము ఆనందంతో చాలాసార్లు చప్పట్లు కొట్టాం. అదీ ఆమె నాట్య ప్రతిభ... జనతా ప్రభుత్వంలో ప్రధానమంత్రిగా ఉన్న మొరార్జీదేశాయిగారు ఆమెను రాష్ట్రపతి అభ్యర్థినిగా ప్రతిపాదించినప్పుడు దానిని అంగీకరించకపోవడం ఆమె వ్యక్తిత్వపు గొప్పతనం. కాని ఆమె అంగీకరించి ఉంటే ఒక కళావిద్వాంసురాలిని రాష్ట్రపతి చేసిన అరుదైన గౌరవం భారతదేశానికి దక్కేది. పనిలో పనిగా మరొకమాట. ఆ రోజుల్లోనే ప్రముఖ వయొలిన్ విద్వాంసులు ద్వారం వెంకటస్వామి నాయుడుగారికి ఆంధ్ర విశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ' బిరుదునిచ్చి సత్కరించింది. ఆ సందర్భంగా మా కళాశాల ఒక సభ ఏర్పాటు చేసి వారిని ఘనంగా సత్కరించింది. సన్మానం అయిన తరువాత ద్వారంవారు దాదాపు ఒక గంటసేపు వయొలిన్ కచేరీ గొప్పగా చేశారు. అందరం మంత్రముగ్ధులమై వింటున్నాం. కచేరీ చివరిలో వారు 'అప్పన్నాతన్నామన్నా మోరోడి బైరన్నా' అన్న జానపద పాటను ఎత్తుకోగానే సభ చప్పట్లతో మారుమ్రోగిపోయింది. ఇన్నేళ్ళ తరువాత కూడ. ఆ ఇద్దరూ నా కళ్ళకు కట్టినట్లు కనిపిస్తున్నారు. ఆ రోజులను ఈ వ్యాసం ద్వారా నాకు జ్ఞాపకం చేసినందుకు రావినూతలవారికి, మీకూ నా కృతజ్ఞతలు!...."

*– కణుగుల వేంకటరావు, శ్రీకాకుళం*

✧ "…..ఇన్నేళ్ళ తర్వాత మళ్ళీ గురువుగారినీ, గురువుగారి నివాసం 'ఛాయ'నీ ఛాయకు అనుసంధానమైన ఎందరో వారి యుగపు ప్రత్యేక సాహితీ స్వరూపుల్నీ, హఠాత్తుగా మనోనేత్రం ముందు నిలిపారు అశ్వినీగారు. తెలంగాణా సాహితీ యుగకర్త కాళోజీ, ఎవ్వరినీ కలవడానికి ఇష్టపడని ఏకాంతవాసి. చండీదాస్, మో గారిని నిలదీసి నిగ్గదీయగల నగ్నముని, రైల్వే చంద్రశేఖరరావుగారు, యగళ్ల, ధర్మాన; యువ రచయితల్ని ప్రోత్సహించేందుకు ఛాయ డాబామీదికొచ్చిన సంజీవదేవ్, ఇస్మాయిల్ ఇలా ఎందరి సాహితీ స్వరూపాలో. మాస్టారి ఛాయలం మేమూ వీలయినపుడెల్లా ఆ చిన్న గేటు తెరుచుకుని చిన్న పూలమొక్కల మధ్య చప్టామీంచి వరండాలో ఊగని చెక్క ఊయలని దాటుకుని మాస్టారి స్టడీలోకి ప్రవేశించి, సుజాతగారిచ్చే టీ సేవిస్తూ శ్రోతలమైపోయేవాళ్ళం. పాతికేళ్ల అదృష్టం మాది… కవి శివారెడ్డీ, నగ్నమునీ మాస్టార్ని మోహన అని సంబోధించేవారు. నగ్నముని అయితే 'హొరే మోహనా' అని పిలిచేవారు. మాస్టారి పేరు 'మో'గా ఎప్పట్నించి మారిందో నాకు తెలుసు…. మాస్టారు వ్రాస్తున్న కాలంలో ఆయన రచనలమీద మాట్లాడటానికీ, వ్రాయడానికీ సాహసించినవారు కొద్దిమంది మాత్రమే. మాట్లాడిన ఒకరిద్దరూ 'ఆయన సాహిత్యంలో నాకు కొన్ని ప్రతీకలు కనుపించినై' అని తప్పుకున్నారు. మాస్టారి రచనలకి ముందుమాటల తరవాత, మాస్టారి కవిత్వంలోను, కవితా వచనంలోను అడుగడుగునా ఎదురయ్యే సంగీతాత్మకత, ఉటంకింపుల గురించి డా. మృణాళినిగారంత సమగ్రంగా వ్రాసినవారు దాదాపు లేరు. మృణాళినిగారు మాస్టారి కవిత్వాన్ని గురించి హృదయంలో కలం ముంచి వ్రాశారు. అందుకు వారికి చేతులెత్తి నమస్కరించినా నాకు తృప్తికలగదు…. తమ పుస్తకాలనన్నిటినీ మాస్టారు స్వహస్తాలతో నాకిచ్చారు. ఆనందంగా వాటినందుకుని, చదువుకుని దాచుకున్నాను. నాకు ఈ జీవితంలో పట్టిన గొప్ప అదృష్టం మాస్టారి ప్రేమ. వారు తమ సంకలనం– 'కరచాలనం' తమ రిటైర్మెంటురోజున విజయవాడ క్లబ్బులో సిద్ధార్థ మేనేజ్‌మెంట్, ఆయన కవిమిత్రులు ఎన్. గోపీలాంటివారి సమక్షంలో నన్ను స్టేజి ఎక్కించి, బట్టలుపెట్టి నాకు అంకితం ఇచ్చారు. నాలాంటి అనామకుడికి మాస్టారిచ్చిన ప్రేమ కానుక అది….. ఆయన ఆత్మీయులకి ఆయనలాంటి స్నేహితులు దొరకరు. నంగితనం ఉన్న సాహిత్యకారులెవరూ ఆయన్ని తొంగి చూడ్డానికే భయపడేవారు. ఆయనలాంటి శ్రేయోభిలాషి అందరికీ దొరకరు… ఆయన మన చిటికెనవేలొదిలి వెళ్ళిపోయాక, ఆయన్ని 'ఓన్' చేసుకోవడానికి వాళ్ళు చేసిన హంగామా, ఆయన ఆత్మీయులకి బాధ కలిగించింది. గోతుల్లో దాక్కున్న మొహం తప్పించిన నక్కలన్నీ ఎలా ఊళలేస్తున్నాయో చూశారా? అని బాధపడ్డాడు మిత్రుడు 'కాళ్ళ'. లోకం తీరు అంతేకద!….. మాస్టారి సాహిత్యం మీద వ్రాయాలంటే వారి హృదయాన్ని తమ హృదయంలోకి ఆవాహన చేసుకుని, ప్రయోపవేశం చేసి పలవరించాలి. డా. మృణాళినిగారు ఆ పనిని అద్భుతంగా నిర్వర్తించారు. మూడురోజులు ఆహ్వానించి తమ విశ్వవిద్యాలయంలో మాస్టారిచేత ఆధునికాంగ్ల కవిత్వంమీద పోయెటిక్ ట్రెండ్స్‌మీదా ఉపన్యాసాలిప్పించుకున్నారు. డీఫెలో ప్రొఫెసర్లు అత్యాధునిక కవితా ప్రక్రియలమీద మాస్టారికున్న అధికారానికి అది గౌరవం… "మీకు ఈతకొట్టడం వచ్చా" అని హఠాత్తుగా అడిగారు ఓ రోజు ఉదయం డిపార్టుమెంటుకి రాగానే. వచ్చన్నాను. ఎలా నేర్చుకున్నారు? అని ప్రశ్న. ఈతను మన పల్లెటూరివాళ్ళకి ఎవరూ నేర్పనక్కర్లా. చిన్నప్పుడు గేదెలు కాశాను. ఈత వచ్చేసింది. అన్నాను. మాస్టారు ఎగ్జయిట్ అయి వెంటనే 'గేదెలు కాసిన కవి' అని ఓ కవిత రాశారు… నేను అచ్చమైన పల్లెటూరివాణ్ణి. మాస్టారు పట్నాల్లో స్థిరపడ్డా ఆయన కవిత్వంనిండా పల్లెటూరి నాస్టాల్జియా. ఆయన సదా పల్లెటూరి బాలకుడు. మాస్టారికున్న సెంటిమెంట్లు బహుశా ఎవరికీ ఉండవేమో!…… డిపార్ట్‌మెంట్‌లో ప్రశాంతంగా కూర్చున్నప్పుడు సాహిత్యాన్ని గురించి ఎన్ని విషయాలు చెప్పేవారో! వారితో వ్యక్తిగతంగా గడిపిన గొప్ప రోజులు, అనుభవాలు ఎన్నో! 'మో'గారి స్మృతుల్ని నిద్రలేపిన అశ్వినీగారికి, 'మో'గారి సాహిత్యంలోని సంగీత పార్శ్వాన్ని హృద్యంగా విశదీకరించిన డా. మృణాళినిగారికి నమస్సులతో….."

*– బి.వి. రామిరెడ్డి, రుద్రవరం*

# మన తెలుగు – ఒక పరిశీలన

– ఎం. పురుషోత్తమాచార్య

అపౌరుషేయాలు అనబడే వేదాల కాలంనుండి ఇప్పటిదాకా జరిగిన కాలాన్ని స్థూలంగా వైదికయుగం, పురాణయుగం, ఐతిహాసికయుగం, చారిత్రకయుగం, ఆధునికయుగం అని 5 రకాలుగా విభజించుకోవచ్చు. మానవుడు భాషను నేర్చిన ప్రాథమికకాలంలోనే భగవంతుడు వేదాలను సృష్టించాడని, అనంతమైన అట్టి వేదాలను వ్యాసుడు సంక్షిప్తపరచి, నాలుగు భాగాలుగా విభజించాడని మన భారతీయుల విశ్వాసం.

వేదాల్లో ఉన్న భాషనే ఆ కాలంలో అందరూ మాట్లాడారని, క్రమంగా మానవ సమూహం జట్లు జట్లుగా విడిపోయి ప్రపంచమంతటా విస్తరించిదని, కాలక్రమేణ ఎక్కడికక్కడే వైదికభాష ఎన్నో రూపాంతరాలు చెంది పలు భాషలుగా స్థిరపడిందని విజ్ఞులు చెబుతున్నారు. ఈ ప్రక్రియకంతటికీ మధ్యాసియా కేంద్రమని, అక్కడినుంచే దక్షిణానికి వచ్చినవారిలో ఆర్యులు, దస్యులు మొదలైన జాతులు ఏర్పడ్డాయని ఊహిస్తున్నారు. వింధ్య పర్వతాలు దాటిరాని ఆర్యులకు దక్షిణాన ఎవరూలేరని, ఏమీ లేదనే భావన కలిగి దాన్ని 'అంధక' (చీకటి) ప్రాంతమని పిలిచేవారు. ఆర్య భాషాకూటమిలో 'అంధ్' పదానికి 'మనిషి' అనే అర్థం కూడా ఉన్నట్లు కొందరి అభిప్రాయం. తరువాత దస్యులు వింధ్య పర్వతాన్ని దాటి దక్షిణ ప్రాంతానికి వచ్చి సముద్ర తీరాలలో నివాసాలు ఏర్పరచుకుని 'ద్రావిడులు' అనే పేరుతో జీవించారని తెలుస్తున్నది.

కాని అప్పటికే వింధ్య పర్వతాన్ని దాటగా వచ్చే తొలి ప్రాంతాలలో పదహారు జనపదాలు విస్తరించుకుని ఉన్నాయి. వీటిలో అశ్మక జన పదాన్ని అంధక దేశంగా వ్యవహరించారు. అశ్మక జన పదాన్ని అస్మక, అస్సక, అళక అనే పేర్లతో కూడా పిలిచేవారు. ఈ జనపదంలో నివసించేవారు కొండ ప్రాంతాలను ఆవాస స్థలాలుగా చేసుకున్నారు. వీరు మాట్లాడిన భాష 'కొడగు' అని కొందరు చరిత్రకారుల అభిప్రాయము. ఈ భాష వైదికభాష నుంచి పుట్టిన ఏ ప్రాంతీయ భాషా లక్షణాన్నీ కలిగియుండక ఒక విలక్షణమైన రూపాన్ని సంతరించుకుని ఉన్నది. దాదాపుగా వీరికి వైదిక భాష పట్టుబడలేదనే చెప్పాలి. చాలా కాలం తరువాత ఈ అశ్మకజనపదాల వారి జనాభా పెరిగేందుకు ఇతర జాతులతో సంబంధ బాంధవ్యాలు ఏర్పడి, వారి భాషల సాహచర్యం కూడా తోడ్పడడంతో కొడగు భాష పైశాచీ భాషలోకి క్రమంగా మారసాగింది. ఇంచుమించు ఈ రెండు భాషల పదవాక్య ప్రయోగాలలో పోలికలెక్కువగా ఉండడంవల్ల 'కొడగు' వెనుకబడిపోయింది.

పదహారు జనపదాలలో మాగధి, శౌరసేని, కాంభోజవంటి జనపదాలవారు మాట్లాడే వైదిక భాషా ప్రభావం పైశాచి భాష మీద కూడ గణనీయంగా పడింది. అయితే వేల సంవత్సరాలు గడిచిపోవడం, వైదికభాష ఆయా జనపదాలలో స్వరూపాన్ని మార్చుకోవడం విపరీతంగా జరిగి మూలవైదికభాషను మరిచిపోయే పరిస్థితికి వచ్చింది. వైదిక భాషను సరిగా

ఉచ్చరించలేక పదస్వరూపాన్ని మార్చేసిన జనపదాలవారి వ్యవహార భాషను వేదపండితులు "ప్రాకృతం" అని పిలిచారు. చదువు రాక అజ్ఞానులైనవారిని 'ప్రాకృతులు' అని వ్యవహరిస్తారు. కనుక అలాంటివారు మాట్లాడే భాషను ప్రాకృతం అన్నారు. అప్పటికి భారతదేశంలోని చాలా ప్రాంతాలు ప్రాకృత భాషలోనే మాట్లాడడం పెరిగిపోయింది.

వేదపండితులు ఈ పరిస్థితిని సహింపలేకపోయారు. ప్రాకృత భాషా వాఙ్మయాన్నంతటిని ఒక సుస్పష్టమైన స్థిరరూపంలోకి తేవాలనుకుని ప్రాకృత శబ్దాలన్నిటిని సంస్కరించడం ప్రారంభించారు. అట్లా సంస్కరింపబడి కొత్త రూపు దిద్దుకున్న భాష కనుక దాన్ని "సంస్కృతం" అని వ్యవహరించారు.

సంస్కృత భాష ఏర్పడ్డ తరువాత కొంత కాలానికి పురాణ రచనలు, ఇతిహాస రచనలు ప్రారంభమైనాయి. వాటిలో మొట్టమొదటిది రామాయణం కనుక అది ఆదికావ్యమని, దానిని రచించిన వాల్మీకిని 'ఆదికవి' అని కూడా గౌరవించారు. అంటే, ఆదిమయుగంలో ఉన్న ఏ భాషలోనూ అప్పటిదాక కావ్యం ఏదీ రాలేదని మనం భావించవచ్చన్నమాట! కాని ప్రాకృతం, పైశాచి, మాగధి, కళింగ, పాంచాల భాషల్లో కూడా రచనలు వెలువడ్డాయని కొందరి భావన. అయితే వాటిని పండితులు, ప్రభువులు ఎవరూ ఆదరించనందున ఈ విషయం మరుగున పడిపోయిది. అందుకే అప్పటినుండి ఏ రచన చేసినా సంస్కృతంలోనే చేయాలనే సంప్రదాయం బలపడిపోయింది.

తరువాత కాలంలో అశ్మక జనపదాలవారు మాట్లాడే పైశాచి భాషలో గుణాఢ్యుడు 'బృహత్కథ' రచించాడని, రాజతిరస్కారానికి గురియయి ఆ గ్రంథం పాక్షికంగా దెబ్బతిన్నదని పరిశోధకులు అంటున్నారు. ప్రాకృత భాషా ప్రచారం జరిగిన కాలంలో అశ్మక జనపదంవారు ప్రాకృతం కలిసిన పైశాచి భాషను మాట్లాడుతూ క్రమంగా ప్రాకృతానికి అలవాటుపడిపోయినారు. కొడగు, పైశాచి భాషా మిశ్రమంతో కొత్త పోకడను పొందిన ప్రాకృత భాషను శాతవాహనులు అధికార భాషగా స్వీకరించినారు. అశ్మక జనపదంవారిని అంధరకట్ట, అంధరట్ట, ఆంధ్ర జాతివారుగా పిలవడం ప్రారంభించినారు. ప్రాకృతం పూర్తిగా లేని వారియొక్క భాషను "ఆంధ్రభాష"గా స్థిరీకరించినారు. ఐతరేయ బ్రాహ్మణ కాలం నుండే వారికి "ఆంధ్ర' శబ్దం వ్యవహారంలోకి వచ్చింది.

శాతవాహనులు, వారి తరువాత వచ్చిన రాజులు ఈ ఆంధ్రభాష మీద ప్రత్యేక దృష్టిని సారించినారు. కాని ఆ భాష గిరిజన భాష అని, దానికి కావ్యగౌరవం లేదని సంస్కృత పండితులు పదేపదే చెప్పడంవలన ఎవరూ ఆంధ్ర భాషలో రచనలు చేయడానికి సాహసించలేదు. అయినా ఆంధ్ర భాషను శాసనభాషగా స్వీకరించి, ఆ సాకుతో పద్యం, గద్యం కలిపిన రచనలను అప్పుడప్పుడు స్వల్పంగా పరిచయం చేసిన రాజులు చరిత్రలో చాలా స్వల్పంగా కనిపిస్తారు.

క్రీస్తు పూర్వం 500 సం॥ల కాలం నుండే ఆంధ్ర భాషకు సాహిత్య రంగంలో కొద్దికొద్దిగా చోటు దొరకడం ప్రారంభమైంది. అయినా సంస్కృత భాషా ప్రాబల్యం ఆంధ్ర భాషను అణిచిపెడుతూనే ఉంది. కాళిదాసు, భారవి, భవభూతి, జయదేవుడు, ఆదిశంకరులు మొదలైనవారంతా సంస్కృతాన్నే రచనాభాషగా స్వీకరించారు. ఒకవైపు అరబ్బీ, పారసీదేశాలవారు మన దేశంలోకి రావడం మొదలుపెట్టాక భారతీయ భాషలు వారి నోళ్ళలో పడి మరో క్రొత్తరూపు సంతరించుకున్నాయి. అదే క్రమంలో ఆంధ్ర భాషలోకి ఉర్దూ, అరబ్బీ, పార్సీ పదాలు చొచ్చుకుపోయాయి. మరోవైపు మతఘర్షణలు ప్రారంభమయ్యాయి. శైవ, వైష్ణవ, జైన, బౌద్ధ, శాక్తేయమతాల ఆధిక్యతా సమరం సమాజానికి సమస్యగా మారింది. ఆదిశంకరులు ఆవిర్భవించాక కొంతవరకు ఈ కల్లోలం సద్దుమణిగినా తరువాత వీరశైవం విజృంభించింది. బసవేశ్వర మతం

ఊపందుకున్నది. 'చీకటి' అనే అర్థం నుండి వచ్చిన 'ఆంధ్ర' పదాన్ని ఉచ్చరించడానికి చాలామంది ఇష్టపడలేదు. అందువల్ల శైవపండితులు ఆంధ్రులు నివసిస్తున్న ప్రాంతాలను ఒక చట్రంగా చేశారు. శ్రీశైలం, దాక్షారామం, కాళేశ్వరం అనే మూడు శివలింగక్షేత్రాల మధ్యన ఉన్న దేశం కనుక "త్రిలింగదేశం" అని పిలవాలనే విషయాన్ని వ్యాప్తిలోకి తెచ్చారు. భాషను "త్రిలింగభాష" అన్నారు. ఈ సంస్కృతపదాన్ని ప్రజలు సరిగా ఉచ్చరించలేకపోవడం వల్ల అది 'తెలుంగు'గా మారింది. అదే వ్యవహారంలోకి వచ్చింది.

13వ శతాబ్దంలో తెలుగురాజ్యంపై సుల్తానుల ఆధిపత్యం విపరీతంగా పెరిగిపోయింది. వారి ఉర్దూ భాష తెలుగును బాగా ఆక్రమించుకున్నది. సుల్తానులు దేశాలు, ప్రాంతాల పేర్లు పేర్కొనాల్సి వచ్చినప్పుడు త్రిలింగదేశం పేరు నోరు తిరక్క అవస్థపడ్డారు. అందుకే తెలుంగును 'తెలంగ్' అని, తెలుగు రాజ్యాన్ని 'తెలంగాణా' అని వ్యవహరించడం ప్రారంభించారు. ప్రాకృతాన్ని సంస్కృతంగా మార్చేసిన పండితజాతి క్రమక్రమంగా తెలంగాణాకు దూరంగా జరిగిపోయింది. (వాళ్ళనే మనం ఇప్పుడు 'ఆంధ్రులు' అని పిలుస్తున్నాం) కాని అప్పటికే సంస్కృతం తెలుగు దేశీయ భాషా సంస్కృతిని బాగా దెబ్బతీసింది. కాకతీయుల పరిపాలనావైభవాన్ని, తెలంగాణాపై మాలిక్ కాఫర్ దండయాత్రను అభివర్ణిస్తూ అమీర్ ఖుస్రో అనే సంగీతసాహితీవేత్త డైరీలాంటి రచన ఒకటి చేశాడు. ఆయన కవితారచనలోనూ, సంగీతగానంలోనూ గొప్ప ప్రావీణ్యం కలవాడు. తబల వాద్యాన్ని కనిపెట్టింది కూడా ఆయనే. ఖుస్రో తాను పాడుతున్న ఒక తరహాలోని రాగాన్ని తెలంగాణావారు ఎక్కువగా అభిమానించారు కనుక ఆ రాగానికి 'తెలంగ్' అనే పేరు పెట్టాడు. ఇప్పుడు దీన్ని హిందూస్తానీ సంగీతసంప్రదాయంలో 'తిల్లాంగ్' అని పిలుస్తారు. అమీర్ ఖుస్రో రచనలోనే మొదటిసారిగా తెలుగు ప్రాంతాన్ని 'తెలంగాణా' అని వ్యవహరించినట్లుగా చరిత్రకారులు పేర్కొనడాన్ని గమనించాలి.

కొడగు భాష మాగధి, శౌరసేని, పైశాచి, ప్రాకృతం, సంస్కృతం, ఉర్దూ భాషలన్నిటిని తనలో కలుపుకుని తెలుగుభాషగా స్థిరపడింది. తరువాత కూడ ఆధునికకాలం వరకు మన తెలుగు–తమిళం, మళయాళం, కన్నడం, మరాఠీ, బెంగాలీ, హిందీ, ఇప్పుడు ఇంగ్లీషుభాషలను కూడా కలిపేసుకున్నది. ఇన్ని భాషలు కలిగినా తన సహజసౌందర్యాన్ని తెలుగుభాష ఏమాత్రం కోల్పోలేదు. సామాన్యప్రజల వాచికంలో సురక్షితంగానే ఉన్నది. అసలు అజంతాభాషగా జన్మించిన మన భాష పరభాషలను కలుపుకొనడం ద్వారా విలక్షణమైన రూపాన్ని సంతరించుకున్నదే కాని ఉనికిని కోల్పోలేదు. ప్రపంచభాషల్లో ఇటలీకూడా మన భాషలాగ అజంతా, అంటే అచ్చులతో ముగిసే ఉచ్చారణ కలిగినదే. అయితే మన తెలుగు యొక్క మూలపదాల్ని మాత్రం మనం మరచిపోయామనేది విచారింపదగిన విషయం. ఆ పదాల గురించి కొంత సమాచారం 'ఆంధ్రనామసంగ్రహం' అనే గ్రంథంలోనూ, పొన్నికంటి తెలగనార్యుని "యయాతి చరిత్రము" కావ్యంలోనూ మనం గమనింపవచ్చు.

'తెలంగాణా' అనే పదం మహ్మదీయ సుల్తానులు మన ప్రాంతానికి చేసిన ఉర్దూ నామకరణం. తెలుగుభాష అనేది ఎన్నో లేవు. ఉన్నది ఒక్కటే. అదే 'తెలుగు' అదే తెనుగు, అదే ఆంధ్రం. ఈ భాష తెలంగాణావారి సొత్తే అనడంలో సందేహించనక్కరలేదు. తెలుగు వేరు, తెలంగాణా వేరు కాదు. మొదటిది భాష పేరు, రెండోది ఆ భాష మాట్లాడేవారి ప్రాంతం పేరు. అంతే......... 'తెలంగాణా' పదం ప్రాంతాన్ని సూచించేదే తప్ప భాషావాచకం కాదు.

ఏ భాషలోనైనా దేశ్యం, గ్రామ్యం రెండూ ఉంటాయి. ఒకటి శిష్టవ్యావహారికం, రెండోది గ్రామీణుల వ్యావహారికం. గ్రామ్యాన్నే యాస అని, మాండలికం అని వ్యవహరిస్తారు. ఆయా ప్రాంతాలను బట్టి ఈ మాండలికం మారుతూ ఉంటుంది. ఒక ప్రాంతంవారి మాండలికాన్ని మరో ప్రాంతంవారు

వెక్కిరించడం అనే అసంగతం నుంచే భాషా ఉద్యమం పుడుతుంది. ఇటువంటి పరిహాసాన్ని ఏ భాషవారు, ఏ ప్రాంతంవారూ సహింపలేరు, సహింపకూడదు కూడా. దాన్ని నిరసించవలసిందే, తిరస్కరించవలసిందే. కాని సుందరమైన మౌలికభాషను ప్రక్కకుపెట్టి మాండలికమే మా అసలు భాష అనే ధోరణి ఏ భాషీయులకూ సమంజసం కాదు. డాలర్ల పంట కోసం అమ్ముడుపోవాలనుకున్న మన చిన్నారుల పాశ్చాత్యవ్యామోహం నుండి విముఖుల్ని చేసి మన తెలుగు భాషను కాపాడుకోవడానికి అందరం ఉద్యుక్తులమవుదాం. మౌలిక భాషా స్వరూపాన్ని అధ్యయనం చేద్దాం. వీలైనంతవరకు ఏ భాషాపదం కలవని అచ్చతెలుగు పదాలను ఉపయోగిద్దాం. ఇతరభాషాపదాలకు కూడా సమాంతరమైన తెలుగు పదాలను సృష్టించి ఇతర భాషీయులకు ఆదర్శంగా నిలుద్దాం. ఈ రోజుల్లో మనం మాట్లాడుతున్న తెలుగులో దాదాపు అరవై శాతం సంస్కృతం అనివార్యంగా కలిసిపోయింది. దీన్ని విడదీయడం అంత సులభం కాదు. తెలుగు పుట్టిన తొలిరోజుల్లో సంస్కృతం దాడి చేసి తెలుగును బాగా లోబరచుకుంది. తరువాత ఉర్దూ ప్రతి తెలుగు పదంలోకి జీర్ణించుకుపోయింది. ఇప్పుడు ఆంగ్లం తన కబంధహస్తాల్లో తెలుగును ఇరికించుకుంది. ఈ విధంగా మిగిలిన 40 శాతంలో 10 శాతం ఇతరభాషలు కలవగా మనకు మిగిలింది 30 శాతమే.

కనుక ఆధునికకాలంలోని ప్రచార, ప్రసార మాధ్యమాలను వినియోగించుకుని సత్ఫలితాలను రాబట్టుకుందాం. అచ్చతెలుగు భాషాస్వరూపాన్ని చక్కని పదబంధాలతో, పలుకుబడులతో, సుందరమాండలిక పదప్రయోగంతో సంరక్షించుకుందాం. ఇంకా ప్రయత్నిస్తే మన తెలుగు భాషకు ఒక "బృహత్తర నిఘంటువు"ను కూడా నిర్మించుకోవచ్చు. దీనికి కావలసిందల్లా శాంతియుత సదాలోచన, సంస్కారయుక్త సత్యపరిశీలన. అందరం కృషి చేసి మన తెలుగు భాషను రక్షించుకుంటూ అందంగా తీర్చిదిద్దుకుందాం. మనం ప్రస్తావించుకున్న ఈ అంశాలన్నీ స్థూలపరిశీలనా విషయాలు మాత్రమే. వీటిని చరిత్ర పరిశోధకులు సమగ్రంగా నిరూపించవలసిన అవసరం ఉంది.

డా. ఎం. పురుషోత్తమాచార్య
నల్లగొండ, ఫోన్: 939 661 1905.



(పానశాల నుంచి)

*అఖిల శాస్త్ర పురాణ తత్త్వాబ్ధి లీఁది*
*పరమ విజ్ఞానదీపమౌ పండితుండు*
*కాళరాత్రిని మార్గంబు గానలేక*
*యల్ల మామూలుకథఁ జెప్పి యంతరించు!*

*జీవితంబెల్ల బహుశాస్త్ర సేవలందుఁ*
*గడపితి, రహస్యములు చాల గ్రాహ్యమయ్యె;*
*నిప్పుడు వివేకనేత్రంబు విప్పిచూడ*
*దెలిసికొంటి నాకేమియుఁ దెలియదంచు.*

*మనకు ముందేఁగినట్టి యా మాన్యులెల్లఁ*
*బ్రబలగర్వాంధ నిద్రానిబద్ధులైరి;*
*నెలఁత, మధు వాని నావల్ల నిజము వినుము;*
*వారు చెప్పిన చదువెల్ల వట్టి కల్ల!*

# లలిత కళా అకాడెమీలు

– మామిడిపూడి కృష్ణమూర్తి

మహోన్నతమైనది, అతి ప్రాచీనమైనదియైన మన పురావస్తు సంపదను, మన సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించుకునేందుకు దేశ స్వాతంత్ర్యసిద్ధి జరిగిన వెంటనే భారత ప్రభుత్వం కొన్ని సంస్థలను నెలకొల్పింది. అలాగే జాతీయ సాంస్కృతిక విధానాన్ని నిర్వచించుకుని పురోగమించేందుకు సమకాలీన భాషాసాహిత్యాలు, నాటక నాట్య సంగీత కళలు, చిత్ర శిల్ప కళలు తగురీతిని పురోభివృద్ధి చెందవలసిన ఆవస్యకతను గుర్తించి, వాటి వికాసం కోసం కొన్ని సంస్థల ఏర్పాటు చేయవలసిన అగత్యాన్ని గుర్తించి, కేంద్ర సాహిత్యం, సంగీత, నాటక, లలిత కళా అకాడెమీల ఏర్పాటు చేసింది. వీటి కార్యకలాపాలు నిర్వర్తించుకునేందుకు న్యూఢిల్లీలో లోడి రోడ్‌లో రబీంద్రభవన్ నిర్మించింది. ఈ అకాడెమీలకు తగిన వార్షిక వనరులను ఏర్పాటు చేసింది. ఆయా రంగాలలో నిష్ణాతులైనవారికి ఇందులో స్థానం కల్పిస్తూ, ప్రభుత్వ ప్రమేయం, జోక్యం లేకుండా ఈ సంస్థలకు స్వయం ప్రతిపత్తి కలిగించి తగిన కార్యక్రమాలు ఆయా రంగాలలో నిష్ణాతులైనవారే నిర్ణయించుకునేందుకు వెసులుబాటు కలిగించినది. ఈ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడమేగాక ఇటువంటి సంస్థలను రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాష్ట్రాలలో ఏర్పాటు చేసుకోవలసిందిగా సూచనలిచ్చింది. ఈ మార్గదర్శకాలననుసరించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ, ఆంధ్రప్రదేశ్ సంగీత, నాటక అకాడెమీ, ఆంధ్రప్రదేశ్ లలిత కళా అకాడెమీలను ఏర్పాటు చేసింది.

ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడెమీని సెప్టెంబరు 18, 1961 సంవత్సరంలో ఏర్పాటు చేసింది. అంతకు ముందు ఏర్పడిన రెండు అకాడెమీలలాగే లలిత కళా అకాడెమీ రెండు చిన్న గదులలో ప్రారంభించినది. 1965 సంవత్సరంలో ఈ మూడు అకాడెమీల అభ్యర్థనమేరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం సహకారంతో హైదరాబాదులోని రవీంద్రభారతి ప్రాంగణంలో అకాడెమీలకోసం కొనుగోలు చేసిన స్థలంలో కళాభవన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కళాభవన్‌లో లలితకళా అకాడెమీ ఒక కళాశ్రేణికను (ఆర్ట్ గ్యాలరీ), గ్రంథాలయాన్ని, కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నది. ప్రప్రథమంగా రాష్ట్ర ప్రభుత్వం 35 శిల్ప, చిత్రకారులతో ఒక జనరల్ కౌన్సిల్‌ను ఏర్పాటుచేస్తూ ప్రముఖ విద్యావేత్త నూకల నరోత్తమరెడ్డిని అధ్యక్షులుగాను (వీరు తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్‌గా పనిచేశారు), ప్రముఖ చిత్రకారుడు ఎస్.ఎన్. చామకూరును ఉపాధ్యక్షులుగాను, ఎల్.ఎన్. గుప్తా ఐ.ఎ.ఎస్. గారిని కార్యదర్శిగాను నియమించింది.

**ఆంధ్రప్రదేశ్ లలిత కళా అకాడెమీ**

**ముఖ్య ఆశయాలు, ఉద్దేశ్యాలు:**

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాచీన వాస్తు, శిల్ప, చిత్ర సంపద, సమకాలీన చిత్ర శిల్ప కళల వికాసానికి చేపట్టవలసిన అన్ని కార్యక్రమాలు చేపట్టటం,

రాష్ట్రంలోని కళాకారులను ప్రోత్సహించేందుకు వార్షిక ప్రదర్శనలను ఏర్పాటుచేసి, ఎంపిక చేసిన కళాకారులకు బహుమతులిచ్చి ప్రోత్సహించడం,

కళాకారులు తమ చిత్రప్రదర్శనలను ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా కళాశ్రేణికి (ఆర్ట్ గ్యాలరీ) వసతులను కల్పించడం, వర్ధమాన కళాకారులకు ఉన్నత విద్యకై ఉపకారవేతనాల్ని మంజూరు చేయడం, చిత్ర శిల్ప కళలకు

సంబంధించి పుస్తకాల ప్రచురణ – ప్రాచీన చిత్ర శిల్ప వాస్తు కళలు, సమకాలీన కళాకారుల జీవితం, కృషి సంబంధించిన గ్రంథాల ప్రచురణ, కేంద్ర అకాడెమీ, ఇతర రాష్ట్రాల అకాడెమీల సహకారంతో కళాప్రదర్శనలు ఏర్పాటు చేయటం, రాష్ట్రంలో వివిధ జిల్లాలలో కళాప్రదర్శనలు చేర్పాటు చేయటం, రాష్ట్రంలో వివిధ జిల్లాలో ఉన్న కళాసంస్థలను అనుబంధ సంస్థలుగా గుర్తించి వాటికి ఆర్థిక సాంకేతిక వనరులను సమకూర్చటం, రాష్ట్రంలో వివిధ పట్టణాలలో కళాశ్రేణికల నిర్మాణం చేపట్టటం, జానపద కళలపైన సర్వేలను నిర్వహించి, సమగ్రమైన నివేదికలను తయారుచేసి, వాటికి తగిన ప్రోత్సాహకాలను పొందుపరచటం, స్థూలంగా పైన పేర్కొన్న ఆశయాలేగాక శిల్ప చిత్రకళల వికాసానికి తీసుకోవలసిన అన్ని చర్యలు తీసుకోవటం. పైన పేర్కొన్న ఆశయాల సిద్ధికై అకాడెమీ 1961 సంవత్సరం నుండి ఎన్నో కార్యక్రమాలను నిర్వహించినది. 1984–89లో రాష్ట్రప్రభుత్వం అన్ని అకాడెమీలను రద్దుచేసి, వాటిని తెలుగు విజ్ఞాన పీఠం దరిమిలా తెలుగు విశ్వవిద్యాలయంలో విలీనం చేసింది. ఈ అనాలోచిత చర్యవలన అకాడెమీ లక్ష్యాలనకు తీవ్ర విఘాతం కలిగింది. రద్దు చేయబడినవాటికి దానిని స్థాపించి 22 సంవత్సరాల కాలంలో అకాడెమీ నిర్వహించిన కార్యక్రమాలను స్థూలంగా ఇక్కడ పేర్కొంటున్నాను.

**చిత్ర శిల్ప కళా ప్రదర్శనలు:**

అకాడెమీ ఏర్పడిన నాటినుండి 22 వార్షిక ప్రదర్శనలను ఏర్పాటు చేసింది. ప్రతి సంవత్సరం ఎంపిక చేసిన పదిమంది కళాకారులకు విశిష్ట పురస్కారాలను అందజేసింది. ప్రతి ప్రదర్శన నుండి 20–25 కళాఖండాలను కొనుగోలు చేసింది. కేంద్ర అకాడెమీ, విదేశి రాయబార కార్యాలయాల సహకారంతో 40 పైగా అంతర్జాతీయ కళాప్రదర్శనలను హైదరాబాదులో నిర్వహించింది. వివిధ రాష్ట్రాల సహకారంతో ఆదాన ప్రదాన కార్యక్రమం క్రింద 30 పైగా ఇతర రాష్ట్ర కళాప్రదర్శనలు, 15 ఆంధ్ర కళాకారుల ప్రదర్శనలు ఇతర రాష్ట్రాలలో నిర్వహించింది. కెన్‌టకి ఆర్ట్స్ కౌన్సిల్ సహకారంతో ఆంధ్ర చిత్రకళా ప్రదర్శనను యు.ఎస్.ఎ.లో కెన్‌టకి స్టేట్‌లో ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్ చిత్రకారుల ప్రదర్శనలను రాష్ట్రంలో వివిధ జిల్లాలో 50కి పైగా ఏర్పాటు చేసినది. నామమాత్రపు ఖర్చుల క్రింద వందల చిత్ర శిల్పకారులకు తమ ప్రదర్శనలను ఏర్పాటు చేసుకునేందుకు కళాశ్రేణిక వసతులను కల్పించింది. సిద్ధిపేటలోని లలిత కళా సమితికి సిద్ధిపేటలోను, విజయవాడలో ఆంధ్ర అకాడెమీ ఆఫ్ ఆర్ట్స్, విజయవాడలోని ముత్యాలంపాడులో కళాశ్రేణికలు నిర్మించుకునేందుకు తగిన ఆర్థిక సహాయాన్ని అందజేసింది.

వార్షిక ప్రదర్శనల నుండి ఇతర వన్ మ్యాన్ షోల నుండి అకాడెమీ శాశ్వత సంచయానికి దాదాపు 200 చిత్ర శిల్ప కళాఖండాలను కొనుగోలు చేసింది. ఈ అమూల్యమైన కళాసంపద 20వ శతాబ్దపు మొదటి 50 సంవత్సరాలలో జరిగిన సమకాలీన కళావికాసానికి ప్రతీకగా పరిగణించవచ్చును. ఈ చిత్ర శిల్పాలతో ఒక మ్యూజియం ఏర్పాటుకు అకాడెమీ చర్యలు మొదలుపెట్టింది. ప్రముఖ విశ్వవిద్యాలయాలలో, ప్రముఖ నిష్ణాతుల పర్యవేక్షణలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వర్ధమాన చిత్రకారులకు 80 కి పైగా ఉపకారవేతనాలను మంజూరు చేసింది. ప్రస్తుతం పేరుబడసిన చిత్రకారులలో చాలామంది ఈ ఉపకారవేతనాలను పొందినవారే! చిత్ర శిల్ప కళాసదస్సులు, పెయింటర్స్ క్యాంప్‌లు, గ్రాఫిక్ వర్క్‌షాపులు నిర్వహించడమేగాక కేంద్ర అకాడెమీ, హైదరాబాదులో నిర్వహించిన జాతీయ సదస్సుల ఏర్పాటుకు సహకరించినది. ఇతర రాష్ట్రాలలో జరిగే సదస్సులలో ఆంధ్ర చిత్రకారులు పాల్గొనే అవకాశం కలిగించినది. కేంద్ర అకాడెమీ సహకారంతో, రైల్వే మంత్రిత్వశాఖతో సంప్రదించి కళాకారులు ఇతర రాష్ట్రాలలో సభలు, సమావేశాలు, కళాప్రదర్శనలలో పాల్గొనేందుకు రైల్వే కన్సెషన్‌ను ఇచ్చే ఏర్పాటు చేసింది.

రాష్ట్ర చిత్రకారులు సదస్సులలో ప్రవేశపెట్టిన తీర్మానాలను ప్రభుత్వ దృష్టికి తెచ్చి సముచిత చర్యలకై ఒత్తిడి చేసిది. అత్యవసర పరిస్థితులలో, ఆపత్కర సమయాలలో ఆర్థికంగా వెనుకబడిన కళాకారుల కుటుంబాలను ఆదుకునేందుకు కళాకారుల సహాయనిధిని

ఏర్పాటు చేసింది. ప్రముఖ కళాకారులు, చారిత్రికులు, విలేఖరులు మొదలైనవారిచేత కళలకు సంబంధించిన, ఉపన్యాసాలను, కళలు, కళాకారులపై తయారుచేసిన డాక్యుమెంటరీలను, స్లైడ్ షోస్‌ను ప్రతి నెలా ఏర్పాటు చేసిది. చిత్ర శిల్ప వాస్తు కళలకు సంబంధించిన కొన్ని వేల పుస్తకాలను కొనుగోలుచేసి ఒక ఉత్కృష్టమైన గ్రంథాలయాన్ని నెలకొల్పింది. ఇందులో చాలా గ్రంథాలు అమూల్యమైనవి, ప్రస్తుతం ముద్రణలో లుప్తమైనవి, మరు ప్రచురణకు నోచుకోనివి. ఈ గ్రంథాలయం కళల పరిశోధకులకు ఎంతగానో ఉపయోగింపబడుతున్నది.

**అకాడెమీ ప్రచురణలు:**

దేశంలోనే ఏ రాష్ట్ర అకాడెమీ చేయని విధంగా ఆంధ్రప్రదేశ్ అకాడెమీ కళలు కళాకారులమీద కొన్ని ప్రచురణలు చేసింది.

**లేపాక్షి:**

అనంతపురం జిల్లాలోని 16వ శతాబ్దినాటి లేపాక్షి ఆలయం, వాస్తు చిత్ర శిల్ప కళావైశిష్ట్యాన్ని విశదపరచే ఒక సమగ్రమైన పుస్తకాన్ని ప్రచురించినది. దీనిని ఆమంచర్ల గోపాలరావుగారు రచించారు. ఈ పుస్తకం 'Excellence in Printing and Designing' అన్న అంశం కింద రాష్ట్రపతి పురస్కారాన్ని అందుకున్నది.

**ఆంధ్రా డాన్స్ స్కల్ప్చర్స్:**

రచయిత ఎస్.ఎస్. కృష్ణమూర్తి, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడెమీ సంయుక్త ప్రచురణ. మొక్కపాటివారి భాగవత చిత్రాలు, ఆంగ్లం, తెలుగులో విడివిడిగా, రచయిత వజ్ఝ శ్రీనివాస శర్మ.

**మన వాస్తు సంపద, మన శిల్ప సంపద:**

రెండు పుస్తకాలు ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా. విడివిడిగా 15 పుస్తకాలు – 15 మంది శిల్ప చిత్రకారుల కృషి, విశేషాలు తెలుపుతూ ఆంగ్లంలో. పైన పేర్కొన్న పుస్తకాలకు అదనంగా *భారత ఆధునిక భాషల వికాసం* అన్న కేంద్ర ప్రభుత్వ పథకం కింద, దేశంలోనే ఏ సంస్థ చేయని విధంగా చిత్ర శిల్ప, వాస్తు కళలకు సంబంధిచి తెలుగు, సంస్కృతం, ఆంగ్లంలో ఉన్న పదాలతో, వాడుకలో ఉన్న పదాలనుకూడా చేర్చి ఒక పారిభాషిక పదకోశాన్ని తయారు చేసింది. దీనికి దాదాపు 5, 6 సంవత్సరాల కాలం తీసుకుంది. ఇది మ్యానుస్క్రిప్ట్ దశలోనేవుంది. వెలుగు చూడవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఆంధ్రప్రదేశ్ లలిత కళా అకాడెమీ 1984–85లో రద్దైననాటికి అంటే దాదాపు రెండున్నర దశాబ్దాలలో చేసిన కృషిని స్థూలంగా వివరించాను. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర అకాడెమీల పనితీరును సమీక్షించి ఒక నివేదికను సమర్పించవలసిందిగా విశ్రాంత సుప్రీమ్ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.డి. కోస్లా అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ కేంద్రంలోనేగాక దేశమంతటా విస్తృతంగా పర్యటించి, రాష్ట్ర అకాడెమీలతోబాటు సంబంధిత కళాకారులతో చర్చలు, సంప్రదింపులు జరిపి ఒక సమగ్ర నివేదికను సమర్పించింది. హైదరాబాదులోని మూడు అకాడెమీల పనితీరును సమీక్షించి, ఆంధ్రప్రదేశ్ లలిత కళా అకాడెమీనీ గురించి ఈ విధంగా పేర్కొన్నది:

"The annual budget of the Academy is small. But by economising in the management expresses, the Academy has succeeded in achieving a great deal."

1984–85లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నార్ల వేంకటేశ్వరరావుగారిని, అకాడెమీల పనితీరును సమీక్షించి ఒక నివేదికను అందజేయవలసిందిగా కోరింది. వారు అకాడెమీల కార్యనిర్వాహకులతోగాని, కళాకారులతోగాని ఏ విధమైన చర్చలు సంప్రదింపులు చేయకనే రెండు పేజీలలో ఒక నివేదికను సమర్పించారు. అందులోని సారాంశం – ప్రభుత్వం నుండి అందుతున్న ఆర్థిక సహాయంతో ప్రతి ఏటా సర్వ సభ్య సమావేశాల పేరిట దుర్వినియోగం జరుగుతున్నది అని నార్లవారు అంతకుముందు ఆంధ్రప్రదేశ్ లలిత కళా అకాడెమీ కృషిమీద కురిపించిన ప్రశంసల వర్షం ఏమైందో అర్థంకాని విషయం. ఈ నివేదిక ఆధారంగా మూడు అకాడెమీలనేగాక, రాష్ట్ర ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం పొందుతున్న అంతర్జాతీయ తెలుగు సంస్థ, తెలుగు భాషా సమితి, ఇతర కొన్ని సంస్థలనన్నింటినీ రద్దుచేసి, వాటి స్థిరచరాస్తులను తెలుగు విజ్ఞాన పీఠానికి, దరిమిలా తెలుగు

విశ్వవిద్యాలయానికి బదిలీ చేసింది. విశ్వవిద్యాలయంలోని వివిధ శాకలతోపాటు రద్దు చేయబడిన అకాడెమీల కార్యకలాపాలు ఒక శాఖకు బదిలీ అయినవి. పైగా కళలలో ఏ అభిరుచిలేని అధికారుల పర్యవేక్షణలో ఈ శాఖకు ఏ విధమైన ప్రాముఖ్యతలేక అకాడెమీల కార్యక్రమాలకు ప్రాధాన్యత తగ్గిపోయినది. ఈ శాఖ పనులను పర్యవేక్షించేందుకు ఏ అర్హతలు లేని గుమాస్తాల అధీనంలోకి మార్చబడింది. విశ్వవిద్యాలయం కొత్తది కావడంచేత ప్రాథమికంగా విశ్వవిద్యాలయానికి అవసరమైన నియమనిబంధనలు, స్టాట్యూట్స్, వివిధ కోర్సుల పాఠ్యాంశాల రూపకల్పన, వీటిలో తలమున్కలై అకాడెమీల కార్యక్రమాలు వెనుకబడినవి.

లలిత కళా అకాడెమీ రద్దు జరిగిన కొద్దిరోజులు ముందుగా దాని కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం కేంద్రంగా 20వ శతాబ్దపు ప్రథమ భాగంలో అంకురార్పణ జరిగిన ఆధునిక ఆంధ్ర చిత్రకళకు ఆజ్యంపోసిన చిత్రకారుల కళాఖండాలను సేకరించి ఒక ప్రదర్శనను ఏర్పాటు చేయవలననే సంకల్పానికి అడుగులువేసింది. దీని కొనసాగింపుగా అప్పటి తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఆచార్య తూమాటి దొణప్పగారిని ఈ పనిబారాన్ని నాకు అప్పగించవలసిందిగా ప్రాథేయపడ్డాను. నన్ను వేరే శాఖకు బదిలీ చేసినా, నాకు ఈ అదనపు బాధ్యతను అప్పగించారు. కానీ ఈ కార్యక్రమం చాలా వ్యయప్రయాసలతో కూడుకొన్నది. దీనికి అవసరమైన నిధులను కేటాయించడంలో అధికారుల నిర్లిప్తత, విముఖత కారణంగా చాలా జాప్యం జరిగింది. అంకురార్పణ జరిగిన మూడు సంవత్సరాలకుగాని ఈ ప్రదర్శన చాలా అపురూపమైనదని ప్రశంసలను పొందింది. ఇలాగే చాలా సులువగా జరగవలసిన కార్యక్రమాలు అతి కష్టంతో జరుపవలసి వచ్చినది. పైగా ఈ కళలకు సంబంధించిన నిష్ణాతుల సూచనలు, మార్గదర్శకాలు విశ్వవిద్యాలయం పరిధిలో మృగ్యమైపోయినవి. వార్షిక ప్రదర్శనలు అడపాదడపా జరగడం, కళాఖండాల కొనుగోలు, సేకరణ నామమాత్రంగా మిగిలిపోవడం, చిత్ర శిల్ప కళల మీద పుస్తక ప్రచురణలు దాదాపు శూన్యమైపోవటం జరిగింది. చిత్ర శిల్ప కళలపైని పుస్తక ప్రచురణ చాలా శ్రమతోను, వ్యయంతో కూడుకొన్నది. కళలపైన ఒక్క పుస్తకం మీద పెట్టే ఖర్చుతో సాహిత్యం మీది ప్రచురణలను పదింటిని ప్రచురించవచ్చునన్నప్పుడు కళలపైన పుస్తక ప్రచురణకు ప్రాధాన్యత ఎలా ఉంటుంది? లోగడ తెలుగు భాషా సమితి స్వల్ప వార్షిక వనరులతో విజ్ఞాన సర్వస్వ సంపుటాలను పదిహేనింటిని ప్రచురించింది. అది విలీనం అయి మూడు దశాబ్దాల కాలంలో తెలుగు విశ్వవిద్యాలయం ఒక్క అదనపు సంపుటాన్ని వెలువరించలేకపోవడమేగాక లోగడ ప్రచురించిన సంపుటాలను అప్‌డేట్ చేసి ఒక్క సంపుటాన్నైనా మలిముద్రణ చేయలేకపోయినది.

ఎంతోమంది కళాకారులు తమ ప్రదర్శనలను ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా ఉండిన కళాశ్రేణికను (ఆర్ట్ గ్యాలరీ) కళాభవన్‌తోబాటు అన్యాక్రాంతం చేసింది. అకాడెమీ వ్యయప్రయాసలతో సమకూర్చిన 2,000 పైగా అమూల్యమైన చిత్రాలకు సంరక్షణ కరువై వాటి పరిస్థితి నేడో రేపో అన్న జీర్ణదశలో ఉన్నది. ఈ విధంగా చెప్పుకుంటూపోతే అకాడెమీ కార్యక్రమాల కొనసాగింపు దేవుడెరుగుగాని ఉన్నవాటిని రక్షించుకోలేని స్థితిలో ఉన్నది తెలుగు విశ్వవిద్యాలయం.

స్వయంప్రతిపత్తితో, సంబంధిత కళాకారుల సమాలోచనలతో, ఆయా కళల కోసం కృషి చేస్తూ ఉండిన అకాడెమీల కార్యకలాపాలు విశ్వవిద్యాలయం పరిధిలో ఏ విధంగాను ఇమడలేకపోవడం గమనార్హం. మేధావుల ఆశయ సాధనకు నోచుకోలేకుండా పోయింది. ఇప్పుడైనా రెండు తెలుగు రాష్ట్రాలు లలితకళా అకాడెమీ ప్రాధాన్యతను గుర్తించి రెండు అకాడెమీలను పునరుద్ధరించగలరని ఆశిద్దాం. మహోన్నతమైనది, అతి సుందరమైనది, అన్ని హంగులతో కూడుకొన్నదియైన సౌధాన్ని నిర్మించడం ఎంతో వ్యయప్రయాసలతో కూడుకొన్నది. కాని దానిని ధ్వంసం చేయడం నిమిషాలలో జరిగేపనే. రెండు పేజీలలో, నూరు పంక్తులతో ఈ పని జరిగిపోవడం శోచనీయం.

**మామిడిపూడి కృష్ణమూర్తి**
**అమెరికా నుండి**, e-mail: krishnamamidipudi@gmail.com

# ఆవుల గోపాలకృష్ణ మూర్తి

*- కొసరాజు వెంకటేశ్వరరావు*

సమాజంలో మానవతా విలువలు మృగ్యమౌతున్న సమయంలో, హేతువాద ప్రభావం తగురీతిలో లేని రోజుల్లో హేతువాద జ్యోతిని కరదీపికగా చేసుకుని, మానవవాద ఉద్యమానికి తమ జీవితాన్ని అంకితం చేసిన మహనీయులు బహుకొద్దిమంది మాత్రమే వున్నారు.

గడచిన కొన్ని దశాబ్దాల కాలంలో ఆంధ్రదేశంలో నడిచిన హేతువాదోద్యమానికి కీ.శే. ఆవుల గోపాలకృష్ణమూర్తి జీవగర్ర అంటే అతిశయోక్తి కాదేమో. వీరేశలింగం చేసిన కృషి మరుగుపడుతున్న రోజుల్లో త్రిపురనేని రామస్వామి రంగంలోకి ప్రవేశించాడు. ఆయన మరొక అడుగు ముందుకు సాగి హేతువాదోద్యమాన్ని పటిష్టం చేశాడు. ఆయన మరణించిన తరువాత ఆంధ్రదేశంలో ఆ ఉద్యమానికి ప్రోత్సాహంలేక పోయింది. రాజకీయోద్యమాలు అందుకు పెద్దగా ప్రోత్సహించలేక పోయాయి. ఆ పరిస్థితులలో హేతువాద ఉద్యమం బలహీనమైపోయింది. అటువంటి నిస్తేజమైన వాతావరణంలో గోపాల కృష్ణమూర్తి కార్య రంగంలో ప్రవేశించారు.

**బాల్యం:**

గోపాలకృష్ణమూర్తి తెనాలి తాలూకా మూల్పూరు గ్రామానికి చెందిన రామస్వామి, రామశేషమ్మ దంపతులకు 1917లో జన్మించారు. వీరికి నల్గురు సోదరులు, ఒక సోదరి. వీరి విద్యాభ్యాసం మూడవ ఫారం వరకు పెరవల్లి, నాల్గవ ఫారం తెనాలిలో, యస్.యస్.యల్.సి. తురుమెళ్ళ పాఠశాలలో 1932-33లో పూర్తి చేసి, గుంటూరు ఎ.సి. కాలేజీలో బి.ఏ. చేశారు. డాక్టరు కావాలన్న ప్రగాఢ వాంఛ వున్నా, ఆర్థిక పరిస్థితుల వలన బి.ఏ. చదివారు. లక్నోలో ఎం.ఎ. ఎల్ఎల్బి పట్టా పుచ్చుకుని గుంటూరులో న్యాయవాద వృత్తి ప్రారంభించారు. 1942లో బెజవాడలో జరిగిన రాడికల్ పార్టీ ద్వితీయ రాజకీయ మహాసభలో, వారు ఆపార్టీ ప్రధాన కార్యదర్శిగా నియుక్తులయ్యారు. వారు హైస్కూల్లో వున్నప్పుడే కవిత్వంపై అభిరుచి కలిగి "కృష్ణ శతకం" అనే పద్యకావ్యం వ్రాశారు. విద్యార్థి దశలోనే వారు వ్రాసిన వ్యాసాలు - 'ద్రౌపదికి భర్తలెందరు', 'చిత్రగుప్త', 'ఆశ్రమాలు', 'ఢంకా' అనే పత్రికలో ప్రచురితమయ్యాయి. గుంటూరులో విద్యార్థిగా వున్నప్పుడే ఊళ్ళో పురాణాలు చెప్పే శాస్త్రి గారిని సవాలు చేసి, లైబ్రరీ దగ్గర అర్థ సహితంగా పురాణాన్ని చెప్పి అక్కడి శ్రోతలను దిగ్భ్రాంతి చేశారు. 1938లో జాతీయోద్యమ స్ఫూర్తితో పండిట్ నెహ్రూ గుంటూరు వచ్చినప్పుడు గుంటూరు పట్టణ విద్యార్థి సంఘం కార్యదర్శిగా విరాళాలు వసూలు చేసి వారికి అందించారు. వీరు లక్నోలో చదువుచున్నప్పుడే యం.యన్. రాయ్‌తో వ్యక్తిగత పరిచయమేర్పడింది. లక్నోలో వుండగానే "నేషనల్ హెరాల్డ్" పత్రికకు వ్యాసాలు పంపి, పత్రికా రచనలో ప్రవేశించారు. ఎవరు ఏది చెప్పినా, తనకు తాను ఆలోచించనిదే అంగీకరించేవారు కాదు. కొరియా సమస్య వచ్చినప్పుడు రాయ్‌తో విభేదించారు. త్రిపురనేని రామస్వామి రచనలు ఛాందస భావాలను ఛేదించటానికి ఉపయోగపడతాయని భావించారు.


ఆవుల గోపాలకృష్ణ మూర్తి

కవిరాజు త్రిపురనేనితో స్నేహం పెరగటంతో సూతాశ్రమంలో రోజూ ఆయనతో చర్చలు సాగుతూ వుండేవి. అప్పటికే రాయ్ భావాలను పుణికి పుచ్చుకున్న మూర్తి ఆ భావాలను ప్రచారం చేసే కోగంటి సుబ్రమణ్యం, జి.వి కృష్ణరావు, కోగంటి రాధాకృష్ణ మూర్తి, గుత్తికొండ హరి, లావు అంకమ్మ, గోపీచంద్, పి.వి. సుబ్బారావు మొదలైన వారితో పరిచయం పెరిగింది. రాయ్ భావాల ప్రచారానికి తీవ్ర కృషి చేశారు. కవిరాజుతో ఏర్పడిన పరిచయం స్నేహంగా మారి హేతువాద దృష్టి పరిపుష్టికి దారి తీసింది. రెండవ ప్రపంచయుద్ధ ప్రారంభంతో యం.ఎన్.రాయ్ కాంగ్రెసు నుంచి బయటకు వచ్చి రాడికల్ డెమోక్రటిక్ పార్టీను ప్రారంభించారు. లక్నోలో 1943లో జరిగిన ఆ పార్టీ సభకు ప్రతినిధిగా వెళ్ళి రావటంతో ఆంధ్ర రాడికల్ డెమోక్రటిక్ పార్టీ తెనాలి కేంద్రంగా ఏర్పడింది. ఆ సంవత్సరమే రాడికల్ పత్రిక స్థాపించిడానికి చాలా సంవత్సరాలు సంపాదకునిగా పని చేశారు. ఆంధ్రరాష్ట్ర రాడికల్ డెమోక్రటిక్ పార్టీకు కార్యదర్శిగా, ఆలిండియా రాడికల్ డెమోక్రటిక్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులుగా పని చేశారు. ఇండిపెండెంట్ ఇండియా అనే పత్రికలో అనేక ఆంగ్ల వ్యాసాలు వ్రాశారు.

**వైవాహిక జీవితం:**

వీరు కృష్ణా జిల్లా కాసరనేని లంక గ్రామానికి చెందిన కాసరనేని వీరయ్య, ఆదిశేషమ్మ దంపతుల కుమార్తె హేమలతను వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు జన్మించారు. రెండవ ప్రపంచ యుద్ధంలో ప్రజాస్వామ్య శక్తుల నిజ చిహ్నంగా వీరి పెద్ద కుమార్తెకు జయశ్రీ అని, ప్రముఖ సంఘ సంస్కర్త రాజారామ మోహన్‌రాయ్, హేతువాది. యం.యన్. రాయ్‌ల గుర్తుగా పెద్దకుమారునికి రాజారామ్‌మోహన్ రాయ్, గౌతమ బుద్ధునిపైన వున్న మమకారంతో రెండవ కుమారునికి గౌతమ బుద్ధుడు అని (న్యాయవాది), మూడవ కుమారునికి తన తండ్రి, రామస్వామి పేరుని, ఆంధ్రరాష్ట్ర అవతరణ సమయంలో జన్మించిన రెండవ కుమార్తెకు ఆంధ్రశ్రీ అని చివరి కుమార్తె అరుణోదయ సమయంలో జన్మించటంతో అరుణశ్రీ అని పేర్లు పెట్టారు.

**న్యాయవాద వృత్తి:**

న్యాయవాదిగా 1941లో గుంటూరులో వృత్తి ప్రారంభించి ఆ తరువాత తెనాలికి మారి కొద్ది సమయంలో ఆ పట్టణంలో ప్రముఖ క్రిమినల్ లాయర్‌గా, నవ మానవతావాదిగా ప్రజలకు సుపరిచితులయ్యారు. తన వివాహంలో పంక్తి భోజనంలో పంచముల్ని కూర్చోబెట్టారని, కొందరు అభ్యంతరం పెట్టి లేచి పోవటానికి ప్రయత్నిస్తే, తాను వివాహామే మానుకుంటానని భీష్మించిన మానవతావాది. వారు వేలాది ఆదర్శ వివాహాలు దగ్గరుండి చేయించారు. తన ఇంటిలో కూడ ఆదర్శ వివాహాలు జరిపించారు. 1947లో కలకత్తాలో రాడికల్ డెమోక్రటిక్ పార్టీ రద్దు చేయించే కార్యక్రమంలో ప్రముఖ పాత్ర పోషించి హ్యూమనిస్టు భావాల ప్రచారానికి పూనుకున్నారు. 1951లో తెనాలిలో అఖిల భారత హేతువాద సభ నిర్వహించారు. బాల కళాపరిషత్‌ను స్థాపించి దానికి అధ్యక్షునిగా తెనాలిలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. ప్రెస్‌క్లబ్‌ను స్థాపించి దానికి అధ్యక్షునిగా వ్యవహరించారు. ఆంధ్ర రాష్ట్ర జర్నలిస్టుల సమాఖ్యకు ఉపాధ్యక్షునిగా, తెనాలి లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా పనిచేశారు. తెనాలిలో మున్సిపల్ కౌన్సిల్‌కు రెండుసార్లు ఎన్నికయ్యారు. 1955లో ఆ మున్సిపాలిటీకు ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై, అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి ఆ పట్టణం రూపురేఖలు పూర్తిగా మార్చి వేశారు. ఆయన పరిపాలనా కాలంలో కౌన్సిల్‌లో ఏ తీర్మానంపై ఓటింగ్ లేదు. వారు ప్రాథమిక విద్యాపరిపుష్టికి చాలా కృషి చేసి, విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననలు పొందారు.

**విదేశీయాత్ర:**

అమెరికా ప్రభుత్వం 1963లో అధికారికంగా తమ దేశం పర్యటించవలసినదిగా మూర్తిని ఆహ్వానించడం గొప్ప విశేషం. ఆయన పేరు మోసిన రాజకీయ నాయకుడు కాదు. ఎలాంటి బిరుదులు లేని సాధారణ వ్యక్తి. సినిమా క్రీడా, కళా రంగాలలో సెలబ్రిటీ కూడా కాదు. ఆనాటి ప్రమాణాలతో పరిగణిస్తే ఆయనను ఒక బహుముఖ ప్రజ్ఞాశాలిగా పరిగణించడంతో ఇటువంటి ఆహ్వానాన్ని అమెరికా పంపించిందని పలువురు భావించారు. ఆయన అమెరికా బయలుదేరుతున్నప్పుడే పెద్ద దుమారం రేగింది.

ఆయన వాషింగ్టన్‌లో ప్రెసిడెంట్ కెన్నడీప్రెస్ కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఆ పర్యటనలో జవహర్‌లాల్ నెహ్రూ విధానాలపై ఘాటుగా విమర్శలు చేయగా, తిరిగి ఇండియాకు పంపించివేస్తానని ఆనాటి భారత రాయబారి బి.కె. నెహ్రూ బెదిరించినా, మూర్తి ఏ మాత్రం బెదరలేదు సరికదా, నెహ్రూను విమర్శించడం మానుకోనని కరాఖండీగా చెప్పారు. కాలిఫోర్నియా రాష్ట్రంలో వున్న ఫైస్నో పట్టణ 'గౌరవ మేయరు'గా నియమించి ఆయన ప్రతిభను గౌరవించారు. ఆ దేశం నుండి తిరిగి వస్తూ ఇంగ్లాండు, ఫ్రాన్సు, జర్మనీ మొదలగు దేశాలు పర్యటించి అచ్చటి ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులను నిశితంగా గమనించారు. తన 60 రోజుల విదేశ ప్రయాణాన్ని ముగించుకుని స్వదేశం తిరిగి వచ్చి "నా అమెరికా పర్యటన" అనే పుస్తకాన్ని ప్రచురించి, అమెరికా జీవితాన్ని అన్ని కోణాల నుండి చూసిన తీరు తెన్నులు, మనకు వారికీ వివిధ రంగాల్లో వున్న పోలికల తీరులు, వ్యత్యాసాలు చక్కగా వివరించారు. ఈ పుస్తకంలో కవులకు కవిత సాంఘిక వాదులకు సాంఘిక ఇతివృత్తం, ప్రజాస్వామ్య వాదులకు భావవాదులకు, రైతులకు, విద్యావేత్తలకు, స్థానిక పాలకులకు కావలసిన విషయాలు చాలా చక్కగా విపులీకరించారు. ఈ అమెరికా ప్రయాణం తనకొక కనువిప్పు కలిగిందని రచయిత ముందుమాటలో అభిప్రాయపడ్డారు. అమెరికా ప్రయాణానికి ముందు, ఆ తరువాత ఎన్నో సంస్థలు, వ్యక్తులు ఆయనను సత్కరించారు. ఘనంగా గౌరవించారు.

**బహుముఖ ప్రజ్ఞాశాలి:**

మూర్తి హైందవంలోని వైదిక మతంపై దండయాత్ర చేశారు. బౌద్ధ విప్లవాన్ని నాశనం చేసి శంకరాచార్యులు కులమతాల్ని పటిష్టం చేశారని, అవి భారత దేశ పురోభివృద్ధికి అడ్డంకులని జీవితాంతం పోరాడిన యోధుడు. రిజర్వేషన్లు ఆర్థికంగా బలహీనంగా వున్న వారికి మాత్రమే వర్తించాలని, కులం ప్రాతిపదికపై వుండకూడదని గట్టిగా నమ్మిన అసాధారణ వ్యక్తి. సూటిగా, పరుషంగా విమర్శించడం ఆయనకు పరిపాటి. గోపీచంద్‌తో ఎంతో సాన్నిహిత్యంగా వున్నా కొన్ని విషయాలలో ఆయనతో విభేదించి తన అభిప్రాయాల్ని నిర్మొహమాటంగా వ్యక్తపరచేవారు. భావ విప్లవం లేనిదే సాంఘిక చైతన్యం సాధ్యం కాదని ఆయన దృఢ విశ్వాసం. వృత్తి రీత్యా న్యాయవాది అయినా, ప్రవృత్తి రీత్యా ఆయన సాహితీవేత్త. రోజువారి కోర్టు వ్యవహారాలు పూర్తి అయిన తరువాత ఆయన ఇల్లు ఒక "భువన విజయం"గా వుండేది. ఆయన మిత్రవర్గంలోని రచయితలు, కవులు, ప్రతికావిలేకరులు దాదాపు పాతిక మంది సాయంత్రంపూట హాజరయ్యేవారు. సాహిత్య రంగంలో విశ్వనాథ సత్యనారాయణ రచనలు అశాస్త్రీయమైనవని, మూఢనమ్మకాల పుట్టలని మూర్తి విమర్శించే వారు. వీరికి తిక్కన కంద పద్యాలు, కవిరాజు గీతాలు కంఠతాపాఠాలు, జ్ఞాపకశక్తి ఆయన సొమ్ము. అధునాతన కవితా రీతులలో పరిచయమున్నప్పటికి వారికి కవిరాజు, జాషువా, మోదుకూరి, ఏటుకూరి అభిమాన కవులు. ఆయన వాస్తవవాది. నాటకాలు కేవలం ఆనందించటానికి మాత్రమే కాదని, అవి సాంఘికంగా విప్లవాత్మకమైన మార్పుల సాధనకు బలీయమైన సాధనాలని విశ్వసించేవారు. రుద్రయాగాలు చేసి, దేవాలయాల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించి ప్రజల్ని బాగు చేయగలం అని అనేవారు. ఆయన కళాభిమానిని కాదని చెప్పుకున్నా భౌతికంగా కళాభిమాని అని సంజీవ్‌దేవ్ అభిప్రాయపడ్డారు. ఒక మంచిపనికోసం ఇంకొక చెడ్డపని చేయటానికి ఆయన అంగీకరించేవారు కాదు. బ్రాహ్మచర్యం నుండి సన్యాసిగా మారి తన వేదాంత ఉపన్యాసాలతో ఊరూతలూగిస్తున్న తన మిత్రుడ్ని, ఆయన బంధువుల కోరిక మేరకు ఆయనను గృహస్థునిగా మార్చి కొండవీటి వెంకటకవిగా మార్చిన ఘనుడు ఏ.జి.కె. (వీరు తెనాలి ప్రజలకు ఏ.జి.కె.గా సుపరిచితులు). వేదాంతులు, ఉద్ధండ పండితులు ఆయిన మత్పరమహంస పరివ్రాజకాచార్య జగద్గురువు బ్రహ్మానందగిరి స్వాములవారి భావాలను సైతం వీరు సెక్యులరైజ్ చేసి ఆయనతో "సాంఘిక విప్లవం" వ్రాయించి దానిని తాను "సోషల్ రివల్యూషన్" అని ఆంగ్లంలోకి అనువదించారు.

**సంఘసంస్కర్త:**

ఏ.జి.కె. తనకు నచ్చిన మేర ఎవరితోనైనా కలిసి పనిచేసివారికి సహాయం అందించటానికి వెనుకాడేవాడు

కాదు. ఆచార్య రంగా, తిమ్మారెడ్డిగార్లతో రైతు సమస్యల గురించి, గోరాతో పార్టీ రహిత ప్రజాస్వామ్యం, నాస్తిక వాదం, సంఘసంస్కరణ, యస్.రామనాధన్ (మాజీమంత్రి తమిళనాడు)తో హేతువాదం, కులవ్యవస్థలపై పోరాటానికి బహుజనులతో కలిసి పనిచేశారు. తమ ఇంట్లోవారు పూజలు, పునస్కారాలు చేస్తూ వుంటే, తనకు పట్టి పట్టినట్లుగా వ్యవహరించేవారు. స్త్రీలను వృత్తి విద్యలందు నిపుణులుగా తయారు చేస్తే వరకట్నాల బెడద పూర్తిగా రూపుమాసిపోగలదని, పరిమిత కుటుంబం వలన స్త్రీలకు విశ్రాంతి దొరికి వారు సామాజిక సేవారంగాలలో చురుకుగా పాల్గొనటానికి అవకాశం ఏర్పడుతుందని విశ్వసించేవారు. పిల్లలకు నిర్భయాన్ని అలవర్చటం, తల్లిదండ్రుల, గురువుల ప్రధాన కర్తవ్యం అని భావించేవారు.

**రైతు బాంధవుడు:**

ఎవరి నమ్మకాలు, విశ్వాసాలు వారికి వుంటాయి. ఎవరైనా ఏ.జి.కెతో ఏకీభవించవచ్చు లేక విభేదించవచ్చు. కాని ఆయన నైతిక స్థయిర్యాన్ని నిజాయితీని, మానవతా విలువలపై ఆయనకున్న నమ్మకాన్ని, వ్యక్తి స్వేచ్ఛపై వున్న అచంచల విశ్వాసాన్ని, సంఘసంస్కరణలపట్ల ఆయనకు వున్న ప్రగాఢవాంఛనూ ఎవరూ ప్రశంసించకుండా వుండలేరు. రాష్ట్రంలోని పలువురు ప్రముఖులు వీరితో అనేక అంశాలపై చర్చలు జరిపేవారు వారిలో ఆచార్య రంగా, తిమ్మారెడ్డి, గోరా, మాజీ ముఖ్యమంత్రులు సంజీవయ్య, బ్రహ్మానందరెడ్డి ఇంకా అనేకమంది రచయితులు కవులు వుండేవారు. తన తాత్విక చింతనతో విభేదించేవారితో కూడా సత్సంబంధాలు కలిగి వుండటం ఆయన విశిష్టత. ఆయన మంచివక్త. అంధ విశ్వాసాలను, దురాచారాలను వ్యతిరేకిస్తూ అనర్గళంగా ఉపన్యసించేవారు. 17వ రాజ్యాంగ సవరణ వలన రైతు లోకానికి నష్టం వాటిల్లుతుందని, నియంతృత్వ ధోరణులు ప్రబలుతాయని రాజగోపాలాచారి, యన్.జి.రంగా ఆ సవరణకు వ్యతిరేకంగా ఆందోళన చేశారు. ఆ సందర్భంలో బాపట్లలో పెద్ద రైతు సభ జరిగింది. రైతుల శ్రేయస్సుకోరేవారు కావటంతో ఏ.జి.కె ఆ సభకు హాజరయ్యారు. ముందుగా వారే ఉపన్యసించారు. అది విన్న తరువాత ఇక తను మాట్లాడవలసినది ఏమీ లేదని, రైతు, రైతు కూలీల సమస్యలను ఏ.జి.కె. చాలా విడమరచి అన్ని విషయాలను కూలంకషంగా చెప్పారని రాజాజీ వ్యాఖ్యానించారు. రాజాజీ నిండు సభలో శ్లాఘించటం ఎ.జి.కె. విషయ పరిజ్ఞానానికి పరిపక్వ విమర్శకు గొప్ప సర్టిఫికేట్‌లాగే భావించాలి.

**రచయిత, పత్రికాధిపతి:**

గుంటూరులో విద్యార్థిగా వున్నప్పుడే ఆయన దృష్టి రచనా వ్యాసంగం పైకి మరలింది. "కృష్ణశతకం" అనే పద్య కావ్యం వ్రాసి అందరి దృష్టిలో పడ్డారు. అనేక వ్యాసాలు తెలుగు, ఆంగ్లంలో వేరు వేరు పత్రికలలో ప్రచురింపబడినాయి. పత్రికల పట్ల, పత్రికా స్వేచ్ఛా పట్ల ఆయనకు నిర్దుష్టమైన అభిప్రాయాలుండేవి. పత్రికలు ప్రజల దృక్పథాలను ప్రభుత్వానికి, ప్రభుత్వ విధానాలను ప్రజలకు అన్వయం చేస్తూ ఏ వేళలో ఏది ఉచితమో ఉభయులకు తెలియచేస్తూ లోపాలను దిద్దే వేదికగా పనిచేయాలని ఆయన దృఢమైన అభిప్రాయం వారి దృష్టిలో ప్రతికా రచన ఒక నైతిక విక్రయ, పత్రికాలోకం పతితమైతే జాతి జీవనాడుల్లో ఒక ప్రధాననాడి దెబ్బ తిని పోయి జీవిత గమనం అరిగిపోయినట్లు భావించి వుంటుంది అన్న నిలుకడ గల ప్రజాస్వామ్యం వర్థిల్లాలంటే పత్రికాలోకానికి సంపూర్ణ స్వాతంత్ర్యం వుండాలని వారి అభిప్రాయం.

వారు "రాడికల్" పత్రిక, "రాడికల్ హ్యూమనిస్టు" అనే పత్రికలకు సంపాదకునిగా పనిచేశారు. "నా చుట్టూ ప్రపంచం" అనే శీర్షికతో "వాహిని" పత్రికలో వ్రాసిన వ్యాసాలకు ఆనాటి ముఖ్యమంత్రులు, రాజకీయ వేత్తలు స్పందించక తప్పలేదు. ఆయన రచనలు చాలా పదునుగా, నూతన వైఖరిని సంతరించుకునేవి. తెలుగులో ఎన్నో రచనలు చేసిన ఎ.జి.కె. అఖిల భారత స్థాయిలో నాయకులను ఆంధ్రకు పిలిపించి హేతువాద ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయారు. తమిళనాడు ముఖ్యమంత్రి అన్నా దొరైని తెనాలికి ఆహ్వానించి పెద్ద సభను నిర్వహించారు. వారితో పాటుగా యం.జి. రామచంద్రన్ కూడా హాజరయ్యారు. హేతువాద వ్యాప్తికి ప్రత్యేక స్టడీ క్యాంపులు నిర్వహించారు. ఎంతటి వారినైనా శాస్త్రీయ దృష్టితో విశ్లేషించేవారు. ఆ విధంగా ప్రముఖ పాత్రికేయులు

నార్ల వెంకటేశ్వరరావును ఆకట్టుకున్నారు. స్వామి వివేకానందపై ఆయన చేసిన విమర్శలు ఆంధ్రప్రభ సంపాదకులు నీలం రాజు వేంకటశేషయ్య వ్యతిరేకించినా హేతుబద్ధంగా సమాధానం చెప్పలేకపోయారు. వీరు పత్రికలలో వ్రాసిన వ్యాసాలే కాక "నా అమెరికా పర్యటన" "ఏజికె సూక్తులు" "సాహిత్యంలో ఔచిత్యం" "నాలో నేను" "హ్యూమనిజం" "నవ్యమానవవాదం" పుస్తకాలు వ్రాశారు. అనేక పుస్తకాలకు పీఠిక, ముందుమాట వ్రాశారు.

**సౌజన్య నిధి:**

ఆయన వృత్తి రీత్యా న్యాయవాది. తన సంపాదనపై ఆరాటం కన్నా సామాజిక సమస్యలపై తన సమయాన్ని అధికంగా కేటాయించేవారు. ఆ సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేశారు. ఆనాటి రాజకీయ ప్రముఖులు, కవులు ఆచార్య రంగా, గొట్టిపాటి బ్రహ్మయ్య, తుమ్మల సీతారామమూర్తి, ఆవులు సాంబశివరావు, గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, గోరా, సంజీవదేవ్, తుమ్మల గోపాలకృష్ణయ్య, వెలగా వెంకటకృష్ణయ్య. యం.వి. రామమూర్తి, కొత్త భావయ్య చౌదరి, అత్తోట రత్నకవి ఇంకా ఎందరో ప్రముఖులతో ఆయనకు సత్సంబంధాలు వుండేవి. ఇంతటి బహుముఖ ప్రజ్ఞాశాలి తన 50వ యేటనే 1966లో మరణించడం తెలుగుజాతి దురదృష్టం.

ఎ.జి.కె.ను గురించి నార్ల వేంకటేశ్వర రావు పేర్కొన్న వాక్యాలతో ఈ వ్యాసం ముగించడం ఔచిత్యంగా వుంటుంది. "బహుజనాభిప్రాయానికి భిన్నంగా వెళ్ళటం ఏటికి ఎదురీత, కత్తిమీద సాము, నిప్పుతో చెలగాటం, నల్లత్రాసుతో పగ, అయినా గోపాలకృష్ణమూర్తి చలించలేదు. వెనుకంజ వేయలేదు. వెన్ను చూపించలేదు. ధైర్యంగా ఆయన నిలిచాడు. అటునుంచి నరుక్కురావటానికి ప్రయత్నించాడు. ఈ పోరులో మునిగివుండగానే అకాలమృత్యువు ఆయనను కబళించడం ఎంతైనా శోచనీయం. అది మన రాష్ట్రానికి పెద్ద దెబ్బ, మన దేశానికి నష్టం. గోపాలకృష్ణమూర్తి మధ్యలో విడిచివెళ్ళిన పోరాటాన్ని కడవరకు కొనసాగించడం ఆయన మిత్రుల ధర్మం. దాన్ని పాలించిన మేరకే వారు తమ మిత్రుని స్మృతిని గౌరవించడం జరుగుతుంది.

*స్నేహ శీలత నిజ శీలమ్మువే నీవు*
*నవ్య మానవతకు నడకనీవు*
*తర్క శాస్త్ర విద్య తాత్పర్యమే నీవు*
*నిజము పల్క మా మనీషి వీవు*

అన్న పి. అచ్యుతరామ్ మాటలు ఆ స్నేహశీలికి నిలువుటద్దాలు. ఆ మహామనిషి అకాల మృతి హ్యూమనిస్టు ఉద్యమానికి తీరని లోటని చెప్పక తప్పదు.

హేతువాద ఉద్యమ నాయకుడు ఆవుల గోపాలకృష్ణమూర్తి (1917–1966) ఆంధ్రదేశంలో హేతువాద, నవ్య మానవవాద ఉద్యమాలకు ముఖ్యనాయకునిగా, ఎం.ఎన్.రాయ్, కవిరాజు త్రిపురనేని రామస్వామిల ఆశయాలకు ప్రభావితులై సమాజ సంస్కరణకు కృషి చేసిన ప్రముఖులు గోపాలకృష్ణమూర్తి. అంధ విశ్వాసాలను, దురాచారాలను వ్యతిరేకిస్తూ అనర్గళంగా ఉపన్యసించేవారు. అనేక రచనలు చేశారు. 1958లో తెనాలి మున్సిపల్ ఛైర్మన్‌గా పనిచేసి విశిష్ఠ సేవలందించారు. ప్రతి ఒకరికి భావప్రకటన స్వేచ్ఛ ఉన్నదనీ, మానసిక విప్లవం ద్వారా మాత్రమే భావ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించగలమని అనేవారు. గోపాలకృష్ణమూర్తి బహుముఖ ప్రజ్ఞశాలి, మేధావి. తన ఆలోచనలతో ప్రసంగాలతో విద్యావంతుల్లో భావ పరిణామం తీసుకొచ్చిన ఎ.జి.కె. చిరస్మరణీయులు.

కొసరాజు వెంకటేశ్వరరావు
హైదరాబాద్, ఫోన్ : 967 675 5633.



# కూనలమ్మ పదాలు

– ఆల్తి మోహనరావు

*జపతపంబుల కన్న*
*చదువుసాములకన్న,*
*ఉపకారమే మిన్న*
*కూనలమ్మ*

*అన్నమిచ్చినవాని*
*ఆలి నిచ్చినవాని*
*అపహసించుట హాని*
*ఓ కూనలమ్మ..*

*మగని మాటకుమాటి*
*కెదురు పల్కెడి బోటి*
*మృత్యుదేవత సాటి*
*ఓ కూనలమ్మ..*

*కాపువాడే రెడ్డి*
*గరికపోచే గడ్డి*
*కానకుంటే గుడ్డి*
*ఓ కూనలమ్మ*

*కవితా రసపు జల్లు*
*ఖడ్గాల గలగల్లు*
*కరణాలకే చెల్లు*
*ఓ కూనలమ్మ*

*దుర్యోధనుడొక భోగి*
*ధర్మరాజొక జోగి*
*అర్జునుండే యోగి*
*ఓ కూనలమ్మ*

*భీష్ముడనుభవశాలి*
*భీముడే బలశాలి*
*కర్ణుడే గుణశాలి*
*ఓ కూనలమ్మ*

*ఆడితప్పినవాని*
*ఆలినేలనివాని*
*ఆదరించుట హాని*
*ఓ కూనలమ్మ*

ఈ ఎనిమిది ప్రచారంలో ఉన్న పాత కూనలమ్మ పదాలు. వీటిని 1930లో శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు *భారతి* పత్రికలో బాలభాష శీర్షిక క్రింద ప్రచురించారు. వేటూరి తర్వాత ఈ పదాలను సంకలన గ్రంథంలో ప్రచురించిన కృష్ణశ్రీగారు ఈ పదాల గురించి ముందుమాట రాస్తూ కూనలమ్మ జానపదుల దేవత అని చెప్పారు. పార్వతీదేవి కూతుళ్లు కామేశ్వరీ దేవి తోబుట్టువులు అయిన ఏడుగురు అక్కలకు తమ్ముడు పోతరాజు. ఆయన భార్య కూనలమ్మ. ఆ కూనలమ్మను జానపదులు దేవతగా కొలుస్తూ కూనలమ్మ సంకీర్తనలు, కూనలమ్మ వేట, కూనలమ్మ చీర మొదలగు పాటలను సృష్టించారు. 1960లో నేదునూరి గంగాధరంగారు *జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి* అను పుస్తకాన్ని వెలువరించారు. అందులో గుంటూరు నెల్లూరు ప్రాంతాలలో కూనలమ్మ పదాలు ప్రఖ్యాతిగా ఉండేవి వేద పురాణాలు ఉపనిషత్తుల సారం కూడా ఈ పాటలో స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది అంటూ ఈ పదాలను వాడే ప్రాంతాలు వాటిలో ఉన్న విశేషాలను వివరించారు.

**కాలము:**

కూనలమ్మ పదాలు ఎప్పటినుంచి ఉన్నాయి అని ఇదమిత్థంగా చెప్పలేము కానీ నన్నెచోడుని కావ్యాలలో ఈ కూనలమ్మపదాల వరుస కనిపిస్తున్నది. ఉదాహరణకు "తూలగొని పారు సుగంధము జొమ్పముల దూరు సుగంధము మీరు" – దీనినిబట్టి శివకవి యుగానికి ముందు నుంచే కూనలమ్మ పదాలు లోకంలో వ్యాప్తిలోయున్నవని చెప్పవచ్చు. ఇప్పటికీ మన తెలుగు నేలలో కూనిరాగాలు తీస్తున్నాడని, కూనలమ్మ సంగీతాలు తీస్తున్నాడని నానుడులున్నాయి. ఈ నానుడులు పై పదములవల్ల పుట్టినవే.

**ఛందస్సు :**

ఓ కూనలమ్మ లో, 'ఓ' అను అక్షరము లోపిస్తే నాలుగు పాదాలు కలిసి సీస పద్యంలో ఒక పాదం అవుతుంది అని సి. నారాయణ రెడ్డి గారు అభిప్రాయపడుతున్నారు. కూనలమ్మ పదాలలో మకుటము తప్ప ప్రతిపాదంలోనూ 10 మాత్రలు కచ్చితంగా ఉండాలి. ఆపది మాత్రలు 3+ 4 + 3 లేదా 5 + 5 లెక్కలో మాత్రల విరుపు వుంటే వీనులకు విందును చేకూరుస్తాయి. ఆరుద్రగారు ఈ ఛందస్సును పరిశీలించి సుమారు 16 రకాల విరుపులు సూచించారు.

**ఆరుద్ర కూనలమ్మ పదాలు:**

ఇంత ప్రాచీనత కలిగిన, జన బాహుళ్యము లోనున్న, కూనలమ్మ పదాలను చదివి, ఉత్తేజితులై, ఆ ఛందస్సుకు ఆకర్షితులై, పదాల సంవిధానాన్ని ఆకళింపు చేసుకుని, రస గుళికలవంటి నూతన పదాలను, ఓ కూనలమ్మ మకుటంతో తెలుగు సాహిత్యానికి అందించారు ఆరుద్రగారు. ఆరుద్రగా తెలుగు ప్రజలకు సుపరిచితులైన భాగవతుల సదాశివశంకర శాస్త్రి పట్టి బంగారం చెయ్యని సాహిత్య శాఖ లేదు. కవిత్వం, కథలు, నాటకాలు, నవలలు, పత్రికా వ్యాసాలు, పరిశోధనలు ఇలా బహుముఖంగా అతని రచనా వ్యాసంగం సాగింది. సాహిత్యం అర్ణవమైతే ఆరుద్ర మథించని లోతులు లేవు. సాహిత్యం అంబరమైతే ఆరుద్ర విహరించని ఎత్తులు లేవు. "తెలుగు సాహిత్య లోకానికి ఆయన ఆరోగ్యాన్ని, ఆయుస్సును, త్యాగం చేసి అందించిన గొప్ప వరం సమగ్రాంధ్ర సాహిత్యం. అంతటి గొప్ప పరిశీలకుడి కలము నుండి సమకాలిక జీవితం మీద చురుకైన విసుర్లతో, కరుకైన కసుర్లతో, ప్రతిపద రమణీయం, పదపద చమత్కారంతో జాలువారిన రస ప్రదాలు కూనలమ్మ పదాలు.

*కూనలమ్మ పదాలు / వేనవేలు రకాలు /*

*లోకానికి సవాలు / కోరుకున్న వరాలు*

ఇవి ఆరుద్ర సరదాలు అంటూ *ముమ్మాటికీ* అనే పేరుతో శ్రీశ్రీ రాసిన అభినందనలతో, శ్రీ ముళ్ళపూడి వెంకటరమణగారికి పెళ్ళికానుకగా 1964లో వెలువడ్డదీ పొత్తము.

**ఆరుద్ర కూనలమ్మ పదాలు రచనా కాలము:**

1960 ప్రాంతంలో శ్రీ నీలంరాజు వెంకట శేషయ్యగారు నడిపిన *ఆంధ్రప్రభ* ప్రత్యేక సంచికకు ఓ కూనలమ్మ అనుపాత మకుటంతోనే, మొదటిసారిగా 14 కొత్త పదాలు రాసి పంపించారు. ఇవి చదివిన మల్లాది రామకృష్ణశాస్త్రిగారు, ముళ్ళపూడి వెంకటరమణగారు, ఇలాంటివి వందలైనా రాయాలని ఆరుద్రను కోరారు.

ఆ తరువాత నందూరి రామమోహనరావు, బాపు-రమణ, కొండలరావు, రాఘవయ్యగార్ల ఉమ్మడి ప్రోత్సాహంతో *జ్యోతి* మాస పత్రిక ఏర్పడింది. ముళ్ళపూడిగారి కోరికమేరకు దాని రెండవ సంచిక నుండి కూనలమ్మ పదాలను ఒక ఫీచర్‌గా రాయటం ఆరంభించారు ఆరుద్రగారు. తదుపరి ఆ *జ్యోతి* ప్రచురణలు వారే తమ మొదటి గ్రంథంగా కూనలమ్మ పదాలను ముద్రించారు.

**ఆరుద్ర కూనలమ్మపదాలు వివరణ:**

నేను చదివిన పొత్తములో శ్రీ శ్రీ గారి *ముమ్మాటికీ* అనే అభినందన, ఇంట్రో పేరుతో ఆరుద్రగారి ముందుమాట 152 ఓ కూనలమ్మ అను మకుటముతో పదాలు ఉన్నాయి. 152 పదాలలో మొదటి 5 అవతారిక పదములు. చివరి రెండు పదాలు స్వస్తివాక్యములు.

*చిన్ని పాదములందు / చివరి ప్రాసల చిందు*

*చేయు వీనుల విందు / ఓ కూనలమ్మ*

అంటూ చిన్ని పదములలో అంత్యప్రాసలతో వీనులకు విందు చేస్తానని మొదటి పదము ద్వారా ప్రకటించారు.

*నీవు పలికిన రీతి / నేను పాడెద నీతి /*

*నీకు చెందుత ఖ్యాతి ఓ కూనలమ్మ*

అంటూ తన నీతి ద్వారా కూనలమ్మకు ఖ్యాతిని తీసుకువస్తానని చెప్పి జానపదుల కూనలమ్మను శిష్ట వ్యవహారుల కూనలమ్మగా మార్చాడు.

అవతారిక, స్వస్తి పద్యములు పోగా మిగిలిన 145 పద్యములలో జీవిత వైవిధ్యాన్ని అంత్యప్రాసలతో సూక్తి ప్రాయంగా వ్యంగ్యంగా పాఠకుల కళ్లముందుంచాడు. ఈ పదాలను నేను పరిశీలించి కొన్ని విభాగాలుగా మీ ముందు పెడుతున్నాను.

**కవులపై పదాలు:**

తాను చదివిన, తాను మెచ్చిన కవులకు ఈ పదాలలో సముచిత స్థానాన్ని కల్పించారు ఆరుద్రగారు.

*గద్య సుమముల నుండి / కావ్య మధువులు పిండి*

*పంచి పెట్టెను దండి / ఓ కూనలమ్మ*

*భక్తి తేనెల ఏరు / పసిడి కలల బిడారు*

*కలసి పోతనగారు / ఓ కూనలమ్మ*

*చెరుకు రసముల తోట / చిన్మయత్వపు తేట / యోగివేమన మాట*

అంటూ ప్రాచీన కవులయిన దండి, పోతన, వేమనలను తన పదములలో ప్రశంసించాడు.

*కొంతమందిది నవత / కొంతమందిది యువత*

కృష్ణశాస్త్రిది కవిత అంటూ కృష్ణశాస్త్రిదే నిజమైన కవితయని,

*రెండు శ్రీలు ధరించి / రెండు పెగ్గు బిగించి*

*వెలుగు శబ్ద విరించి*

అంటూ శ్రీశ్రీ మద్యపాన అలవాటును ఎత్తిచూపినా, ఆతడు శబ్ద బ్రహ్మ అని తన పదములలో శ్లాఘించాడు. అలాగే విశ్వనాథ, బాపు, కొడవటిగంటి, వెంకటరమణ, నండూరి సుబ్బారావు, పట్టాభి, గోపీచంద్ మొదలగు కవులను తన పదముల ద్వారా కొనియాడాడు. ప్రజలు వొల్లని కథలు చివరికి చెదలకే చేరుతాయని, అజ్ఞులైన కాకవులు, కాకాకవులయ్యారని, కుకవులును తన పదములలో నిందించారు.

*హృదయమున్న విమర్శ / మెదడు కలచువిమర్శ*

*తిట్టునెచ్చెలి స్పర్శ*

అంటూ సద్విమర్శ ప్రియమైన స్నేహితురాలి కరస్పర్శవలె వుంటుందని, వంకర బుద్ధిగలవాడి సమీక్షను ఉపేక్ష చేయమని తన పదాలలో సూచించారు.

**పురాణ ఇతిహాసములమీద పదములు:**

*భాగవతమున భక్తి / భారతమున యుక్తి*

*రామ కథ యేరక్తి*

అంటూ మూడు మహా గ్రంథాలపై ఒకే పదములో కట్టే, కొట్టే, తెచ్చే వ్యాఖ్యానము చేశారు. పుణ్య గాథల బూతు బూజు పట్టిన ట్రూతు అంతు చిక్కదు లోతు అంటూ పురాణగాథలలో ఉన్న బూతు కథలను పరిహసించాడు. సుమారు ఏడు పదాలలో భాగవత కృష్ణుడి మాయ చేష్టలను వ్యంగ్యంగా చమత్కరించాడు. మచ్చుకు–

*మేనమామకు యముడు / మేనయత్తకు మరుడు*

*ఘనుడు కద మాధవుడు.*

*పరుల యింట తిరిగే / పరుల పడతుల మరిగే పరతత్త్వమైసురిగే.*

*చెలుల చీరలు దోచి / చెల్లి చీరను గాచి / చేసేనే లాలుచీ.*

కృష్ణుడి లీలలు వింటేనే ఆనందపడతాము. ఈయన పదాలలో చదివితే పరమానందభరితులౌతున్నాము కదా!

**మూఢనమ్మకాలపై పదాలు:**

సహజముగా అభ్యుదయము, హేతువాద భావాలు ఈయన రచనలలో కనిపిస్తాయి. ఈ చిన్న పదాలలో కూడా మూఢనమ్మకాలపై విరుచుకుపడ్డారు.

*బహు దినమ్ములు వేచి / మంచి శకునము చూచి*

*బయలుదేరును హోచ్చి*

అంటూ శకునములను నిరసించాడు.

*కసిని పెంచే మతము / కనులు గప్పేమతము*

*కాదు మనకభిమతము*

అంటూ కసిని పెంచే మతాన్ని విడిచి పెట్టమన్నాడు.

*మరి యొకరి చెడు తేదీ*

*మనకు నేడు ఉగాది / పంచాంగమొకసోది*

అంటూ పంచాంగ శ్రవణాన్ని నిరసించి హేతువాద దృక్పథాన్ని బలపరిచాడు.

*కొత్త దంటే రోత / చెత్త పాతకు జోత / మనిషి ప్రగతికి ఘాత*

అంటూ కొత్తదనాన్ని అంగీకరించనివారు ప్రగతికి అవరోధులు అని మూఢనమ్మకాలపై తన నిరసనను ఈ పదాల ద్వారా తెలియజేశారు.

**రాజకీయ రంగంపై:**

60 సంవత్సరాల క్రితం ఈ పదాలను రాసినా నేటికీ ఆ పరిస్థితులు మనసమాజము నుండి దూరం కాలేదు. ముఖ్యంగా రాజకీయ రంగంలో

*తగిన సమయము సూచి / తాను వేయును పేచి*

*పోలిటిక్సుల బూచి.*

ఇది నేటికీ కొనసాగుతున్న పేచీయే.

*మధువు మైకము నిచ్చు / వధువు లాహిరి తెచ్చు*

*పదవి కైపే హెచ్చు*

అంటూ ఆయన చెప్పిన పదవి కైపు రోజురోజుకూ పెరుగుతుంది తప్ప తగ్గుముఖం పట్టడంలేదు.

*సగము కమ్యూనిస్టు / సగము క్యాపిటలిస్టు /ఎందుకొచ్చిన రొస్టు.*

అంటూ సగం సగం అభిప్రాయాలు కలిగిన రాజకీయ నాయకులను నిరసించాడు.

*అరుణ బింబము రీతి / అమరు నెహ్రూ నీతి*

*ఆరిపోవని జ్యోతి.*

*సూక్ష్మబుద్ధికి త్రావు / సూటిమాటల ప్రోవు*

*సోవియట్ కృశ్చెవ్*

అంటూ తనకు నచ్చిన నెహ్రూ, కృశ్చెవ్‌లను తన పదాలలో కొనియాడారు.

**సంసార సాగరంపై:**

యక్షగానము, శతకము, సంకీర్తన, పాట, పదము మొదలగు ప్రక్రియల ద్వారా తత్వాలను చెప్పిన మహా కవులందరూ సంసారసాగరాన్ని తడమకుండా ఒడ్డుకు చేరలేదు. అయితే ఆ మహా కవులందరూ సంసార సాగరంపై విరక్తితో రచనలు చేస్తే ఈ పదములల్లిన ఆరుద్రగారు మాత్రము సంసార సాగరమును కొన్ని సులువులతో ఈదవచ్చునని చమత్కారంగా సెలవిచ్చారు. తను రాసిన ఎక్కువ భాగం ఈ సంసారిక విషయాలపైనే.

*మూగ చూపుల సంజ్ఞ / మొదటి ప్రేమ కనుజ్ఞ*

*తెలుసుకొనుతే ప్రజ్ఞ*

అంటూ తొలిప్రేమను తెలుసుకోవడమే గొప్ప ప్రజ్ఞ యనియువ పాఠకులకు ప్రేమ సందేశాన్నిచ్చారు .

*భార్య పుట్టినరోజు / భర్త మరచిన రోజు*

*తగ్గెననుకో మోజు.*

*కురులు దువ్వ విధాన / చెలుని దువ్వెడివాన*

*నిజముగా నెరజాణ.*

*పిలిచినపుడు రాదు / వెడలగొట్టిన పోదు*

*వనిత తీయని చేదు.*

*ఆలి కొన్నది కోక / అంతరిక్షపు నౌక*

*అంతకన్నను చౌక.*

*ఆలుమగల లడాయి / అంతమొందిన రేయి*

*అనుమానపు హాయి.*

మొదలగు పదాలలో భార్యా భర్తల చిన్ని చిన్ని కలహాలను తన సరదా పదాలుగా రాశారు.

*జాలి కరుణలు మాని / ఆలి నేలని వాని*

*జోలికెళితే హాని.*

అంటూ భార్యను ఏలుకోనివాడి జోలికి వెళ్ళకూడదు అని తన స్త్రీ పక్షపాతాన్ని ప్రకటించారు. ఉత్తమ వ్యక్తిత్వ వికాసానికి; ఆధునిక కాలములో వ్యక్తిత్వ వికాస ప్రాధాన్యత చాలా విస్తరించింది. ఆరుద్రగారు తన పదాలలో నేటి తరానికి పనికివచ్చే అనేక నీతులను వివరించారు.

*ఆశ పెరిగినవాడు / అహము పెరిగిన వాడు*

*తనకు తానే కీడు.*

అంటూ ఆశ, అహము పెరిగితే అవి మనకు కీడు చేస్తాయని వాటికి దూరంగా ఉండమన్నాడు.

*పరుల తెగడుటవల్ల / బలిమి పొగడుట వల్ల*

కీర్తి వచ్చుట కల్ల అంటూ ఇతరులను తిట్టుకుంటూ కూర్చోవడం, తనను తాను పొగుడుకోవడం వలన కీర్తి రాదని నీతినీ ఉద్బోధించాడు. అలాగే

*రాక్షసత్వము పోయి /రాచరికములు పోయి*

*ప్రజల దే పైచేయి.*

అంటూ ప్రజలదే ఎప్పటికీ పైచేయి అని

*ఎద్దు నెక్కేనుశివుడు / గెద్ద పైమాధవుడు*

*ఘనుడు మన మానవుడు*

అంటూ మానవుడే గొప్పవాడు అనే ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేశాడు. అలాగే ఈ పదములు రాసేనాటి సమాజములో జరిగిన చైనా యుద్ధము మొదలైన సంఘటనలపై తన పదములలో స్పందించారు.

*అయిదురోజుల వేస్టు / కగుట కెయ్యది బెస్టు*

*చూడుము క్రికెట్ టెస్టు*

అంటూ క్రికెట్ చూడటము సమయాన్ని వృథా చేసుకోవడం అవుతుందని క్రికెట్ను నిరసించాడు.

ఇవి చూడటానికి చిన్న పదాలు, ఆరుద్ర సరదా కోసం రాసిన పదాలు, అయినా లోతులకు వెళితే తడవకుండా ఉండవు మన వదనాలు.

*సర్వజనులకు శాంతి / స్వస్తి సంపద క్రాంతి / నేకోరు విక్రాంతి*

అని ఆరుద్రగారు కోరుకున్నట్టే మనమంతా ప్రశాంతంగా ఉండాలని అభిలషిస్తూ.... కృతజ్ఞతలు.

**ఆల్తి మోహనరావు**
**శ్రీకాకుళం, ఫోన్: 996 389 5636.**



# తొలినాళ్లలో తిరుమల

- దేవిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి

తిరుమల వేంకటేశునికి తొలుత ఆలయమే లేదు. చెట్టు నీడలో, కొయ్యస్తంభాల పందిరి నీడనో ఉండేవాడు; ఎండ, వాన, గాలి తగులుతూ ఉండేవి. వేంకటాచలం అని తరువాతి కాలంలో పిలువబడిన సెలయేటి ఒడ్డున ఇలా ఉండేవాడు. కాలక్రమంలో సెలయేటి ప్రభావంతో ఇది కూడా కృంగి, చెదల పుట్టలచే కప్పబడి ఉండేవాడు. మరికొంత కాలానికి ఆ పుట్టలపై పశువులు తొక్కడంతో వేంకటేశుని ప్రతిమ బయట పడడం జరిగింది. ఇది చూసిన అక్కడి నివాసులైన పశువుల కాపరులు, ఏనుగుల్ని మచ్చిక చేయు కురువర్‌లు ఆనాటి తిరుమల పరిసరాల పాలకుడైన తొండైమాన్ చక్రవర్తిగా పిలువబడిన అడోండైకి (ఆనంద), అనగా, ఒకటవ తిరైయ్యాన్‌కు తెలుపడం జరిగింది. దీనితో, తొండైమాన్ ఆ ప్రతిమను వెలికి తీయించి, పునఃప్రతిష్ట గావింపజేసి, శిలాస్తంభాలతో కూడిన మండపరీతి ఆలయాన్ని వేంకటేశునికి నిర్మింపజేసి, పూజాది కార్యక్రమాలు నిత్యం జరగడంకై కావలసిన ఏర్పాట్లు చేశాడు. ఇదంతా క్రీ.శ. ఒకటవ శతాబ్ది ప్రాంతంలో జరిగింది. క్రీ.శ. 756 నాటి శిలప్పదికారం గ్రంథంలోని వివరాలుబట్టి ఆనాటికి కూడా తొండైమాన్ నిర్మింపజేసిన శిలామండపరీతి ఆలయమే ఉండినట్లు తెలుస్తోంది. ఐతే, అప్పట్లో తిరుమలకు వెళ్ళడం అత్యంత కష్టంగా ఉండేది. కడకు, క్రీ.శ. నాలుగు–తొమ్మిది శతాబ్దుల మధ్యకాలపు ఆళ్వారులు కూడా ఎంతో కష్టంతో తిరుమలకు వెళ్ళి వేంకటేశుని దర్శించి, సేకరించిన వివరాలనుబట్టి పాటలు రాసి, వేంకటేశుని భక్తి తత్వాన్ని దక్షిణ దేశమంతా ప్రచారం చేశారు. ఇక, సామాన్య భక్తులకు తిరుమల వెళ్ళడం మరింత కష్టంగా ఉండేది.



అందుకే, తిరుచుకనూర్ అనబడిన నేటి తిరుచానూరులో క్రీ.శ. 826 ప్రాంతంలో వేంకటేశుని భక్తుల ఆధ్యాత్మిక అవసరాల్ని తీర్చడంకై, బహుశా, నేటి పద్మావతీ అమ్మవారి ఆలయ స్థలంలో వేంకటేశునికి తొలి కట్టడ ఆలయం నిర్మింపబడింది. దీనిని తిరువిలన్ కోయిల్ అనేవారు. ఇందులోని వేంకటేశుని తిరువేంగడత్తు పెరుమానడిగళ్ అనేవారు. దీనిని కోయిర్కోన్ అనువాడు నిర్వహించగా, దీనిలోని సేవకుల్ని వల్లువకోన్ అనేవారు. ఈ ఆలయం నిర్మింపబడిన కొద్దికాలంలోనే దీని ప్రక్కనే ఒక పెద్ద హాలు వంటిది నిర్మింపబడి, అందులో ఒక చివరన మరొక వేంకటేశుని ప్రతిమ ప్రతిష్టింపజేయడం జరిగింది. ఈ నిర్మాణాన్ని తిరుమంత్రశాలై అనేవారు. ఇందులోని వేంకటేశుని తిరుమంత్రశాలై పెరుమానడిగళ్ అనేవారు (అప్పట్లో తిరుమలలోని మండపరీతి ఆలయంలోని వేంకటేశుని తిరువేంగడత్తు పెరుమానడిగళ్ అనేవారు). హాలు వంటి ఈ నిర్మాణంలో వైష్ణవంలోకి మార్చిడి కార్యక్రమం జరిగేది (అష్టాక్షరం అనబడిన తిరుమంత్రంతో). ఈ హాలు క్రీ.శ. 1234 తరువాతి కాలంవరకు ఉండినట్లు తెలుస్తోంది. ఇందులో క్రీ.శ. 1234లో తిరుచానూరు గ్రామపు, ఆలయపు 'సభయ్యార్' అనబడిన పన్నెండు మంది పాలకమండలి సభ్యులు, 'నాటార్లు' అనబడినవారు

ముఖ్యమైన సమావేశాలు జరుపుకొనేవారని తిరుమల తిరుపతి శాసనాలు వాల్యూం ఒకటి, శాసనం నలభై బట్టి తెలుస్తోంది.

(క్రీ.శ. 826 నాటి గ్రామ సభను ఊర్‌నియోగం అనేవారు. అది తిరుచానురులోని వేంకటేశుల రెండు ఆలయాల ఖర్చుల్ని అప్పట్లో భరించేది). అంటే, 1234 నాటికి తిరుచానూరులోని వేంకటేశుని ఆలయాలు రెండింటిలోనూ దైవ ప్రతిమలు లేవని, తరలింపబడినాయని భావించవచ్చు. అసలు, తిరుచానూరు వేంకటేశుని ఆలయానికి క్రీ.శ. 1000 తరువాత దానాలు ఇచ్చినట్లు శాసనాలు లేవు. అనగా, క్రీ.శ. 826 ప్రాంతంలో నిర్మింపబడిన తిరుచానూరు వేంకటేశుని ఆలయాలు క్రీ.శ. 1000 ప్రాంతానికి దైవంలేని నిర్మాణాలుగా మిగిలిపోయాయి, దైవ ప్రతిమలు తరలింపబడ్డాయి. ఇవి కాలక్రమంలో తిరుమలకు క్రీ.శ. 1339 ప్రాంతంలో శ్రీరంగనాథయాదవరాయల కాలంలో తీసుకువెళ్ళబడినట్లు తెలుస్తోంది. వాటిలో ఒకదానినే తిరుమలలో మలైకునియనిన్రాన్ అనబడిన మలయప్ప అని, మరొకటి తిరుమంత్రిశాలై పెరుమానడిగళ్ అనబడిన కొలువు శ్రీనివాసుడని భావన ఉంది. వీరితో బాటు ఇరువురు దేవేరులు కూడా తీసుకెళ్ళబడినట్లు తెలుస్తోంది. తిరుచానూరులో ఇలాంటి వేంకటేశుని తొలి కట్టడ ఆలయాలు పల్లవ చక్రవర్తుల పాలనాకాలంలో, వారి సామంతులుగా తిరుమల సమీప ప్రాంతాల్లో పాలన చేసిన బాణ వంశీయుల కాలాన, బహుశా, విజయాదిత్యుని కాలాన నిర్మింపబడినవిగా తెలుస్తోంది. వీటి స్థానంలోనే, క్రీ.శ. 1234 తరువాత కొంతకాలానికి, బహుశా, 1339లో తిరుచానూరులోని ఇరువురు వేంకటేశుల ప్రతిమలు తిరుమల చేరాక అలర్మేల్‌మంగై (అలమేలు మంగ) ఆలయంగా పిలువబడిన నేటి పద్మావతి అమ్మవారి ఆలయం నిర్మింపబడినట్లు తోస్తోంది. పాంచరాత్ర సంప్రదాయ రీత్యా తిరుచానూరు వేంకటేశుని ఆలయాలు నిర్మింపబడినవి గాన, పాంచరాత్రంలో అమ్మవారికి సమాన స్థానం ఇవ్వబడాలి గాన పద్మావతీ ఆలయం కూడా నిర్మింపబడినట్లు తోస్తోంది. లక్ష్మీదేవి పథకంను వేంకటేశుని కంఠానికి రామానుజాచార్యులు ధరింపజేయడం కూడా తిరుచానూరు పద్మావతి ఆలయ నిర్మాణం జరగడానికి ప్రభావం ఉన్నట్లు తోస్తోంది.

తిరుచానూరు వేంకటేశుని ఆలయాలు వాడుకలో లేకుండా పోయిన క్రీ.శ. 1000 ప్రాంతాన, బహుశా, కొంత ముందుగనే తిరుచానూరు పశ్చిమ భాగంలో తిప్పలాదీశ్వరముడైయ్యాన్ అనబడిన పరాశరేశ్వరాలయం (శివాలయం) నిర్మింపబడింది. కాళహస్తి–తిరుపతిల సమీపపు తొండమనాడు వద్ద చివరి పల్లవ రాజు అపరాజితునికి, ఒకటవ ఆదిత్య చోళునికి మధ్య క్రీ.శ. 898లో జరిగిన యుద్ధంతో పల్లవుల పాలన దాదాపు పూర్తిగా అంతమైన అర్ధ శతాబ్ది తరువాత ఈ శివాలయం నిర్మింపబడినట్లుంది. తొండమనాడులో మరణించిన ఒకటవ ఆదిత్యుని సమాధిపై నిర్మింపబడిన ఆదిత్యేశ్వర ఆలయ నిర్మాణ కాలాన ఇది కూడా నిర్మింపబడి ఉండవచ్చు. ఆ తరువాత కొంత కాలానికి పదకొండవ శతాబ్ది తొలి దశాబ్దుల్లో కాళహస్తి శివాలయం నిర్మింపబడినట్లుంది (భట్టర్ అను రామానుజాచార్యుల కజిన్ కాళహస్తి ఆలయంలో శైవుడుగా సేవలు చేసి తరువాత వైష్ణవాన్ని స్వీకరించిన విషయమే ఇందుకు ఆధారం). దాదాపు ఇదే కాలంలో తిరుచానూరులో అళగీయ పెరుమాళ్ ఆలయం నిర్మింపబడింది. ఇది బహుశా అక్కడ ఒకప్పుడు ఉండిన వరదరాజ ఆలయం కావచ్చు.

ఇక, పరాశరేశ్వర ఆలయంలో ఉత్తరాయణ సంక్రమణం రోజుల్లో తిరుమంజనం అనబడిన అభిషేకం జరిపించాలని తిరుచుకనూర్ సభయ్యార్‌కు ఇరవై ఆరు కలంజుల బంగారంను ఒక దాత క్రీ.శ. 1008లో అప్పగించి, అందుకై బియ్యం, చింతపండు, పసుపు, పెరుగు, తేనె, మిరియాలు, సీసమమ్, సిదరి, చందనం, వక్కలు, ఆకులు, నూట ఎనిమిది మట్టి కడవలు/కుండలు, కలశంలు సమకూర్చాలని కోరడం జరిగినా సభయ్యార్ ఆ కార్యక్రమాన్ని నిర్వర్తించకుండడంతో ఆ విషయాన్ని క్రీ.శ. 1225లో తెలుసుకొన్న అప్పటి ఈ ఆలయ స్థానత్తర్, బహుశా, పండియదరాయర్ నాటి తిరుమల తిరుపతి పరిసరాల పాలకుడైన వీరనరసింగ యాదవ రాయలకు తెలుపగా

అతడు ఆ బంగారంను ఆలయ స్థానత్తర్ ఆధీనంలో ఉండేట్లు, దాత కోర్కెకై అది వినియోగింపబడేట్లు చేశాడు. ఈ పండియదరాయర్ మరుమగన్ (కజిన్) నారాయణి పిళ్లై ఒకటవ వీరనరసింగుని వైపు నాటి సామంత పల్లవరాజు కొప్పేరుంజింగతో చెంగల్పట్టుజిల్లా మధురాంతకం తాలూకాలోని నేటి ఒరట్టి (ఉరట్టి), వద్ద జరిగిన యుద్ధంలో పాల్గొని వీరమరణం చెందడం జరిగింది. ఇతని జ్ఞాపకార్థమే పండియ దరాయర్ భూముల్ని కొని, ఉదయం, రాత్రి అన్నప్రసాదంకై ఈ ఆలయ పూజారులు ముగ్గురుకి దానంగా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇది క్రీ.శ 1223లో మూడవ రాజరాజ చోళుని కాలాన జరిగింది. మాసి తిరునాళ్ళకై కూడా ఇతడు క్రీ.శ 1240లో ఇదే ఆలయానికి మరొక భూదానం చేశాడు. వెంకటనాథ పురంధర అను బిరుదు ధరించిన వేంకటేశుని భక్తుడైన ఒకటవ కుళోత్తుంగుని కాలపు క్రీ.శ. 1073 నాటి శాసనం బట్టి కూడా ముంజైపూండి (శివపాదకేసరి నల్లూర్‌గా పేరు మార్చబడిన నేటి ముళ్ళపూడి) ఈ ఆలయ దేవదాన గ్రామమని, నారనదేవ అను వీరరాజేంద్ర చోళుని అధికారి ఇందులో వసూలు కాబడుచుండిన వట్టెకాసు, తిరుగుకాసువంటి పన్నుల చెల్లింపుకు మినహాయింపు ఇచ్చాడని తెలుస్తోంది (తరువాతి కాలంలో వట్టెకాసు పన్నునే వడ్డికాసు అని, వేంకటేశుని వడ్డికాసుల ఆదాయం వచ్చువాడు అను అర్థంలో వడ్డికాసులవాడా అని భక్తులు పిలుచుకోవడం జరుగసాగింది).

ఈ శివాలయ నిర్వహణకు స్థానత్తర్, గణత్తర్, తిరు ఉల్‌నాలికై భట్టర్ ఉండేవారు. ఇందులో ఒక నిరంతరాయ దీపం వెలగడానికి అప్పట్లో ఇరవై నాలుగు కలంజుల బంగారం గాని, ముప్పయ్‌రెండు గోవుల్నిగాని దాతలు ఇవ్వాల్సి ఉండేది. ఈ ఆలయ వివరాలతో కూడిన శాసనాలబట్టి ఆనాటి తూకాలు, కొలతల వివరాలు కూడా తెలుస్తున్నాయి. బియ్యాన్ని అరుమోలి దేవన్ కొలతలుగా పిలువబడిన కలం, తూని, కురణి, నలి/నాలి, పడకులతో కొలచేవారు. 'పలం'లలో తూకం ఉండేది. వక్కల్ని లెక్కించడం ఉండేది. ఆకుల్ని కట్టలుగా లెక్కపెట్టేవారు. బంగారు నాణేలను కలంజు, మంజడి, మాడై అనేవారు. అరుమోలిదేవన్ అనేది ఒకటవ రాజరాజ చోళుని ఇంటిపేరు (సర్‌నేమ్) మీదుగా వాడుకలో ఉండేది. అనగా, మాట తప్పని వాడు అని అర్థం. ఇక, బంగారును కుడైనాయ్‌క్కల్, ధర్మక్కాటలై అను రెండు రకాలుగా తూచేవారు. ఈ కొలతలు, తూకాలే గాక ప్రాచీనం నుండి అప్పటికే వాడుకలో ఉండినవి కూడ వాడబడుచుండేది. అవి: తూంబు (తూము), వట్టి, సొలిగై (సొలిగి) మొదలైనవి. అప్పటి పన్నులుగా కడమైయాయం, పోర్‌కడమై, పడికావల్, వెట్టిసరికై, కొల్వరి, సిల్వరి వంటివి ఉండేవి.

ఇక, ఒకవైపు తిరుచానూరు వేంకటేశుని కట్టడ ఆలయాలు రెండు క్రీ.శ. 826 ప్రాంతంలో నిర్మింప బడడం, క్రీ.శ. 1000 ప్రాంతంలో అవి వాడుకలో లేకుండా పోవడం జరుగుచుండిన కాలంలో క్రీ.శ. 840–870 మధ్య, బహుశా, క్రీ.శ. 870 ప్రాంతంలో తిరువేంగడత్తు పెరుమానడిగళ్ అని, తిరువేంగడం ఉడైయ్యాన్ అని పిలువబడిన వేంకటేశునికి తిరుమలలో కట్టడ ఆలయం నిర్మింపబడింది. అప్పట్లో ఇది గర్భగృహ, శయన మండపంలను కలిగి, వాటి చుట్టూ క్లోజ్‌డ్ ప్రదక్షిణాపథను కలిగి ఉండేది (నేటి వైకుంఠ ప్రదక్షిణ స్థానంలో ఉండిన పాత ప్రదక్షిణాపథ). గర్భగృహంపై ఇప్పుడు మనం చూస్తున్న విమానం గాని, ఇతర నిర్మాణాలు గాని అప్పటి తిరుమల ఆలయంలో ఉండేవి కావు; అవన్నీ కాలక్రమాన ఏర్పడినాయి, ఆ వివరాలు మరో వ్యాసంలో తెలుపబడి ఉన్నాయి. క్రీ.శ. ఒకటవ శతాబ్ది ప్రాంతాన తొండైమాన్ నిర్మింపజేసిన శిలామండప రీతి ఆలయ స్థానంలో ఈ కట్టడ ఆలయం నిర్మింపబడినట్లు తెలుస్తోంది (తొండైమాన్ నిర్మింపజేసిన శిలామండప రీతి ఆలయ కాలంలోనే తిరుపతి సమీప గుడిమల్లం లోని పరశురామేశ్వర మండప రీతి ఆలయం



నిర్మింపబడినట్లు తోస్తోంది ఆ తరువాత కట్టడ ఆలయం నిర్మింపబడింది). ఈ నిర్మాణంతో భక్తులు తిరుమలకు వెళ్ళడం పెరగసాగింది. తిరుచానూరు వేంకటేశుని ఆలయాలు రెండూ ఆకర్షణను కోల్పోయి క్రీ.శ. 1000 ప్రాంతానికే వాడుకలో లేకుండా పోయాయి. అసలు, క్రీ.శ. 966లోనే సామంత పల్లవుల రాణి సామవై అనబడిన కడవన్ పెరుందేవి తిరుచానూరు వేంటేశుని భూముల్ని, ఇతరుల భూముల్ని కొని, తిరుమల వేంకటేశుని ఆలయం ఆనుకొని ముందుభాగంలో తిరువిలన్ కోయిల్ అనబడిన మండపరీతి స్నపన/స్థపన మండపంను నిర్మింపజేసి, మణవాళ పెరుమాళ్ అనబడిన భోగశ్రీనివాసుని వెండి ప్రతిమను ఆ మండపంలో ప్రతిష్ఠింపజేసి, వేంకటేశుని ప్రతి అంగానికీ విలువైన ఆభరణాల్ని దానంగా ఇచ్చి, ఆలయంలో ఆమె కోరుకొన్న పలు కార్యక్రమాల నిర్వహణకై (తొలి పురటాసి బ్రహోత్సవంతోబాటు) తిరుచానూరులో కొనిన భూముల్ని దానంగా ఇచ్చింది. సామవై దానాలతో తిరుమల వేంకటేశునికి, ఆయన ఆలయంకు తొలిసారిగా ఆర్థిక పుష్టి, ప్రతిష్ట ఏర్పడి, అవి దినదినాభివృద్ధి చెందసాగాయి. సామవై దానాలు తరువాత చోళులు, పాండ్యులు ఈ ఆలయం గురించి పెద్దగా పట్టించుకోక పోయినా, తిరుమల–తిరుపతి పరిసర ప్రాంతాల్ని, బహుశా, నారాయణవనంను రాజధానిగా చేసుకొని పాలించిన యాదవ రాజుల కాలాన, వారి తరువాత ఈ ప్రాంతాన్ని పాలించిన విజయనగర పాలకుల కాలాన ఆలయం ఆర్థిక పుష్టి, ప్రతిష్టలు గణనీయంగా పెరిగాయి.

యాదవ రాజుల కాలాన, బహుశా, గట్టిదేవ యాదవరాయులు కాలాన, అనగా విక్రమచోళ (క్రీ.శ. 1118–1135), రెండవ కులోత్తుంగ (క్రీ.శ. 1135–1150) చోళ చక్రవర్తుల కాలాన తిరుమల ఆలయంలో పూజాది విషయాలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, వాటిని చక్కదిద్దాలని, తిరుమల పరిసర గ్రామాల జనం, బహుశా, తిరుచానూరు వంటి గ్రామాల జనం కోరడంతో రామానుజాచార్యుల్ని యాదవ రాయలు పిలిపించి, తిరుమల ఆలయంలో కార్యక్రమాలు క్రమపద్ధతిలో జరిగేట్లు చేయించడం జరిగింది (తిరుమల నంబి సోదరి భూపిరాట్టి, కేశవసోమయాజులు కుమారుడు రామానుజాచార్యులు). అప్పట్లో బ్రాహ్మణులంతా తిరుచానూరులో నివసిస్తుండినందున, అది తిరుమలకు దూరంగా ఉండినందున, ఇలాంటి పరిస్థితి ఏర్పడి ఉండవచ్చునని భావించి కాబోలు తిరుమల కొండల దగ్గరగా వారికి నివాస ప్రాంతం ఏర్పరిస్తే తిరుమల ఆలయ కార్యక్రమాలు కొంత సవ్యంగా జరిగే అవకాశం ఉంటుందని నేటి కపిలతీర్థం వెళ్ళు దారి ప్రక్కన ఉండిన కొత్తూరు అని పిలువబడుచుండిన ప్రాచీనపు కోటవూరు (బహుశా బోయకొట్టంల కోట ఉండిన వూరు) దగ్గర్లో నివాస ప్రాంతాల్ని బ్రాహ్మణులకు ఏర్పరచాలని రామానుజాచార్యులు తలంచాడు. దాదాపు ఇదే కాలంలో చిదంబరం నుండి తీసుకురాబడిన గోవిందరాజ ప్రతిమ ఏదో ఒకచోట ప్రతిష్ఠింపజేయవలసి ఉండింది. ఐతే, అప్పట్లో తిరుమల కొండలు–కపిలతీర్థంలకు, తిరుచానూరుకు మధ్య ఒక్క గ్రామం కూడా ఉండేది కాదు. కాని, పూర్వపు శిథిలమైన కొత్తూరు/కోటవూరుకు దక్షిణాన కొంతదూరంలో పార్థసారథి ఆలయం మాత్రం ఉండేది. దీనితో, ఆ ఆలయం ప్రక్కనే గోవిందరాజ గుడిని నిర్మించి, గోవిందరాజ ప్రతిమ ప్రతిష్ఠాపన చేసి, వాటి చుట్టూ బ్రాహ్మణుల నివాసానికి ఏర్పాటు చేయడం మంచిదని, అలా అక్కడ బ్రాహ్మణ అగ్రహారం ఏర్పడితే, అది క్రమంగా ఒక పట్టణంగా రూపొందుతుందని రామానుజాచార్యులు భావించినట్లుంది. అందుకే, దీని దగ్గర ప్రాంతంలో వైఖానస రీతి పార్థసారథి ఆలయం ప్రక్కనే అదేరీతిలోని గోవిందరాజ ఆలయాన్ని నిర్మింపజేసి, వాటి చుట్టూ నాలుగు మాడవీథుల్ని, మాడవీథుల చుట్టూ నాలుగు రాజవీథుల్ని ఏర్పాటు చేయించి, వాటి మధ్య బ్రాహ్మణ అగ్రహారం ఏర్పడేట్లు చేయడం జరిగింది, అనగా, నేటి తిరుపతి నగరం ఏర్పడేట్లు చేయడం జరిగింది. నేటి తిరుపతిలోని గాంధీరోడ్డు, తేరువీధి, కరణాలవీధి, భేరివీధుల మూలల్లో ఉన్న నాలుగు మండపంల హద్దులతో ఇది ఏర్పరచబడింది. దీనిని తొలుత గోవిందరాజపురంగాను, తరువాత రామానుజపురంగాను, ఆ తరువాత తిరుపతి గాను పిలువడం జరిగింది. ఇది తొలుత కొత్తూరు గ్రామపు ఉపగ్రామంగా ఉండి ఉండవచ్చు.

ఐతే, అటు తిరుమల ఆలయంలో పరిస్థితిని చక్కదిద్దడం, ఇటు గోవిందరాజ ఆలయం నిర్మాణం, ప్రతిమా ప్రతిష్టాపనలను జరుపడం, మరోవైపు తిరుపతి నగర నిర్మాణం చేపట్టడంవంటి మూడు బృహత్కార్యాల్ని నిర్వహించడం రామానుజాచార్యులు ఒక్కడికే ఎంతమాత్రం వీలయ్యే కార్యక్రమాలు కావు. నాటి యాదవ రాజులు ఘట్టిదేవ, లేదా, యాదవ నారాయణ సహాయ, సహకారాలతోనే అట్టి ఘనతలు వీలయ్యాయి. అనగా, నేటి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుపతి నిర్మాణానికి *యాదవ రాజులే కారణం.* ఇలాంటి *తిరుపతి గోవిందరాజ* ప్రతిమా ప్రతిష్టాపన, *తిరుపతి నిర్మాణం* కార్యక్రమాలు ఫిబ్రవరి నెల ఇరవైనాల్గవ తేదీ వెయ్యిన్నీనూటముప్పయ్యవ సంవత్సరాన (24–2–1130) జరిగాయి. గోవిందరాజ ఆలయం క్రీ.శ. 1234 నాటి నుండి తిరుమల ఆలయ యాజమాన్యాన నిర్వహింపబడుచుండేది. ఐతే, తొలి నుండి దీనికి ప్రత్యేక వనరులు ఉండేవి. అందునుండే అముదపడి, సాత్తుపడి వంటి కార్యక్రమాలు నిర్వహింపబడేవి. కాని, అప్పట్లో ఇది పార్థసారధి ఆలయంకు అనుబంధ ఆలయంగా ఉండేది. ఇంతటి సేవ అటు తిరుమలకు ఇటు తిరుపతికి చేసినందునే క్రీ.శ. 1220 ప్రాంతానికే గోవిందరాజ ఆలయం ప్రాంగణంలో రామానుజాచార్యులకు ఒక గుడి నిర్మింపబడింది. క్రీ.శ. 1308 నాటికి గోవిందరాజ ఉత్తరమాడవీధిలో 'రామానుజ కూటమి' అని పిలువబడిన తొలి అన్నదాన కేంద్రం నిర్మింపబడి, నిత్యం వేలాదిమంది భక్తులకు ఉచిత భోజన వసతి కల్పించబడింది. ఇక, తిరుమల ఆలయంలో క్రీ.శ. 1180 ప్రాంతంలో, ఆ తరువాత తిరుపతిలోని పలు ఆలయాల్లో, ఇతర ప్రాంతాల్లో కూడా రామానుజులకు గుడులు నిర్మింపబడినాయి. *ప్రాంతీయ చరిత్రకు ప్రచారంలేక యాదవ రాజులు మాత్రం మరుగున పడిపోయారు.* అసలు, సామంత పల్లవ రాణి సామవై తిరుమల రాక, దానాలతో (క్రీ.శ. 966లో) వేంకటేశుని ప్రాచుర్యం పుంజుకొన్నా, తరువాతి కాలపు యాదవ రాజుల శ్రద్ధే లేకుండినట్లయితే తిరుమల వేంకటేశుని ఎప్పుడో జనం మరిచిపోయి ఉండేవారు, ఆలయమూ పాడుబడిపోయి ఉండేది; అంతేగాక, గోవిందరాజ ఆలయం, ఇతర తిరుపతి ఆలయాలు, కడకు, తిరుపతి పట్టణం పుట్టి ఉండేవికావు. వీరి తరువాత పాలించిన విజయనగర చక్రవర్తుల దృష్టి తిరుమలపై పడడం, ఆలయ వృద్ధిపై వారు శ్రద్ధ చూపడం కూడా జరిగి ఉండేది కాదు.

ఇక, *గోవిందరాజ ఆలయపు ఇతర నిర్మాణాల్ని* పరిశీలిస్తే, ఆలయపు లోపలి గోపురం క్రీ.శ. 1219కి పూర్వం నిర్మింపబడినట్లుంది. (అనగా, తిరుమలలో పడికావలి అనబడిన వెలుపలి సమతల గోపురంను వీరనరసింగ యాదవ రాయలు నిర్మింప జేసిన క్రీ.శ. 1217 కాలాన నిర్మింపబడింది). చిత్రకూట మంటపం క్రీ.శ. 1493లో నిర్మింపబడింది. నాల్గుస్తంభాల మంటపంను శ్రీమాన్ మహామండలేశ్వర మొదలైనవారు కలసి వేదాంత దేశిక గుడి దగ్గర్లో క్రీ.శ. 1494లో నిర్మింపజేశారు. వసంతమంటపం నిర్మాణం అహోబిల మఠ్ నిర్వాహకులు వణ్ శతగోప జీయర్‌చే వెలుపలి గోపురం ముందు క్రీ.శ. 1494 ప్రాంతంలో ఆరంభింపబడి, తరువాతి కాలంలో నల్లార్ అంగాండ్రైచే పూర్తిగావించబడింది. నిరాలిమంటపంను కృష్ణరాయల సైన్యాధ్యక్షుడు అప్పాపిళ్ళై ఆలయపోటు (వంటగది) దగ్గర్లో క్రీ.శ. 1506లో నిర్మపజేశాడు. ఇది క్రీ.శ. 1512, లేదా, 1522 వరకు (పుష్కరిణి ఏర్పడే వరకు) వాడుకలో ఉండినట్లు తోస్తోంది. లక్ష్మీదేవి మంటపంను గంగురెడ్డి క్రీ.శ. 1542లో నిర్మింపజేశాడు. పాత ధ్వజస్తంభంను శిద్దలూరు వాసి రాజశ్రీ రామాజి మదర్‌సు పంతులు నిర్మింపజేశాడు. ద్వారపాలకుల ప్రతిమలను నంద్యాల నారప్పరాయ మార్చి 18, 1549లో ప్రతిష్టంపజేసి, నగరి సీమలోని పల్లిపట్టును, అంజూర్ విభాగంలోని గుండిపూండిని వారికి నిత్యం నాలుగు వెల్ల తిరుప్పోణకంల నైవేద్యం జరుపడంకై దానంగా ఇచ్చాడు. పెద్ద గోపురంను దేవచోళ వంశీయుడైన మట్ల కుమార అనంతరాయులచే గోవిందరాజ ఆలయ సన్నిధివీధిలో క్రీ.శ. 1628లో నిర్మింపజేశాడు. హనుమాన్ గుడిని కృష్ణరాయల సైన్యాధ్యక్షుడు అప్పాపిళ్ళై తండ్రి కరవాటిపులి ఆళ్వార్ అప్పాపిళ్ళైయ్ క్రీ.శ. 1509లో గోవిందరాజ ఆలయపు సన్నిధివీధి చివర్లో తూర్పున, నేటి తేరు వీధిలో, గోవిందరాజ ఆలయం ఎదురుగా

నిర్మింపజేశాడు. గోవింద పుష్కరిణి, కృష్ణరాయ పుష్కరిణి అనబడినది క్రీ.శ. 1522 ప్రాంతంలో నిర్మింపబడింది. కృష్ణరాయల మంత్రి సాళువ తిమ్మరసు సోదరుడు (రాచిరాజ కుమారుడు) గోవిందరాజ ఈ పుష్కరిణిని, దీని గట్టున గోపాలకృష్ణ గుడిని నిర్మింపజేశాడు. ఇక్కడి మరొక మంటపంను విల్లియర్ అను గోవిందరాజ ఆలయ లెక్కలు వ్రాయువాడు పుష్కరిణి ఒడ్డున క్రీ.శ. 1530లో నిర్మింపజేశాడు.

ఇక, *ఆర్థిక వనరులు,* స్వయంప్రతిపత్తి, ప్రత్యేక లెక్కల నిర్వహణ వంటి అంశాలన్నింటిలోనూ స్వేచ్ఛను కలిగి గోవిందరాజ ఆలయం (నిర్మాణం జరిగిన తొలినాళ్ళ నుండే) తిరుమల ఆలయ నిర్వాహకులైన స్థానత్తర్‌ల నిర్వహణలో ఉండేది. ఐతే, ఆలయ నిర్మాణం జరిగిన క్రీ.శ. 1130 నుండి క్రీ.శ. 1219 వరకు ఈ ఆలయ ఆర్థిక వివరాలు లభించడం లేదు; క్రీ.శ. 1219 నుండి మాత్రమే లభిస్తున్నాయి. ఈ ఆలయంలోని దేవతలకు ఆర్థిక సహాయాలు విడివిడిగా అందించబడినా అది అక్కడి దేవతలందరి కార్యక్రమాలకు వినియోగించబడుచుండేది. తొలుత, తిరుమల–తిరుపతి పరిసరాల పాలకుడైన వీర నరసింగయాదవరాయల రాణి గోవిందరాజ స్వామి ముందు నందవిలక్కు అనబడిన నిరంతరాయంగా వెలిగింపబడు దీపానికి అవసరమగు నెయ్యి సరఫరాకై ముప్పయ్ రెండు ఆవుల్ని, ఒక కోడెను క్రీ.శ. 1219లో దానంగా ఇవ్వడం జరిగింది. అదే రాణి, అదే రాజు, గోవిందరాజ ఆలయంలో మొట్టమొదటగా వీరనరసింగుడు ఆరంభింపజేసిన ఆణి బ్రహ్మోత్సవాలకు, గోవిందరాజ చతుర్ముఖ తేరు పైభాగాన బంగారు శిఖరం/కూటం నిర్మించడానికి, ఆలయంలో నిర్మాణాలకు అవసరమైన ఆదాయం రావడానికి అప్పటి కుడవూర్‌నాడులోని పయిండిపల్లి అనబడిన నేటి తిరుపతి సమీప పైడిపల్లి గ్రామపు సగభాగం భూముల్ని క్రీ.శ. 1234లో దానంగా ఇవ్వడం జరిగింది (మిగిలిన సగభాగం పైడిపల్లి భూములు అంతకు పూర్వమే వీరనరసింగుడు తిరుమల వేంకటేశు నికి దానంగా ఇవ్వడం జరిగింది). గోవిందరాజ ఆలయంలోని తిరుమంగై ఆళ్వార్‌కు కుడవూర్‌నాడులోని కొత్తకాల్వ గ్రామం క్రీ.శ. 1234లో దానంగా ఇవ్వబడింది. గోవిందరాజకు పెరియ మాంబట్టు అను గ్రామం క్రీ.శ. 1255లో దానంగా ఇవ్వబడింది. కాని, ఈ రెండింటి దాతలు తెలియుట లేదు. నెర్క గ్రామ బ్రాహ్మణులు నిర్ణీత దినాల్లో యాత్రికుల అన్నదానంకై క్రీ.శ. 1308లో ఏర్పాట్లు చేశారు. ముల్లయ్ తిరువేంకట జీయర్ దంపతులు గోవిందరాజ అధ్యనోత్సవం జరుగు పది రోజులు నిత్య ప్రసాద నైవేద్యంకై క్రీ.శ. 1390లో దానం చేశారు. గోవిందరాజకు నిత్యం ఒక తిరుప్పోణక నైవేద్యంకై కొల్లికావలి దాసర్ క్రీ.శ. 1387 లోను, కరుణాకర దాసర్ క్రీ.శ. 1442లోను దానాలు ఇచ్చారు. ఇక, తిరుమల స్థానత్తర్‌లలో ఒకడైన తిరుచుకనూర్ సభయ్యార్ క్రీ.శ. 1445లోను, 1446లోను, ఎంపెరుమాన జీయర్ క్రీ.శ. 1457లోను, చెన్నకేశవ దాసర్ క్రీ.శ. 1450లోను గోవిందరాజ ప్రసాద నైవేద్యాలకు దానాలు ఇచ్చారు. సాళువ నరసింహరాయలు 26 హరివాణ, ఒక అప్పా హరివాణ, ఒక తిరుక్కనమాడై నిత్యనైవేద్యంకై ముప్పడువేట, మంగోడువెలద, మణవూరు గ్రామాల్ని దానంగా ఇవ్వడం జరిగింది. ఇవన్నీ పరిశీలిస్తే, చోళ, పాండ్య రాజులు గోవిందరాజ ఆలయాన్ని పూర్తిగా పట్టించుకోలేదు. విజయనగర కాలాన ఒక్క సాళువ నరసింహరాయలు మాత్రమే పట్టించుకొన్నాడు. కృష్ణరాయలు, అచ్యుతరాయల కాలాల్లో వారి అధికారులు మాత్రం దానాలు ఇచ్చారు. సదాశివరాయల కాలంలో పలువర్గాల జనం మాత్రం దానాలు ఇచ్చారు. ఇక, ఒక్క యాదవ పాలకులు మాత్రమే ఈ ఆలయం గురించి కొంత పట్టించుకోవడం జరిగింది. విజయనగర కాలాన సాళువ నరసింహరాయల కాలంనుండి ఈ ఆలయం ఆర్థికంగా మరింత పుంజుకోవడం అగుపడుతుంది.

*గోవిందరాజ ఆలయానికి అనుబంధంగా పలు గుడులు,* దైవప్రతిమలు ఉండేవి. అవి: గోవిందరాజ *ఆలయంలో* రామానుజాచార్యులగుడి క్రీ.శ. 1220 ప్రాంతాన, దీని ప్రక్కనే దాదాపు ఇదే కాలంలో తిరుమల నంబి గుడి (రామానుజాచార్యుల అమ్మ తండ్రి), తిరుమంగై ఆళ్వార్ ప్రతిమా ప్రతిష్ఠాపన క్రీ.శ. 1234లో, సూదిక్కొడుత్త

నాచియార్ అనబడిన ఆండాళ్ గుడి క్రీ.శ. 1308లో, కురత్తాళ్వార్ గుడి (రామానుజుల ప్రీతిపాత్రుడు) క్రీ.శ. 1433కు కొంత ముందు కాలాన, సాలై నాచియార్ అనబడిన పుండరీకవళ్ళి తాయార్ గుడి క్రీ.శ. 1457 ప్రాంతంలో, మధురకవి ఆళ్వార్ గుడి క్రీ.శ. 1543కు కొంత ముందు కాలాన నిర్మిపబడినాయి. మధురకవికి మూడు రోజుల అధ్యయనోత్సవంకై పదిహేను రేఖిపాన్‌ల ఆదాయాన్నిచ్చు నగరి గ్రామాన్ని క్రీ.శ. 1553లో కొండరాజ దానంగా ఇవ్వడం కూడా జరిగింది. గోవిందరాజ *ఆలయ తూర్పుమాడవీధి* అనబడిన నేటి తేరువీధిలో, గోవిందరాజ ఆలయ సన్నిధివీధికి ఎదురుగా హనుమాన్ గుడి క్రీ.శ. 1491 ప్రాంతాన, అందులోనే విఠలేశ్వరగుడి క్రీ.శ. 1546లో (దీని నిర్మాత ఆరవీటి పొట్లపాటి చినతిమ్మరాజ వ్యక్తిగత సేవకుడు ఉదయగిరి దేవరాజ భట్టర్) నిర్మిపబడినాయి. గోవిందరాజ *ఆలయ ఉత్తరమాడవీధిలో*, అనగా, నాటి బాష్యకార్/అయ్యంగార్ వీధిలో గోవిందకృష్ణన్ గుడి క్రీ.శ. 1543లో (దీని నిర్మాత ఆలయ లెక్కలు వ్రాయు తిరువనంతాళ్వార్ కుప్పయ్యన్ తిరుప్పణి పిళ్ళైయ్ నుండి జాగాకొని గుడిని నిర్మించాడు), అదే వీధి తూర్పు కొసన తిరువేంకట గోపాలకృష్ణ గుడి క్రీ.శ. 1546లో (దీని నిర్మాత ఆలయ లెక్కలు వ్రాయు పెరియ సోలై), ఇదే వీధిలో నమ్మాళ్వార్ గుడి క్రీ.శ. 1544లో, దానికి అనుబంధంగా రామానుజకూటం అనబడిన ఉచిత అన్నదాన కేంద్రం నిర్మిపబడినాయి, నమ్మాళ్వార్ గుడి, అన్నదాన కేంద్రాల నిర్వహణకు వీటి నిర్మాత 5713 రే.పా. ఆదాయాన్నిచ్చు పది గ్రామాల్ని క్రీ.శ. 1544లో, మరొకసారి 400 రే.పా. ఆదాయాన్నిచ్చు నగరి గ్రామాన్ని, విడుగ్రామంలను దానంగా ఇచ్చాడు, అటుతరువాత 1550, 1552, 1553లలో కూడా ఇతర దానాలు చేశాడు.

దానికి కర్తార్‌గా ప్రతివాది భయంకరం అలగరయ్యంగార్ అన్నన్‌గారాచార్యర్ అదే కాలంలో ఉండేవారు. గోవిందరాజ *పుష్కరిణి,* దాని ఒడ్డున గోపాలకృష్ణ గుడి క్రీ.శ. 1522 ప్రాంతంలో కృష్ణరాయల మహామంత్రి తిమ్మరుసు సోదరుడు రాచిరాజ గోవిందరాజ నిర్మింప జేయగా, అదే పుష్కరిణి ఒడ్డున రఘునాథ గుడిని క్రీ.శ. 1606లో నారాయణ దాసరి నాయక్కర్ నిర్మింపజేశాడు. సుదర్శన ఆళ్వార్ గుడిని ఇదే పుష్కరిణి పశ్చిమ ఒడ్డున తాళ్ళపాకం తిరువేననాథన్ 13–1–1558లో నిర్మింపజేశాడు. తిరువేంగడం ఉడైయ్యాన్ గుడిని సన్నిధి వీధిలోని సొంత మఠంలో 13–10–1546లో కోయిల్‌కెళ్వి వానమామలై రామానుజ జీయర్ నిర్మింపజేశాడు.

ఇక, *ఆళ్వార్‌తీర్థం అనబడిన కపిలతీర్థం* వెళ్ళుదారి ప్రక్కన తిరుమంగై ఆళ్వార్ గుడి క్రీ.శ. 1234 ప్రాంతంలో నిర్మింపబడింది. అందులో పూజకై అదే ఏడాది కొత్తకాల్వ గ్రామవాసి పెరియ నాట్టర్ ఏర్పాటు చేశాడు. వోయసలుల మహాప్రధాని సింగయ్య ధణ్ణాయక ఈ గుడికి, వీరనరసింగ పెరుమాళ్ గుడికి తిరుప్పోణకప్రసాద నైవేద్యంకై సింగానల్లూరు అనబడిన పొంగలూర్‌ను క్రీ.శ. 1328లో దానంగా ఇచ్చాడు. తిరుమల వేంకటేశునికి రెండు తిరుప్పోణక నిత్యనైవేద్యంకు, తిరుమంగై గుడిలో పల్లికొండ తిరుమంటపం నిర్మాణానికి, ఇతర నిర్మాణాలకు క్రీ.శ. 1472లో కావేరినది ఒడ్డున గల వెన్నైయ్‌వాసల్ గ్రామాన్ని వీరమదెక్కిపట్టి వాసి మూవరాయర్ దానంగా ఇచ్చి, ఎంపెరుమాన జీయర్‌ను దీనికి కర్తార్‌గా నియమించాడు. సదాశివరాయలు జనవరి 8, 1547లో దానంగా ఇచ్చిన పదివేల కులిల భూమిలో అధిక భాగం తిరుమంగై గుడికి, కులశేఖర ఆళ్వార్ గుడికి కేటాయించినట్లు తెలుస్తోంది. ఇదే కపిలతీర్థం ఒడ్డున నమ్మాళ్వార్ గుడిని, దాని విమానం, ప్రాకారాల్ని క్రీ.శ. 1287 ప్రాంతంలో నంజలూర్ వాసి పల్లవరాయర్ నిర్మింపజేయగా నల్లార్ అంగాండై క్రీ.శ. 1485లో, శరణుశెట్టి,



గోవిందరాజ *ఆలయ దక్షిణమాడవీధిలో* లక్ష్మీనారాయణ పెరుమాళ్ గుడి 1636లో, పెరియ ఆళ్వార్ గుడి అదే శతాబ్దిలో నిర్మింపబడినాయి; తొలిదానికి దానం ఇచ్చి, రెండవ

నరసింగరాయపురం వాసి వప్పుశెట్టి అయ్యన్‌లు క్రీ.శ. 1494లో, యతిరాజజీయర్ 1514లో, ధర్మపురం శిత్తముశెట్టి 1517లో, నమ్మాళ్వార్ పట్టైడై అనబడిన తిరుపతి సమీప ఎలమండ్యం గ్రామాన్ని పత్తర్ పిరన్ అయ్యన్ 1523లో, వెంగాపురం నారాయణశెట్టి క్రీ.శ. 1544లో (48900 ఫణంలను) దానాలు ఇవ్వడం జరిగింది. ఇక కపిలతీర్థం దారిలోని హనుమాన్ గుడి క్రీ.శ. 1528లో నిర్మింపబడింది. కపిలతీర్థం పుష్కరిణి పునర్నిర్మాణం, దాని రాతిమెట్ల నిర్మాణం, పుష్కరిణి చుట్టూ సంధ్యావందనం మంటపంలు, హద్దులు నాలుగు మూలల్లో సుదర్శనం రాళ్ళను నిర్మింజేయడంను క్రీ.శ. 1531లో అచ్యుతరాయలు చేయించాడు. లక్ష్మీ నారాయణ పెరుమాళ్ గుడిని తీర్థవారి మంటపంలో 20–6–1546లో తాళ్ళపాకం పెరియ తిరుమలై అయ్యంగార్ నిర్మింపజేయగా, పెరియ ఆళ్వార్ గుడిని కపిలతీర్థం వద్ద గల పెద్దచిముగు కొండపైన తాళ్ళపాకం తిరువెంగళప్పన్ తల్లి పెద్దమంగమ్మ నిర్మింపజేసింది. వేంకటేశుని ప్రతిమ ఒకటి కపిలతీర్థంపై గల నాల్గవ గుహలో ఉండినట్లు జూన్ 1547 నాటి సొత్తై తిరుమలైనంబి శ్రీనివాస అయ్యంగార్ శాసనంద్వారా తెలుస్తోంది. నయనార్ కపిలేశ్వర ముడియన్ నయనార్ కోయిల్ అనబడిన కపిలేశ్వర ఆలయంలోని నృత్యమంటపంలోని విఘ్నేశ్వరుని నిత్యపూజకై 200 ఫణాల్ని 30–1–1563లో సెవ్వుసాని అను నాట్యగత్తె దానంగా ఇచ్చింది. ఇక, ఆళ్వార్‌తీర్థం శేషాచల కురువై అనబడిన ఉచిత అన్నదాన సత్రంనుమట్ల అనంతరాజ నిర్మింపజేశాడు. కపిలతీర్థంలో మరమ్మత్తుల్ని 10–2–1865లో మహంత్ ధర్మదాస చేపట్టడం జరిగింది. ఆంగ్లేయులు 1843లో మహంతును తిరుమల తిరుపతి ఆలయాలకు నిర్వాహకునిగా 19 పెద్ద ఆలయాల్ని, 17 చిన్న గుడుల్ని 1824–33 లెక్కల ప్రకారం అప్పగించినట్లు తెలుస్తోంది.

ఇక, కపిలతీర్థం దారిలోని *ఒకప్పట్టి కొత్తూరు/* కోటవూరులో అచ్యుతపెరుమాళ్ ఆలయంను క్రీ.శ. 1537కు ముందు, బహుశా, 1530 తరువాత అచ్యుతరాయలు నిర్మింపజేశాడు. దీని నిర్మాణానికి, దీని చుట్టూ వందమంది బ్రాహ్మణులకు గృహవసతి గలిగిన అగ్రహారం ఏర్పాటుకు అవసరమైన భూముల్కై తిరుమల వేంకటేశుని ఆలయానికి 2400 ఫణంలు అచ్యుతరాయలు చెల్లించడం జరిగింది. అచ్యుతరాయ, గోవిందరాజల వేట తిరునాళ్ళకై చంద్రగిరి సమీప కృష్ణరాయ పట్టణం నివాసి నామిశెట్టి 1230 ఫణాల్ని క్రీ.శ. 1537లో దానంగా ఇవ్వడం కూడా జరిగింది. ఈ అగ్రహారాన్ని అచ్యుతపేట అని, ఆలయాన్ని పేట గుడి, అచ్యుతపేట గుడి అని కూడా పిలచేవారు. ఇదే కొత్తూరు గ్రామపు బీడు ప్రాంతాల్లో కులశేఖర ఆళ్వార్‌గుడి క్రీ.శ. 1469లో సాళువ నరసింహరాయల కాలంలో అలగీయ మణవాళ జీయర్ శిష్యుడైన కందాడై రామానుజ అయ్యంగార్ నిర్మింపజేశాడు. ఇందులోనే కుమార రామానుజ అయ్యన్ మండపం కూడా ఉండేది. ఇక్కడ కులశేఖర వీధికూడా ఉండినట్లు క్రీ.శ.1512 నాటి శాసనం ద్వారా తెలుస్తోంది.

పెరియ ఆళ్వార్ గుడి ఒకటి *అలిపిరి* వద్ద క్రీ.శ. 1300 ప్రాంతాన నిర్మింపబడినట్లు, ఆళ్వార్ల సాత్తుమురై ఉత్సవాలు కాలాన తిరుమల నుండి తీసుకురాబడు వేంకటేశుని ప్రసాదాలు ఈ గుడివద్దనుండే గౌరవ మర్యాదలతో తీసుకు వెళ్ళబడేవని తెలుస్తోంది. నరసింహస్వామి ఆలయాన్ని అలిపిరివద్ద క్రీ.శ. 1485లో సాళువ నరసింహరాయలు నిర్మింపజేయడం జరిగింది. తిరుపతిలోని కతారి హనుమాన్ గుడిలో నరసింహ ప్రతిమను తాళ్లపాకం తిరుమలై అయ్యంగార్ నిర్మింపజేయుగా, మరో నరసింహ గుడి అప్పటి వదిరాజపురంలో నిర్మింపబడింది.

*తిరుపతి* పశ్చిమ భాగాన *శ్రీనివాసపురంలో* నరసింహతీర్థం ప్రాంతాన వీరనరసింగ పెరుమాళ్ గుడిని క్రీ.శ. 1328లో, బహుశా, వీరనరసింగ యాదవ రాయలు నిర్మింపజేయడం జరిగింది. తిరుపతికి పశ్చిమాన ఉన్నందున మీలై సింగార్ కోయిల్ అని కూడా దీనిని పిలచేవారు. హోయసల మహాప్రధాని సింగయ్య ధణ్ణాయకుడు పొంగలూరు అనబడిన సింగానల్లూరును వీరనరసింగ, లేదా, తిరువేంకటనాధ నుండి పొంది ఈ గుడికి దానంగా ఇవ్వడం జరిగింది. పెరియ రఘునాథ అనబడిన రాములవారి ఆలయాన్ని *తిరుపతిలోని కుమార*



అన్నప్రసాదం

*రామానుజపురం* నివాసి నరసింహరాయ మొదలియార్ క్రీ.శ. 1480–81లో నిర్మింపజేశాడు. దీనికి *తిరుపతిలోని నరసింగాపురం* వ్యాపారి ధర్మపురం సిత్తము చెట్టు క్రీ.శ. 1517లో ప్రసాద నైవేద్యంకై దానం చేయగా, కోయిల్‌కెళ్వి వడ తిరువేంగడ జీయర్, మండలం అయ్యంగార్, కుమార రామానుజ అయ్యంగార్ (క్రీ.శ. 1530లో), పచ్చెయ్ లింగిశెట్టి, రామభట్టర్‌లు (1532లో) తాళ్లపాకం సిరు/చిన్న తిరుమలై అయ్యంగార్ (1547లో), యతిరాజ జీయర్ (1540లో) దానాలు ఇచ్చారు; బ్రహ్మోత్సవం, తేరు తిరునాళ్ కూడా ఇక్కడ జరిగేవని 1545 నాటి శాసనంబట్టి తెలుస్తోంది. *వ్యాపారవీధి అనబడిన నేటి తిరుపతి బేరివీధిలో* వరదరాజపెరుమాళ్, నాచ్చిమార్, తిరుకచ్చినంబి (తిరుకచ్చి, రామానుజాచార్యులు అలవందర్ శిష్యులు) ప్రతిమలతో కూడిన తిరుకచ్చినంబి శిలామంటవ గుడిని రామాపుర గ్రామవాసి శిలంబిదయార్‌శెట్టి 19–4–1596లో నిర్మింపజేశాడు. *తిరుపతిలోని నాథమునిపురం/వీధిలో* పేరు తెలియని వ్యక్తి క్రీ.శ. 1596కు పూర్వం నాథముని గుడిని నిర్మింపజేశాడు. అదే వీధిలో చక్రవర్తి తిరుమగనర్ అనబడిన రాముని గుడి క్రీ.శ. 1636 ప్రాంతానికే ఉండినట్లు, దీనికి 1636లో ప్రతివాది భయంకరన్ దానం ఇచినట్లు తెలుస్తోంది. నాటి *తిరుపతి వదిరాజపురంలోని* తన తోపులో భూతనాథ రామభట్టర్ క్రీ.శ. 1537లో గోపాలకృష్ణ గుడిని నిర్మింపజేశాడు. ఇదే వదిరాజపురంలో నరసింహస్వామి గుడి కూడా నిర్మింపబడింది. తిరుపతి పశ్చిమ భాగంలోని *తిరువెంకటాపురంలో* మరొక రఘునాథ గుడిని క్రీ.శ. 1535లో రామభట్టర్ నిర్మింపజేశాడు. తిరుచానూరులోని *ఒకప్పటి వరదరాజపురంలో* వరదరాజ గుడి ఉండినట్లు 13–2–1541 నాటి శాసనం ద్వారా తెలుస్తోంది. అలాగే, వేదాంత దేశిక గుడిలో మరొక వరదరాజ గుడి, మణవాల మహాముని గుడిలో ఇంకొక వరదరాజగుడి, గోవిందరాజ గుడిలో వేరొక వరదరాజ గుడి నిర్మింపబడి ఉండేవి.

**డా. దేవిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి**
**తిరుపతి, ఫోన్**: 984 958 4324.




*"..... పారిజాతం పరిమళ భరితం. ఆ పరిమళంలోనుండి తొంగి చూచిన ఆవేదన, ఎన్నో పాత్రలు... ఎన్నెన్నో దుఃఖాలు ఏదో చెప్పలేని బాధ, గుండెల్లో గూడుకట్టుకొన్న ఆవేదన, గడ్డకట్టిన 'కన్నీటి ముద్దలాటి విషాదం!' మీరు తిరిగి చూచిన ప్రదేశాలన్నింటినీ కథల్లో మిళితంచేసి చెప్పిన వైనం, ఆ నేర్పు మెచ్చుకోదగిన గొప్ప విషయం. కొందరు ఏవేవో కోర్కొని, ఏమేమో ఊహించుకొని, ఎక్కడికో, ఎవరి సరసనో చేరి చివరికి ఏమి సాధించలేక శూన్యమైన ప్రేమరాహిత్యంలో దిక్కుతోచక ఎలాటి అంతం ఆహ్వానిస్తారో 'మాలి' కథలో ఆర్ద్రంగా వర్ణించారు. బంధాన్ని కాదనలేక కోర్కెల బరువుని మోయలేక సతమతమయ్యే ప్రమోద, నిస్సహాయతతో కుంగిపోతోన్న బింకం వీడని శ్యాంరెడ్డి పాత్ర మనోభావాలు పంజరం కథలో కళ్ళకు కట్టించినట్లు మలిచారు.... అత్యాశ మనిషిని ఆవరిస్తే ఉనికే లేకుండా ఎలా అయిపోతారో అనేదానికి 'పులివేట' కథ మంచి ఉదాహరణ. ఎంతో మంది గుండె గోడులు విన్న తన గుండె చప్పుడు ఎలా వినాలి... అతని వదలి వెళ్ళినన అవమానంలా అతని దేహం వ్రేలాడుతోంది. కథ పూర్తయ్యాక కన్నీళ్ళు వచ్చాయి.... ముఖ్యంగా కథల్లోని వస్తువైవిధ్యం, కథాకథనం, తాత్త్వికత, వర్ణనల గాఢత, అంతరంగ మథనం, ఆయా ప్రదేశాల వర్ణన అదే పల్లెటూరు నుండి ప్రపంచందాక... రొమాంటిక్‌గా కొన్నిచోట్ల ఎక్కువ కథను నడిపే తీరు ఒక విలక్షణమైన శైలి... కథకు కావలసిన హంగులన్నింటినీ కలబోసుకొని ఏకబిగిన చదివించాయి. పారిజాత సుమసుగంధం ఆఘ్రాణించినకొద్దీ వస్తూనే ఉంది.. వెరసి మంచి కథలు చదివామన్న తృప్తి కలుగుతుంది....."*

*విజయ బక్ష్, మండపేట*

ప్రతులకు : ***మిసిమి*** కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్ : 994 951 6567.

# అన్నమయ్య ఆధ్యాత్మికత

– ఉడాలి నరసింహశాస్త్రి

వేదసారాన్ని అలతి అలతి పదాలతో తీర్చిదిద్ది తెలుగు వేదంగా తన కీర్తినాలను తెలుగుజాతికందించిన మహనీయుడు అన్నమయ్య. తిరుమలేశుని భక్తపరమాణువై ఆశువుగా 32 వేల సంకీర్తనా సుమాలను స్వామి పాదాలకు సమర్పించిన భక్త శిఖామణి. నవ విధ భక్తులలో ఒకటైన ఆత్మనివేదనాసక్తిని సంపూర్ణ శరణాగతి రూపంగా సమర్పించిన అకళంక భక్తాగ్రేసరుడు. తన భావజాలాన్ని పద సాహిత్యం ద్వారా పండిత, పామర, జనామోదం చేసిన మహనీయుడు. ఆయన కీర్తనలలో నీతి, భక్తి, శృంగారం, వైరాగ్యం కలబోయబడి సంగీత, సాహిత్య, నృత్యానుకూలములయ్యాయి.

తెలుగు పద కవితకు భాష్యం చెప్పినవాడాయన. తెలుగు పాటకు పట్టం కట్టినవాడు. అలమేలు మంగను కీర్తించే తరి తన్ను చెలికత్తెగా, నాయికగా, పెండ్లికూతురుగా, జగన్మాతగా ఉల్లేఖించుకున్నాడు. అన్నమయ్య రచించిన శృంగార ఆధ్యాత్మ సంకీర్తనలకు సరియైన లక్షణ నిర్దేశం లేకపోవడంవలన తన సంకీర్తనలకు తానే సంకీర్తన లక్షణ గ్రంథం వ్రాసుకున్నాడు. దీనిని చిన తిరుమలాచార్యులు ఆంధ్రీకరించారు.

అన్నమయ్య కీర్తనలలో శృంగార సంకీర్తనల లక్షణాలు, శృంగార స్త్రీల మధుర మనోజ్ఞమైన వాక్కులు, పామర స్త్రీల సరసోక్తులు దర్శనమిస్తాయి. దేహాత్మ, పరమాత్మలకు సంబంధించిన వైదిక, లౌకిక ధర్మాలు వివరించేది ఆధ్యాత్మ సంకీర్తనలని లక్షణ నిర్దేశం చేశాడు. కీర్తనం అంటే భగవంతుని గుణ, నామాలను పాడడం. ముక్తికోసం అన్నమయ్య చేసిన సంకీర్తనలకు పది స్వరూపాలున్నాయి. శృతులు, శాస్త్రాలు, పురాణ కథలు, నీతులు, విపుల మంత్రార్థాలు మున్నగునవి. అన్నమయ్య తన సంకీర్తనలను సంగీత ప్రధానమైనందున కృతులుగా భావించాడు. ఆయన శృంగార సంకీర్తనలే ఎక్కువగా వ్రాశారు.

మానవునిలో శృంగార, వైరాగ్య దశలు కలిస్తేనే సంపూర్ణ జీవితం అన్న దానికి వ్యాఖ్యానమే ఆయన శృంగార ఆధ్యాత్మ సంకీర్తనలు. ఆయన సంకీర్తనలు ముక్తకాలు. ఒక్కొక్క రకమైన లోకానుభవాన్ని దేనికవే వివరిస్తాయి. సమాజమే ఆయన సంకీర్తనలకు వేదికగా భాసించింది.

శృంగార భావాలైన కచకుచాది అవయవాలు అతిగా వర్ణించడంవల్ల ఏర్పడిన వైరాగ్యంతో అవి ఆధ్యాత్మిక దశకు పరిణమించడం అన్నమయ్య కీర్తనలకు ప్రయోజనం. రెండు ఆత్మలు ఒకటైనప్పుడు, రెండు దేహాలు ఒకటి కావచ్చునని ప్రతిపాదించే తత్వమే శృంగార సంకీర్తనల తత్వం. తన సంకీర్తనలు రాధామాధవుల తత్వంవంటిదన్నాడు. అంటే రక్తితో ప్రారంభమై, భక్తిగా పరిణమించే మోక్ష కాముకత్వం ఈయన కీర్తనలలో ప్రధానాంశం. దీనినే మధుర భక్తి అంటారు.

భక్తి జ్ఞాన శృంగార వైరాగ్య సంస్మరణాత్మక దృక్పథంగల 32 వేల అచ్చతెలుగు కీర్తనలతోబాటు, సంస్కృతమున వేంకటాచల మహాత్మ్యం, సంకీర్తనా లక్షణాలు, తెలుగు ద్విపద రామాయణం, మరియు 11 శతకాలు రచించి, పదకవితా పితామహుడుగా, సంకీర్తనాచార్యుడుగా, పంచాగమ సార్వభౌముడుగా బిరుదులందుకున్నాడు.

సాహిత్యపరంగా అన్నమయ్యది ఒక సారస్వత యజ్ఞం. ఆయన కీర్తనలలో అస్పృశ్యతా నివారణ, సర్వ మానవ సమానత్వం, జగన్మిధ్యావాద తిరస్కరణం ఉన్నాయి. రామదాసు భజన సంప్రదాయం, క్షేత్రయ్య నృత్య

సాంప్రదాయం, త్యాగరాజు సంగీత సాంప్రదాయం ఇవన్నీ అన్నమయ్య నుండే ఏర్పడ్డాయి. సాహిత్యాన్ని ప్రజాసామాన్యానికి అందజేయాలనే సత్సంకల్పంతో అచ్చతెనుగు నుడికారాలు, పలుకుబడులతో దేశి కవితా గానం చేశాడని చెప్పాలి. ఆనాడు బహుళ ప్రచారంలో ఉన్న ఏలలు, దరువులు, చందమామ పదాలు, తుమ్మెద పదాలు, లాలిపాటలు, దంపుడు పాటలు మున్నగు దేశీయ కవితలకు స్వరతాళగతుల నేర్పరచి ప్రాణప్రతిష్ఠ చేసినవాడు అన్నమయ్య.

అన్నమయ్య గీతాలు జ్ఞానభాండాగారాలు. శృంగార, నీతి, వైరాగ్య భక్తులకు నిండు కొలువులు. భక్తి ఉద్యమంలో వీరశైవులు ప్రధానపాత్ర వహించినా, తమిళ ఆళ్వారుల ప్రభావంవల్ల అవి ఉన్నత స్థానానికి వచ్చాయి. తెలుగులో కూడా అవి ఉన్నత స్థాయికి రావడానికి కారణం వైష్ణవులే. భాగవత ఉద్యమాన్ని తెలుగునాట ఏర్పరచినవాడు పోతన అయితే, భక్తి ఉద్యమంలో ప్రతి అక్షరాన్ని సంకీర్తనారూపంగా అంకితం చేసిన ఘనత అన్నమయ్యదే. నవవిధ భక్తులను తన మార్గంలో భిన్నంగా వివరించడంలో అన్నమయ్య సఫలీకృతుడయ్యాడు. రామకథా రాగసుధ పానం చేసి తెలుగువారి మనస్సులను రంజింపచేయడానికి కారకుడు త్యాగయ్య. తెలుగు నేల చీకట్లను పారద్రోలడానికి వేల కీర్తనలు వెలిగించినవాడు అన్నమయ్య.

ఇతని భక్తిలో జ్ఞానము, వైరాగ్యము, రాగము, సఖ్యము, వాత్సల్యము, శృంగారము, ఆధ్యాత్మికత పెనవేయబడి ఉన్నవి. ఏ విషయమును కూడా తన మనోవీధిలో హత్తుకొనిగాని చెప్పడు. చెప్పడంలో పునరుక్తులున్నా విసుగు రాదు. భాషపై ఇతనికి అపార అధికారమున్నది. అన్నమయ్య శయ్యాపాకములెరిగినవాడు. కావ్యగుణాలన్నీ అతనికి కరతలామలకాలు. కాలానుగుణమైన భాష వాడి, ముచ్చట గలిగించాడు. "జయము మనది వనచరులార..... రక్కసములమీద రాముడలిగెనట, ధక్కానినదం ధమధమ ధమం" ఇలా ధ్వన్యనుకరణ శబ్దాలు వాడి భావానికి రూపం కల్పించాడు.

వస్తువునకు వస్తువే కాదు. భావానికి వేరే భావాన్ని ఉపమానంగా వాడి, తన ప్రతిభను చూపినవాడు. ఆశ పగవంటిదట. మమత జగడమువంటిదట. వేంకటేశ్వరుని కృప నీతివంటిది. ఇతర దేవస్మరణలు భూతమువంటిది అని ఉపమారూపకములచేత వర్ణ్య వస్తువులకు మరొక కల్పిత వస్తు ప్రపంచాన్ని సృష్టించాడు. ఈయన కీర్తనలలో జాతీయాలు, సామెతలు, చాటువులు కోకొల్లలు. "చిగురు కొమ్మైన చేవ, తంగేటి జున్ను మీసాలపై తేనియల్" మున్నగునవి జాతీయ ప్రయోగాలు. మంచుబులకలు, ఎండచూపులు, అంకెల మోవి మున్నగునవి దేశీయ పదప్రయోగాలు. తన పలుకులే సామెతలుగా తీర్చిదిద్దినవాడు. ఒకే కీర్తనలో ఐదారు సామెతలు కూర్చగలనేర్పరి. "చెంతనిండు చెరువుండ చెలమలేలా", "మొదలుండ కొనలకు మోచి నీళ్ళు పోయనేలా". ఇలాంటివి తన చరణాలలో వర్ణించడం ఆయన కవితా శిల్పంలో మరో ప్రతిభ.

అర్చనలో ఆంతర్యాన్ని వివరిస్తూ "అర్చన బయట విషయంగాకాక మనసు లోపలి చైతన్యంగా గుర్తించినపుడే అది దైవపూజగా భావింపబడుతుంది" అని తెలిపాడు. "భావములోన, బాహ్యమునందున గోవిందా గోవిందయని కొలువవో మనసా" అని పలికిన అన్నమాచార్యుడు హృదయంలో భగవత్ చైతన్యాన్ని అనుభవించగలగడమే నిజమైన అర్చన అన్నాడు. "పెను హృదయమే హరిపీఠమట, కనుగొను చూపులే ఘన దీపములట, నలువైన రుచులే నైవేద్యమట" అని అర్చనా తత్వాన్ని అన్నమయ్య వివరించాడు. సామాన్యుడు కూడా భగవత్తత్వాన్ని అర్థం చేసుకుని ఆచరించాలనేది అన్నమయ్య విశ్వాసం. తెలుగు పలుకుల స్వాభావిక సౌందర్యాన్ని గుబాళింప చేసిన ప్రజాకవి అన్నమయ్య.

అన్నమయ్య కేవలం భక్తిమార్గాలే బోధించలేదు. సమాజంలో సమత, మానవ ధర్మ స్థాపనకు కీర్తనలు వ్రాశాడు. అన్నమయ్య కీర్తనలలో సామ్యవాద సిద్ధాంతం కొట్టవచ్చినట్లు కనబడుతుంది. 'నిండారరాజు నిద్రించు నిద్రయు ఒకటే, అండే బంటు నిద్ర అదియునొకటే, అనగు దేవతలకు అల కామసుఖమొకటే, ఘనకీట పశువులకు కామసుఖమొకటే' అని సామ్యవాదాన్ని సోదాహరణంగా వివరించాడు. అందరి ఆత్మ ఒకటైనప్పుడు అనుభవించే

సుఖాలలో తారతమ్యం లేదన్నాడు. ఈ భేదరాహిత్యంవల్ల మనుషులు, మృగాలు, రాజులు, సేవకులు సమానులన్నాడు. అన్నిటిలో అన్నమయ్య పరబ్రహ్మను దర్శించాడు. ఈ విధంగా తన కీర్తనలలో సామ్యవాద సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. పరమ పదమైన శ్రీనివాసుని పాదాన్ని వర్ణిస్తూ 'బ్రహ్మ కడిగిన పాదము, బ్రహ్మము తానే నీ పాదము' దానిలోని దాస్య భక్తికి, సేవానిరతికి, కైంకర్యానికి అగ్రతాంబూలమిచ్చాడు. పాదసేవనమే పరమార్థమన్నాడు. బలిచక్రవర్తి రాక్షస వంశజుడైనా, రాక్షసాంశ లేనివాడు. కాబట్టి బలినీ, ఇంద్రునీ ఒకేవిధంగా వామనావతారంలో సంతృప్తి పరిచాడు. వెంకన్నను వర్ణించుటలో విష్ణుతత్త్వాన్ని ప్రతిపాదించాడు. 'ఏకో విష్ణుః మహద్భూతం, పృథగ్భూతాన్యనేకశః' అని విష్ణు సహస్ర నామంలో చెప్పినట్లు, భగవంతుడంటే విష్ణుతత్త్వమే. అది దేవ మానవ రాక్షస మృగ పక్షి ప్రకృతి రూపంలో విశ్వాత్మగా ప్రకాశిస్తున్నదని చెప్పాడు. పోతన ఏ తత్త్వాన్ని ఈశ్వర శబ్ద వాచ్యం చేశాడో, అదే తత్త్వాన్ని అన్నమయ్య తిరుమలేశు ని వర్ణించుటలో చేశాడు.

'శృతిశిరసి విదీప్తే బ్రహ్మణి శ్రీనివాసే' అని శ్రీనివాసుడు బ్రహ్మతత్త్వమని, ఆ బ్రహ్మతత్త్వవే బ్రహ్మోత్సవాలన్నాడు. మాయకు లోబడ్డవానికి తిరుమలేశుడు నానారూపుడు. మాయ దాటినవానికి బ్రహ్మస్వరూపుడు అని వెంకన్నను వర్ణించాడు. 'కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుడని, తలతురు మిము శైవులు తగిన భక్తులు శివుడనుచు' అని వేంకటేశ్వరుని విష్ణుస్వరూపునిగా వర్ణించాడు.

ఇక ఆయన సుదర్శన చక్రాన్ని వర్ణిస్తూ, భగవంతుని సంకల్పమాత్రంచేత పనిచేసే చక్రం సుదర్శనం. సుష్టు దర్శనం అంటే చూచేవారికి మంగళకరంగా కనిపించేది. 'వేయంచుల విశ్వపు చక్రము, భావించు సుజన పాల చక్రము, శ్రీ వేంకటపతి చేతిది చక్ర'మని స్తుతి చేశాడు.

తాళ్ళపాకవారు సుదర్శన చక్రారాధకులు. 'సతతము హరిచేతి శంఖచక్రములే గతియై మా పాపాలనుండి కాచుగాక'. అన్నమయ్య ముద్రధారన పొందినవాడు కాబట్టి తమను రక్షించే బాధ్యత తిరుమలేశునిదే అని భావించాడు. ఈ సుదర్శన చక్ర స్తుతి అన్నమయ్య కీర్తనలలో పలుచోట్ల కానవస్తుంది. 'నమో నమో దానవ వినాశ చక్రమా, సమర విజయమైన సర్వేశు చక్రమా' అన్న కీర్తనలో అన్నమయ్య వర్ణించిన సుదర్శన చక్రాన్ని, పెద తిరుమలయ్య సుదర్శన రగడలో వర్ణించాడు. సమస్త విశ్వాన్ని నడిపించే కాలచక్రమన్నాడు. ఈ చక్ర ప్రతాపానికి బలియైన రాక్షస వీరులను కూడా అన్నమయ్య వర్ణించాడు. 'చెండిన రావణ శిరోమాలికల దండల పూజల' అనే కీర్తనలో సుదర్శన చక్ర వర్ణన అవగతమౌతుంది. రావణుని కపాల మాలికలే పూదండగా, కంసుని మెదడు గంధంగా, హిరణ్య కశిపుని రక్తం అర్ఘ్యపాద్యాలుగా, మధుకైటభుల ప్రాణాలు నైవేద్యంగా సుదర్శన చక్రానికి బలియైనట్లు వర్ణించాడు.

అలిమేలు మంగను వర్ణిస్తూ, ఆమెను శక్తిస్వరూపిణిగా, ఆ శక్తిపురుషుని వీడిపోదని, ఆ శక్తి పరమాత్మను ఆశ్రయించుకొని ఉంటుందని, ఆమెయే స్త్రీ అని వర్ణించాడు. 'శివశ్శక్త్యాయుక్తో యది భవతి శక్తః ప్రభవితుం' అన్న వాక్యానుసారం శక్తిస్వరూపం లేకపోతే పరమేశ్వరుడు కూడా నిస్సహాయుడే అని తాత్పర్యం. అన్నమయ్య పరవశంతో అలిమేలు మంగను కీర్తించేటప్పుడు తన్ను తల్లిగా, చెలికత్తెగా, నాయికగా ఊహించుకొని, ఆమెచేత నాట్యం చేయించాడు. నీరాజనాలందించాడు. సృష్టిలోని లావణ్యమంతా ఆమేనన్నాడు. ఆమెను గోదాదేవిగా వర్ణించాడు. 'ఆమని సొబగుల అలిమేలు మంగ' అని ఆమెను రాసిబోసిన వసంతకాల సౌందర్యమన్నాడు. ఆరు ఋతువులు ఆమెలో రూపుదాల్చినట్లు ఇలా వర్ణించాడు:

'కాలములారును గలిగె నీకు నిదె బాలకియందె పైపై నీకు సతికొప్పు విరులు జలజల రాలిన లతల వసంతకాలము నీకు కతగాదనమైకాఁకలు చూపిన అతి వేసవి కాలమప్పుడే నీకు', మరో కీర్తనలో పాలసముద్రము నుండి పుట్టినందున సముద్ర గాంభీర్యం ఆమెలో ఉందన్నాడు. ఆమె కరుణామయ స్వరూపాన్ని గొప్పగా వర్ణించాడు. వేంకటేశ్వరుని ఆమే వచ్చి వివాహము చేసుకొన్నదట. అంటే ప్రకృతి పరమాత్మలో చేరింది అన్న అన్నమయ్య భావనాశక్తి, రచనా వైదుష్యానికి ఈ కీర్తన గొప్ప ఉదాహరణ. 'చూడరమ్మ సతులాల సోబాన

బాడరమ్మ కూడున్నది పతిఁ జైడికుడునాంచారి శ్రీమహాలక్ష్మియట సింగారాల కేమరుదు' ఇందు సోబాన అనేది పెండ్లిపాట. పెండ్లికుమార్తెగా అలిమేలు మంగ సౌందర్యాలన్నింటిని సాభిప్రాయంగా వర్ణించాడు అన్నమయ్య. ఈ విధంగా ఆయన గళం నుండి వేనకు వేల కీర్తనలు వెలువడ్డాయి. కాని ఇవన్నీ కూడా స్వామి తనలో ఉండి పలికించాడని తనను తాను ఆత్మసమర్పణ చేసుకొన్నాడు.

అన్నమయ్య నిజభక్తి స్వరూపం ఎలాంటిదో ఈ క్రింది ఆయన వివరించాడు: 'నానా భక్తులివి నరుల మార్గములు యేనెపాననైనా అతడియ్యకొను భక్తి. హరికిగా వాదించుటది ఉన్మాదభక్తి పరుల గొలువకుంటే పతివ్రతాభక్తి, అరసి యాత్మగొనుటయే విజ్ఞాన భక్తి అరమరచి చొక్కుటే ఆనందభక్తి, అతి సాహసాల పూజ అది రాక్షస భక్తి, అతని దాసుల సేవే అదియే తురీయభక్తి క్షితినొక పనిగోరి చేసుటే తామసభక్తి, అతడే గతని ఉండుటది వైరాగ్య భక్తి అట్టి స్వతంత్రుడటే అది రాజసభక్తి నెట్టన శరణనుటే నిర్మల భక్తి, గట్టిగా వేంకటేశు కైంకర్యమే సేసి తట్టుముట్టులేనిదే తన నిజభక్తి' అని దశ విధ భక్తి మార్గాలు చెప్పి నిజమైన భక్తి తట్టు, ముట్టు కానివి అన్నాడు. తట్టు అంటే ఆలోచనవచ్చుట, ముట్టు అంటే తాకుట. అంటే తాను పనిలో ఉండి, స్పర్శ కలిగి ఉండడం. దీనినే కర్మబంధం అంటారు. ఇక తక్కిన భక్తులన్నీ సత్వరజస్తమో గుణాలచేత భేదాలు కలిగి ఉంటాయి. గోదాదేవి తిరుప్పావైలో ప్రదర్శించిన భక్తిని పతివ్రతా భక్తి అంటారు. అంటే ఒకే దైవాన్ని ఆరాధించటం.

ఇక నారదాది దేవర్షులు, సనక సనందనాది బ్రహ్మర్షులు, ఆత్మను సందర్శించి, పరమాత్మునిలో అచంచల విశ్వాసం కలిగినవారు. వారిది విజ్ఞాన భక్తి అన్నాడు అన్నమయ్య. భక్తిపారవశ్యంలో తన్ను మరిచిపోవడం ఆనంద భక్తి. దీనికి ప్రహ్లాదుడు ఉదాహరణ. కైలాసగిరిని పెకలించి, వీణ వాయించి, రావణుడు చేసిన సాహస పూజ రాక్షస భక్తి. ఒక పనిని సంకల్పించి చేసేది తామస భక్తి అని అన్నమయ్య స్పష్టం చేశాడు. 'నీ కొండకు నీవే రప్పించుకో' అన్న భావన ఏర్పడటం అహంకార త్యాగం. దానినే వైరాగ్య భక్తి అన్నాడు. వైరాగ్యమేర్పడితే మనస్సు నిర్మలమవుతుంది. కార్యఫలాపేక్షను అపేక్షింపక చేసే భక్తి నిజభక్తి. ఇదే భగవద్గీతలో చెప్పిన నిష్కామ కర్మయోగం. నిజభక్తులు దేనినీ కోరరు. అలాంటివారిలో ఆంజనేయుడు, నారదుడు మున్నగువారు పేర్కొనదగినవారు. వారికి స్వామి కైంకర్యమే పరమార్థం.

అన్నమయ్య తన కీర్తనలలో వివాహ వ్యవస్థను మనోజ్ఞంగా వర్ణించాడు. వేంకటేశ్వరుని వరునిగా, అలిమేలుమంగను వధువుగా ఊహించి, తన కీర్తనలో అన్ని రకాల పద్ధతులను వర్ణించాడు. వివాహం ఒక సామాజిక వ్యవస్థ. స్త్రీపురుషుల నైతిక సంబంధాలను, పిల్లల పోషణకు సంబంధించిన సాంఘిక వ్యవస్థగా దీన్ని వర్ణించాడు. బాసికాలు కట్టటం, పూలదండలు మార్చటం మొదలగు విషయాలు అన్నమయ్య వర్ణించిన వివాహ ఘట్టం. 'కాంతకు నీకును కనురెప్పలే తెర, దంతపు నవ్వులే మీకు తలంబ్రాలు' అని అన్నమయ్య వివాహ పద్ధతులకు అనుగుణంగా వర్ణించాడు. ఆయన కీర్తనలలో బొమ్మల పెళ్ళిళ్ళు ప్రాముఖ్యం వహించాయి. నాగవల్లి, కంకణధారణ, కొంగుముడి మొదలైన వైవాహిక కార్యక్రమాలు వర్ణించబడ్డాయి. అన్నమయ్య ప్రధానంగా దాక్షిణాత్య కర్ణాట ఆంధ్ర వివాహ పద్ధతులను, వారి దేశీయ ఆచారాలను తన సంకీర్తనలలో స్పష్టం చేశాడు. అన్నమయ్య వేదాంతం శ్రీమద్రామానుజులవారి అభిప్రాయానికి అనుగుణమైంది. ఆయన వేదాంతంలో దైవకైంకర్యం ప్రధానం. మహావిష్ణువును నమ్మి, ఆయన కృపకు పాత్రులు కావడమే ఆయన వేదాంతం. బ్రహ్మమొక్కటే అనే కీర్తనలో ఆయన వేదాంతాన్ని మనం చక్కగా అర్థం చేసుకోవచ్చు. లోకాన్ని హరిమయంగా గుర్తించి తరించడమే ఆయన వేదాంతంలో రెండో మెట్టు. 'హరి నీ మయమే అంతాను.'

మరో సందర్భంలో 'తగిలెద బహులంపటముల – తగిలెద బహుబంధంబుల తగులను మోక్షపు మార్గము – తలపున నెంతైనా అగపడి శ్రీవేంకటేశ – అంతర్యామివై నగినగినను నీకే ఇక – నాకా మామాయ!' జీవుడు సర్వదా పతనంవైపే ప్రయాణం చేస్తాడు. తన శ్రేయస్సు కోరుకోడు. అట్టివానిని చూచి దేవుడు నవ్వుకోక ఏమి చేస్తాడని

పైకీర్తనలోని భావం. జీవితంలో మనిషికి మిగిలేది స్వామి కరుణే. మిగతా ఏవీ కూడా మిగలవన్నాడు. అంచేత మమతానుబంధాలు తొలగాలంటే ఒకటే మార్గం. 'అంతరంగమెల్ల – శ్రీహరి కొప్పించకుండితే, వింతవింత విధముల – వీడు నాబంధములు' – ఈ కీర్తనలో అనన్య భక్తి, దాస్యబుద్ధి, పరోపకరా స్వభావం ఏర్పడితే అన్ని బంధాలు తొలగిపోతాయన్నాడు. మనిషి మంచిని మెచ్చుకుంటే గొప్ప భక్తుడౌతాడని అన్నమయ్య సారం. వెంకన్న బ్రహ్మోత్సవాలలో రోజుకో అలంకార శోభను తన పద కవితలో ఉజ్వలంగా వర్ణించాడు. వాహన అలంకార శోభనను వర్ణిస్తూ 'తిరుదండెలపై నేగ దేవుడిదే తొలినాడు, సిరుల రెండవనాడు శేషునిమీద, మురిపాన మూడోనాడు ముత్యాల పందిరి క్రింద' ఉత్సవ వైభవాన్ని దేశ్య పదాలతో ప్రయోగించాడు. అలాగే గరుడ, గజ, సూర్యప్రభ, అశ్వవాహనాలు ఉత్సవాలలో జరుగుతాయని స్వామి కళ్యాణంతో బ్రహ్మోత్సవాలు పూర్తవుతాయని వివరించాడు. 'కనకపుటందలము కదిసి తొమ్మిదోనాడు పెనచి పదోనాడు పెండ్లిపీట' అని మంగళకరంగా కళ్యాణాన్ని వర్ణించాడు. పెండ్లిపీట అనేది అచ్చతెనుగు నుడికారం. అన్నమయ్య పదకవితలలో సూక్తులు మానవ వ్యక్తిత్వ వికాసానికి సోపానాలు. ఈ సూక్తులలో సామాజిక సూక్తులు ప్రయోగించాడు. అరిషడ్వర్గాలలో క్రోధము ప్రమాదమైనదన్నాడు. 'కోపము మానితేని కోటి జపాలు సేయుట, సరవి కోపించకుంటే జన్మమెల్ల సుఖమే' అన్నాడు. మరో కీర్తనలో 'సర్వ వేదసారం సమబుద్ధి' అన్నాడు. మరో కీర్తనలో మానవునికి అత్యాశ పనికిరాదన్నాడు. 'కడుపులోని పుండు కండలేని ఆశ' అని వర్ణించాడు. మనిషిలోని స్వార్థం పంది బతుకుతో సమానం. 'పందివలె తను తానే బ్రతుకేటి సుఖం' అన్నాడు. పరోపకారంకంటే పుణ్యం పరపీడనకంటే పాపం మరొకటి లేదన్నాడు. కుల వ్యవస్థపై తిరుగుబాటు చేస్తూ, బ్రాహ్మణుడు మెట్టె భూమి, ఛండాలుడు ఉండేటి భూమి ఒకటే అన్నాడు. కాంతాకనకాదులు, కామాంధకారం, అప్పు, తప్పు చేయటం అనే అంశాలు తన సూక్తులలో వివరించాడు. ఆయన సూక్తులు దివ్యౌషధాలు. సమాజ రుగ్మతల రూపుమాపి నవసమాజ నిర్మాణమునకు నాంది పలికాయి. అన్నమయ్య శరణాగతి తత్వాన్ని వివరిస్తూ తన్ను ఆత్మార్పణ చేసుకున్నాడు. అడుగడుగునా అన్నమయ్య శరణాగతి ఇట్లు ధ్వనించును. 'హరి నీమయమే అంతాను, అరిసి నీకు శరణనియెద.... అంతర్యామి అలసితి, సొలసితి, ఇంత నీ శరణిదే జొచ్చితిని' అని భక్తితో హరిని కైవసం చేసుకొని స్వాధీనపతికనాయికవలె తన్ను భావించుకొన్నాడు. అన్నిటికంటే ఆ వేంకటేశ్వరుని శరణు అంటివిగదా, నాకేమి కొరత అని నిబ్బరాన్ని పొందాడు. భగవద్విషయమున శృంగారమును సమన్వయింపజేసి ఆ పరమాత్మునితో ప్రణయ కలాపాన్ని సాగిస్తాడు. అది జీవాత్మ, పరమాత్మల శుద్ధ దాంపత్యం. అది విశ్వవ్యాప్తమైన శృంగారంగా భాసిస్తుంది. గోపికలు, రాధాకృష్ణులు, ఆళ్వార్లు, ఆండాళ్ళు ఈ మార్గంలో మధురభక్తి తన్మయులై శృంగార భక్తిలో పరాకాష్ట చెందారు.

శృంగార నాయికగా ఉన్న తరి అన్నమయ్య తన్ను ఆ వేంకటేశ్వరుని ధర్మపత్ని అలిమేలు మంగగా భావించుకొని, 'అక్కరో వేంకటేశుడలిమేల్మంగ ఇక్కడ తనుగూడి ఏలినాడమ్మా' అని తన్ను పరిచయం చేసుకున్నాడు. 'నెలత బాసి యుండలేను, నిముషమేడు నేడు నాకు అని ఆ నాయకుడు ఈ తరుణికై తపించునట' అని ఆధ్యాత్మిక మార్గంలో శృంగార భక్తిని అనుభవైకవేద్యంగా వర్ణించినాడు అన్నమయ్య పరమాత్మునితో తనకేర్పడిన వియోగం సహింపలేక భక్తుని ఆత్మ పడు తహతహయే భగవద్విరహం. జీవులలో శృంగారమున దశ విధ మన్మథావస్థలు ఎట్లు గోచరించునో అట్లే భక్త జీవులలోకూడ భగవతుని వాల్లభ్యము ఆపేక్షించినపుడు అశ్రు చింతావ్యథ వ్యామోహ విభ్రమ జ్వరాదులనే అవస్థలు ఏర్పడునని అన్నమయ్య వర్ణించాడు. 'ఎవ్వరుగలరమ్మ ఇక నాకు, నెవ్వగల చిత్తమ్ము నెలకొన్న దిపుడు అనయము నెరవు తానై ఉన్నదిపుడు' అని తన వశమున ఏమీ లేదనే భావన చూపించాడు. అంతటికీ కారణమై, అన్నిటికీ సాక్షియైన ఆ పరమేశ్వరుడే దీనికి ఉపాయము ఎరుగవలె! కాని మానవమాత్రుడు ఈ విరహునకు ఏ మందులు చెప్పగలరు? 'దేవశిఖామణి తిరుమల దేవుని తలపున బాయక భావించిన ఈ కామిని భావము లోపలను ఆ విభుడే తానుండిన అతడే

తానెరుగగవలె, ఈ వెలదికి గల విరహము ఏమని చెప్పుదుము?' అని చెలికత్తెలలో పెద్ద చెలికత్తె అయిన అన్నమయ్య ఆ దేవునితో విన్నవించిన మాటలివి.

ఆయన లీలలు భక్తమనోహ్లాదైక లక్ష్యాలు. భక్తులకు ఆయన లీలా విలాసమే జీవరసం. ఆయన లీలాబోధయే వేదాంత బోధన. పరిపరివిధాలైన ఆయన లీలలను వర్ణిస్తూ 'గోళ్ళమీటుచు నుండె కొన్నాళ్ళు, గొల్లవీళ్ళ పాలారగించె వీడు కొన్నాళ్ళు, కొండ గొడుగున పట్టె కొన్నాళ్ళు, తాకొండముచ్చులనేలె కొన్నాళ్ళు' ఈ విధంగా అనుక్షణ పరిణామశీలియైన ఆ పరమేశ్వరుని లీలావిలాసాలు వర్ణించాడు. ఒకప్పుడు బాలక్రీడలు, మరొకప్పుడు జలక్రీడలు, మరోసారి గొల్ల పడుచులతో సయ్యాటలు, చించెతలతో వీరవిహారాలు తన కీర్తనలలో వర్ణించాడు. ఆయన సేవలన్నీ కూడా అన్నమయ్యకు విశ్వలీలా విలాసంగా గోచరించాయి.

ఇక ఉన్న కథలకు తోడు లేనివి ఊహించి చేసిన ఆయన సంకీర్తనా ప్రసంగాలు, భక్తులను తన్మయులను జేయును. స్వామివారి నిత్యోత్సవాలలో జరిగే కైంకర్యాలు అన్నమయ్యను ఆనందడోలికలలో ముంచి, అతనిచేత దివ్య ప్రసంగాలు గానం చేయించేవి. తన్ను తాను ఆ దేవునికి దాసినని, ప్రియనని, పత్నినని భావించుకొనును. 'అవ్వలి ఇవ్వలి నీ యంగనల వద్దను పవ్వళించి ఉండగా పాదములొత్తుదునా' అని ఆ దేవునితో ప్రసంగించును. 'వలువ నేరుతురుగాని వాదించలేనురా, మెలగి నీవెట్టుండినా మెచ్చుకుండలేనురా' అని అన్నమయ్య స్వామితో రాజీపడును. ఇట్టి ప్రాసంగికములు వారి కీర్తనలలో పలుచోట్ల కనబడును. అన్నమయ్య కాలంనాటికి తిరుమల దేవాలయాలు సువర్ణమయం. నిత్యకళ్యాణ పచ్చుతోరణాలతో వైభవంగా ప్రకాశించేవి. 'మహినీదు ఘనఫనామణుల శైలముగంటి, బహువిభవముల మంటపములగంటి, సహజ నవరత్న కాంచన వేదికలుగంటి, రహివహించిన గోపురములగంటి' అని పై కీర్తనలో ప్రకాశవంతమైన స్వామి విగ్రహాన్ని అన్నమాచార్యుడు ఎన్నో విధాలుగా వర్ణించాడు. ఒకొక్క సేవలో ఒక్కొక్క శోభనం రూపురేఖావిలాసాలు భౌతిక స్థాయి దాటి ఆధ్యాత్మిక స్థాయికి ఎదిగింది. అన్నమయ్య ఇద్దరు భార్యల ముద్దుల మొగుడు. సంసారి. కాని భగవద్గుణానుభవమున సంతత అనురాగి. 'ఇటి వేలుపు వేంకటేశు కొలువన్, పరులవెంట తిరుగుట ఓడ విడిచి వదరిడుట' అని చెప్పి కామినీ కాంచనాలపై మక్కువ వదలమన్నాడు. 'ఈ బంధములు మరి ఈ దేహము కలకాలము నెడయవు ప్రాణులకు' అని అన్నమయ్య వ్యామోహమును వీడమన్నాడు. అతని కీర్తనలలో ఒకవైపు సంసార విరక్తికి ఎంత ఉపదేశముందునో, భగవదనురక్తికి అంత ప్రబోధముందును. సంసారాన్ని వర్ణిస్తూ 'నడికట్టె కటకటా సంసారముచూడ, జడదిలోపల ఈత సంసారము, చమురుదీసిన దివ్వె సంసారము, సమరమ్ములో ఉనికి సంసారం' అని సంసార నిరసన వర్ణించినాడు. వైరాగ్యం కలిగితేకాని భగవద్భక్తి కుదరదు. అందువల్ల ఆచార్యులందరు విరక్తి మార్గంలో భక్తిని పెంచుకున్నారు.

అన్నమయ్య సన్యాసానికి వ్యతిరేకి. 'దురితంబులకు దొడవు మమకారము, అరిసి మమతలకు దొడవు అడియాసలు' అన్నాడు. 'ఇదివో సంసారమెంత సుఖమోగాని, తుదలేని దుఃఖమును తొడవుగడియించె' అందువల్ల పరమేశ్వరుని సేవించుటే శ్రేయస్కరమన్నాడు. ఇంద్రియాలు అతి చపలమైనవి. 'మనోహి హేతుః సర్వేషాం, ఇంద్రియాణాం ప్రవర్తనే' అన్నట్లు మనస్సును నిగ్రహిస్తేగాని ఇంద్రియములు మాట వినవు. సారవంతమైనది భగవదనుభవం. ప్రాపంచిక భ్రమ వీడితే మనసును అరికట్టుకొనవచ్చును. ఎంత చెప్పినా వినని మనసును చూచి ఇది కూడా దైవికమే అని నిర్ణయిస్తాడు. 'జీవమెంతటివాడు, చిత్తమెంతటిది, దైవికము గడువ ఎంతటివాడు తాను' అని నిశ్చయించి, మనోనిగ్రహం కూడా దైవాధీనమే అన్నాడు. 'స్వయంకృత్వా పరాం తారయేత్' అన్నట్లు తాను ఆచరించి, అనుభవానికి తెచ్చుకొన్న ఏ విజ్ఞానముందో దానినే ఇతరులకు ఉపదేశించి, అన్నమయ్య తరించును. ఆయన విజ్ఞానం వేంకటేశ్వరుని భక్తియే. ఆయన అభిప్రాయంలో జీవస్వరూపాన్ని, మోక్షస్వరూపాన్ని తెలుసుకోవడమే విజ్ఞానం. అన్నమయ్య శరణాగతియే వేదాంత రహస్యమని

అది తెలిసి ఆచరించుటకంటే విజ్ఞానం మరొకటి లేదని వివరించాడు.

అన్నమయ్య తన అనుభవాలను పారలౌకికమైన దృష్టితో లోక సహజమైన వస్తువ్యాపారములను సాదృశ్యసామ్యములతో గుర్తించి చెప్పును. 'ములిగి భారపు మోమపు మోసేటివాడు, అలసి దింపుకొననాడాడను అలరు సంసారికి నదియు లేదాయె తొలగని భారమెందును దింపలేదు'. ఇది ఎంతో లోకానుభవమున్నగాని చెప్పలేడు. అతని అనుభవానికి 'పత్తి లోపలి నూనెవంటిదీ జీవనం', 'చిక్కుపడ్డ పనికి చేసినదే చేత' అనే వాక్యాలు నిలువుటద్దాలు.

అన్నమాచార్యుల రచనలెన్నో కాలగర్భంలో కలిసిపోయాయి. వీరి రచనలు రాగి రేకులమీద వ్రాయించి, తిరుమల సంకీర్తనా భాండాగారంలో భద్రపరిచారు. అన్నమయ్య 32 వేల సంకీర్తనలు వ్రాస్తే, మనకు 12 వేలే దొరికాయి. 12 శతకాలు రచిస్తే 1 శతకమే దొరికింది. ఇక వారు వ్రాసిన ఇతర గ్రంథాలు అసలు లేవు. గేయాన్ని ఆదరించిన తెలుగువారు గాయకులను పంక్తి బాహ్యులన్నారు. పద్యానికి పట్టంకడుతూ, పదాన్ని నిరసించారు. పద్యకావ్యాలవలె పద రచనలు ఆదరణకు నోచుకోలేదు. వారి రాగిరేకుల సాహిత్యం 2635 వరకే ఉంది. అహోబిల, శ్రీరంగంలో తాళ్ళపాకవారి సాహిత్యం రాగిరేకులలో భద్రపరచి ఉన్నారు. వారి ఆధ్యాత్మిక సంకీర్తనలు 363 రేకులలో, శృంగార సంకీర్తనలు 1921 రేకులలో ఉన్నాయి. 1978లో టి.టి.డి. వారు అన్నమాచార్య ప్రాజెక్టు ప్రారంభించి, తాళ్ళపాకవారి కీర్తనలను ప్రచారం చేస్తున్నారు. 1998లో తాళ్ళపాకవారి సాహిత్యాన్ని 29 సంపుటాలలో టి.టి.డి.వారు ముద్రించారు.

ఇక తాళ్ళపాక కవులు చేసిన సాహిత్య సేవ మరువరానిది. అన్నమయ్య కుమారుడు పెద తిరుమలయ్య మనుమడు చిన తిరుమలయ్య మొదలైనవారు సంకీర్తనలు, ద్విపదలు, ఉదాహరణలు, దండకాలు, శతకాలు, వ్యాఖ్యానాలు మొదలైన రచనలు చేశారు. అన్నమయ్య భార్య తిమ్మక్క తొలి తెలుగు కవయిత్రి. వీరు వైష్ణవ దేవాలయాల్లో సంకీర్తనలు పాడే ఏర్పాటు చేశారు. ఎన్నో ఉత్సవాలు ప్రవేశపెట్టారు. ఎన్నో కైంకర్యాలు ప్రవేశపెట్టి మండపాలు నిర్మించారు. పుష్కరిణికి మెట్లు కట్టించారు. కళ్యాణోత్సవం ప్రవేశపెట్టారు. బ్రహ్మోత్సవాలు ఏర్పాటు చేశారు. తాళ్ళపాకవారి సేవలు సుమారు 60 శాసనాలు టి.టి.డి.లో శిలాక్షరాలుగా దర్శనమిస్తాయి.



తిరుమలయ్య పితృవాక్య పరిపాలనాదక్షుడై రోజుకొక కీర్తన ప్రకారం వేంకటేశ్వరునికి నివేదించాడు. తమకు అర్పించిన కానుకలను, అగ్రహారాలను సర్వం ఆ వేంకటేశ్వరునికి అర్పించారు. స్వామి పుష్కరిణికి జీర్ణోద్ధరణ చేశారు. విశిష్టాద్వైత తత్త్వం ప్రచారం చేశారు. సాంఘిక సమానత్వం కోసం జనహితాన్ని దృష్టిలో పెట్టుకొని కార్తీక వనభోజనాలు నిర్వహించారు.

పై విధంగా అన్నమయ్య, వారి కుటుంబం శ్రీ వేంకటేశ్వరుని పాదసేవయే జీవిత పరమార్థంగా భావించి తమ జీవితాలను ధన్యం చేసుకున్న పుణ్యాత్ములు.

**డా. ఎ. నరసింహ శాస్త్రి, నెల్లూరు.**



# జానపద సామెతలు

– జి. రాజా

జానపద గద్య సాహిత్యంలో "సామెతలు" ప్రముఖమైనవి. ఇవి పరిమాణంలో చాలా చిన్నవి. జానపద సాహిత్యంలో చాలా ప్రక్రియలకు ప్రత్యేకమైన సందర్భాలు ఉంటాయి. కానీ సామెత ఏ సందర్భంలోనైనా పుట్టవచ్చు. ఇద్దరు వ్యక్తుల మధ్య సంభాషణలలో, పెద్ద సమూహం, జనం మధ్యలో కూడా సామెత పుట్టవచ్చు. ఒక్కరు చెప్పిన మాట మీద విసురుగా కానీ లేదా దాని పైన వ్యాఖ్యగా కానీ, దాన్ని తిరస్కరించడానికి సామెత పుట్టవచ్చు. పై కారణాలను పరిశీలించినట్లైతే మిగతా ప్రక్రియల వ్యాప్తి కంటె సామెతల వ్యాప్తి చాలా విస్తృతంగా ఉంటుంది. ప్రతి వ్యక్తి నిత్య జీవితంలో సామెత విడదీయరాని భాగం అవుతుంది. దాదాపు ప్రతి వ్యక్తి తనకు తెలిసిన సామెతను ఏదో ఒక రోజున, ఏదైనా సందర్భంలో ప్రయోగించవలసిన అవసరం వస్తుంది. అందువల్ల సామెత ప్రతి వ్యక్తి జీవితాన్ని స్పృశిస్తూ జీవించే జానపద ప్రక్రియ.

సామెత అనే మాట "సామ్యతా" అనే సంస్కృత పదం నుండి వచ్చినది. సామెత అనే మాట అచ్చ తెలుగు మాట కావడానికి కూడా చాలా అవకాశాలు ఉన్నాయి. దీని అక్షరాల కూర్పునుబట్టి తెలుగు మాట అని చెప్పవచ్చు. దీనికి తెలుగులోనే సాటవ, శాస్త్రం, చాత్రం అనే పర్యాయ పదాలు వ్యవహారంలో ఉన్నాయి. జానపద సాహిత్య ప్రక్రియలను స్థిరపాఠ్య ప్రక్రియలు, అస్థిర పాఠ్య ప్రక్రియలు అని రెండు రకాలుగా విభజిస్తారు. సామెతలు స్థిరపాఠ్య ప్రక్రియలు. వాటిలో జానపద సాహిత్యానికి ఉన్న ప్రముఖ లక్షణం పాఠ్యం ఎప్పటికప్పుడు మారుతుంది. కానీ, సామెతలలో పాఠ్యం మారదు, ఎప్పుడూ స్థిరంగా ఉంటుంది. సామెత రూపం మారదు. సామెత మారకుండా ఉంటేనే సామెతకు "ప్రకార్యపు" విలువ ఉంటుంది. సామెత వ్యక్తి నుండి వ్యక్తికి పాఠ్యాన్ని మార్చుకుంటే దానికి ఉద్దేశించిన అర్థాన్ని ఇవ్వదు. అందుకే సామెత స్థిరపాఠ్య ప్రక్రియ.

సామెతల మీద ప్రపంచ వ్యాప్తంగా విస్తృతంగా పరిశోధన జరిగింది. ముఖ్యంగా "ఫిన్లాండ్" దేశంలో జరిగిన పరిశోధన ప్రాచీనమైనదిగా భావించవచ్చు. అక్కడ 1702వ సంవత్సరంలోనే సామెతలను సేకరించి ఒక సంకలన గ్రంథంగా అచ్చువేశారు. అంతర్జాతీయంగా చాలా విలువైన పరిశోధనలు జరిగాయి. సామెతలపై జరిగే పరిశోధనలను ప్రత్యేక శాస్త్రంగా చెబుతారు. దీన్ని "పెరెమ్యాలజీ" అని అంటారు.

భారతీయ భాషలలోనూ విశేషించి తెలుగులోనూ సామెతలకు సంబంధించిన సామెతల సేకరణ పరిశోధన మంచి స్థాయిలోనూ జరిగింది. ఆంగ్ల ఉద్యోగి అయిన ఎం.డబ్ల్యు. కార్ మొదటగా సామెతలను సేకరించినట్లు మనకు తెలుస్తూ ఉంది. శ్రీ పువ్వాడ శేషగిరిరావు గారు 1969వ సంవత్సరంలో సామెతలను సేకరించి గ్రంథంగా వెలయించారు. అటు తర్వాత చాలా మంది సామెతల సంకలనాలు తెచ్చారు. వీటిలో ప్రధానంగా చెప్పదగినది ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి వారు సేకరించి ప్రచురించిన "తెలుగు సామెతలు" అనే గ్రంథం. ఇందులో మూడు ప్రాంతాల నుండి (రాయలసీమ, తెలంగాణా మరియు కోస్తా) ముగ్గురు విద్వాంసులు ఉన్నారు. వారిలో డా॥ దివాకర్ల వేంకటావధాని, డా॥ మరువూరు కోదండ రామిరెడ్డి, డా॥ యశోదారెడ్డి గార్లు ఈ సామెతలను సేకరించారు. దాదాపు పదివేలకు పైగా సామెతలు

ఉన్నాయి. అలనాటి ప్రముఖ జానపద విజ్ఞాని శ్రీ నేదునూరి గంగాధరంగారు కూడ చాలా సామెతలు సేకరించారు. ఆయన సేకరణలో దాదాపు ఆరువేలకు పైగా సామెతలు ఉన్నాయి. విశ్వవిద్యాలయాల స్థాయిలో కూడా పరిశోధనలు జరిగాయి. డా॥ బి. దామోదరరావుగారు "తెలుగు సామెతలు జానపద సంస్కృతి" అనే గ్రంథాన్ని గ్రహించి పి.హెచ్‌డి. పట్టా కోసం పరిశోధన గ్రంథాన్ని వెలయించారు. ఎం.ఫిల్. డిగ్రీల కోసం సామెతల మీద చాలామంది విశ్వవిద్యాలయాలలో పరిశోధన చేసినట్లు తెలుస్తుంది.

సామెతలు ఎప్పుడు పుట్టాయి అంటే చెప్పలేము. భాషలో అభివ్యక్తి సామెత కాబట్టి. భాష వికాస దశ నుండి నన్నయ భారతంతో మౌఖిక సాంప్రదాయంలో సామెత ఉన్నది అని చెప్పడానికి వీలు ఉంది. లిఖిత సాంప్రదాయంలోనికి కూడా సామెతలు ప్రవేశించాయి. పాతకాలం నుండి లభ్యమవుతున్న కావ్యాల నుండి ఇప్పటి నవలలు, కథల వరకు ఉన్న చాలా సాహిత్య ప్రక్రియలు సామెతలను కలుపుకొన్నాయి. కావ్యాలలో ఉన్న సామెతల ఉటంకింపులు వాటి ప్రాచీనతను తెలియజేస్తాయి. సామెతలు జానపదగీతాలలోకి కూడా చేరి ఉండడం మనకు ప్రస్తుతం లభ్యమవుతున్న రచనల ద్వారా తెలుస్తున్నది.

సామెతలలో నిర్దుష్టమైన నిర్మాణం ఉంటుంది. అంతర్జాతీయంగా సామెతల నిర్మాణం గురించి మంచి పరిశోధనలు జరిగాయి. "నిట్ ఆఫ్ వన్ అన్డ్ విస్డం ఆఫ్ మెనీ" అనే గ్రంథం సామెతల గురించి అచ్చు అయిన మంచి పరిశోధన గ్రంథం. ప్రఖ్యాత జానపద విజ్ఞాని అయిన "అలన్ డండెస్" కూడా సామెతలను గురించి చాలా విలువైన పరిశోధన చేశారు. ఈయన సామెతల నుండి మనోవిశ్లేషణ చేశారు.

అల్పాక్షరాలలో అనల్పార్థ రచన అన్నమాటకు సరిగ్గా సరిపోతాయి సామెతలు. గూఢంగా కుదుర్చుకొని వివరణ కోరేదే సామెత. మొత్తం సాహిత్య ప్రక్రియలలోనే అతి చిన్న పరిమాణంలో ఉండే సాహిత్య ప్రక్రియ సామెత. ద్విపద కన్నా చిన్న పరిమాణం ఉన్న ప్రక్రియ ఇది. ఒక వాక్యంలోనే పూర్తయ్యే వీలున్న అతిచిన్న ప్రక్రియ సామెత. ఒక్కోసారి రెండు వాక్యాలు కూడా ఉండవచ్చు. సామెతలలో ఉండే అలంకారాలలో ఎక్కువగా ఉండేది ఉపమాలంకారం. సామెత అనే పదం సామ్యత నుండి పుట్టింది అనడానికి ఇదే ప్రబలమైన ఆధారం.

తెలుగు సామెతలలో నిర్మాణం పరిశీలించినట్లైతే సామెత రెండు భాగాలుగా నిర్మాణమై వుండి యతిమైత్రి ఉంటుంది.

**మచ్చుకు కొన్ని:**

1. కోతికి కొబ్బరికాయ దొరికినట్లు, 2. అందితే జుట్టు అందకపోతే కాళ్ళు.

1. ఇందులో 'కోతికి' అంటే అల్లరివాడని, మిడిమిడి జ్ఞానం కలవాడని, అసమర్థుడని స్ఫురిస్తుంది. 'కొబ్బరికాయ' అనగా ఒక ఉన్నతమైన స్థానం కావచ్చు లేక ఒక వస్తువు కావచ్చు పై విషయంలో నిగూఢంగా తెలిపేది ఏమిటంటే అసమర్థుడు లేక అనర్హుడు అయిన వాడికి ఏదేని ఉన్నతస్థానం లభించినచో సదరు వ్యక్తి చేసేటివంటి కార్యాలను గురించి ఈ సామెత ద్వారా వ్యంగ్యంగా చెప్పవచ్చు లేదా తమ తమ అభిప్రాయాలను చెప్పవచ్చు.

2. ఇకపోతే రెండవ సామెతకు వివరణ అవకాశవాదం అని చెప్పవచ్చు. ఇలాంటి దృక్పథం కల సమూహం చాలా మందికి స్నేహితులుగానూ, బంధువులుగాను తారస పడతారు. కాబట్టి జాగ్రత్త సుమా! అని తెలియజేస్తుంది.

**సామెత నిర్మాణంలో ప్రాసయతి కూడా ఉంటుంది.**

**మచ్చుకు కొన్ని:**

1. అత్తమీద కోపం దుత్త మీద చూపినట్లు, 2. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక పోయినట్లు.

ఇందులో మొదటి సామెత చాలా ప్రాచుర్యం గలది. ఇది అత్త–కోడళ్ళ మధ్య జరిగే చిన్నపాటి వాగ్యుద్ధం కావచ్చు లేదా పరోక్ష కోపతాపాల వల్ల కావచ్చు. రెండవ సామెత ప్రస్తుతం ప్రభుత్వేతర లేదా ప్రభుత్వ దవాఖానా (ఆసుపత్రి)లలో జరిగే చికిత్సలను ఉటంకిస్తూ మరియు అనేక సందర్భాలలో ఇలాంటి వ్యంగ్యాస్త్ర సామెతలను చూడవచ్చు.

సామెతల నిర్మాణం అంత్యప్రాసలతో కూడా ఉంటుంది.

**మచ్చుకు కొన్ని:**

1. పరులసొమ్ము పాపిష్టిసొమ్ము, 2. అయిన వాడికి ఆకుల్లో కాని వాడికి కంచాల్లో, 3. బుద్ధులు భూములేలతాయి రాతలు గాడిదల్ని కాస్తాయి.

ఇతరుల సొమ్ము పాపిష్టి సొమ్ము అంటూ మొదటి సామెత సమూహానికి మంచి బుద్ధులను తెలియజేస్తుంది. రెండవది వ్యక్తిగతంగా కొందరు వ్యక్తులు ఎలా ఉంటారో, ఇలా ప్రవర్తిస్తారో తెలియజేసే సామెత. ఇక మూడవది రెండవ సామెతకు కొనసాగింపుగా లేక అనుబంధమైనదిగా చెప్పవచ్చు. బుద్ధులు భూములేలుతాయి అంటే వ్యక్తి యొక్క జ్ఞానాన్ని పరిశీలించినట్లైతే అతను ఎంతో ఉత్తముడు, జ్ఞాని మరియు ఉత్తమ స్థానాలలో ఉండాల్సినవారు అని స్ఫురిస్తుంది. రాతలు గాడిదలేలతాయి. అనగా అతని నుదుటి రాత సరిగా లేకపోవడం లేదా వ్యక్తి యొక్క ప్రస్తుత దీన పరిస్థితిని తెలుపుతుంది.

మనం క్షేత్రస్థాయిలోకి వెళ్ళి పరిశోధన చేసినట్లైతే ఇంకా చాలా రకాల సామెతల నిర్మాణాలను తెలుసుకోవచ్చు. ముందు తెలిపిన సామెతల నిర్మాణాలు విస్తృతంగా ఉంటాయి. అంతేకాదు సామెతలలో సమతూకంగా ఉండే రెండు భాగాలు ఉండడం చాలా ప్రముఖమైన నిర్మాణాలను తెలుపుతాయి.

సామెతల ప్రకార్యాలు అంటే చాలా రకాలుగా ఉండవచ్చు. దీనికి కారణం సామెతలు బాగా ప్రతిబింబిస్తాయి. జానపద సంస్కృతిని కూడా ప్రతిబింబింపజేస్తాయి. ఈ సామెతలలో చాలా వరకు ప్రకార్యం ఒకవ్యక్తి చేసిన పనిని విమర్శించడం లేక తిరస్కరించడం వంటివి ఉంటాయి. అలాగే నీతిని కూడా చెప్పడం జరుగుతుంది. ఇంకను సదరు వ్యక్తికి సూక్తి వలె గుర్తుచేయడం.

**మచ్చుకు కొన్ని:**

1. కూసే గాడిద వచ్చి మేసేగాడిదను చెడగొట్టినట్టు, 2. తాచెడ్డ కోతి వనమెల్లా చెరిచినట్టు, 3. కుక్కతోక పట్టుకొని గోదారి ఈదినట్టు.

మొదటి మరియు రెండవ సామెతలు సూక్తిని చాలా స్పష్టంగా తెలియజేస్తుంది. అవతలి వ్యక్తి చేసిన పని తప్పు అని, అలా చేయకూడదని మరియు ఆ పని వలన మరికొందరు చేసే పనికి ఆటంకం కలిగిస్తూ ఉంటుందని చాలా ఘాటుగా విషయాన్ని తెలియచెప్తుంది. ఇవి ఎంత ఘాటుగా ఉంటాయంటే తనను పశువులతో పోల్చినందుకు అవతలి వ్యక్తి వ్యాఖ్యానించిన వారిని కొట్టడానికి కూడా రావచ్చు. మూడవ సామెత చేసే పని ఎందుకూ పనికిరాదన్నట్టుగా వ్యాఖ్యానించడం.

**నీతిమాటలు చెప్పే సామెతలు మచ్చుకు కొన్ని:**

1. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది, 2. నలుగురితో నారాయణ కులంతో గోవింద, 3. మంచమున్నంతే కాళ్ళు చావుకోవాలి.

పైన తెలిపిన సామెతలలో ఒకటవది చాలా మందికి బాగా తెలిసినదే. ఎదుట వ్యక్తులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, మర్యాదపూర్వకంగా ఉండాలని తెలియజేస్తుంది. రెండవది అందరూ నడచిన మంచి దారిలోనే నడవమని, సాంప్రదాయాలను పాటించాలనే సంఘ సూక్తిని తెలియజేస్తుంది. మూడవ సామెత ఆడంబరాలకు పోకుండా తనకున్నంత ఆర్థిక మరియు వ్యవహారిక హద్దులలోనే ఉండాలని తెలియజేస్తుంది.

ఇకపోతే జానపద సాహిత్య విజ్ఞానం అంటే అదేదో పాతకాలపు విషయాలగూర్చి తెలుసుకోవడం మనకెందుకని చాలావరకు మందికి ఇష్టం ఉండదు. కానీ జానపద సాహిత్యం విజ్ఞానంలో అనేక విషయాలు భవిష్యత్తరాలు ఎలా ఉండాలో ఇక్కడ నిగూఢంగా తెలియజేస్తుంది.

జి. రాజా ఎం.ఏ.,
కుప్పం, ఫోన్ : 949 027 0471.



# అచ్చ తెలుగు రచనలు

– జె. రాయమల్లు

'అచ్చ తెలుగు' ఒక విశిష్టమైన ప్రక్రియ. సాహిత్యంలో రచయితలు అనేక రకాల ప్రయోగాలు చేస్తారు. ఈ ప్రయోగ వైవిధ్యం వల్లనే అనేక ప్రక్రియలూ, ఆ ప్రక్రియల్లో శాఖలూ బయల్దేరాయి. ఈ ప్రక్రియల పుట్టుక కేవలం ఏదో ఒక కొత్త ప్రయోగం చెయ్యాలనే రచయిత కుతూహలంవల్ల మాత్రమే జరుగుతుందా? లేదా మరే ఇతర సమకాలీన కారణాలేమైనా ఉంటాయా? అన్న ప్రశ్నకు బదులుగా అచ్చ తెలుగు కావ్య రచనకు ఆద్యుడైన పొన్నెగంటి తెలగన ప్రయోగ వైచిత్రినే తప్ప మరే ఇతర కారణాన్ని చెప్పుకోలేదు.

ప్రాచీన కాలంలో సంస్కృత పద ప్రయోగం లేకుండా తెలుగులో రచన చేయడం ఒక చమత్కారం మాత్రమే అయితే ఆధునిక కాలంలో మాత్రం కొంత సొంత భాషాభిమానం ఇలాంటి రచనలకు తోడయ్యింది. ఎలాంటి భావాలనైనా అచ్చ తెలుగులో చెప్పవచ్చని నిరూపించడానికీ, అలాంటి తెలుగు చాలా మధురమైందనీ తెలియజేయడానికీ కవులు అచ్చ తెలుగు కావ్యాలు రాశారు. కవులు పద్యకావ్య రచనకేగాక తక్కిక ప్రక్రియలకూ 'అచ్చతెలుగు' యోగ్యమైందేనని నిరూపించే ప్రయత్నం చేశారు.

**అచ్చ తెలుగు స్వరూప స్వభావాలు:**

'అచ్చ తెలుగు'ను గురించి పలువురు కవులు పల రకాలుగా అభిప్రాయపడ్డారు. నన్నయ, తిక్కనాదులు *తెనుంగునన్ మహా భారత సంహితా రచన; ఆంధ్రావళి మోదముం బొరయునట్లుగ;* రచన సాగిస్తామని చెప్పారేగానీ, తెలుగు భాషను గురించి ఏమీ చెప్పలేదు. నన్నెచోడుడు, పాల్కురికి సోమనలు తమ కావ్యాల్లో వాడిన భాషను 'జాను తెలుగు' 'దేశి' అని పేర్కొన్నారు.

అయితే 'అచ్చ తెలుగు' అనే మాట పాల్కురికి సోమన కాలంనాటికి వాడుకలో లేదు. మూల ఘటిక కేతన 'అచ్చ తెలుగు' అనే పదాన్ని సృష్టించాడు. కేతన తన 'ఆంధ్ర భాషా భూషణం'లో తెలుగు భాష పదాలను తత్సమం, తద్భవం, అచ్చ తెలుగు, దేశ్యం, గ్రామ్యం అని అయిదు భాగాలుగా వర్గీకరించాడు. అచ్చ తెలుగుకు తల, నెల, వేసవి, గుడి, మడి, పులి, చలి మొదలైన పదాలను ఉదాహరించి ఎల్లవారికి తెలిసే ఈ పలుకులు అచ్చ తెలుగన్నాడు. ఈ అచ్చ తెనుగునే పెద్దన "సహజాంధ్ర దేశభవం" అన్నాడు.

పై ప్రయోగాలన్నీ పరిశీలించిన మీదట 'జాను తెనుగు', 'దేశి', 'అచ్చ తెనుగు' అనే మాటలు కొంత అస్పష్టంగా ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపుగా తెలుగు వ్యాకరణాలన్నీ దేశ్యాన్నే 'అచ్చ తెనుగు' అనీ ఆ రెండింటికి భేదం లేదనే భావించాయి. తన కాలంనాటికి ఉన్న తెలుగు సాహిత్యాన్నంతటిని పరిశీలించిన పరవస్తు చిన్నయసూరి తన 'బాలవ్యాకరణం'లో 'తెలుగునకు వర్ణములు ముప్పదియా' అని అచ్చ తెలుగు కావ్యాల్లోని భాషా వర్ణాలనే చూపించాడు. చిన్నయ సూరి చెప్పిన సూత్రానికి అనుగుణంగానే అచ్చ తెలుగు కావ్యాల్లో వాడిన భాష కన్పిస్తుంది. పంతొమ్మిదవ శతాబ్దానికి తత్సమాలు, గ్రామ్యాలు తప్ప మిగిలిన పదజాలమంతా 'అచ్చ తెలుగు'గా లాక్షణికులు గుర్తించారు. ఆదిభట్ల నారాయణదాసు 'అచ్చ తెలుగు' దేశ్యం అనే అర్థంలో 'నాటు తెలుగు' అని వ్యవహరించాడు.

అచ్చ తెలుగంటే సంస్కృత సమాలుకాని తక్కిన పదజాలమంతా, అంటే ప్రాకృత సమ, సంస్కృత భవ, ప్రాకృత భవ, దేశ్య పదజాలంతో కూడిన భాషను 'అచ్చ తెలుగు' లేక 'ఆచ్ఛిక భాష' అంటారు. అయితే తెలుగు కావ్య రచనలో ఇతివృత్తమంతా సంస్కృత సాహిత్యం

నుంచే వచ్చింది కాబట్టి పాత్రల పేరు, బిరుదులు సంస్కృతంలోనే ఉండటం, వాటిని మార్చి కృతకమైన పదబంధాలను కల్పించడంవల్ల ఇంపుగా లేకపోవడం, అర్థానికి ఆటంకం కలగడం మొదలైన కారణాలవల్ల సంస్కృత శబ్దాలను అంగీకరించడం జరగింది. తొలి అచ్చ తెలుగు కావ్య కర్త పొన్నెగంటి తెలగన తన 'యయాతి చరిత్ర' పీఠికలో,

*"తెనుఁగునను మాఱుపేళ్ళిడి*
*పెనఁచిన వినఁగూడదనుచు బిరుదులుఁబేళ్ళన్*
*మును వేల్పు బాస వెంబడి*
*నునిచెదఁ గాదనకుడయ్య యుల్లములందున్"*

*(యయాతి చరిత్ర, ప్రథమాశ్వాసం, 14వ పద్యం)*

–అని ఈ విషయాన్నే తెలియజేశాడు. దాదాపుగా అచ్చ తెలుగు కావ్యకర్తలందరూ ఈ విషయంలో తెలగననే అనుసరించారు. అచ్చ తెలుగు రచనా నియమం కథా భాగంలోనేగాక, షష్ఠ్యంతాలలో కూడా కొంతమంది కవులు పాటించారు. అచ్చ తెలుగులో అతివాదులు నామాలకు మారుపేర్లు కల్పించుకున్నారు. కానీ అది అంత సముచితంగా అనిపించదు. ఎందుకంటే 'సీత' అనడానికి 'పంట చెలి పట్టి' అని ఒక కవి అన్నాడు. అనగా పంటలకు చెలి భూదేవి, భూదేవి బిడ్డ సీతాదేవి అని, కానీ ఇలాంటి వాటిని తెనిగించడంవల్ల సరైన అర్థం పొసగదు.

అచ్చ తెలుగు రచన అనేది చాలా క్లిష్టమైనది, అలాంటి రచనకు పూనుకోవడమనేది ఒక అద్భుతకార్యం. మరి అలాంటి పద్య రచనతో కావ్యం ఆమూలాగ్రం నిర్వహించడం కత్తిమీద సాములాంటిది. ఈ విషయాన్నే పొన్నెగంటి తెలగనార్యుడు ఈ కింది విధంగా చెప్పాడు.

*"అచ్చ తెనుంగు బద్దెమొకటైనను గబ్బములోన నుండినన్*
*హెచ్చుని యాడుచుందురది యెన్నుచు నేర్పునఁ బొత్తమెల్లని*
*ట్లచ్చ తెనుంగు నన్నుడువ నందుల చంద మెరంగు వారునిన్*
*మెచ్చరో యబ్బురంబనరొ మేలనరో కొనియాడరో నినున్"*

***(యయాతి చరిత్ర, ప్రథమాశ్వాసం, 12వ పద్యం)***

ఈ విధంగా సంస్కృత తత్సమశబ్ద నిషేధంగా ఒక నియమబద్ధమై ఉండటాన్నిబట్టి 'అబ్బురంబనరొ' అని పొన్నెగంటి తెలగన అన్నట్లు అచ్చ తెలుగు రచన ఆశ్చర్య హేతువవటంవల్ల అచ్చ తెలుగు 'చిత్ర కవితా' భేదంగా భావించబడుతోంది. తెలుగు కవులు తమ ప్రతిభా పాండిత్యాన్ని ప్రదర్శించడానికైతేనేమీ, కవిత్వంలో కొత్తదనాన్ని తీసుకురావడానికైతేనే మీ మొత్తంమీద కవులచే అచ్చ తెలుగు రచనకు అంకురార్పణ జరిగింది. అంతేకాకుండా తెలుగు కవులు అచ్చ తెలుగు కావ్యాలు రాయలేరనే సంస్కృత కవుల ఆక్షేపణ కూడా అవి ఉద్భవించడానికి కారణమైంది. 'అచ్చ తెలుగు' రచనే చిత్రమైతే అందులోనూ చాలా రకాల చిత్ర కవితా రీతులు ప్రదర్శించబడ్డాయి.

**తెలుగు – తెనుగు:**

తెలుగు భాషకు ఆంధ్రము, తెనుఁగు, తెలుఁగు అను మూడు వ్యవహారాలున్నాయి. అవే జాతి వాచాకాలుగా కూడా ఉన్నాయి. ఏ భాషకైనా రెండు పేర్లుండటం సహజంకాదు కాని మన తెలుగు భాషకు రెండు కాదు మూడు పేర్లున్నాయి. లాక్షిణికులు తెనుగు 'త్రినగ' శబ్ద భవమనీ, తెలుగు 'త్రిలింగ' శబ్ద భవమని చెప్పుతున్నారు. అయితే ఆంధ్రుల ప్రసక్తి మొట్టమొదట రుగ్వేదానికి చెందిన ఐతరేయ బ్రాహ్మణంలో, మొదటి పదంగా చెప్పబడుతున్న 'నాగబు' అమరావతీ స్థూప పలకంలో కనిపిస్తుంది.

క్రీస్తు శకారంభం నుండి పదవ శతాబ్ది వరకు 'తెలుగు' జనవ్యవహారంలో మాత్రమే ఉండేది. అది ఇంకా సాహిత్య స్థితికి ఎదుగలేదు. కానీ సంస్కృత, ప్రాకృతాలు రాజాస్థానాల్లో ఆదరింపబడుతుండేవి. అప్పటికి ఇంకా తెలుగుకు ఆ గౌరవం దక్కలేదు. రాజరాజనరేంద్రుని ప్రోత్సాహంతో మొదటగా నన్నయ "తెనుంగునన్ మహాభారత సంహితా రచన బంధురుడయ్యాడు". తెలుగుకు మొదటిసారిగా సాహిత్య స్థితి కలిగిన ఈ దశ తొలిదశ. రెండు శతాబ్దాల తర్వాత నన్నెచోడాది శివ కవులు తెలుగును 'జాను తెనుగు'గా కూర్చడానికి ప్రయత్నించారు. సంస్కృత పదజాలాన్ని తగ్గించారు. తెలుగు వికాస పరిణామంలో ఇది రెండవ దశ. ఇక పదహారవ శతాబ్దంలో పొన్నెగంటి తెలగనాదులు తమ భాష స్వరూపాన్ని నిరూపించుకోదలచి, తత్సమాన్ని వెలివేసి కేవలం దేశ్య పదజాలంతోనే కావ్యాలు రాశారు. తెలుగు భాషాభివృద్ధిలో ఇది మూడవ దశ. ఇవే

దశలు సాహిత్యంలో ఉత్తమ, మధ్యమ, అధమ దశలుగా పరిగణించబడ్డాయి. ఈ 'అచ్చ తెలుగు' ప్రక్రియ అధమ దశ కావ్య ప్రక్రియగా భావించబడింది.

**తొలి అచ్చ తెలుగు కావ్యమేది?**

అచ్చ తెలుగు ప్రక్రియలో మొట్టమొదటి కావ్యం పొన్నెగంటి తెలగన రాసిన "యయాతి చరిత్ర" అని కవుల జీవిత చరిత్రలు రాసిన చరిత్రకారులన్నారు. అలాగే సాహిత్య లోకంలో కూడా ఈ కావ్యమే తొలి అచ్చ తెలుగు కావ్యమని వాడుకలో ఉంది. అంతేకాకుండా తెలగన తర్వాత అచ్చ తెలుగు కావ్యకర్తలు కూడా తమ కావ్యాల్లో తెలగనే తొలి అచ్చ తెలుగు కావ్యకర్త అన్నారు. ఇలా తెలగనను అచ్చ తెలుగు కవులు ప్రస్తుతించటంవల్లనూ, కందుకూరి వీరేశలింగం మొదలు, కవి జీవిత చరిత్రకారులు తెలగన్నే అచ్చ తెలుగు రచనకు ఆద్యుడని చెప్పడంవల్ల 'యయాతి చరిత్రమే' అచ్చ తెలుగు కావ్యాల్లో మొదటిదని తెలుస్తోంది.

*"అచ్చ తెనుఁగు బద్దె మొకటైనను గబ్బము లోనుండినన్"* అనే పద్యంవల్ల అక్కడక్కడ ఒకటో రెండో అచ్చ తెలుగు పద్యాలు కావ్యాల్లో ఉండేవి కాని కావ్యం మొత్తం అచ్చ తెలుగులో తెలగనకు పూర్వం ఉండేది కాదని తెలుస్తోంది.

*"మున్నెవ్వరు నొడువని యీ / తెన్నిడి కదుమీ యచ్చ తెనుఁగుం గబ్బం / బెన్నిక మీగఁ జెప్పిన / నిన్నుం బొగడంగఁ గలఁడె నెలతాల్పియినన్"*

*(యయాతి చరిత్ర, ప్రథమాశ్వాసం, 11వ పద్యం)*

– అని తెలగన అన్నాడు. అంటే అచ్చ తెలుగు ప్రక్రియలో పొన్నెగంటి తెలగనదే మొదటి కావ్యం అని స్పష్టమవుతుంది. "యయాతి చరిత్ర"ను రాసిన పొన్నెగంటి తెలగన క్రీ.శ. 1550 నుండి 1600 మధ్యకాలంలో జీవించాడని కె.వి. సుందరాచార్యులు రాసిన "అచ్చ తెలుగు కృతులు – పరిశీలనం" అనే గ్రంథంవల్ల తెలుస్తోంది. తెలగన గోల్కొండ పాలకుడైన ఇబ్రహీం కుతుబ్ షా పాలనలో ఉన్నాడు. మీర్ జూమ్లా అమీన్ ఖాన్ అనే సర్దార్ ప్రోత్సాహంతో 'యయాతి చరిత్ర'ను రాశాడు. ఈ గ్రంథాన్ని 1574 నుండి 1581 మధ్యకాలంలో రాసినట్లు స్పష్టమవుతున్నది. ఈ గ్రంథం ఆశ్వాసాంత గద్యంలో తను 'శ్రీ మదన గోపాల మంత్ర ప్రసాద లబ్ధ సారస్వతుడ'నని, 'సుకవి జనవర్ణనీయవచో విభుడ'నని, 'భావనామాత్య తనూభవుడనని', పొన్నెగంటి వంశ్యుడ'నని 'తెలగ నార్యుడ'నని తెలుపుకొన్నాడు. తెలగన ఈ 'యయాతి చరిత్రము'ను అమీన్‌ఖాన్‌కి అంకితం చేశాడు. ఈయన నివాసం మెదక్ జిల్లాలోని ప్రస్తుతం 'పటాన్ చెరువు' అని పిలవబడుతున్న 'పొట్ల చెరువు'.

ఇక అచ్చ తెలుగులో వెలువడిన కావ్యాలను పరిశీలించే ప్రయత్నం చేద్దాం. ఈ అచ్చ తెలుగు అనేది ఒక విశిష్టమైన ప్రక్రియ. నిజానికి సహజమైన భాషా ప్రవాహం.

**శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతా కల్యాణము:**

ఈ కావ్య కర్త మరింగటి సింగరాచార్యులు. ఈయన 16వ శతాబ్ది ఉత్తరార్థానికి చెందినవాడు. ఈయన తెలుగులో నిరోష్ఠ్య రచనకు, చతురర్థక రచనకు ఆద్యుడు. ఈ గ్రంథం మూడాశ్వాల కావ్యం. కవి కథా భాగాన్నే నిరోష్ఠ్య, శుద్ధాంధ్ర, నియమాలతో రాశాడు. సింగరాచార్యులు ఈ గ్రంథాన్ని కర్పూరాద్రి నృసింహ స్వామికి అంకితమిచ్చాడు.

**అచ్చ తెలుగు రామాయణము:**

కవిసార్వభౌమ కూచిమంచి తిమ్మకవి ఈ కావ్యకర్త. ఈయన క్రీ.శ. 1690 ప్రాంతంవాడు. ఈ కావ్యంలో అష్టాదశ వర్ణనలు, కావ్యేతిహాస లక్షణాలు సంపూర్ణంగా ఉన్నాయి. ఈ గ్రంథం శ్రీరామ పట్టాభిషేకంతో సుఖాంతమై ముగుస్తుంది. తిమ్మకవి 'రామాయణం' అచ్చ తెలుగు ప్రక్రియలో అద్వితీయం.

**శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన కుశ చరిత్రం:**

మచ్చ వెంకట కవి ఈ కావ్యకర్త. ఈయన కాలం క్రీ.శ. 1856 నుండి 1903 వరకు. దీన్ని సింహాచల నృసింహస్వామికి అంకితం చేశాడు. సర్పరాజైన తక్షకుని కుమార్తె కుముద్వతిని కుశుడు వివాహమాడుట ఇందులోని ఇతివృత్తం.

ఇంకా శుద్ధాంధ్ర నిర్వచన శతకంఠ రామాయణము, శుద్ధాంధ్ర రామాయణ సంగ్రహము, అచ్చాంధ్ర నిరోష్ఠ్య నిర్గద్య దాశరథి చరిత్రము, రామకథలాంటి మొదలైన

రామాయణ కథాత్మక పద్యకావ్యాలు అచ్చ తెలుగులో వచ్చాయి.

**చిలువ పడిగె రాని చెరితము:**

ఈ కావ్య రచయిత మరింగంటి వేంకట నృసింహాచార్యులు. ఈయన క్రీ.శ. 1770 ప్రాంతంవాడు. 'శుభాంగి' అనే నాయికా స్వయంవరం ఇందులోని ఇతివృత్తం. ఇది మూడాశ్వాసాల కావ్యం. చక్కని కవితాధార ఉన్న కావ్యమిది. నరసింహస్వామి కలలో కన్పించి అచ్చ తెలుగు రచన గొప్పదని చెప్పడం వల్ల ఈ కావ్య రచనకు పూనుకున్నట్లు తెలుస్తోంది.

**కవ్వడి కైవారం:**

అచ్చ తెలుగు 'కిరాతార్జునీయం' అను నామాంతరం గల 'కవ్వడి కైవారం' గ్రంథాన్ని తిరుమామిడి రామస్వామి రాశాడు. ఈయన క్రీ.శ. 19వ శతాబ్దికి చెందిన వాడు.

**అచ్చ తెలుగు అభిజ్ఞాన శాకుంతలం:**

ఈ కావ్యాన్ని దాసు శ్రీరామకవి 1901లో రాశాడు. ఈయనే 'చక్కట్లదండ' అనే అచ్చ తెలుగు నీతి శతకం కూడా రాశాడు.

**శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధము:**

కందుకూరి వీరేశలింగం పంతులు 1870లో చదువుకునే రోజుల్లోనే ఈ కావ్యాన్ని రాశాడు. ఇది మూడాశ్వాసాల గ్రంథం. ఈయన రాసిన మరో కావ్యం 'రసికజనమనోరంజనం'. ఇది నాలుగాశ్వాల ప్రబంధం. ఈ అచ్చ తెలుగు ప్రబంధాన్ని విష్ణువుకు అంకితమిచ్చాడు. అంతేకాకుండా 1872లో రాసిన 'శుద్ధాంధ్రోత్తర రామాయణం' 1879లో రాసిన 'శుద్ధాంధ్ర భారత సంగ్రహం' కూడా ఈయన రాసిన అచ్చ తెలుగు కృతులు.

**అచ్చ తెలుగు భాగవతం:**

ఈ గ్రంథ కర్త అల్లమరాజు రామకృష్ణ కవి. ఈయన 19వ శతాబ్దికి చెందినవాడు. ప్రస్తుతం ఈ కావ్యం అలభ్యం.

**కాళిదాస రుతు సంహారం:**

ఆకుండి వెంకటశాస్త్రి పుత్రుడు వ్యాసమూర్తిశాస్త్రి ఈ కావ్యాన్ని రాశాడు. ఇది ఆరాశ్వాసాల శుద్ధాంధ్ర కావ్యం. దీన్ని 1897లో రాశాడు.

**సత్య విజయం:**

అయ్యనకోట పార్థసారథిశెట్టి రాసిన ఈ కావ్యం 'హరిశ్చంద్రోపాఖ్యానం' చివరికి సత్యమే జయిస్తుంది కాబట్టి 'సత్య విజయం' అని రూఢి అయ్యింది. దీని రచనా కాలం 1896 సంవత్సరం.

**అచ్చ తెలుగు పలుకుబడి:**

అచ్చ తెలుగు పలుకుబడిని గురించి అదిభట్ల నారాయణదాసు వర్ణనాత్మకంగా నూటపద్నాలుగు ద్విపదల్లో రాసిన లఘు కావ్యం ఇది. అచ్చ తెలుగు స్వరూప స్వభావాలు ఇందులో వర్ణించబడ్డాయి. ఈయన ఈ గ్రంథంతోపాటూ గౌరమ్మపెండ్లి, తల్లివినికి, నూరుగంటె, సీమపలుకువహి మొదలైన పన్నెండు అచ్చ తెలుగు కావ్యాలు రాశాడు.

**శుద్ధాంధ్ర మేఘ సందేశం:**

అడవి సాంబశివరాజు పంతులు, కాళిదాసు మేఘసందేశానికి రాసిన అచ్చ తెలుగు అనువాద కృతి ఇది. తన రచనను భగవంతునికి అంకితమిస్తూ ఆధ్యాత్మిక దృక్పథాన్ని చాటుకున్నాడు.

**అనందోదయం:**

కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి దీనికర్త. ఇది మూడాశ్వాసాల కావ్యం. దీన్ని 1902లో రాశాడు. ఈయనే "శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిరూష్మ నిర్వచన నైకాదశాక్షరి శాకుంతలం" అనే మరో అచ్చ తెలుగు కృతిని రాశాడు.

**కళావతి పరిణయం:**

జయంతి భావనారాయణ, 'షేక్స్పియర్' రాసిన 'సింబలిన్' నాటక కథనుసరించి రాసిన అచ్చ తెలుగు పద్యకావ్యమిది. ఇది నాలుగాశ్వాసాల కావ్యం. దీన్ని సుమారు 1900ల సంవత్సరంలో రాసినట్లు తెలుస్తోంది.

**అచ్చాంధ్ర నిర్గద్య నిరోష్ఠ్య సారంగధర చరిత్రం:**

దేవులపల్లి నృసింహశాస్త్రి రచన ఇది. చేమకూర వేంకటకవి రాసిన 'సారంగధర చరిత్రమును' ఆధారంగా చేసుకొని ఈ కావ్యాన్ని రాశాడు. ఇది శృంగారంతో మొదలై కరుణ రసంతో ముగిసే మూడాశ్వాసాల కావ్యం.

**అచ్చాంధ్ర నిరోష్ఠ్య నిర్గద్య దాశరధి చరిత్రం:**

అబ్బరాజు హనుమంతరాయశర్మ పాకయాజి

ఈ గ్రంథకర్త. శ్రీ రామ పట్టాభిషేకం వరకుగల కథను మూడాశ్వాసాలలో ముగించడం, మూడు నియమాల్ని పాటించడం ఈ గ్రంథంలోని ప్రత్యేకత. ఈయన కాలం 1880 సంవత్సర ప్రాంతం. ఈయన అంతకుముందే "అచ్చాంధ్ర నిరోష్ఠ్య నిర్గద్య నృగ చరిత్ర" రాసినట్లు చెప్పాడు. ఇది అలభ్యం.

**సుమతి:**

ఈ కావ్య రచయిత గోపిశెట్టి రామచంద్ర నాయుడు. సుమతి కథ చిన్నదైనా, కవి పండితులకు నమస్కారం చేసి సందర్భానికి తగినట్లు నూతన వర్ణానాంశాలను చేర్చి రాశాడు. ఈ కావ్యానికి మూలం సంస్కృతేతివృత్తం కాకపోవడం, తత్సమ పదాలు లేకుండా ఉదేశ్యంతో రాయబడింది.

**కుబ్జా కృష్ణ విలాసం:**

ఈ గ్రంథాన్ని చక్రవర్తుల లక్ష్మీనృసింహాచార్యులు 1907నాటికే రాసి 1932లో ప్రకటించాడు. కుబ్జను శ్రీ కృష్ణుడు అనుగ్రహించుట ఇందులోని కథ. ఇది మూడాశ్వాసాల ప్రబంధం.

**మద్దుకథ:**

ఈ కావ్యాన్ని మంగిపూడి వేంకటశర్మ రాశాడు. ఈ కావ్యం చక్కని ధారశుద్ధితో దేశీయేతి వృత్తంతో సాగుతుంది. కావ్యంలో ప్రధాన రసం ధర్మ వీరం. ఇది 1933లో ముద్రింపబడింది. కథ, భాష, వృత్తాంతం దేశీయమైన ఈ 'మద్దుకత' ప్రత్యేకతను సంతరించుకుంది.

**శుద్ధాంధ్ర నిర్వచన చంద్రహాస చరిత్రం:**

శలపాక వెంకట సూర్య ప్రకాశ ప్రధాని దీన్ని ఏకశ్వాస ప్రబంధంగా రాశాడు. నూటయాభై పద్యాలతో పూర్తైన ఈ కావ్యంలో కవి కథకు ప్రాధాన్యమిచ్చాడు. ఈ కావ్యం 1890 ప్రాంతంలో వెలువడింది.

ఇవేగాక ఇంకా శుద్ధాంధ్ర భారత సంగ్రహము, శృంగార శాకుంతలము, శకుంతల, అచ్చ తెలుగు భారవిలాంటి భారత కథాత్మక అచ్చ తెలుగు కావ్యాలు, నీల సుందరి పరిణయము, సుపాణినీ పరిణయము, శుద్ధాంధ్రహరిశ్చంద్ర చరిత్రము, సత్య విజయము, శుద్ధాంధ్ర నిర్వచనరుక్మిణీ పరిణయము, శుద్ధాంధ్ర నిర్వచన సత్యవివాహము, తరి దాలుపు దళసరి, శుద్ధాంధ్ర నిర్గద్య నిరోష్ఠ్య కేకయ రాజ నందన చరిత్రము, అచ్చ తెలుగు పార్వతి పరిణయము, అచ్చ తెలుగు మెచ్చుల పచ్చుముచ్చిలి, మనువు పుట్టువు లాంటి భాగవత పురాణ కథాత్మక పద్య కావ్యాలు అచ్చ తెలుగులో వెలువడ్డాయి. అంతేకాకుండా శుద్ధాంధ్రనిర్వచన చంద్రహాస చరిత్రము, శుద్ధాంధ్ర రుతు సంహారము, ఎకువ, మకువ, నవరస తరంగిణి, ఉమరు కైయాము రుబాయతు, వెన్నెల పెండ్లి, వెన్నెలవాక, తెలుగు పొలుపు, వేల్పుమాట, భళిర కరివేల్పు శతకము, త్రిశిర గిరీశ శతకము, చక్కట్లదండ, జేజేల మేలువాని మేటి యింపునిట్ట వెన్నుని వేయి పేర్ల వినకరి, తల్లివిన్కి, వేల్పువంద, మొక్కుబడి వంటి పద్య కావ్యాలు, ఖండకావ్యాలు, ద్విపద కావ్యాలు, శతకాలు, స్తుతులు అచ్చ తెలుగు ప్రక్రియలో వెలువడి ఆ ప్రక్రియను సుసంపన్నం చేశాయి. ఇవేగాక కథలు, వ్యాసాలు, పీఠికలు, నాటకాలు, హరికథలు, నిఘంటువులు, మిగతా అలభ్యాలు ఒక్కటేమిటి మనకు తెలిసినవీ, తెలియనివీ ఎన్నో రచనలు అచ్చతెలుగు ప్రక్రియలో వచ్చాయి. అందులో కొన్ని అలభ్యాలు. ఇంకొన్ని లభిస్తున్నాయి.

అయితే తెలుగు సాహిత్యంలో నాటి నుండి నేటి వరకూ అచ్చ తెలుగు సాహిత్యం అనాదృత వాఙ్మయంగానే పరిగణించబడింది. ఈ గడిచిన ఐదువందల సంవత్సరాల్లో అచ్చ తెలుగులో వెలువడిన కావ్యాలు కేవలం వేళ్ళ మీద లెక్కబెట్టదగిన సంఖ్యలో ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. అందులోనూ సగం నిఘంటువులే కావడం గమనార్హం.

**జె. రాయమల్లు**

**హైదరాబాదు. ఫోన్** : 995 142 8183.



# అట్టమీద బొమ్మలు

క్రీస్టీ చిత్రకళా వ్యాపార సంస్థవారు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన అనేక చిత్రాలను కొనుగోలు చేసి కొంతకాలం వాటిని తమ అధీనంలో ఉంచుకొని తగిన సమయం చూసి వాటిని చిత్రకళా ప్రేమికులకు అమ్మే ప్రయత్నం చేస్తూవుంటారు. ఈ అమ్మకం వేలంపాట ధోరణిలో నిర్వహించబడుతుంది. ఇందులో రినైజాన్స్‌కు చెందిన చిత్రాలతోపాటు పికాసోలాంటి



చిత్రకారుల ఆధునిక చిత్రాలను సైతం అమ్మకానికి ఉంచుతారు. **మిసిమి**లో ప్రచురించబడిన ఈ నాలుగు చిత్రాలు 1998వ సంవత్సరంలో క్రీస్టీ సంస్థచే చిత్రకళా అభిమానులకు వేలంపాట ద్వారా అమ్మబడిన చిత్రాలు.

**మొదటి అట్ట:** ప్రేమలేఖ. చిత్రకారుడు ఫెదరిగో ఆంద్రియోటి. 1847 – 1930 సంవత్సరాల మధ్య జీవించిన ఇటలీ వాస్తవ్యుడైన ఫెదరికో, ఫ్లోరెన్స్‌లోని అకాడెమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో విద్యార్థిగా చిత్రకళనభ్యసించాడు. చదువుకుంటున్న రోజులలోనే ప్రతిభా పురస్కారాలను అందుకున్నాడు. చదువు పూర్తయిన తరువాత అదే కాలేజీలో ఉపాధ్యాయునిగా కొనసాగాడు. 19వ శతాబ్దపు ఉన్నత కుటుంబం జీవన శైలి అతని చిత్రకళలో మనల్ని అలరిస్తుంది. అందమైన దుస్తులు వేసుకున్న స్త్రీ, పురుషులు, ఇంటిలోని గృహోపకర వస్తువుల సముదాయం అతని కుంచెలో అందంగా ఒదిగిపోయింది. క్రీస్టీ సంస్థ 82,900 పౌండ్లు దీని విలువగా నిర్ణయించింది.



**రెండవ అట్ట:** రక్షకురాలు. ఈస్తర్ దుస్తుల గదిలో. చిత్రకారుడు డచ్ దేశస్థుడైన ఎలర్ట్ జెల్డర్ (1647–1727). తన చిత్రకళాశైలిలో చిత్రకళారంగాన్ని ఒక ఊపుఊపిన రెంబ్రాం (Rembrandt) శిష్యుడితను. ఈ చిత్రం ఈస్తర్‌కు సంబంధించినది. బుక్ ఆఫ్ ఈస్తర్ అన్న పుస్తకం ఆధారంగా 1680, 1687 సంవత్సరాల మధ్య కొన్ని చిత్రాలను రచించాడు. ఈస్తర్ – హీబ్రూ బైబిల్ క్రైస్తవ పాత నిబంధనల ప్రకారం యూదు జాతికి చెందిన రాచకన్య. తన సోదరుడు చేసిన కొన్ని వ్యాఖ్యానాలకు కినిసి ఈస్తర్ సోదరుని మాత్రమేగాక మొత్తం యూదులందరినీ తుదముట్టించమని ఆజ్ఞాపిస్తాడు పర్షియన్ రాజు. తన జాతి జనులకోసం ఆమె తన సౌందర్యాన్ని పాచికగా వేసి యూదులను రక్షించుకుంటుంది. ఇందులో నిజానిజాల మాట ఎలా ఉన్నా ఈస్తర్ జీవించి ఉన్నట్లు కొన్ని ఆధారాలు లభిస్తున్నాయి. ఈ చిత్రంలో ఆమె ముఖంలో ఉన్న విషాద రేఖలు మనం గమనించవచ్చు (క్రీస్టీ సంస్థ నిర్ణయించిన వెల 4,80,000 పౌండ్లు).

**మూడవ అట్ట:** నిన్నటి కల. Sir Isanbra at the ford. 1856లో మిలేస్ వేసిన చిత్రం. మిలేస్ చిత్రకళలో ప్రీరాఫిలిజం అనే సిద్ధాంతాన్ని తీసుకుని వచ్చినవాడు. రేఫిల్‌కు ముందే చిత్రకళ అత్యున్నత స్థాయికి చేరుకుందనే అభిప్రాయం



ఈ సిద్ధాంతానికి మూలం. దీనిని అంగీకరించినవారికంటే విభేదించివారు ఎక్కువ. మిలేస్ ఈ చిత్రాన్ని 1857వ సంవత్సరంలో Royal అకాడెమీలో ప్రదర్శించాడు. ఒకటికంటే ఎక్కువసార్లు పెయింట్ చేయటంతో గుఱ్ఱపు చర్మం తన సహజత్వాన్ని పోగొట్టుకుంది. మధ్య యుగానికి చెందిన ఒక కింగ్ ఆథర్ యోధుడు (knight) పేద కుటుంబానికి చెందిన ఒక బాలుని, బాలికను తనతోపాటు గుఱ్ఱం మీద ఎక్కించుకొని నదిని దాటుతున్న దృశ్యం. ఇందులో చలినుంచి రక్షణగా కొన్ని కట్టెపుల్లలను కూడా తమతోబాటు మోసుకొని వచ్చారు పిల్లలు. ఈ చిత్రం మొదటిసారిగా ప్రచురితమైనప్పుడు చాలా విమర్శలను ఎదుర్కొంది. ఇందులో యోధుని పాత్రలో తన్ను తాను చిత్రించుకున్నాడు మిలేస్. క్రీస్టీ సంస్థ ప్రకారం దీని విలువను 6,72,500 పౌండ్లు.



**నాల్గవ అట్ట:** అమాయకత్వం. Kittens (పిల్లికూనలు) చిత్రకారుడు ఫ్రెడరిక్ లీటన్. లీటన్ ప్రతిభ గురించి **మిసిమి**లో అనేకసార్లు పేర్కొనబడింది. లీటన్ రాయల్ అకాడెమీ అధ్యక్షునిగా ఎన్నికయిన 5వ సంవత్సరంలో (1889) ఈ చిత్రం రాయల్ అకాడెమీలో ప్రదర్శించబడింది. చిన్నపిల్లల అమాయకత్వంపై లీటన్‌కు మక్కువ. ఈ చిత్రాన్ని 1998వ సంవత్సరంలో క్రీస్టీ ఆర్ట్ గ్యాలరీ వాళ్ళు 8,59,000 పౌండ్లకు అనగా సుమారు రూ. 5 కోట్ల 40 లక్షలుగా దీని వెలను నిర్ణయించారు. ఇక్కడ Kittens అన్న పదం చిన్న పిల్లలకు కూడా వర్తిస్తుంది.

# ఎడిటర్స్ డైరీ

కొత్త సంవత్సరం బెజవాడ పుస్తక ప్రదర్శనతో మొదలైంది. చలిచలిగా, చిరుదీపాల మిలమిలలతో స్వరాజ్య మైదానం పుస్తకాలతో నిండిపోయింది. ప్రతి సంవత్సరం 1వ తేదీ నుండి 10వ తేదీవరకు పుస్తక ప్రదర్శన, అమ్మకాలు, గ్రంథావిష్కరణలు, సాహిత్య సభలు వగైరాలన్నీ అంగరంగ వైభవంగా జరిగేది స్వరాజ్య మైదానం అనే పి.డబ్ల్యు. గ్రౌండ్స్ – నాలుగు ప్రక్కల రహదారులతో రద్దీగా ఉండే బందరురోడ్డు – మహాత్మాగాంధీ మార్గంగా మారిన వైనం.



(కుడి నుంచి ఎడమకు) ఎడిటర్, జితేంద్రబాబు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, జి. లక్ష్మి, ప్రమోద్‌కుమార్, సుబ్రహ్మణ్యం భట్టు (నోబుల్ ప్రసంగాల గ్రంథావిష్కరణ)

అదిగో అక్కడే '**మిసిమి** స్టాల్' వెలసింది. మొదటిరోజు నుంచి అభిమానులు ఎంతో ప్రేమతో తమ ఇష్టాన్ని **మిసిమి** పట్ల తమ అభిమానాన్ని మమ్మల్ని కలసి కలబోసుకున్నారు – మాకు దుమ్ము – ధూళి – ఎండా వెలుతురూ శ్రమ తెలియకుండా వస్తూనే ఉన్నారు. అలా వచ్చినవారిలో మండలి బుద్ధప్రసాద్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, పన్నాల సుబ్రహ్మణ్యం భట్టు, జింకా రామారావు, పెద్ది సాంబశివరావు, రచయిత్రులు – జి. లక్ష్మి, హిందీ తెలుగు ఆచార్యులు శ్రీమతి హేమలత, కోదాడ నుంచి బంగారు రామాచారి – తెనాలి నుంచి తపస్వి, గిరిధర్ గౌడ్, సురేష్‌గార్లు, జంక్షన్ నుంచి లెఫ్టినెంట్ కర్నల్ డా. అశోక్, గన్నవరం నుంచి బాలవర్ధనరావు, దేవినేని మధుసూదనరావు, జయశ్రీగార్లు. ఎమెస్కో లక్ష్మిగారు తన మనవరాలితో రెండు రోజులు **మిసిమి**ని దర్శించారు.

డా. కాకుమాని శ్రీనివాసరావు తన శిష్యబృందంతో వచ్చి 3 రోజులు మాతో అనేక విషయాలు చర్చించారు. **మిసిమి**ని ఇప్పుడు కాలేజీ విద్యార్థులూ చదువుతున్నారని, తమ తెలుగు పలుకుబడిని మెరుగుపరచుకుంటున్నారని విని ఆనందించాం. బి.వి. రామిరెడ్డి గారి 'నోబెల్ ప్రసంగాలు' యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ చేతులమీదుగా ఆవిష్కరింపబడితే, భట్టు తమ విశ్లేషణతో శ్రోతలను, అతిథులను ఆశ్చర్యపరిచారు. జి. లక్ష్మి తన సమీక్షతో సమావేశాన్ని సుసంపన్నం చేశారు. ప్రమోద్‌కుమార్ సభానిర్వహణ బాధ్యత సమర్థవంతంగా సాగించారు. జితేంద్రబాబు మునగాల నుంచి ప్రత్యేకంగా వచ్చి **మిసిమి** పూర్వాపరాలు చెప్పారు.


దేవినేని, అడుసుమిల్లి

**మిసిమి** ని సందర్శించిన అభిమాన పాఠకుల శ్రేణి 25 సంవత్సరాల నుంచి ప్రారంభమవటం ఎంతో శుభసూచికంగా సంతోషించాం. ఇన్నాళ్ళు యువతను చేరలేకపోతున్నామనే ఒక దిగులు ఉండేది. ఈ పుస్తకాల పండుగ మాకు నిజంగా సంక్రాంతి పండుగలా ఆనందపరిచింది. బెజవాడలో **మిసిమి** స్టాల్‌కు అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యంగారు తమ పెద్ద వయస్సు కూడా లెక్క చేయకుండా **మిసిమి** ఎక్కడా అని వెతుక్కుంటూ అశోక్, మధుసూదనరావుగార్లతో వచ్చారు. అంత దూరం నుంచీ నడిచే వచ్చారు. ఎన్నో పుస్తకాలు కొని తీసుకువెళ్ళారు. వీరి పుత్రుడు రామకృష్ణ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్యదర్శి. తెనాలి నుంచి ఒక **మిసిమి** అభిమాని తన అమెరికన్ భార్యతో స్టాల్‌కు వచ్చి అన్ని పుస్తకాలు చూశారు. "మీ మీద అభిమానంతో పారిజాతం కొంటున్నాను, సంతకం చేసి ఇవ్వండి" అన్నారు. ఈ కథలన్నీ నా భార్యకు వినిపిస్తానని అన్నారు.


పూజ


అమెరికన్ భార్యతో తెనాలి అభిమాని

ముద్రిక ప్రింటర్స్ కృపాకరరావుగారి అమ్మాయి పూజ (ప్రగతి ప్రింటర్స్) వచ్చి ఒక గంట గడిపి వెళ్ళింది. ఓ సాయంత్రం సర్వోత్తమ భవన్ నిర్వాహకురాలు శ్రీమతి శారద



శ్రీమతి శారద

**మిసిమి**ని దర్శించి వెళ్ళారు. 104 సంవత్సరాల క్రితం పాతూరి నాగభూషణం స్థాపించిన సర్వోత్తమ భవనం పచ్చని చెట్ల నీడలో, పూలచెట్ల రంగులతో ఒక గ్రంథాలయం, ఒక లైబ్రరీ సైన్స్ కాలేజీ, పరిశోధక విద్యార్థులకు రీడింగ్ రూములు కూడా నిర్వహిస్తున్నారు. బెజవాడ బందరు రోడ్డులో (పడమట) ఒక ఎకరం స్థలంలో ఇప్పటికీ ఎటువంటి ఆర్థిక ప్రలోభాలకూ లోనుకాకుండా శ్రీమతి శారద సర్వోత్తమ భవనం నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఎన్నో పుస్తకాలు సేకరించి, విద్యార్థులకు పంచిపెడతారు. అటువంటి అవకాశం ఒకసారి నాకూ కలిగించారు.

ఓ రోజు సాయంత్రం దేవినేని మధుసూదనరావుగారు, జయశ్రీగారు తమ ఇంటికి తెన్నేరు తీసుకువెళ్ళి ఆతిథ్యం ఇచ్చి పంపించారు. వారు ప్రకృతిలో, పుస్తకాలతో జీవనం సఫలం చేసుకుంటున్నారు. వరవరరావుగారి అల్లుడు శ్రీనివాస్ **మిసిమి**ని దర్శించి వెళ్ళారు. రిటైర్డ్ ప్రొఫెసర్, నాగార్జున యూనివర్శిటీ శ్రీ సత్యనారాయణగారు (జన్మతః చూపులేదు) **మిసిమి** స్టాల్ సందర్శించారు.



ప్రకృతి - పుస్తకాలతో దేవినేని దంపతులు

10 రోజులు 10 నిమిషాలలా గడిచిపోయాయి. ప్రమోద్‌కుమార్ ఆతిథ్యం ఎంతో ఆత్మీయంగా అనుభవించిన మాకు ఎలా కృతజ్ఞత చెప్పాలో తెలియలేదు.

ముఖ్యంగా రెండు విషయాలు మీతో పంచుకోవాలి. కొండపల్లి వేగన్ వర్క్‌షాప్‌లో ఉద్యోగం చేస్తున్న సత్యనారాయణ తమ కుటుంబంతోసహా భార్యా, ఇద్దరు ఆడపిల్లలు **మిసిమి** స్టాల్ దగ్గరకు వచ్చి గంటకుపైగా గడిపి, మాకు ఎన్నో కబుర్లు చెప్పారు. ఆయనకు నిండా 40 ఏళ్ళు లేవు. 'నా ఇనుప ముక్కలు ఉద్యోగంలో **మిసిమి** చక్కని ఉద్యానవన'మన్నారు. కోదాడ నుంచి బంగారు రామస్వామి పెట్టెడు పుస్తకాలు కొన్నారు. ఆయన రాసిన ఉత్తరం ఈ నెల 'కమ్మ తెమ్మెరలు'లో చదవండి.



సత్యనారాయణ చిరంజీవులు పల్లవి, స్వాతి

మరొకరు – యార్లగడ్డ రాజారాంగారు. ఏలూరు కాలేజీలో చరిత్ర బోధించారు. ఆయన షటిల్ స్టేట్ ప్లేయర్ కూడ. అర్థాంతరంగా 2011లో నడుము నొప్పితో మంచం పట్టారు. ప్రాథమిక వైద్యం, ఆర్థోపెడిక్ వైద్యం అయిన తర్వాత, మద్రాస్ అపోలోలో చేరారు. అక్కడ వైద్యపరీక్షలన్నీ చేసి వారికి మల్టిపుల్ మైలమా అని చెప్పారు. అప్పటికే ఆయన కుడి చెయ్యి, కుడి కాలు, నడుము పడిపోయాయి. ఇంక ఆయనకు 6 నెలలకంటే ఎక్కువ సమయం లేదని కూడా చెప్పారు. ఆయన, ఆయన భార్య దిక్కుతోచక వారికి దూరపు పరిచయమైన కాన్సర్ వైద్యుడ్ని (అపోలో) డా. నిమ్మగడ్డ రమేష్‌ను సంప్రదిస్తే ఆయన ముందు– 'మీరు శారీరకంగా కోలుకోవాలి, తరువాత మీకు కిమోథెరపీ చేయాలి, ఆ తరువాత బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ చేయాలి. ఇవన్నీ మీరు తట్టుకోగలిగితే బ్రతికి బట్టకడతారు' అని చెప్పాడు. డా. ఈసోవ్ బి.ఎమ్.టి. చేశారు. వారు తాము లోనైన శారీరక, మానసిక, ఆర్థిక, కౌటుంబిక బాధలన్నిటినీ మాకు ఏకరువు పెట్టారు. అంతేకాదు, తాము ఎలా కోలుకొన్నది, పూసగుచ్చినట్లు చెప్పారు. చివరికి తమ మానసిక స్థైర్యానికి **మిసిమి** ఏ విధంగా అండగా నిలిచిందో ఆయన విశ్లేషిస్తుంటే మేము నోరు తెరచి విన్నాం. ఆయనను ఎలా అభినందించాలో మాకు అర్థంకాలేదు. అయితే, ఆయన ఇప్పుడు ఆరోగ్యంగా తిరగగలగటం చూసి మేము ఆనందించాం. **మిసిమి** స్టాల్‌లో ఒక పూటంతా గడిపి ఆయనకు కావలసిన పుస్తకాలు తీసుకువెళ్ళారు. తప్పనిసరిగా హైదరాబాద్ వచ్చి **మిసిమి** కార్యాలయాన్ని సందర్శిస్తానని చెప్పారు.



యార్లగడ్డ రాజారాం

* * *

అంతలోనే సంక్రాంతి పండుగ వచ్చింది. సరే, ఆ సంబరాలు విడిగా చెప్పాలా?

కట్ చేస్తే హైదరాబాద్ పుస్తకాల పండుగ జనవరి 18 న మొదలైంది. ఎన్.టి.ఆర్. గ్రౌండ్స్‌లో పెద్ద మహోత్సవమే చోటుచేసుకొంది. ఒక ప్రక్క ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ నడుస్తున్నా, సంక్రాంతి పండుగ ఖర్చులు ఎంతైనా, నెలాఖరు వస్తున్నా పుస్తకాల సంతకు అభిమానులు బారులుకట్టారు. మొదటివారం రద్దీగానే ఉంది. ఆ సందర్భంలోనే మాకు ఆశ్చర్యం కలిగించే విషయం నిజంగా ఎంతోమంది యువకులు **మిసిమి** ని వెతుక్కొంటూ వచ్చారు. 'మేము ఫేస్‌బుక్‌లో చూశాము, ట్విట్టర్‌లో చూశాము, వెబ్‌లో చదివాము' అని పుస్తకాలు తీసుకొని వెళ్ళారు.


ఎన్నార్కె - పుట్టంశెట్టి

పుట్టంశెట్టి లక్ష్మీనారాయణ – ఒక యువ సినీ రచయిత, దర్శకుడు – వరసుగా మూడు రోజులు మాతో గడిపి ఆశ్చర్యపరిచాడు. "మీ 'అగాథం, ఎడోనిస్' ప్రతీ అక్షరం వచ్చు" అని "మీ 'అనంతరంగం' అద్భుతం" అన్నాడు.


విజయ్, తనికెళ్ళ భరణి, రాణి

**మిసిమి** స్టాల్‌కి గొల్లపూడి మారుతీరావు వచ్చి రెండు గంటలు గడిపారు. ఆయనకోసం ఓ వందమంది ఆటోగ్రాఫులు, సెల్ఫీలు, పలుకరింపులు – ఆనందంగా గడిచిపోయింది. ఆ మర్నాడు తనికెళ్ల భరణి వెతుక్కుంటూ వచ్చి ఆప్యాయంగా కౌగిలించుకున్నారు. ఆయనతోపాటు తండోపతండాలు – నిలబడనివ్వరు – కూర్చోనివ్వరు – పాపం – కీర్తి, కనకాలు తెచ్చే ఇబ్బందులు కూడా ఉంటాయి. తమకు కావలసిన పుస్తకాలు సొమ్మిచ్చి మరీ కొనుక్కున్నారు. ఒకరోజు ముప్పయి స్కూలు బస్సులు – పిల్లలతో కిటకిటలాడిపోయింది. విచ్చుకునే మొగ్గల్లా ఉన్నారు – కిలకిలలాడుతూ **మిసిమి** అంటే ఏమిటి అని అడిగారు. ఆ రోజు **మిసిమి**లో ఒక పేరా చదివిన బాల – బాలికలందరికీ **మిసిమి** బహుమతిగా ఇచ్చాం.


అలెగ్జాండర్ - కాలేజీ స్టూడెంట్స్

ప్రముఖంగా చెప్పవలసింది కాంగో నుంచి మమ్మల్ని వెతుక్కుంటూ వచ్చిన ఐ.వి. రామరాజుగారు – ఆయన గురించి ఈ సంచికలోనే మరోచోట వివరంగా వ్రాశాం (పుట. 84). మర్నాడు వారు కుటుంబంతోసహా వచ్చి మాతో ఎంతో విలువైన సమయాన్ని గడిపారు (రామరాజు పిప్పర చుట్టుప్రక్కల ఊళ్ళ 15 లైబ్రరీలకు అయిదు సంవత్సరాల చందా కట్టారు. ఆయన స్నేహితుడు అల్లూరి సతీష్‌వర్మగారితో మరో 15 లైబ్రరీలకు అయిదు సంవత్సరాల చందాలు కట్టించారు).


అందెశ్రీ

అందెశ్రీ రోజూ **మిసిమి** స్టాల్ దగ్గర సాయంత్రాలు గడిపారు. ఆయన స్టాల్‌లో కూర్చొనివుంటే అన్ని వయస్సులవాళ్ళూ వచ్చి కాళ్ళకు దండాలు పెడుతుంటే పాపం – రాణికి ఏమీ అర్థంకాలేదు. ఎవరీ అనామకుడు – సినిమా స్టార్‌కంటే పాపులర్‌గా ఉన్నారు – అని ఆశ్చర్యపోయింది. చివరి రోజున అందెశ్రీ తన కూతుర్ని తీసుకువచ్చి రాణీకి పరిచయం చేశారు 'ఈమె నా భార్య కూతురు' అని. ఆమె చిత్రకారిణి – పెలెట్ స్టైల్‌తో చిత్రాలు సృష్టిస్తుంది. ఇంకా **మిసిమి**ని సందర్శించిన ప్రముఖులు జూలూరి గౌరీశంకర్, కవి జూకంటి జగన్నాథం, వాసిరెడ్డి నవీన్, కన్నూరి అలెగ్జాండర్, శివారెడ్డి.

ఈ రెండు పుస్తక ప్రదర్శనలలో **మిసిమి**కి లభించిన ఆదరణ – మమ్మల్ని ఎంతగానో ఆనందపరిచింది. ముఖ్యంగా యువతను ఆకర్షించి ఆలోచింపచేస్తున్నందులకు మాకు మరింత ప్రోత్సహకరంగా పుస్తకాల పండగ ముగిసింది.

ఇదంతా పోలీసు రిపోర్టులాగా ఉంటే క్షమించండి. ఎందుకంటే ఆ ముచ్చటా తీరింది. స్టాల్‌లో బ్యాగ్ దొంగిలించబడింది. నేను, నాగేశ్వరరావుగారు గాంధీనగర్ పోలీస్ స్టేషన్ కోసం గంటసేపు ప్రయాణంచేసి చేరాం.

రాత్రి 9.00 గం॥లకు. గాంధీనగర్ పోలీస్ స్టేషన్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రక్కన ఉంది. ఆశ్చర్యం! పోలీస్ స్టేషన్ కార్పోరేట్ ఆఫీస్‌లాగా ఉంది. సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ వి. రమేష్ స్క్రీన్ హీరోలా ఉన్నారు. ఎంతో మర్యాదగా తమ సేవలందించారు.

**ఈ ఆదివారం – 11-2-2018**

ఉదయం – మెట్రో – అప్పుడే నిద్ర మేల్కొంటుంది – ఇప్పుడిప్పుడే హైద్రాబాద్ మెట్రోరైలు అందచందాలకు అలవాటుపడుతోంది. హైదరాబాదీలు ఆదరాబాదరా బ్రతుకు నుంచి ఒక పద్ధతికి అలవాటుపడుతున్నారు. కానీ మనుషుల్ని గౌరవించే సంస్కృతి ఇంకా వంటబట్టినట్టు లేదు. క్యూ పాటించరు – దిగేవాళ్ళకు అడ్డంగా వెళ్తారు. పోలీసును చూస్తే భయపడతారు. కెమెరాలకు చిక్కుతారు – ఎల్లో లైను దాటతారు. అక్కడ సహాయకులు వచ్చి వెనక్కు నెట్టాలి. ఇవన్నీ మెల్లగా అలవాటవుతాయని ఆశిద్దాం. వేలంవెర్రి కాస్త తగ్గింది.

అలా మీయాపూర్ చేరాం (వళ్ళు కదలకుండ). అక్కడ ఖాళీ బస్సులు కూడా ఆగకుండా వెళ్ళిపోయతున్నాయి.


బేతవోలు రామబ్రహ్మం

చిన్ని నాలుగు చక్రాలు షేర్‌వాన్‌లో చందానగర్ 'శ్రీదేవి' సినిమా హాలు దగ్గర (ఇంటెలిజెంట్) దిగాం. అక్కడ నుంచి మారుతీహిల్ కాలనీకి పాదయాత్ర చేశాం. అక్కడ హిల్ ఏమీ లేదు. అలా బేతవోలు రామబ్రహ్మం, అద్దంకి శ్రీనివాసగార్లను కలిశాం. కబుర్లాడుకున్నాం. కాసేపు విరించితో ఆడుకున్నాం (శ్రీనివాస్ చిరంజీవి). 'మీ ఎడిటర్స్ డైరీ బావుంటోంది' అని కితాబిచ్చారు. బేరాగారు రాజశేఖర్ చరిత్ర, శమంతకమణి గ్రంథాలకు వ్యాఖ్యానం రాసి ఈ మధ్యనే ప్రచురించారు. శ్రీనివాస్ తాను వ్యాఖ్యానం రాసిన అప్పనమంత్రి (ధర్మశాస్త్రం) మర్యాదల పుస్తకం ఇచ్చారు! ఆంగ్లంలో *ఎటికెట్* బుక్ చదివాను. తెలుగులో చూడటం ఇదే మొదటిసారి. రామబ్రహ్మం గారి శ్రీమతి భోజనం చేసి వెళ్ళండి అంటున్నా వినకుండా అక్కణ్ణించి అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డిని కలవటానికి బయలుదేరాం. వారు మా రాక గమనించి, ఎంతో సంతోషించి, ఆనందంగా కౌగిలించుకున్నారు (మదీనాగూడ, స్వాగత్ గ్రాండ్ వెనుక). 'ఫ్రాయిడ్ మనసు గతి' ఇచ్చారు. బౌద్ధంలో మరొక నికాయ తెనిగించే పనిలో ఉన్నారు. 80 దాటినా రచనా వ్యాసంగం ఆపలేదు. స్వాగత్ గ్రాండ్‌లో మంచి భోజనం చేశాం. భోజనం అంటే ఇప్పటి హోటల్స్‌లో భోజనం దొరకటంలేదు. బిర్యానీ,


అన్నపరెడ్డి

ఫ్రైడ్ రైస్ మాత్రమే అందిస్తున్నారు. ఒక కుట్ర ప్రకారం భోజనం దొరకకుండా చేస్తున్నారు. మేము ప్రత్యేకంగా అన్నం, కూర తెప్పించుకుని తిన్నాం. అక్కడి సేవికులందరూ ఒరిస్సా వయ్యారి భామలే. తెలుగు రాదు అని తెలుగులో చెప్తున్నారు. అయినా మర్యాదలకు ఏమీ లోటులేదు. తరువాత మా పాదయాత్రలో మజిలీ ఎస్.వి.ఎల్. నరసింహారావు, నిజాంపేట రోడ్‌లో (వీరు బాన్స్‌వాడ మాజీ ఎమ్.ఎల్.ఎ.). వారింటికి 3.30 ని॥లకు చేరాం. అది వారు మధ్యాహ్నం నిద్రపోయే సమయం. మేం కూడా నిద్రపోయాం. అందరం లేచిన తర్వాత 5.00 గం॥లకు టీలు తాగి, కబుర్లు చెప్పుకున్నాం. వారు ఖలీల్ జిబ్రాన్ జీవితాన్ని, కవిత్వాన్ని అనువదింపించి ప్రచురించారు. వారి అమ్మాయి 'రంగవల్లి' పేరుతో ప్రచురణలు జరుగుతున్నాయి. ఆమె పోలీసు ఎన్‌కౌంటర్‌లో చనిపోయింది. ఎస్.వి.ఎల్. గారు ఇప్పుడు ఖలీల్ జిబ్రాన్ రాసిన జీసస్ క్రీస్ట్ 'ఈజ్ సన్ ఆఫ్ మ్యాన్' అనే పుస్తకాన్ని తెలుగులో తీసుకువస్తున్నారు. ఆయనకు ఈ శివరాత్రికి 86 ఏళ్ళు. జన్మదిన శుభాకాంక్షలు అందించి, శెలవు తీసుకున్నాం. ఆదివారమైనా హైదరాబాద్ రోడ్లేమీ ఖాళీగా లేవు.


మెట్రోలో

కొసమెరుపు: 29 సంవత్సరాలుగా తెలుగులో తెలుగు కోసం కనీసం ప్రకటనలు తీసుకోకుండా నడుపుతున్న ***మిసిమి*** పత్రిక ఉనికి తెలుగు ప్రపంచ మహాసభల హోరులో కనపడలేదు. ఆహ్వానం లేదు. అంతేనా! ప్రస్తుతం జరుగుతున్న తెలుగు భాషా బ్రహ్మోత్సవాల సంరంభంలో ఎక్కడా ధ్వనించటంలేదు. కారణం – పిలుపు లేకపోవటమే. ఇదేమి న్యాయం? మీరే చెప్పండి!

# సప్త సహోదరీల ప్రాంతం ఈశాన్య భారతం

*- ముకుంద రామారావు*

త్రిపుర:

సంస్కృతంలో త్రిపుర అంటే మూడు పురములు లేదా మూడు నగరములని అర్థం. త్రిపుర పేరుకు కారణాలు అనేకం. అందులో ఎక్కువగా అంగీకార యోగ్యంగా తీసుకున్నది. వాళ్లు పలికే భాషలో త్రిపురని విడగొట్టి, తుయ్ (అంటే నీరు) + ప్ర (అంటే దగ్గర) భౌగోళికంగా నీటి దగ్గరగా ఉన్న ప్రాంతం కాబట్టి ఆ పేరు వచ్చిందని ఒక వాదన ఉంది. భారతీయ పురాణేతిహాసాలైన మహాభారతం, పురాణాల్లోనూ, ఆశోకుడి శాసనాల్లో కూడా ఈ ప్రాంత ప్రస్తావన ఉంది. ఇప్పటి బంగ్లాదేశ్, మైన్మార్ వరకూ విస్తరించిన విశాల దేశం ఒకప్పుడు, కానీ అదిప్పుడు మూడవ అతి చిన్న రాష్ట్రం. ఈ రాష్ట్రానికి బంగ్లాదేశ్, మిజోరాం, అస్సాం సరిహద్దులు. ఆ సరిహద్దుల్లో 84 శాతం ఉత్తర, దక్షిణ, పశ్చిమ దిక్కుల చుట్టూతా బంగ్లాదేశే ఉంది. తూర్పున మిజోరాం, ఈశాన్యాన అస్సాం ఉన్నాయి. అక్కడి మూలవాసుల్ని త్రిపురి లేదా తిప్ర అని, వారినే కక్-బరక్‌లని అంటారు. బెంగాలీ, కక్-బరక్, ఆంగ్లం అక్కడి అధికారిక భాషలు. రమారమీ 7వ శతాబ్దం నుండీ మాణిక్య వంశ మహారాజుల అధీనంలో వున్న ఈ ప్రాంతం, అనేక శతాబ్దాలపాటు, 1949లో భారతదేశంలో విలీనమయే వరకూ మొత్తం 184 మంది రాజుల పాలనలో ఉంది. ఈ రాజులందరికీ ఫా (ఫా అంటే తండ్రి) అని బిరుదు. అయితే 14వ శతాబ్దానికి ఈ బిరుదు మాణిక్యగా మారిపోయింది. ఈ వంశీకులవి ఇండో మంగ్లోలియన్ల మూలాలని చరిత్రకారులు నిర్ధారించారు. దాదాపు 3,000 సంవత్సరాల వరకూ వీరి పాలన సాగింది. ధాన్య మాణిక్య మహారాజు (1463–1515) కాలంలో ఈ ప్రాంతాన్ని అస్సాం, బెంగాల్, మైన్మార్ లోపలి వరకూ విస్తరించారు. 17వ శతాబ్దంలో మొఘులుల అధీనంలోకి పోయినా, ఆ తరువాత ఆంగ్లేయుల అధీనంలో ఉన్నా, ఆ మహారాజుల పాలనలో స్వతంత్ర పరిపాలక విభాగంగానే త్రిపుర ఉంది. 1923లో సింహాసనం అధిరోహించిన చివరి మహారాజు బీర్ బిక్రం కిషోర్ మాణిక్య. అతని మరణానంతరం త్రిపురని, స్వతంత్ర భారతదేశంతో విలీనం చేయడానికి, భారతదేశంతో ఒప్పందం చేసుకున్నారు. 1950లో కేంద్రపాలిత ప్రాంతమయింది. అక్కడి ప్రజల ఆందోళన అభ్యర్థన మేరకు 1972లో సంపూర్ణ రాష్ట్రంగా మారింది.



అనేక తెగల రకరకాల పౌరలతో కప్పబడి ఉన్న ప్రాంతం త్రిపుర. తమతమ పౌరల భావావేశాలు అక్కడి కవులకు అనివార్యం కావడంలో ఆశ్చర్యం ఏముంది. బెంగాలీ మాట్లాడే జనాభా దాదాపు 80 శాతం. అక్కడున్న అందరికీ బెంగాలీ అర్థం అవుతుంది. 15వ శతాబ్దంలోని ధర్మ మాణిక్య మహారాజు (1431–1462) కాలంలో హిందూ మతంలోకి మార్పిడితో బాటు, బెంగాలీని అధికారిక న్యాయస్థాన భాషగా కూడా చేశారు. ఆ కారణంగా బెంగాలీ అక్కడ సుస్థిర స్థానం ఆక్రమించింది. ఒకప్పటి తూర్పు బెంగాలు, ఇప్పటి బంగ్లాదేశ్ నుండి బెంగాలీ భాషీయుల అంతులేని వలస ప్రవాహం, ఈ ప్రాంతం లోని కక్-బరక్ స్థానీయుల్ని అల్పసంఖ్యాక వర్గంగా మార్చింది. గిరిజన తెగల్లో అక్కడ ఎక్కువగా మాట్లాడేది కక్-బరక్. హిందీ, మోగ్, ఒడియా, మణిపురీ, బిష్ణుప్రియ మణిపురీ, చక్మా, హలం, గారోలాంటి ఇతర భాషీయులు కూడా ఉన్నారు. అక్కడి ప్రజలు కనీసం రెండు భాషలు మాట్లాడతారు.

నిజానికి త్రిపుర మాండలీకాన్నే కక్-బరక్ అంటారు. కక్ అంటే పదాలు, బరక్ అంటే జనులు. కక్-బరక్ అంటే ప్రజల భాష అని అర్థం. ఈ మాండలికం ఇండో బర్మన్ కుటుంబానికి చెందింది. 1979లో త్రిపుర ప్రభుత్వం కక్-బరక్ భాషని కూడా రాష్ట్ర అధికార భాషగా గుర్తించినప్పటి నుండీ, ఆ భాషలో సాహిత్యం ఎక్కువ కావడం మొదలైంది. కొలొమ అన్న కక్-బరక్ లిపి

19వ శతాబ్దానికే కనుమరుగైంది. అప్పటినుండి బెంగాలీ లిపి, కక్–బరక్ లిపిగా మారింది. అయితే కొన్నాళ్లకు అది వివాదాస్పదం కావడంతో, కొందరు బెంగాలీ లిపిలోను, మరికొందరు రోమన్ లిపిలోను ఈ భాషని రాస్తున్నారు. కక్–బరక్‌లో స్వీయ సాహిత్య సృజనతోపాటు, బెంగాలీ నుండి అనువాదాలు విరివిగా చేసుకుంటున్నారు.

ప్రాచీన త్రిపుర పాలకులు కేవలం సంస్కృతి పోషకులు మాత్రమే కాదు. ఇతర సృజనాత్మక రంగాల్లో కూడా నిష్ణాతులు. త్రిపుర కొత్త యుగం మహారాజా బీర్ చంద్ర (1862–1896) కాలంలో మొదలయింది. అతనొక గొప్ప వర్ణ చిత్రకారుడు, అద్భుతమైన ఛాయాచిత్ర కారుడు, సంగీత స్వరకర్త, వైష్ణవ సాహిత్యంలో గొప్ప పండితుడు, అన్ని సృజనాత్మక ప్రక్రియల్లో పారీణుడు. బెంగాలు రవీంద్రనాథ్ ఠాకూర్‌ని 1882లో, అతని 21 ఏళ్ల ప్రాయంలోనే అతనికి "శ్రేష్ఠ కవి" బిరుదు ఇచ్చి సత్కరించి, రవీంద్రునితోబాటు అందర్నీ ఆశ్చర్యపర్చాడు. అప్పటికి రవీంద్రుని "భగ్న హృదయ్" ఒక్క కావ్యమే వెలువడింది. ఆ చారిత్రక బంధం 60 ఏళ్లపాటు, రవీంద్రుని జీవితాంతమూ కొనసాగింది. అది మొదలు నాలుగు తరాల త్రిపుర పాలకులకు, రవీంద్రుడు స్నేహితుడు మార్గదర్శిగా కూడా అయాడు. తన పూర్వీకుల అడుగుజాడల్లో నడుస్తూ త్రిపుర చివరి రాజు, మహారాజ బీర్ బిక్రం కిశోర్, రవీంద్రుడి మరణానికి మూడు నెలల ముందు, రవీంద్రుని "భారత్ భాస్కర్" బిరుదుతో సత్కరించాడు. త్రిపుర రాజు ఆస్థానంలో రవీంద్రుని 80వ జన్మదిన వార్షికోత్సవం, ఘనంగా నిర్వహించారు. అప్పటినుండి ఇప్పటివరకూ రవీంద్రునితోబాటు, ఎక్కడినుంచి బెంగాలీ సాహిత్యం వచ్చినా, అది వారి సాహిత్యమే అన్నంత సంబరం అక్కడి బెంగాలీ భాషీయులకి. త్రిపుర బెంగాలీ కవుల్లో – అనిల్ సర్కార్ (1939–2015), కల్యాణ్ బ్రత చక్రబొర్తి (1941–), స్వపన్ సెన్ గుప్త (1945–), భాస్కర్ రాయ్ బర్మన్ (1950–), పిజూష్ రౌత్, సరోజ్ కే చౌధురి మొదలైనవారు ముఖ్యులు.

*కల్యాణ్ బ్రత చక్రబొర్తి (1941–):* ప్రముఖ బెంగాలీ కవి. ఆరు కవిత్వ సంకలనాలు వెలువరించారు. మూడు రాష్ట్ర సాహిత్య అవార్డులు అందుకున్నారు. ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ పత్రికా విలేఖరిగా కూడా ఉన్నారు.

***సింధుకుమార్ పర్యటనకు ముందు***

***అర్ధరాత్రి ఒక గ్రామం తగలబడుతోంది***

***వాడ జనమంతా / అస్తవ్యస్తంగా అడవులలోకి పారిపోతున్నారు***

***బిడ్డ ఏడుస్తుందన్న భయంతో/ ఇనుప పిడికిలితో నోరు నొక్కుతోంది***

***తల్లి / ఈ రోజుల్లో అక్కడ ఎవరూ కుక్కల్ని పెంచుకోవడం లేదు.***

***ఎవరైనా ఒక్కరు తప్పించుకోగలరా? / ఇంటి పిల్లలు భయంకర***

***హంతకులయారు / రక్షణ గృహాల లోపల కూడా వారు***

***అనాలోచితంగా కాల్పులు జరుపుతూ పారిపోతున్నారు***

***మారణహోమాల్లో పురుగుల్లా ప్రజలు మరణిస్తున్నారు***

***రోజంతా బంద్లు లాగి అలసిపోయి / సర్బజోయ్, కుసుం, గోపీనాథ్***

***నిద్రపోతున్నారు / బిడ్డల లేత కాళ్లు వారి గుండెల్ని అదుముతున్నాయి***

***/ వేకువనే సింధుకుమార్ గ్రామం పోవడానికి***

***నేతగాని భార్య భక్తిగా సిద్ధపడుతోంది / వీళ్లంతా దుర్బలులు,***

***పుట్టుకతో బానిసలు, నిత్యం బానిసలు / ఎవరిదో స్వేచ్ఛని తమ***

***పిడికిలిలో వాళ్లు ఎలా ఉంచుకోగలరు? / ద్వారం దగ్గర ఏదో***

***నెరిసిన తలపిన్ను పడుంది / పడగొట్టిన పాత్రనుండి చెదిరిన కొంత***

***ధాన్యం గింజలు***

(సింధుకుమార్ – తీవ్రవాదుల బాధిత గ్రామం)

తిరుగుబాటుదార్లు చంపిన 13 మంది కోసం రాసిన సంవేదనలు కవితలో పిజూష్ రౌత్ *"తిరుగుబాటుదార్ల ఆగ్రహం ఇచ్చిన బహుమతి/ పదముగ్గురు తండ్రులకు పదమూడు తాజా కళేబరాలు"* అని బాధపడతాడు.

త్రిపురలో ఉద్రిక్తతలకు ముఖ్య కారణం ఆ ప్రాంతంలోకి బెంగాలీ మాట్లాడే వారి వలసలు, ముఖ్యంగా ఒకప్పటి తూర్పు బెంగాలు, ఇప్పటి బంగ్లాదేశ్ నుండి. వారి మూలంగా కక్–బరక్ మాట్లాడే అక్కడి స్థానిక వర్గాలను అక్కడి జనాభాలో అల్పసంఖాక వర్గంగా మార్చటమే. బెంగాలీ సాహిత్యం ఎంత ఉత్కృష్టమైనదైనా, సమకాలీన కక్–బరక్ సాహిత్యం మూలాల్ని వెదుక్కుంటూ వారి సాహిత్యానికి ఒక ప్రత్యేకమైన గుర్తింపుతెచ్చే ప్రయత్నం, అక్కడి కక్–బరక్ సాహిత్యకారులు చేస్తున్నారు. వారి కవిత్వంలో ప్రముఖులు – చంద్రకాంత మురసింగ్ (1957–), నంద కుమార్ దేబ్ బర్మ (1950–), కవయిత్రి శెఫాలి దేబ్

బర్మ (1964–), సుధన్య త్రిపుర (1959–), నరేంద్ర దేబ్ బర్మ (1957–), శ్యాంలాల్ దేబ్ బర్మ (1951–), బికాష్ రాయ్ దేబ్ బర్మ (1960–), బిజొయ్ దేబ్ బర్మ (1962–) మొదలైనవారు.

*చంద్రకాంత మురసింగ్ (1957–):* త్రిపురలో అత్యంత గౌరవనీయుడైన కవి. ఆరు కవిత్వ సంకలనాలు వెలువరించాడు. ప్రపంచవ్యాప్తంగా పేరొందిన సంకలనాలలోను, పత్రికలలోను కవితలు ప్రచురించబడ్డాయి. సాహిత్య అకాడమీ నుండి భాషా సమ్మాన్, త్రిపురలో ప్రతిష్ఠాత్మకమైన రవీంద్ర పురస్కార్‌లాంటి అనేక పురస్కారాలు లభించాయి.

**ఆడవి – 1987**

***పూల దండల సువాసనలు / ఏడు కొండల్ని వెంటాడుతున్నాయి ఈ కాలంలోనే అవి పుష్పించాయా? ఎవరికి తెలుసు! వేకువన కోడిపుంజు కూతల్ని / సందెచీకట్లో లేగల అరుపుల్ని పోగొట్టుకున్నాక / ఆడవిని నేనిపుడు చేరుకోలేను / కోడిపిల్లల్ని పిలుస్తూ/మధ్యాహ్నం నుండి మునిచీకటివరకూ తిరుగుతూ అరుస్తూ / కోడిపెట్ట ఇపుడు అడవిలో ఉంది / వెంటాడే మాధవీపూల పరిమళపు వసంతగాలి మర్మరధ్వనిని తప్పించుకుని / తుపాకిమందు వాసనతో ఘాటుగా ఉంది.***

*సుధన్య త్రిపుర (1959–):* ఎనిమిది కవిత్వ సంకలనాలు వెలువరించాడు. కథా రచయిత కూడా. ప్రతిష్ఠాత్మక రబీంద్ర పురస్కార గ్రహీత.

***పిల్లంగ్రోవి పిచ్చివాడు / నదిమీద / పక్షులు ఎగురుతాయి పక్షిమీద / మేఘాలు ఎగురుతాయి / నదిలో / చేప ఆడుతుంది చేపమీద / పూలు తేలుతాయి / ఒడ్డున / చేపలవల ఉంచుకొని / పిల్లంగ్రోవి పిచ్చివాడు / వేణువు వాయిస్తున్నాడు***

చక్మా మాట్లాడేవారు, త్రిపుర బంగ్లాదేశ్‌లలో ఎక్కువ ఉన్నారు. చక్మా ఇండో యూరోపియన్ భాషా కుటుంబానికి చెందినది. లిపి బర్మా లిపికి దగ్గరగా ఉంటుంది. ఈ భాష లిపి 8వ శతాబ్దం నుండీ ఉంది. 11–15 శతాబ్దాల మధ్య ఈ లిపిలో కొంత సాహిత్యమూ ఉంది. అయితే 20వ శతాబ్దానికి దానిని పునరుద్ధరించారు. అధికారికంగా ఈ భాషకు గుర్తింపు లేకపోయినా త్రిపురలో కొన్ని ప్రాథమిక పాఠశాలల్లో 2012 నుండీ దాన్ని ప్రవేశపెట్టారు. సాహిత్యంలో కూడా ఇటీవల కాలంలో వారి జీవితాలు సంస్కృతిని ప్రతిబింబిస్తూ కొంతమంది కృషి చేస్తున్నారు. చక్మా కవిత్వంలో ముఖ్యులు నిరంజన్ చక్మా (1951–), కవయిత్రి జోగ్మయ చక్మా (1960–).

*నిరంజన్ చక్మా (1951–):* ప్రముఖ కవి. ఇప్పటివరకూ ఎనిమిది కవిత్వ సంకలనాలు వెలువడ్డాయి. అంబేద్కర్ విశిష్ట సభ్యత్వ అవార్డుతో బాటు రాష్ట్ర ప్రభుత్వం నుండి రెండు పురస్కారాలు లభించాయి.

**అడవి వీరగాథలు**

***తుపాను విధ్వంసం తరువాత ప్రతీసారి / కొండంతా నిశ్శబ్దం అవరోహిస్తుంది / పరాకులో ఉన్న పక్షులు కలవరపడతాయి ఛిన్నాభిన్నమైపోయిన వాటి గూళ్లకు చేరుకోవాలా / తిండి అన్వేషణలో బయటకు పోవాలా / ఒకరోజు ఉదయం పక్షులు గుర్తింపు సమస్యతో బాధపడ్డాయి / వాటిని గుర్తించేందుకు వాడుతున్న పేరు / అంతకుముందు వారు ఎన్నడూ వినలేదు***

***ఇటీవల వారి హక్కులు గుర్తింపు మీద / బ్రహ్మాండమైన వాదోపవాదాలు / విద్వత్తుగల జెనీవా సదస్సుని బాగా కుదిపేశాయి / వేదాల్నీ విస్తారంగా ఉల్లేఖించారు /విస్తరణవాదుల శతాబ్దాల పాతబడ్డ సిద్ధాంతాల్ని / గొప్ప ఉద్వేగంతో సమర్పించారు / ఈ పాల్గొన్నవారు / అడవి వీరగాథల్ని అర్థం చేసుకుందుకు / ఎన్నడూ ప్రయత్నం చేయలేదు***

*నంద కుమార్ దేబ్ బర్మ (1950–):* కక్–బరక్ కవుల్లో అగ్రేసర కవి. రవీంద్ర పురస్కార గ్రహీత. త్రిపురలోని గిరిజన తెగలకు అడవి ఒక అవిభాజ్యమైన అంగం. వారు అడవిని ఆరాధిస్తారు. అడవి వారి గుర్తింపు. అడవి వారి జీవనాధారం. దానినే నొక్కి చెప్తున్న కవిత, అడవి.

**అడవి**

***ఆమెను నువ్వు పరిత్యజించలేవు / ఆమె నీ హృదయంలో పొదిగి ఉంది / అగ్ని దగ్ధం చేయలేదు / నీరు ధ్వంసం చేయలేదు / నీ కలలో మేల్కొని / నీతో మాటాడుతుంది నువ్వు ఆమెను తుడిచి పారేయలేవు / నీ భావావేశాల్లో ఆమె చుట్టబడి ఉంది.***

ముకుంద రామారావు
హైదరాబాద్. ఫోన్: 990 834 7273.

# గోదావరి కథ

*- దాట్ల దేవదానం రాజు*

పంట కాలవల రహదారి గుండా... జలనిధి పొలాల తడిపి... చిగురై గింజలై... అన్నం ముద్దలవుతున్నపుడు... మా యింట ఎసరు కాగే సలసలలు సైతం... గోదావరి నీటిరాగపు సంతకాలవుతాయి... గోదావరీ గోదావరీ... నీ ఆర్ద్ర చిత్రం... జలజలమని పారి... వరికంకుల దీపమౌతుంది కదా... గుండెల్ని వెలిగించే నీటి వసంతాల పచ్చతోరణం... జలతారు పాయల వెచ్చని ప్రేమగా... పొదువుకుంటాను... మాగాణి క్షేత్రాల నడుమ ఒయ్యారంగా పరుగిడే పసిడి వన్నెల గోదావరి... సకల సాంస్కృతిక వైభవాలకు సాక్షి. తూర్పున అగాధమౌ జలనిధి సంద్రం... నిక్షిప్త జలపుష్పాల ముత్యాల రహస్య పేటిక. మరో పక్క అరచేయి అడ్డం పెట్టుకుని ఆకాశం వైపు తడికోసం చెమ్మకోసం నిరీక్షణల మెట్ట ప్రాంతం. ఇంకోపక్క నాగరికతకు దూరంగా అమాయకత్వం నిండిన అడివి పుత్రుల వాసం ఏజెన్సీ ప్రాంతం.

అన్నవరం, ద్రాక్షారామం స్థలపురాణాల మహత్మ్యాల మొక్కుల మానసిక ప్రశాంతానిలయాల ఆధ్యాత్మిక శోభలు... ఎందరో సంఘ సంస్కర్తలు... జాతీయోద్యమ నిర్మాతలు... దేశభక్తులు... మరెందరో త్యాగధనులు, దానశీలురు, శ్రమజీవన సౌందర్యోపాసకులు... ప్రాచీన సాహిత్య మూలవిరాట్ నన్నయ్య...

తూర్పు గోదావరి జిల్లాలో సాహిత్య పోషకత్వం ఉంది. జాతీయోద్యమ సవ్వడులున్నాయి. సంఘ సంస్కరణ కార్యకలాపాలున్నాయి. అంధ విశ్వాసాల్ని తునుమాడే ముందుచూపు ఉంది. తెలుగు పలుకుబడుల సాహితీ విన్యాసాల సోయగం ఉంది. విభిన్న ప్రక్రియలకు తొలి సంతకం చేసిన బాట ఉంది. తొలితరం చెక్కిన తెలుగు కథ సోపానం ఉంది. గురజాడ అందించిన దారి పట్టుకుని గుడిపాటి వెంకట చలం, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, చింతా దీక్షితులు తెలుగు కథాసాహిత్యాన్ని సుసంపన్నం చేసిన నేపథ్యం ఉంది. కథాసుగంధాన్ని నాలుగు వైపులా విస్తరింప చేసిన కలాల పంట ఉంది. భాష ఎంత ప్రాచీనమైనదో కథ అంత ప్రాచీనమైనదయి ఉండవచ్చని చేరా అభిప్రాయ పడ్డారు.

మౌఖిక సాంప్రదాయంలో పల్లె ప్రజల నోళ్ళలో కథ నానుతూనే ఉంది. అనేక వందల సంవత్సరాల పాటు గ్రామీణ కళాకారులు కథల్ని గానం చేసారు. బుర్రకథలు, జంగమ కథలు, హరికథలు లాంటివి లిఖిత సాహిత్యం ప్రారంభం కాని రోజుల నుండీ అలరిస్తూనే ఉన్నాయి. భాషతో పాటు కథాప్రకియ పరిణామం చెందిందనే అనుకోవాలి.

లిఖిత సాహిత్యంలో కథ ఒక శక్తివంతమైన సాహిత్య ప్రక్రియగా రూపుదిద్దుకుంది. ఆధునిక కాలంలో కథ ఒక సందేశం ఇవ్వడమో చమత్కారం చిందించడమో దృశ్యాన్ని కళ్ళ ముందుంచడమో కొసమెరుపుతో చమక్కుమనిపించడంతోనో సరిపెట్టలేదు. ఆయా సంవత్సరాలలో జరిగిన సంఘటనలు, వెలువెత్తిన సమస్యలు, ఉద్యమాలు, మానవ సంబంధాల్లో వస్తున్న మార్పులు, విలువల విచ్ఛిన్నత, కుటుంబాల్లో కరువైన ఆత్మీయతానుబంధాలు మొదలైన వాటిని చిత్రించి సామాజిక చరిత్రను నమోదు చేసే అత్యంత బాధ్యతాయుతమైన పాత్ర వహించింది. గడిచిన ముప్పై నలభై ఏళ్ళ సామాజిక చరిత్ర తెలుసుకోవాలనుకుంటే ఆనాటి కథల్ని చదివితే సరిపోతుంది. కథంటే కాలక్షేపం

కథ కాదు. కథంటే జీవితం. కథంటే సమాజం. కథంటే సామాజిక చారిత్రక సందర్భం. కథంటే ఒక ప్రాంత భౌగోళికతను అస్తిత్వాన్ని ఆత్మగౌరవాన్ని విశాల ప్రపంచానికి ఎరుక కలిగించే సాధనం.

భౌగోళికంగా తూర్పుగోదావరి జిల్లాకు పరిమితమైన కథాసాహిత్యం గురించి సమగ్రంగా విశదీకరించాలంటే అనేక పూర్వాపరాలు విశ్లేషించు కోవాల్సి వస్తుంది. అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ని భౌగోళిక స్వరూప స్వభావాలున్నాయో అన్నీ తూర్పు గోదావరి జిల్లాలో ఉన్నాయి. తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్రలను ప్రతిఫలించే ప్రాంతాలు ఈ జిల్లాలో ఉన్నాయి. డెల్టా, మెట్ట, ఏజన్సీలు తమదైన భౌతిక లక్షణాలు కలిగి ఉన్నాయి. ముఖ్యంగా గమనించవలసిన విషయం ఏమిటంటే మొత్తం జిల్లా అంతా సంపద్వంతమైన ప్రాంతం కాదు. పుష్కలంగా గోదావరి నీటి లభ్యతతో రెండు పంటల మాగాణీ వానచినుకుల కోసం ఎదురుచూసే మెట్టప్రాంతాల కలయిక ఇది. ఆరువేల అడుగుల ఎత్తు, ఐదొందల సెంటీ మీటర్ల వర్షపాతమూగల పశ్చిమ కనుమలు గోదావరి జన్మస్థానం.

మొత్తం గోదావరి పొడవు 1450 కి. మీ. ధవళేశ్వరం దిగువన గోదావరి పాయలుగా చీలింది. గౌతమి, వృద్ధగౌతమి, కోరింగ నదులుగా విడివడి యానాం వద్ద బంగాళాఖాతంలో కలుస్తున్నాయి. అలాగే వైనతేయ, వశిష్టలు విడిపోయి పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం వద్ద బంగాళాఖాతంలో కలుస్తున్నాయి. ఈ నదీ శాఖల నడుమ ప్రాంతాని కోనసీమ అంటారు.

గోదావరి డెల్టాలో పందొమ్మిదవ శతాబ్దం పూర్వార్థంలో భయంకరమైన కరువు తాండవించింది. ఒక పక్క గోదావరి జలాలు వృధాగా సముద్రంలో కలియడం మరో పక్క వరదలతో సామాజిక జీవితం అల్లకల్లోలమయ్యేది. అట్లాంటి సమయంలో మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ 1953లో ధవళేశ్వరం దగ్గర ఆనకట్ట నిర్మించారు. ఫలితంగా తూర్పుగోదావరి జిల్లాలో కొన్ని ప్రాంతాలు పసిడి పంటల మాగాణిగా రూపుదాల్చాయి. వ్యవసాయ దిగుబడి పెరిగింది. ప్రజల ఆదాయాలు పెరిగాయి. తదనుగుణంగా తూర్పుగోదావరి జిల్లా సామాజిక జీవితంలో పెనుమార్పులు వచ్చాయి. కారణాలు ఏమైతేనేం ఇంగ్లీషువారు ప్రవేశపెట్టిన విద్యను కొన్ని వర్గాలు అందిపుచ్చుకున్నాయి. వేదంలా ఘోషించే గోదావరి... అమరధామంలా శోభిల్లే రాజమహేంద్రి... శతాబ్దాల చరిత గల సుందర నగరం... గత వైభవ దీప్తులతో కమ్మని కావ్యం... కొట్టుకుని పోయే కొన్ని కోటిలింగాలు... వీరేశలింగమొకడు మిగిలెను చాలు... (ఆరుద్ర)

రాజమండ్రిలో గోదావరి ఒడ్డున నిలబడి... నీళ్ళలోకి తొంగి చూస్తే... నా ముఖం కనిపించదు... వీరేశలింగం గారి ముఖం కనిపిస్తుంది... నీళ్ళు దోసిట్లోకి తీసుకుంటే... తెలుగు సంస్కృతి దోసిట్లో నిలబడుతుంది... . (అద్దేపల్లి రామమోహన రావు) చదువులమ్మ చేతిలో చరిత్ర పుస్తకం... సంస్కారపు వెలుగులు ఆపాద మస్తకం... కెనడా ప్రతిబింబం కోకెనడా నగరం... కడలి తీర కంఠహార పచ్చల పతకం... విద్యా సొబగులతో ఇది చదువుల నగరం... మేధావుల పుట్టినిల్లు మహామహుల మెట్టినిల్లు... (ఎల్. కె. సుధాకర్) రాజమండ్రి, కాకినాడ తొలి నవీన పట్టణాలుగా మారాయి. ఎందరో మహానుభావులు తిరుగాడిన ప్రదేశాలయ్యాయి. సంఘ సంస్కరణోద్యమాల సాహితీ వైభవాల కార్యస్థానాలయ్యాయి. హిందూమతం మీద తిరుగుబాటుగా భావించి ప్రగతిశీలవాదులు బ్రహ్మసమాజం వైపు ఆకర్షితులయ్యారు. చదువుకున్న విద్యావంతులు దాదాపు ఉన్నత కులాలవారే. వారు గౌరవప్రదమైన వృత్తుల్లో ఉండటంవల్ల వారి మాటలకు విలువ ఏర్పడింది. ఎనిమిది వందల సంవత్సరాలు తెలుగు లిఖిత సాహిత్యం సంస్థానాలకు పరిమితమైంది. సంస్థానాలు కనుమరుగైన సందర్భంలో తెలుగు సాహిత్యం దిక్కుతోచనిది అయ్యింది. ఆ తర్వాత సంస్కృతం స్థానం ఇంగ్లీషు ఆక్రమించింది. పందొమ్మిదవ శతాబ్దం తొలి అర్థభాగం లిఖిత సాహిత్యం స్తబ్దతకు లోనయ్యింది. 1860 నాటికి పరిస్థితిలో మార్పు వచ్చింది. ఆనకట్ట నిర్మాణం వల్ల కొత్త సంపన్న వర్గం, ఇంగ్లీషు విద్య వల్ల మేధావి వర్గం ఏర్పడటంతో గోదావరి సీమలో తెలుగు సాహిత్యం మొగ్గ తొడిగింది.

తెలుగులో మొదటి నవల, మొదటి వ్యాసం, మొదటి ప్రహసనం, మొదటి చరిత్ర గ్రంథం, మొదటి శాస్త్ర గ్రంథాలకు కందుకూరి వీరేశలింగం పంతులుగారే ఆద్యులు. తను ఎన్నుకున్న ఉద్యమబాటకు కథ కన్న ప్రహసనం, వ్యాసం లాంటి ప్రక్రియలే మేలు అని ఆయన భావించారు. రాసే భాషకూ మాట్లాడే భాషకూ అంతరం ఉండకూడదని వాడుక భాషా ఉద్యమాన్ని గిడుగు రామమూర్తి పంతులు, గురజాడ అప్పారావు నడిపారు. ఇదొక ముఖ్యమైన సామాజిక ఉద్యమంగా మారింది.

పాశ్చాత్య దేశాలలో పారిశ్రామిక విప్లవ ఫలితంగా నిడివి ఎక్కువైన నవల స్థానంలో లఘు రచన అవసరం పెరిగింది. పత్రికా ప్రచురణ విస్తృతం కావడం వల్ల జీవితాన్ని ఆవిష్కరించే ప్రక్రియ కావాల్సివచ్చింది. ఆ వెతుకులాటలోంచే కథ ఒక ప్రక్రియగా ముందుకొచ్చింది. తెలుగు పరిస్థితి అంతే. 1950ల తర్వాత కథకులూ పెరిగారు. దానికి కారణం ఒక చిన్న కథ సామాజిక స్వరూపాన్ని క్లుప్తమైన రీతిలో చిత్రించగలదనే భావనే. అదీ కాకుండా ఒక నిర్ణీత కాలంలో వచ్చే వీలుండే పత్రికలో నవల ప్రచురించే అవకాశం లేకపోయింది. సీరియల్‌గా ప్రచురించే విధానం ఆనాటికి లేదు. ఈ కారణాలవల్ల తక్కువ పేజీల్లో ఆసక్తికరంగా చదివించే గుణం కలిగిన కథకు మార్గం ఏర్పడింది. జీవితంలోని ఒక పార్శ్వం తీసుకుని సూక్ష్మదృష్టితో పరిశీలించడానికి కథే ఉత్తమం అనిపించింది.

కథలు జిల్లాలోని వివిధ సామాజిక, ఆర్థిక, సామాజిక పరిణామాల్ని తగిన విధంగా ప్రతిఫలించాయని చెప్పవచ్చును. జిల్లా వైవిధ్యత రచనల్లోనూ ప్రతిబింబించింది. ముందు నుంచీ రాశిపరంగా కవిత్వానిదే పై చేయి. అలాగని వచన సాహిత్యం మరీ తక్కువ కాదు. మిగిలిన జిల్లాల సాహిత్యంతో పోల్చినపుడు కూడ విచారించక్కర్లేదు. సాహిత్యం విశ్వజనీనమైంది. అయినా సరే వస్తువు, వ్యక్తీకరణ ప్రాంతీయం కాకపోతే పాఠకుల్ని కదలించలేదు. ప్రాంతీయ సమస్యల్ని ప్రతిభావంతంగా సాహిత్యంలోకి ప్రవేశపెట్టగలిగిన వారే మంచి రచయితుల కాగలరు. ప్రస్తుత కాలంలో రకరకాల కారణాలవల్ల రచనలకు అధ్యయనం తగ్గింది. జీవితాన్ని పరిశీలించి రాయగలిగే శక్తి ఉండి కూడ సరైన ప్రోత్సాహం లేకపోవడం వల్ల రచయితలలో నిరాసక్తత కలిగింది. తూర్పుగోదావరి మినహాయింపు కాదు. ఆధునిక కథకు ఆద్యులెవరో అన్నది కాల సూచికకు సంబంధించిన విషయం. అయితే గురజాడ 'దిద్దుబాటు' కథలో కథకు ఉండాల్సిన సమస్త లక్షణాలు ఉన్నాయనడంలో సందేహం లేదు. గడిచిన వందేళ్ళుగా వృద్ధి పొందిన వస్తు శిల్పాలే కాకుండా సమాజంతో సజీవ సంబంధాలకూ మూలాలు తొలికథల్లో దొరుకుతాయి. తొలినాటి కథకులు గ్రామాలతో అనుబంధం కలిగినవారు. పల్లె జనాల అమాయకత్వం, శ్రమ జీవనం, మంచి మనసులు, పరోపకారం, కలహాలు లేని ఉమ్మడి కుటుంబం కథావస్తువులుగా ఉండేవి.

గుడిపాటి వెంకట చలం, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, చింతా దీక్షితులు తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి అద్భుతమైన బాటలు వేసారు. ముగ్గురూ కూడ సమాజానికి అవరోధాలుగా ఉన్న విలువల్ని ప్రశ్నించే కథలు రాసారు. వీరు ఎంచుకున్న ఇతివృత్తాల్లో గానీ శిల్ప పద్ధతుల్లో గానీ పెద్ద తేడా లేదు. ఇప్పటికీ వారి కథలు కొత్తదనంతో మార్గదర్శకంగా ఉండటానికి వారి ప్రతిభే కారణం. చలం కథలు రమ్యమైన శైలిలో స్త్రీ స్వేచ్ఛను కోరుతూ రాసినవి. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి కథలు స్త్రీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వివరించడమే కాకుండా స్త్రీ విద్య, చైతన్యం అవసరమని చెబుతాయి.

ఇక చింతా దీక్షితులు అణగారిన వర్గాలు లేదా సంచార జీవుల జీవితాల్ని కథలుగా మలిచారు. ముగ్గురూ కూడ తెలుగు వాడుక భాషను అత్యంత సహజంగా ఉపయోగించుకుని కథలు రాసారు. ముఖ్యంగా వీరి కథల్లో గ్రామీణత స్పష్టంగా కనిపిస్తుంది. భిన్నమైన ఎత్తుగడలతో వైవిధ్యంగా ఉండే ముగింపులతో కథలు రాసి మెప్పించారు. సరళత, వ్యవహారిక భాషలోని కొత్త సౌందర్యం వీరి కథల్లో కనబడుతుంది. ఆ రకంగా వస్తువు, భాష, ఇతివృత్తం, ముగింపు మొదలైన అంశాలలో తూర్పుగోదావరి జిల్లా కథ ఒక ఆధునిక ఒరవడిని సాధించిందని చెప్పవచ్చును.

ప్రత్యేకంగా తూర్పుగోదావరి జిల్లాలో పుట్టిన వారు

కొందరైతే ఉద్యోగమో వ్యవసాయమో వ్యాపారమో చేసుకుంటూ ఇదే తమ స్వంత నేలగా భావించి ఒకానొక ఆత్మీయ అనుబంధంతో ఇక్కడ మనుషులతో మమేకమై కథలు రాసినవారు మరికొందరు. ఇక్కడ జన్మించి ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ మరో జిల్లాలో లేదా మరో దేశంలో స్థిరపడి సృజనాత్మక రంగంలో కృషి చేసి జన్మభూమి పట్ల మమకారంతో రచనలు చేసినవారు ఇంకా కొందరు. అందరూ ఈ ప్రాంతాన్ని ప్రేమించినవారే ప్రేమిస్తున్నవారే. వీరెవ్వరినీ వేరుగా చూడటం మంచిది కాదని భావించి అందుబాటులో ఉన్న అందరి గురించి లేఖామాత్రంగానైనా తెలియజేసే ప్రయత్నం ఇది. పైగా స్థానికతపట్ల ఒక విశాలభావం అవసరమైన చారిత్రక సందర్భంగా భావించవచ్చు. ఎవరైనా ఈ జాబితాలో చోటు లేకపోయినా లేక విషయ వివరణలో ఎక్కువ తక్కువ అనిపించినా లేదా ప్రాధాన్యతాక్రమాల్లో తేడాలు కనిపించినా అది ఉద్దేశపూర్వకంగా జరిగింది కాదని గ్రహించగలరు. ముందుగా తొలితరం కథకుల గురించి ముచ్చటించుకుందాం.

*"కథలంటే పైపైన వున్నాయనుకున్నారేమో? అవి కల్పించడానికి చాల గొప్ప ప్రతిభ వుండాలి. వాటి విలువ తెలుసుకోడానికెంతో పరిజ్ఞానం ఉండాలి. అవి చెప్పడానికెంతో రుచి ఉండాలి. అవి బోధపరచుకోడానికెంతో బుద్ధి సూక్ష్మత వుండాలి. కథలు కళ్ళకు వెలుగిస్తాయి. బుద్ధికి పదును పెడతాయి. మనసుకి ఉత్సాహమూ ఉల్లాసమూ కలిగిస్తాయి. జడునకున్నూ కల్పనాశక్తిని ప్రసాదిస్తాయి."*

*– శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి*

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి కథాప్రయోజనం, ప్రాసంగిత గురించి చెప్పిన మాటలివి. ఆయనకు కథ పట్ల అంకితభావం, ఆపేక్ష, గౌరవం ఎంతటిదో ఈ మాటలు చదవగానే తెలుస్తుంది. తూర్పుగోదావరి జిల్లా పొలమూరులో 1891 ఏప్రిల్ 23 తేదీన మధ్యతరగతి వైదిక పండిత కుటుంబంలో జన్మించారు. కథాసాహిత్యానికి మకుటాయమానమైన కథలు రాసారు. తెలుగు కథారచనకే కొత్తదనం కల్పించారు. తెలుగు పాఠక లోకానికి పఠనాసక్తిని పెంపొందించే కథలు ఈయన కలం నుండి వెలువడ్డాయి. గురజాడ తర్వాత కథావేదికనలంకరించి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కథకుడాయన. తెలుగువారి ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలు, తెలుగు పలుకుబడి, చక్కని తెలుగు నుడికారం, తెలుగు వాతావరణం శ్రీపాద వారి కథల నిండా ఉంటాయి. ఆయన ఎంచుకున్న ఇతివృత్తాలు కొన్ని ఈనాటికీ కొత్తదనంతో మిలమిలా మెరుస్తాయి. ఆధునిక ధోరణులకు ప్రతీకలుగా స్త్రీలను నిలిపి కథలల్లారు. 'శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి కథలు' మూడు సంపుటాలుగా వెలువడ్డాయి. 'గులాబీ అత్తరు' కథలో రసహీనులైన రాజోద్యోగులు ముళ్ళ కంచెలా తయారైనప్పటికీ ఆత్మవిశ్వాసం కోల్పోని ఒక మనిషి కథ. 'వడ్ల గింజలు' కథలో చదరంగంలో జమీందారుని ఆటకట్టు చేసి గడీగడీవి రెట్టింపు చేస్తూ వడ్లగింజల్ని బహుమతిగా కోరుకున్న బుద్ధిజీవి కథ ఇది. 64 గడులకు గింజల్ని రెట్టింపు చేసుకునిపోతే వందలు వేలు బస్తాలయ్యేటప్పటికి కంగుతినడం జమీందారుని వంతైంది. మనం ఆశ్చర్యచకితులవుతాం. కలుపుమొక్కలు, అలాంటి తవ్వాయి వస్తే, తాపీమేస్త్రీ రామదీక్షితులు, ఇల్లు పట్టిన విధవాడపడుచు, అరికాళ్ల కింద మంటలు... ఇలా ఎన్నో వేగంగా సాగే శక్తిమంతమైన నుడికారంతో తెలుగు కథకు ఒక స్వంత వ్యక్తిత్వాన్ని సంతరించిన శ్రీపాదకు 1956లో కనకాభిషేక గౌరవం అందుకున్నారు.

**చింతా దీక్షితులు:**

తూర్పుగోదావరి జిల్లా దంగేరులో 1891లో చింతా దీక్షితులు జన్మించారు. 1920 సంవత్సరంలో సఖ, సాహితి పత్రికల ద్వారా సాహిత్య ప్రవేశం చేశారు. సాంప్రదాయంలోనే పాదాలు మోపినప్పటికీ శుభప్రదమైన మార్పు కోసం నిండు గుండెలతో స్వాగతం పలికిన రచయిత. జనపదాలను ఆశ్రయించుకుని బతికే దేశ దిమ్మరులకు అడవుల్ని నమ్ముకుని బతికే గిరిజనులకు ప్రప్రథమంగా కథాసాహిత్యంలో చోటు కల్పించిన ఖ్యాతి దీక్షితులు గారికి దక్కుతుంది. గుండెలకు హత్తుకునే కరుణామయ గాథలు, పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వించే హాస్యకథలు (వటీరావు కథలు) రాసి మెప్పించారు. అలాగే

బాల సాహిత్యంలోనూ ఎంతో కృషి చేశారు. గోదావరి ప్రాకృతిక రమణీయతను పల్లెసీమ అందాల్ని సామాన్యుల ఆచారవ్యవహారాలను కథల్లో చక్కగా వివరించారు. తాటివనం, సుగాలీ కుటుంబం, దాసరి పాట, చెంచురాణి, పెద్దమేడ కథలు ఆయన వ్యక్తిత్వానికి అద్దం పడతాయి. ఋతు పరిణామాలకూ మానవ జీవితంలోని బాల్య, యౌవన, వార్ధక్య దశలకూ లంకె కట్టిన 'తాటి వనము' (1925) కథ భావుకులైన పాఠకులకు నేటికీ మురిపిస్తుంది. అలాగే కరువు బీభత్సాన్ని కళ్ళకు కట్టినట్లుగా వర్ణించిన కథ 'సుగాలీ కుటుంబం'.

**గుడిపాటి వెంకట చలం:**

1894 మే 19 తేదీన చెన్నైలో జన్మించారు. పిఠాపురం, కాకినాడ, రాజమండ్రిలలో కొన్నేళ్ళు నివాసం ఉన్నారు. చలం తెలుగు కథకు ఒక శైలి, ఎత్తుగడ కల్పించి ఆధునికత చేకూర్చిన మహానుభావుడు. రచనారంగంలో చలం ఒక సంచలనం ఒక ఉద్వేగం. తను నమ్మిన విశ్వాసాల్ని ఆచరణాత్మకంగా అమలు చేసినవాడు. పురుషాధిక్యతలో నలిగిన స్త్రీల గురించిన కథలు, స్త్రీ స్వేచ్ఛ విమోచన ప్రబోధించే కథలు రాశారు. భార్య, సుశీల, అప్పుడూ ఇప్పుడూ, వితంతువు, జెలసీ, కర్మఫలం, ఆ రాత్రి మొదలైన కథలలో స్త్రీ పురుష సంబంధాల్ని గురించి సవివరంగా చర్చించారు. 'భార్య' కథలో స్త్రీ జీవితం ఒక బానిస బతుకులా మారి భర్త చేత అడుగడుగునా అణచివేసే దయనీయమైన స్థితిని చిత్రించారు. ఇక చలం 'సుశీల' కథ జాతీయోద్యమ కాలానికి సంబంధించినది. వివాహేతర ప్రేమ ప్రవాహంలో కొట్టుకుపోతున్న సుశీలకు భర్త సహాయ నిరాకరణోద్యమంలో పాల్గోవడం చూసి మనసు మార్చుకుంటుంది. చలం రాసిన కథలన్నింటా ఒక ప్రయోజనం, సందేశం మార్గనిర్దేశం ఉంది. ఇంకా కొందరు తొలితరం కథకుల గురించి క్లుప్తంగా–

**కవికొండల వెంకటరావు:**

రాజమండ్రిలో న్యాయవాద వృత్తిలో ఉండేవారు. వీరు పాటలు, యాత్రారచనలు, కథలు రాసారు. అవసాన దశలో కొట్టుమిట్టాడుతున్న సంస్థానాల గురించి 'జమిందారు' కథ రాసారు.

**వేదుల సత్యనారాయణ శాస్త్రి:**

భద్రాచలంలో జన్మించారు. కాకినాడ, పెద్దాపురం, పేరూరు, రామచంద్రపురం పాఠశాలల్లో ఉపాధ్యాయునిగా పని చేశారు. సత్యనారాయణ శాస్త్రి మానవ స్వభావాన్ని విశ్లేషించే కథలు రాశారు.

**ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి:**

విశాఖ జిల్లాలో జన్మించినా తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురంలో స్థిర నివాసం ఉన్నారు. తెలుగు కథకు కథానిక అని పేరు పెట్టినవారు. 'సృష్టిలో తీయనిది స్నేహమేనోయ్...' అనే ప్రసిద్ధ గీత రచయిత ఈయనే. సందేశాత్మకమైన కథలు రాశారు.

**పిలకా గణపతి శాస్త్రి:**

తూర్పుగోదావరి జిల్లా కట్టుంగ గ్రామంలో జన్మించారు. రాజమండ్రిలో చాల కాలం ఉద్యోగం చేసారు. 'ఆంధ్ర శిల్పి' పత్రికకు సంపాదకులుగా పని చేశారు. వీరి 'విశాల నేత్రాలు' ప్రసిద్ధి పొందిన నవల. కాశ్మీరు రాజు కథలను తెలుగు చేశారు.

**కోసూరి పద్మావతీ దేవి:**

రాజమండ్రి నివాసి. కథకురాలిగా ప్రసిద్ధురాలు. బ్రహ్మసమాజ భావాలతో ఉత్తేజం పొందారు. చలం రచనలు చదివి ప్రేరణ పొందారు. స్త్రీ ప్రగతి గురించి నిర్దిష్టమైన అభిప్రాయాలతో రచనలు చేశారు. వీరి 'పొగడ దండ' 'బంగారు బొమ్మ' కథాసంపుటాలు పేరు పొందాయి.

**ముక్కపాటి నరసింహ శాస్త్రి:**

పిఠాపురం నివాసం. హాస్యప్రియులు. 'బారిష్టరు పార్వతీశం' నవల గొప్ప హాస్య నవలగా ప్రసిద్ధి చెందినది.


యానాం బ్రిడ్జి

'కన్నవీ విన్నవీ' పేరిట రెండు కథా సంపుటిలు, 'బిక్షువు' కథాసంపుటులు వెలువడ్డాయి.

**భమిడిపాటి కామేశ్వర రావు:**

1897లో జన్మించారు. రాజమండ్రిలో అధ్యాపకునిగా పని చేశారు. హాస్యబ్రహ్మగా పేరు పొందారు. హాస్యరచనలకు కొత్త శైలిని రూపొందించారు. ఎక్కువగా నాటకాలు రాశారు. ఆయన రాసిన కథలు తక్కువే. 'గుస గుస పెళ్ళి' కథాసంపుటిని వెలువరించారు.

**ముళ్ళపూడి వెంకటరమణ:**

ధవళేశ్వరంలో 1931 జూన్ 28 తేదీన సాంప్రదాయ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. కథకుడు, వ్యాసకర్త, అనువాదకుడు, సినీ–టీవీ రచయిత. ఆధునిక హాస్యరచనకు ఒరవడి దిద్దిన రచయిత. కొత్త పదబంధాలతో చమత్కార శైలిలో అద్భుతంగా మురిపించగల శక్తి ఈయనకు ఉంది. ముళ్ళపూడి సాహితీసర్వస్వంలో కథ రమణీయం రెండు భాగాలుగా వచ్చింది. మొదటి భాగంలో సీతాకళ్యాణం, సీత, వేట, జనతా ఎక్స్‌ప్రెస్ అర్థాన్వేషణ మొదలైన 40 కథలూ రెండో భాగంలో రాధగోపాలం, చుట్టాలొచ్చారు, ఏకలవ్యుడు, ఋణానందలహరి మొదలైన 45 కథలూ ఉన్నాయి.

**పురాణం సుబ్రహ్మణ్య శర్మ:**

తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో జన్మించారు. నిర్మొహమాటమైన వ్యక్తిత్వం. పురాణం సీత పేరుతో రాసిన 'ఇల్లాలి ముచ్చట్లు' వీరి రచనా ప్రతిభకు తార్కాణం. సుమారు రెండొందలు కథలు రాసారు. 'నీలి', 'కథాసాగరం' 'కల కానిది' 'శివకాంత' కథాసంపుటులు వెలువడ్డాయి.

ఒకప్పుడు కథారచనలో మునిగి తేలి ప్రస్తుతం రాయడం విరమించుకున్నవారూ, ఆధునిక కథానిర్మాణాన్ని ఆకళింపు చేసుకుని ప్రస్తుతం కథలు రాస్తున్నవారిని గురించి తెలుసుకుందాం.

**ఆవంత్స సోమసుందర్:**

తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం దగ్గరలోని శంఖవరంలో 1924 నవంబరు 18 తేదీన జన్మించారు. రచనల్లో ప్రగతిశీలతను గాఢంగా కాంక్షించిన కవి, కథకుడు, విమర్శకుడు ఈయన. సోమసుందర్‌కు రచనా వ్యాసంగం ఒక తపస్సు. దాదాపు అన్ని ప్రక్రియల్లోనూ రచనలు చేశారు. ఊహించి రాయడంగాకాక అనుభవంలోంచి ఎదురైన సంఘటనలను కథలుగా మలిచారు. 1948 నుండి 1984 వరకు సుమారు 50 కథలు రాశారు. 1950లో 'బానిసల దేశం' 1984లో 'సోమసుందర్ కథలు' వచ్చాయి.

**పోరంకి దక్షిణామూర్తి:**

తూర్పుగోదావరి జిల్లా ఆలమూరులో 1935 డిసెంబరు 24 తేదీన జన్మించారు. సుమారు నలభై కథలు రాసారు. కోస్తా, తెలంగాణ, రాయలసీమ మాండలికాల్లో 'వెలుగూ వెన్నెలా గోదారీ', 'ముత్యాల పందిరి', 'రంగవల్లి' నవలలు రాసిన ఘనత ఈయనదే. తెలుగు కథపై 'కథానిక – స్వరూప స్వభావాలు' పేరుతో తెలుగు యువకథకులకు దిక్సూచి అనదగ్గ ఒక ప్రామాణిక సిద్ధాంత గ్రంథం రాశారు.

**శీలా వీర్రాజు:**

రాజమండ్రిలో 1939 ఏప్రిల్ 22వ తేదీన జన్మించారు. కవి, కథకుడు, చిత్రకారుడు, నవలా రచయిత. కొన్ని వందల పుస్తకాలకు ముఖచిత్రాలు గీశారు. మనుషులూ పాత్రలూ ఉండకుండా వర్ణనాత్మకంగా కథ రాయడం, నవలను కథన కావ్యంగా మలచడం వంటి ప్రయోగాలు చేశారు. సమాధి, మబ్బు తెరలు, వీర్రాజు కథలు, రంగుటద్దాలు, పగా మైనస్ ద్వేషం, వాళ్ళ మధ్య వంతెన, మనసులోని కంచె, ఊరు వీడ్కోలు చెప్పింది, హాదిని మొదలైన తొమ్మిది కథాసంపుటాలు వీరి కలం నుండి వెలువడ్డాయి.

**ఆలూరి విజయలక్ష్మి:**

1944లో జన్మించారు. కాకినాడలో నివాసం. సుమారు 150 కథలు రాశారు. నాలుగు నవలలు, అయిదు కథాసంపుటాలు ప్రచురించారు. బాలికలకు అత్యంత అవసరమైన కౌమారదశ అవగాహనకు సంబంధించి వైద్యవృత్తి రీత్యా రాసిన పుస్తకాలతో బాటు సృజనాత్మకంగా కథలు నవలలు రాశారు. తను మాత్రమే రాయగలిగే సామాజిక ప్రయోజనంతో తన అనుభవాలతో 'పేషెంటు చెప్పే కథలు' రాశారు. మీరు ప్రేమించ లేరు,

మీకీ భర్త వద్దు, అగ్నికిరణం, జ్వలిత కథాసంపుటులు వెలువడ్డాయి. శాస్త్రీయమైన ఆలోచనల్ని కలిగించడం, మూఢవిశ్వాసాల పట్ల విముఖత కలిగించిడం దిశగా రచనను బాధ్యతాయుతమైన కృత్యంగా భావించి కథలు రాశారు.

**వివినమూర్తి:**

తూర్పుగోదావరి జిల్లా సఖుమళ్ళ తిమ్మాపురంలో 1948లో జన్మించారు. సమాజమే మానవావసరాల కోసం ఏర్పడినపుడు దానిలో అసమానతలూ మానవ కల్పితాలే అవుతాయనే నమ్మకంతో కథలు రాయడం సాహిత్య ధర్మంగా భావిస్తూ కథలు రాశారు. ప్రవాహం, దిశ–దిశ కథాసంపుటులు వెలువడ్డాయి. కథలకు చిరునామాగా మారిన కథానిలయం కార్యకలాపాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

**యండమూరి వీరేంద్రనాథ్:**

తూర్పుగోదావరి జిల్లా రాజోలులో 1948 నవంబరు 14 తేదీన జన్మించారు. పాపులర్ రచయిత. కథ, నాటకం, నవల, వ్యక్తిత్వ వికాస రచనల్లో ఒక నూతన ఒరవడి సృష్టించిన ఘనత ఈయనది. ఆయన వ్యక్తిత్వవికాస రచనలు ఉత్తేజం, ప్రేరణ కలిగించి ప్రభావితం చేస్తాయి. వస్తువైవిధ్యం, చక్కటి శైలితో ఉత్సుకత కలిగించే విధంగా కథలుంటాయి. ' బెస్ట్ ఆఫ్ యండమూరి' పేరిట 25 కథలతో కథాసంపుటి వెలువడింది.

**కె. వి. ఎస్. వర్మ:**

తూర్పుగోదావరి జిల్లా కైకవోలులో 1950 అక్టోబరు 15 తేదీన జన్మించారు. పెనుమళ్ళలో పెరిగారు. శ్రీశ్రీ ఋక్కుల్ని రావిశాస్త్రి కథలుగా రాశారు. ఈయన రావిశాస్త్రి కథల్లోని ఒక్కో వాక్యం తీసుకుని 'రావిశాస్త్రికి కె. వి. ఎస్. వర్మ ఆరు కథల నివాళి'గా 'నేను నేనే' కథాసంపుటి వెలయించారు. ఇంకా యుద్ధం, ఫీనిక్స్, మరొకడు కథాసంపుటులు రచించారు.

**వంశీ:**

1956 నవంబరు 20 తేదీన పసలపూడిలో జన్మించారు. గోదావరి పరీవాహిక ప్రాంతాన్ని, ఆ ప్రాంతంలోని మనుషుల జీవితాలను, అక్కడి సకల ప్రాకృతిక శక్తుల్ని కథలుగా మలచడం వంశీ ప్రత్యేకత. 'మా పసలపూడి కథలు' తూర్పుగోదావరి జిల్లాలో సంభవించిన అనేక సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిణామాల్ని ప్రతిఫలించే కథలున్నాయి. గ్రామీణత, తూర్పుగోదావరి జిల్లా యాస, పలుకుబడులు ఆయన కథలకు స్పష్టమైన స్థానిక ముద్రను కలిగిస్తున్నాయి. 'ఆనాటి వానచినుకులు', 'మా పసలపూడి కథలు', 'దిగువ గోదావరి కథలు' వెలువడ్డాయి.

**కె. వరలక్ష్మి:**

తూర్పుగోదావరి మెట్ట ప్రాంతానికి చెందిన జగ్గంపేట నివాసం. స్త్రీల నిరసనని, తిరుగుబాటుని, వ్యక్తిత్వాన్ని సిద్ధాంతాలను ఏకరువు పెట్టకుండా చిత్రించిన కథకురాలిగా చేరా ప్రశంసించారు. సమాజాన్ని ఆధునిక జీవితాన్ని నిశితంగా పరిశీలించి వాస్తవికతను ప్రతిబింబించే కథలు రాశారు. జీవరాగం, మట్టి–బంగారం, అతడు–నేను, క్షతగాత్రి కథాసంపుటులు వెలువడ్డాయి.

**వాడ్రేవు వీరలక్ష్మీ దేవి:**

తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతమైన శరభవరంలో జన్మించారు. కాకినాడలో అధ్యాపకురాలిగా పని చేశారు. మంచి కథ రాసింతర్వాత ఒక పూలతోట పెంచి పూలు పూయించినంత ఆనందం కలుగుతుందనే వీరలక్ష్మీదేవి 'ఉత్సవ సౌరభం', ' కొండఫలం' కిటికీ బయట వెన్నెల కథాసంపుటులు వెలయించారు. గిరిజన స్త్రీల మీద జరుగుతున్న అజ్ఞాతమైన దోపిడి, గిరిజన ప్రాంతపు భూమి సమస్యల్ని చిత్రిస్తూ కాలుష్యం, కొండఫలం కథలు రాశారు. కథానిర్మాణం పట్ల నిర్దిష్టమైన అవగాహనతో ఆమె పెరిగిన జీవితంలోని సమస్యల మూలాల్ని వివరించే ప్రయత్నం వీరి కథలలో కనిపిస్తుంది.

**కుప్పిలి పద్మ:**

తండ్రి కడియంలో ఉద్యోగం చేసేవారు. తాతగారు (నాన్న తండ్రి) గారి దగ్గర రాజమండ్రిలో ఉండటం వల్ల పద్మ సాహిత్యంలో ఈదులాడే సదవకాశం కలిగింది. తెలుగు కథాసాహిత్యంలో విలక్షణమైన గొంతు ఈమెది. ఆర్థిక సంబంధాల్లో వస్తున్న మార్పుల్ని గమనించడం, ప్రపంచీకరణ కదలికల్ని తెలుసుకోవడం, స్త్రీ వాదం

వెలుగుల్ని గుర్తించడం వల్ల స్త్రీ వాదం దగ్గరే ఆగిపోకుండా అత్యంత ప్రతిభావంతంగా ఆధునిక పోకడల్ని చిత్రించే కథలు రాశారు. మానవసంబంధాల్లోని విభిన్న కోణాల్ని ఆవిష్కరించే విధంగా 'మనసుకో దాహం', 'ముక్తి', సాలభంజిక' కథాసంపుటులు వెలయించారు.

**తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి:**

1945 మే 14 తేదీన పిఠాపురంలో జన్మించారు. అమలాపురం ఎస్. కె. బి. ఆర్ కాలేజీలో లెక్చరర్గా, రాజమండ్రి ఆంధ్రకేసరి కళాశాల ప్రిన్సిపాల్గా పనిచేసి స్వచ్ఛంద విరమణ చేసి పర్యావరణ రంగంలో పనిచేస్తున్నారు. రాజమండ్రి నివాసం. కథారచనకు జీవితాన్నే ప్రేరణగా తీసుకుంటారు. కథ చేప్పే తీరు ప్రతిసారీ కొత్తగా వుండాలని కోరుకుని కథలు రాస్తారు. సంభాషణల్లోనూ, కథనంలోనూ అంతరంగ భావనల్ని బ్రాకెట్టులలో ఇచ్చి గమ్మత్తు చేస్తారు. నవలలు, వ్యాసాలు రాశారు. సుమారు 60 కథలు అచ్చయ్యాయి. 'వడ్ల చిలకలు', 'పతంజలి శాస్త్రి కథలు' కథాసంపుటులు వెలువడ్డాయి.

**ఎమ్మెస్ సూర్యనారాయణ:**

తూర్పుగోదావరి జిల్లా పొదలాడలో జన్మించారు. కథలు కవితాత్మకతతో నిండి వుంటాయి. నిరంతరం కథను వినూతన శైలిలో చెప్పడానికి ప్రయత్నిస్తారు. కథలు మళ్ళీ మళ్ళీ చదివేకొలదీ కొత్త కోణాలు కనిపిస్తాయి. అసంబద్ధతకు ప్రాధాన్యత నిచ్చే ఈయన కథలు ప్రత్యేక శైలీ విన్యాసంతో ఉంటాయి. 'ఆరోహణ' 'కొంచెం స్వప్నం కొంచెం సత్యం', 'ఉదారంగు మధ్యాహ్నం' కథాసంపుటులు వచ్చాయి.

**డి. ఆర్. ఇంద్ర:**

రాజమండ్రి నివాసం. విశ్రాంత ఉపాధ్యాయులు. నిబద్ధత గల కథారచయిత. తను నమ్మిన విశ్వాసాల్ని నలుగురితో పంచుకోవాలనే తపనతో కథలు రాస్తున్నారు. స్త్రీల అణచివేత. కుటుంబ హింస, అమానవీయకరణ, దోపిడీ సంస్కృతిని ఎండగట్టే కథలు రాయడం ఇష్టమని చెబుతారు. సమాజంలోని వికృత చేష్టలను వ్యంగ్య వైభవంతో రాసిన కథలు ఉన్నాయి. 'ఉత్తుత్తి మనుషులు' కథాసంపుటి వెలువడింది.

**ముప్పిడి ప్రభాకర రావు:**

రాజమండ్రి స్వస్థలం. 1940 జూలై 3వ తేదీన జన్మించారు. తానెరిగిన ప్రపంచాన్నీ తన చుట్టూవున్న పరిస్థితుల్నీ కథల్లో ఇమిడ్చి రాస్తారు. ఇప్పటి వరకు 'లోకం చూసాక', 'అమ్మ ఒడి' కథాసంపుటులు వెలువడ్డాయి

**వాడ్రేవు చిన వీరభద్రుడు:**

28 మార్చి 1962న తూర్పుగోదావరి జిల్లా శరభవరంలో జన్మించారు. కవి, కథారచయిత, వ్యాసకర్త, అనువాదకుడు, యాత్రారచయిత, ఉపన్యాసకుడు. 'ప్రశ్నభూమి' కథాసంపుటి ప్రచురించారు. పోలీసు అత్యాచారానికి గురైన యువతి మానసికస్థితిని వర్ణించే కథ 'సుజాత'. ఒక మగవాడిని నిర్బంధిస్తే శారీరక చిత్రహింస. అదే ఒక స్త్రీ అయితే అత్యాచారందాకా కొనసాగుతుందనే విషయం ఈ కథ చిత్రించింది.

**మాకినీడి సూర్యభాస్కర్:**

కాకినాడలో 1962 ఆగస్టు 17వ తేదీన జన్మించారు. కవి, కథకుడు, చిత్రకారుడు, విమర్శకుడు. ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. అన్ని ప్రక్రియలందు రచనలు చేశారు. 'అంతస్సౌందర్యం' కథాసంపుటిని ప్రచురించారు. 'క్రీ. శ 2050' ఐన్స్టీన్ సాపేక్షతా సిద్ధాంతం ఆధారంగా రాసిన కథ. ఈ కథను సామాన్యునికి సైతం అర్థమయ్యే రీతిలో రాయడం విశేషం.

**రావు కృష్ణారావు:**

రామచంద్రపురంలో జన్మించారు. ప్రస్తుత నివాసం కాకినాడ. కథైనా, వ్యాసమైనా, అనువాదవాదమైనా తను విశ్వసించిన నమ్మకాలు ఆధారంగానే రాస్తారు. విష సంస్కృతిని ఎదిరించాల్సింది పోయి లొంగిపోతున్న మధ్యతరగతివారి గురించి కథలు రాశారు. 'బతుకు పోరు' 'ఆధునిక బేతాళ కథలు (2 భాగాలు)' కథాసంపుటులు ప్రచురించారు.

**దాట్ల దేవదానం రాజు:**

తూర్పుగోదావరి జిల్లా కోలంకలో 1954 మార్చి 20 తేదీన జన్మించారు. ప్రస్తుత నివాసం యానాం. కవి, కథకుడు, చరిత్రకారుడు, విమర్శకుడు. ఆరు కవితాసంపుటులు, మూడు కథాసంపుటులు, రెండు

దీర్ఘకవితలు, ఒక చరిత్ర గ్రంథం వెలువడ్డాయి. 'దాట్ల దేవదానం రాజు కథలు' 'యానాం కథలు' 'కళ్యాణపురం' కథాసంపుటులు ప్రచురించారు. నిర్దుష్ట స్థల కాలాదుల్ని కేంద్రంగా చేసుకుని యానాం ప్రాంత భౌగోళిక పరిసరాలతో, చరిత్రతో ముడిపడిన ప్రజల జీవనపోరాటాల్నీ, భావోద్వేగాల్నీ చిత్రిస్తూ యానాం కథలు రాశారు. తమిళం, హిందీ, ఫ్రెంచి భాషల్లోకి కొన్ని కథలు అనువాదం అయ్యాయి.

**ఆకెళ్ళ:**

స్వస్థలం కాకినాడ. ఆకెళ్ళ వెంకట సూర్యనారాయణ 'ఆకెళ్ళ' పేరుతో ప్రసిద్ధులు. రెండొందలకుపైగా కథలు రాశారు. 26 కథలు కన్నడ, హిందీ, తమిళ భాషల్లోకి అనువదింపబడ్డాయి. విలువలు పెంపొందించే సమాజంకోసం వీరు రాసిన నాటికలెన్నో పురస్కారాలు పొందాయి. 'ఆకెళ్ళ కథలు' కథాసంపుటి వెలివడింది. వాస్తవిక జీవితాన్ని ప్రతిబించే కథలు రాశారు.

**వంగూరి చిట్టెన్ రాజు:**

కాకినాడలో 1945 ఏప్రిల్ 19 తేదీన జన్మించారు. అమెరికాలో ఉంటున్నారు. వంగూరి ఫౌండేషన్ ద్వారా తెలుగు సాహిత్యం, తెలుగు సంప్రదాయాలను పెంపొందించే విధంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హాస్యప్రియులు. హాస్యరచయిత. ఒక ప్రత్యేకమైన శైలీ, ధోరణి గల కథకుడు. ముఖ్యంగా అమెరికాలోని తెలుగు వారి జీవితాల మనస్తత్వాల గురించి హాస్యరసపూరితంగా కథలు రాశారు. 'అమెరికామెడీ కథలు' పేరిట నూటపదహారు కథల సంపుటి ప్రచురించారు.

**సి. ఎస్. రావు:**

తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షారామంలో జన్మించారు. మాధవరాయుడుపాలేంలో పెరిగారు. కథ, నవల, రేడియో నాటకం ప్రక్రియల్లో రచనలు చేశారు. 85 కథలు, 15 నవలలు, ఒక నాటకం వీరి కలం నుండి వెలువడ్డాయి. ఇటీవలే సహస్ర చంద్ర దర్శనం జరుపుకున్నారు.

**జానకీజాని:**

కాకినాడలో జన్మించారు. అసలు పేరు సామవేదం జానకిరామశాస్త్రి. కవి, కథకుడు, వ్యాసకర్త, వక్త. జీవితంలో వివిధ కోణాల్ని స్పృశించే కథలు రాశారు. 'వెన్నెల మెట్లు' 'దిగివచ్చిన అరుంధతి' కథాసంపుటులు వెలువడ్డాయి.

**శ్రీకంఠస్ఫూర్తి:**

1952 డిసెంబరు 20 తేదీన కాకినాడలో జన్మించారు. 150 కథలు పైగా వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ముఖ్యంగా మానవత్వం ప్రబోధించే కథల్ని రాశారు. 'అమృత వర్షం' 'మనిషి చిత్రం' కథాసంపుటులు వెలువడ్డాయి.

**కె. బి. కృష్ణ:**

రాజమండ్రిలో 1944 మే 7వ తేదీన జన్మించారు. 450 కథలు, 15 నవలలు రాశారు. 'గాయత్రి' 'ఆమె నవ్వింది' 'అనుబంధాలు' 'చిత్ర లోకం' 'అభిషేకం' కథాసంపుటులు ప్రచురించారు. కొన్ని కథలు కన్నడం, హిందీ, మలయాళం భాషల్లోకి అనువాదం అయ్యాయి.

**బి. వి. రమణారావు:**

1926 అక్టోబరు 1 తేదీన అమలాపురంలో జన్మించారు. 50 కథలు, 24 నాటికలు రాశారు. 'సంధ్య' 'బి. వి. రమణారావు కథలు' ప్రచురించారు.

**బి. వి. యస్. రామారావు:**

అమలాపురంలో జన్మించారు. గోదావరి పరివాహక ప్రాంతంలో జీవనాన్ని 'గోదావరి కథలు ' పేరుతో కథలు రాశారు.

**నందుల సుశీలాదేవి:**

రాజమండ్రిలో 1940లో జన్మించారు. 200 కథలు, 9 నవలలు రాశారు. ఈమె రచనల్లో సేవాభావం, సేవాదృక్పథం ఎక్కువగా కనిపిస్తుంది,

**ఎండ్లూరి సుధాకర్:**

1959 జనవరి 21 తేదీన జన్మించారు. గత పాతిక సంవత్సరాలుగా తెలుగు విశ్వవిద్యాలయం, రాజమండ్రిలో పనిచేస్తున్నారు. కవి, కథకుడు, వక్త, అనువాదకుడు. కవితైనా కథైనా జీవితానుభవంతో నిబద్ధతతో రాస్తారు. 'మల్లె మొగ్గల గొడుగు (మాదిగల ఆత్మ కథలు) కథాసంపుటి వెలువడింది. సామాజిక వర్గ యథార్థ వ్యథల కథలివి.

**యాళ్ళ అచ్యుత రామయ్య:**

తూర్పుగోదావరి జిల్లా మల్లాం గ్రామంలో 1961 మార్చి 8వ తేదీన జన్మించారు. సమాజంలో అసహాయులుగా ఉన్నవారికి ఆత్మవిశ్వాసం కలిగించే కథలు రాయాలని ప్రయత్నిస్తారు. ఇప్పటి వరకు 58 కథలు రాశారు. ' ఆమె నవ్వు' 'పంజరంలో స్వేచ్ఛ' కథా సంపుటులు ప్రచురించారు.

**ఎలక్ట్రాన్:**

1937 డిసెంబరు 15 తేదీన పెద్దాపురంలో జన్మించారు. అసలు పేరు పింగళి వెంకట రమణరావు. సుమారు 60 కథలు రాశారు. నేలమీద నక్షత్రాలు, జనారణ్యం, విలువల వెల ఎంత, ముళ్ళ కుర్చీలు కథాసంపుటులు ప్రచురించారు.

**వసుంధర:**

తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురంలో 1943 అక్టోబరు 29 తేదీన జన్మించారు. పెరిగింది పేరవరం. మసిలింది రాజమండ్రి, కోలంక, ధవళేశ్వరం. అసలు పేరు జొన్నలగడ్డ రాజగోపాల రావు, రామలక్ష్మి. సాహితీ వైద్యంపేరుతో వందలాది యువకథకులకు కథానిర్దేశం చేశారు. 500 కథలకుపైగా రాశారు. ఇంకా బాలల కథలు, నవలలు రాశారు

**పైడిపాల:**

తూర్పుగోదావరి జిల్లా పసలపూడిలో 1949లో జన్మించారు. రెండొందలు కథలు, రెండు నవలలు, నాటకం, కవిత్వం రాశారు. తెలుగు సినీమా పాట మీద పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. రచనకు సామాజిక ప్రయోజనం ఉండాలని భావిస్తూ కథలు రాశారు. కొన్ని కథలు హిందీ, కన్నడంలోకి అనువాదం అయ్యాయి. 'రేపటి వెలుగు' కథాసంపుటి ప్రచురించారు.



**వాసా ప్రభావతి:**

తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురంలో 1941 జూన్ 6 తేదీన జన్మించారు. సమారు 150 కథలు, 6 నవలలు, 14 కవితాసంపుటులు, 5 ఏకాంకికలు, ఒక నాటకం రాశారు. ప్రత్యేకించి స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి కథలు రాశారు. న్యాయం గుడ్డిది, సంధ్య అంచున, తిలకమ్మ, మొగిలి కథాసంపుటులు ప్రచురించారు.

**పోతుకూచి సాంబశివరావు:**

తూర్పుగోదావరి జిల్లా ఆలమూరులో 1927 జనవరి 27 తేదీన జన్మించారు. సుమారు 300 కథలు, 6 నవలలు రాశారు. శేఖరం కథలు (2 భాగాలు), కొత్తవిలువల బతుకు, బతుకుల పతనం, లోకం తీరు, సరదా కథలు మొదలైన పది కథాసంపుటులు ప్రచురించారు.

**అల్లూరి (పెన్మత్స) గౌరీలక్ష్మీ:**

తూర్పుగోదావరి జిల్లా అంతర్వేదిపాలెంలో 1960 జూలై 22 తేదీన జన్మించారు. 80 కథలు, రెండు నవలలు, కవితాసంపుటి వీరి కలం నుండి వెలువడ్డాయి. మధ్యతరగతి జీవనవిధానాలనూ ఘర్షణలనూ చిత్రించే కథలు రాసారు. 'మనో చిత్రం', 'వసంత కోకిల', కొత్త చూపు' కథాసంపుటులు వెలువడ్డాయి.

**రాంషా:**

సామర్లకోటలో 1924 జూలై 30 తేదీన జన్మించారు. 'ప్రియరాలు', 'మీనాక్షి ముద్దు', 'పెళ్ళి తిరకాసు' మూడు కథాసంపుటులు ప్రచురించారు.

**కె. గోదావరి శర్మ:**

సామర్లకోటలో 1954 ఆగష్టు 17 తేదీన జన్మించారు. 'పూలవంతెన' కథాసంపుటి వెలువరించారు.

**ఎల్. కె. సుధాకర్:**

తూర్పుగోదావరి జిల్లా కపిలేశ్వరపురంలో 1969 ఏప్రిల్ 19 తేదీన జన్మించారు. కవి, కథకుడు, అనువాదకుడు, గేయరచయిత. పల్లెటూరు, బాల్యం, తెలుగుదనంతో రసానుభూతి కలిగించే కథలు రాశారు. 'గొబ్బిపూలు' కథాసంపుటి వెలువడింది.

**అద్దేపల్లి ప్రభు:**

కాకినాడలో 1963 అక్టోబరు 15 తేదీన జన్మించారు. కవి, కథకుడు, వక్త. సుమారు 20 కథలు రాశారు. ప్రపంచీకరణ నేపథ్యంలో జరిగే పరిణామాల గురించి నిబద్ధతతో కథలు రాస్తున్నారు. సీమేన్ కథాసంపుటి వెలయించారు.

**మంజరి:**

పిఠాపురంలో 1954 జూలై 17వ తేదీన జన్మించారు. సుమారు వంద కథలు, 18 నవలలు రాసారు. నివాళి, సంకెళ్ళు కథాసంపుటులు వెలువడ్డాయి. పెద్ద కథ, చిన్న కథ, మినీ కథ, గల్పిక, స్కెచ్, ఇన్‌లాండ్ లెటరు కథ, కార్డు కథ – అనేక రూపాల్లో కథ ముందుకు సాగుతూనే వుంది. తొలితరం కథకుల నుండి ఈనాటి యువతరం వరకు కథావికాసం కోసం కృషి చేస్తూనే వున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నెట్–వెబ్ మాగజైన్‌లలో జిల్లావాసులు కథా సేద్యం చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఇంకా అనేకమంది కథారచయితలు, రచయిత్రులు తమదైన శైలిలో కథారచన చేసినవారు, చేస్తున్నవారూ ఉన్నారు. అలాంటి వారిలో సత్యవోలు సుందరసాయి, ఎం.వి.వి. సత్యనారాయణ, వి. రామలక్ష్మి, తులసి బాలకృష్ణ, కె. గీత, కందుకూరి వెంకట మహాలక్ష్మి, పి. చిరంజీవినీకుమారి, వి.వి. సుబ్బరాజు, అద్దేపల్లి జ్యోతి, గూటం స్వామి, మోకా రత్నరాజు, పి. పద్మజావాణి, యండమూరి కమలేంద్రనాథ్, పుప్పాల సూర్యకుమారి, పెన్మత్స శ్రీకాంత రాజు, చిరువూరి రామకృష్ణరాజు, చోడిశెట్టి శ్రీనివాస రావు, రాధిక, గనారా, ప్రఫుల్లచంద్ర పట్నాయక్, మధుశ్రీ, ధూళిపాళ అన్నపూర్ణ, వింజమూరి అచ్యుతరామయ్య, సీయస్సీ మురళీ, నవులూరి వెంకటేశ్వర రావు, మహీధర రామశాస్త్రి, దవులూరి కృష్ణమోహన రావు, గుత్తుల భాస్కరరావు, ధనిష్ఠ, వేదుల మీనాక్షీదేవీ, కోడూరి లీలావతి, అద్దేపల్లి వివేకానంద దేవి, పోలాప్రగడ సత్యనారాయణ మూర్తి, ఉషశ్రీ, పోలాగ్రడ రాజ్యలక్షీ, ఇంద్రగంటి శ్రీకాంత శర్మ, జానకీబాల, కనక్‌ప్రవాసి, కోడూరి కౌసల్యాదేవి, దాట్ల లలిత, చిరంజీవి వర్మ అనే వత్సవాయి చిట్టి వెంకటపతిరాజు, పొత్తూరి సీతారామ రాజు, కాశి రాజు, పాలపర్తి ధనరాజ్, బుర్రా వెంకట సుబ్రహ్మణ్యం, విజయలక్ష్మి బక్స, పన్నాల సుబ్రహ్మణ్యభట్టు ఉన్నారు. విలువల విధ్వంసం, మానవ సంబంధాల విచ్ఛిన్నత, కుటుంబ బంధాల్లో వచ్చిన మార్పులు, మనోవిశ్లేషణ, ప్రయోగాత్మకతతో కూడిన కథలు తూర్పు గోదావరి జిల్లా కథకులు సృజియించడం జరిగింది. అంతేకాకుండా ఈ ప్రాంతపు యాస, పలుకుబడులు, స్థానిక సమస్యలు, సామాజిక చరిత్ర నమోదు, ప్రపంచీకరణ పరిణామాలు గురించి తమదైన శైలిలో కథారచయితలు రాశారు. అయితే రాయవలసిన కథలెన్నో ఉన్నాయి.

నమోదు చేసే కథలు ఇంకా రావలసి ఉంది. చమురు నిక్షేపాల కారణంగా రాబడి కోల్పోతున్న మత్స్యకారులు 52 గ్రామాల వారు తమకు రావలసిన నష్టపరిహారం కోసం చమురు కంపెనీల దగ్గర నెలల తరబడి ఉద్యమాలు, పోరాటాలు చేసిన సందర్భాలున్నాయి. సుమారు 500 బోట్లతో సముద్రంలో నీటి మీద ఆయా కంపెనీల దృష్టికి తీసుకురావడానికి ధర్నాలు చేసిన చరిత్రాత్మక సంఘటనలున్నాయి. ఇవేమీ కథల రూపంలో నమోదు కాలేదు. వీటిపై కథలు వస్తాయని ఆశిద్దాం.

తూర్పుగోదావరి జిల్లా కథాసాహిత్యం మిగిలిన ప్రాంతాలకు తీసిపోకుండా వృద్ధి చెంది ఒకానొక వారసత్వానికి ప్రాతినిధ్యం వహించే కథలు రచయితలు అందిస్తారని నమ్మకం ఉంది.

దాట్ల దేవదానం రాజు
యానాం, ఫోన్: 944 010 5987.





కృష్ణా సోబతీ

# జ్ఞానపీఠ గ్రహీత - కృష్ణా సోబతీ

*- వెన్నా వల్లభరావు*

ప్రఖ్యాత హిందీ రచయిత్రి కృష్ణా సోబతీకి 2017కుగాను జ్ఞానపీఠ పురస్కారం ఇటీవల ప్రకటించబడింది. ఇది 53వ జ్ఞానపీఠ పురస్కారం. కృష్ణా సోబతీ ఆధునిక హిందీ నవలాకారుల్లో మొదటి తరానికి చెందిన రచయిత్రి. జ్ఞానపీఠం అధిరోహించిన హిందీ సాహిత్యకారుల్లో ఆమె 11వవారు. భారతీయ భాషల్లో ప్రతి ఏటా ఒక ఉత్తమ సాహిత్యకారునికి ప్రదానం చెయ్యబడే ఈ పురస్కార గౌరవం దక్కించుకున్నవారిలో హిందీ సాహిత్యకారులు అగ్రస్థానంలో ఉండగా, కన్నడం 8 మందితో రెండవ స్థానంలోను; మలయాళం, బెంగాలీ, మరాఠీ, గుజరాతీ ఐదేసి మందితో మూడవ స్థానంలోను; ఒరియా, ఉర్దూ నలుగురేసి మందితో నాల్గవ స్థానంలోను; తెలుగు ముగ్గురితో ఐదవ స్థానంలోను; అస్సామీ, పంజాబీ ఇద్దరేసి మందితో అరవ స్థానంలోను; సంస్కృతం, కాశ్మీరీ, కొంకణి ఒక్కొక్కరితో ఏడవ స్థానంలోను ఉన్నాయి.

కృష్ణా సోబతీ 1925, ఫిబ్రవరి 18న అవిభాజ్య భారత దేశంలో, ప్రస్తుత పాకిస్తాన్‌లో లాహోర్‌కు 40 కి.మీ. దూరంలో ఉన్న గుజరాత్ నగరంలో జన్మించారు. ఢిల్లీ, సిమ్లాలలో విద్యాభ్యాసం చేశారు. ఆమె కుటుంబ సభ్యులు బ్రిటిష్ ప్రభుత్వంలో కీలక పదవులు నిర్వహించారు. సోబతీ ఉన్నత విద్య లాహోర్‌లోని ఫతేచంద్ కళాశాలలో ప్రారంభమైంది. దేశ విభజన తర్వాత ఆమె భారతదేశానికి వచ్చి స్థిరపడ్డారు. రాజస్థాన్‌లోని అప్పటి సిరోహీ మహారాజు మనుమడైన తేజ్ సింగుకు ఆమె 2 సంవత్సరాలపాటు చదువు సంధ్యలు నేర్పటంతోపాటు అతని ఆలనాపాలనా కూడా చూశారు. ఆ తర్వాత సాహిత్య వ్యాసంగమే కొనసాగించారు. ప్రస్తుతం సోబతీ తన భర్త డోగ్రీ రచయిత అయిన శివనాథ్‌తోపాటు ఢిల్లీలో నివాసముంటున్నారు.

జ్ఞానపీఠ పురస్కారం అందుకున్న హిందీ సాహితీమూర్తుల్లో సోబతీ రెండవ మహిళ. 1982లో మహాదేవీవర్మ జ్ఞానపీఠ గౌరవం అందుకున్నారు. అటుపిమ్మట మూడున్నర దశాబ్దాలకి మరో మహిళామణి కృష్ణా సోబతీ మరల ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. మహాదేవీ వర్మ కవిత్వానికిగాను పురస్కారం అందుకోగా, సోబతీ హిందీ కథ-నవలా రచనకు జ్ఞానపీఠ గౌరవం కట్టబెట్టారు. మునుపు హిందీలో ఈ పురస్కారం అందుకున్నవారంతా కవులే కావటం విశేషం. 1999లో ఈ పురస్కారం అందుకున్న నిర్మల్‌వర్మ మాత్రమే కవిత్వంతోపాటు కథలు-నవలలు రాసినవారు. ఆ సంవత్సరం ఆయనకు ఒక్కరికే కాకుండా, ఆయనకూ పంజాబీ రచయిత గురుదయాల్ సింగ్‌కు పురస్కారాన్ని పంచటం జరిగింది. కవిత్వం జోలికి పోకుండా కేవలం కథ-నవలా రచనతోనే జ్ఞానపీఠం అధిరోహించిన మొట్టమొదటి హిందీ రచయిత్రి కృష్ణా సోబతీ.

92 సంవత్సరాల వయసున్న కృష్ణా సోబతీది 7 దశాబ్దాల సుదీర్ఘ సాహిత్య ప్రస్థానం. హిందీ కథ, నవలారంగంలో ఆమె విశిష్ట స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. ఆమె తన రచనల ద్వారా ఒక కొత్త ఒరవడిని సృష్టించి, నవ్య రచనా శైలితో ప్రయోగాత్మక కథలు - నవలలకి శ్రీకారం చుట్టారు. స్త్రీని నాలుగు గోడలకి పరిమితం చేస్తున్న సమాజంలో స్త్రీల స్వాభిమానాన్ని కాపాడి వారిలో మనోధైర్యాన్ని పాదుకొల్పేందుకు సాహిత్యాన్ని సాధనంగా

చేసుకున్న స్త్రీమూర్తి ఆమె. స్త్రీ–పురుష సంబంధాలు, భారతీయ సమాజంలో మారుతున్న స్థితిగతులు, క్రమక్రమంగా మృగ్యమౌతున్న మానవ విలువలు ఆమె ఎంచుకున్న అంశాలు.

కృష్ణా సోబతీ కథా రచనతో తన సాహిత్య ప్రయాణం ప్రారంభించారు. టిబెటన్ బౌద్ధమత ప్రచారకుని గురించి ఆమె రాసిన మొట్టమొదటి కథ 'లామా' 1944లో ప్రచురితమైంది. ఆ తర్వాత దేశ విభజనవల్ల ఏర్పడిన విషాదకర పరిస్థితులకు దర్పణంగా రాసిన కథ 'సిక్కా బదల్ గయా' (నాణెం మారిపోయింది) చాలా ప్రసిద్ధిగాంచి హిందీ సాహిత్య జగత్తులో సోబతీకి కథా రచయిత్రిగా మంచి గుర్తింపు తెచ్చింది.

కృష్ణా సోబతీ 'డార్ సే బిఛుడీ' (కొమ్మను విడిచిన), 'యారోంకే యార్' (మిత్రులకు మిత్రులు), 'తీన్ పహాడ్' (మూడు కొండలు), 'మిత్రో మర్జాని', 'సూరజ్ ముఖీ అంధేరేకే' (అంధకారపు పొద్దుతిరుగుడు పూలు), 'జిందగీనామా' (జీవిత గ్రంథం), 'దిలో–దానిశ్' (హృదయమెరిగిన), 'సమయ్ సరగమ్' (కాలపుసంగీతం), 'ఏయ్ లడకీ' (ఓ అమ్మాయి!) 'గుజరాత్ పాకిస్థాన్ సే గుజరాత్ హిందుస్థాన్' (పాకిస్థాన్ గుజరాత్ నుంచి భారత్ గుజరాత్‌కు) మొదలైన నవలలు రచించారు. 'నసీఫా' (స్వచ్ఛమైన), సిక్కా బదల్ గయా' (నాణెం మారిపోయింది), 'బాదలోం కే ఘేరే' (మేఘాల అవహింపు), 'మేరీమా కహా' (మా అమ్మెక్కడ) మొదలైన కథాసంపుటాలు వెలువరించారు.

కృష్ణా సోబతీ రచనలపైన హిందీ, ఉర్దూ, పంజాబీ సంస్కృతుల ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. ఈ మూడు భాషల జాతీయాలు, నుడికారాలు ఆమె భాషలో అమితంగా తారసపడతాయి. ముఖ్యంగా పంజాబ్ సంస్కృతి, జీవిత విధానం, నడవడి, ఆచార–వ్యవహారాలు కృష్ణా సోబతీ రచనల ద్వారా బాగా అవగతమౌతాయి. ఆ ప్రాంతంలో ప్రచారంలో ఉన్న పుక్కిటిపురాణాలు, సామెతలు, దృక్పథాలు ఆమె నవలల్లో దర్శనమిస్తాయి.

1950 ప్రాంతాల్లో హిందీ నవలపై నవ్య కథా ఉద్యమ రచయితలైన రాజేంద్రయాదవ్, కమలేశ్వర్ మొదలైనవారు అనుసరించిన నగర వాస్తవికవాదం, ఇంకా మాండలిక నవలలకు ప్రాచుర్యం కల్పించిన ఫణీశ్వరనాథ్ రేణు రచనల్లోని గ్రామీణ జీవన చిత్రణ, మాండలిక భాష ప్రభావం కృష్ణా సోబతీ రచనలపై కనపడుతుంది. సోబతీ ఒక ప్రాంతానికి మాత్రమే చెందిన రచయిత్రి కాదు. ఆమె రచనలు భాష, ప్రాంతీయతల్ని అధిగమించి అద్భుతమైన రచనా ప్రక్రియకు మారుపేరుగా నిలిచాయి.

భారతీయ సాహిత్యంలో హిందీ ఉనికిని చాటుతూ కృష్ణా సోబతీ తన స్పష్టమైన అభివ్యక్తి, విశిష్టరచనా శైలి కారణంగా ప్రసిద్ధిగాంచారు. తక్కువ రాయటమే ఆమె తన పరిచయంగా చెప్పుకుంటారు. తక్కువ రాయటమంటే విశిష్టంగా రాయటమని ఆమె అభిప్రాయం. ప్రతి రచన ద్వారా ఆమె తన భావాత్మక శక్తి, కళాత్మక ఉత్తేజంతో పాఠకుల్ని మంత్రముగ్ధుల్ని చేయ్యటంతోపాటు అనేక సామాజిక–నైతిక అంశాల్ని, విమర్శనాత్మక దృక్పథాన్ని సాహితీ ప్రపంచం ముందుంచారు.

రచనని జీవితానికి పర్యాయపదంగా భావించే కృష్ణా సోబతీ నవలల్లో ప్రసిద్ధమైనది 'జిందగీనామా'. ఈ నవలకు ఆమెకు 1980లో కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం లభించింది. మానవ సమాజాన్ని కులమతాలుగా విభజించటాన్ని ఈ నవల్లో రచయిత్రి వ్యతిరేకిస్తుంది. ప్రస్తుత పాకిస్తాన్‌లోని షాపుర్ గ్రామం కథకి వేదిక కాగా, కథాంశం 20 శతాబ్దపు మొదటి రెండు దశాబ్దాలకి చెందింది. ఆ ప్రాంతంలో కుల, మత పరమైన కట్టుబాట్లు ఉన్నప్పటికీ హిందూ, ముస్లిం, సిక్కులు దైవాన్ని 'రబ్' అని పిలుచుకుంటూ అన్యోన్యంగా ఉంటూ ఉండేవారని, పండుగలు–పెళ్ళిళ్ళు–పేరంటాలలో అందరూ కలిసి పాల్గొంటారన్న విషయం నవల ద్వారా అర్థమౌతుంది. ఈ నవల్లోని వందలాది పాత్రలు ఎంతోకాలంగా పంజాబ్‌లో ఉంటూ తమపై తరచూ విరుచుకుపడే సైన్యాల్ని ఎదిరించి పోరాడి, పంటలు పండించుకుంటూ బతుకుతున్నవాళ్ళు, బతకాలనే తాపత్రయంతో బతుకులు చేజార్చుకుంటున్నవారే. భూముల్ని కబళించేందుకు వేసే ఎత్తుగడలు – చేసే ప్రయత్నాలు, శ్రమదోపిడీ, మనుషులు–మనుషుల మధ్య విభేదాలు సృష్టించటం ఈ నవల్లో విశాలమైన కాన్వాసుపై దర్శనమిస్తాయి. స్త్రీ పాత్రలకు

అత్యధిక ప్రాధాన్యత ఇవ్వబడిన నవల ఇది. కుటుంబంలో స్త్రీల అభిమతాన్ని, ఆకాంక్షల్ని పట్టించుకోకుండా, వారిని పిల్లల్ని కనే యంత్రాలుగా భావించే పరిస్థితి కనిపిస్తుంది. సమాజంలో స్త్రీల ఆనందాన్వేషణను తృణీకరించటమంటే స్త్రీలను, వారి కోరికలను అణగదొక్కటమే అని 'జిందగీనామా' నవల నొక్కి చెపుతుంది. దేశ విభజననాటి పరిస్థితులకు దర్పణంగా, సామాజిక చరిత్రగానేకాక ఈ నవలను రచయిత్రి స్వీయచరిత్రగా భావించవచ్చు.

'మిత్రో మర్జానీ' సోబతీ మరో ప్రముఖ నవల. సోబతీ తనని తాను స్త్రీవాద రచయిత్రిగా అంగీకరించరు, తననొక సృజనాత్మక రచయితననే చెప్పుకుంటారు. అయినా ఈ నవల స్త్రీవాద దృక్పథానికి మచ్చుతునకగా దర్శనమిస్తుంది. ఈ నవల్లో స్త్రీకి కుడా శారీరకమైన కోరికలు ఉంటాయని, వాటిని భర్తద్వారా తీర్చుకోవాలనుకోవటం సిగ్గుపడాల్సిన విషయమేమీ కాదని స్పష్టం చేస్తుంది రచయిత్రి. కథానాయిక మిత్రో (సుమిత్రావంతి) దిగువ మధ్యతరగతి పంజాబీ కుటుంబంలో కోడలు. వారిది ఉమ్మడి కుటుంబం. భర్తవల్ల ఆమెకు దాంపత్య సుఖం ఉండదు. మిత్రో వెరపు, భీతి ఎరగదు. నోరుగలది. ఏమి చెప్పటానికైనా బిడియపడదు. శారీరకంగా తనని సుఖపెట్టలేని భర్తని చీటికిమాటికి ఆమె దెప్పిపొడుస్తూ ఉంటుంది. అయితే ఆమె చెడ్డది మాత్రం కాదు. భర్త స్నేహితులతో కొంచెం చనువుగా ఉంటున్న భార్యపై అనుమానపడి ఆతను ఆమెను చీటికిమాటికి కొడుతూ ఉంటాడు. తన జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకొనే హక్కులేని వ్యవస్థలో, దాంపత్య సుఖంపట్ల ఆసక్తి కనపరిచే స్త్రీని చెడ్డదానిగా చూసే సమాజంలో మిత్రో నిర్భయంగా, నిస్సంకోచంగా తన అవసరాల్ని, కోర్కెల్ని వ్యక్తపరుస్తుంది. ఫలితంగా అవమానాల్ని భరించాల్సి వస్తుంది. అయినా మిత్రో ధైర్యంగా వాటన్నింటినీ భరిస్తుంది. కానీ మగతోడు కోసం కుటుంబంతోనే ఉంటుంది.

'సమయ్ సరగమ్' నవల్లో ఇద్దరు చిన్ననాటి స్నేహితుల జీవితాల్లోని ఒడిదుడుకులు, వేదనాభరితమైన సంఘటనల జ్ఞాపకాలను వివరిస్తూనే స్నేహానికి అర్థవంతమైన నిర్వచనాన్ని ఇస్తుంది రచయిత్రి. స్నేహితుల మధ్య ఉన్న ఆప్యాయత, అవగాహనను వెల్లడిస్తూనే వారి మధ్య ఘనీభవించిన నిశ్శబ్దానికి అద్దంపట్టిన తీరు హృద్యంగా ఉంటుంది. నానాటికీ దుర్భరంగా మారుతున్న నగర దైనందిన జీవితంలో స్త్రీ–పురుష సంబంధాలు, లింగభేదంతో ప్రమేయం లేకుండా వ్యక్తుల మధ్య ఏర్పడే స్నేహానుబంధాలను ఎంతో భావావేశాపూరితంగా వర్ణిస్తుంది రచయిత్రి. సోబతీ రచనల్లో ప్రముఖంగా తల్లీ కూతుళ్ళ బాంధవ్య చిత్రీకరణ కనపడుతూ ఉంటుంది. జీవితంలో తల్లి తీసుకున్న నిర్ణయాలు సరైనవి కావని భావించి, అలాంటివాటికి దూరంగా ఉండాలనుకున్న కుమార్తె కూడా అటువంటి పరిస్థితుల్లో తల్లి చేసిన తప్పిదాలే చెయ్యటం గమనిస్తాము. 'ఏయ్ లడకీ' (ఓ అమ్మాయీ!) అనే నవల్లో తల్లీకూతుళ్ళ అభిప్రాయాల వైరుధ్యాలు పెరిగి–పెరిగి చివరకు తల్లి మరణంతోనే ఇరువురికీ స్వేచ్ఛ, శాంతి లభిస్తాయి. 'సూరజ్ ముఖీ అంధేరే కే' (అంధకారపు పొద్దుతిరుగుడు పూలు) నవల్లో రచయిత్రి మనిషి మానసిక కుంగుబాటుని, ఎంతో ప్రయాసతో దానిని తాత్కాలికంగా ఉపశమింపజేసుకోవటాన్ని అద్భుతంగా చిత్రిస్తుంది రచయిత్రి.

ఆమె తుది నవల 'గుజరాత్ పాకిస్థాన్ సే గుజరాత్ హిందుస్థాన్'కు కూడా దేశ విభజన సృష్టించిన అల్లకల్లోలమే కేంద్ర బిందువు. దీన్ని నవల అనటంకంటే ఆత్మకథ అనటం సమంజసంగా ఉంటుంది. దీనిలో రచయిత్రి రాసిన దానిలో కల్పన ఏమిలేదు సరిగదా, ఆమె జీవితమే సాక్షాత్కరిస్తుంది. నవల ప్రారంభంలో, విభజన సమయంలో ప్రాణాలు అరిచేతుల్లో పెట్టుకుని కట్టుబట్టలతో పారిపోతున్న దృశ్యాన్ని వర్ణించే పంక్తులు పరిస్థితి తీవ్రతకు నిదర్శనం– "పరుగెత్తండి–పరుగెత్తండి, పారిపోండి... పారిపోండి, ముసలివాళ్ళని, జబ్బుతో ఉన్నవాళ్ళని, పరుగెత్తలేనివాళ్ళని వదిలెయ్యండి. వాళ్ళు బతికే ఆశ ఎలాగో లేదు. ఆలోచించే వ్యవధి లేదు, ముందుకు పోవటమేతప్ప వెనక్కి తిరిగి చూసే సమయం కాదిది. పదండి త్వరగా, ఏ క్షణాన దాడి జరుగుతుందో చెప్పలేం...." ఈ నవల శైలి చాలా విశిష్టంగా ఉంటుంది. మధ్య మధ్యలో కవితాత్మక శైలి తారసపడుతుంది – *"నువ్వు నువ్వు కాదు / మేము మేము కాదు. / ఏమన్నావు? / మళ్ళీ చెప్పు. /రామదాసు / రాంప్రసాద్ / రాంప్రకాష్ /*

*రామకృష్ణ /రామచంద్ / రామ్ సుహాస్ / రామ్ ఆలోక్ / రామ్ కుమార్ – అబ్దుల్ గని / అబ్దుల్ హమీద్ / అబ్దుల్ గఫార్ / అబ్దుల్ మజీద్ / అబ్దుల్ కరీం / అబ్దుల్ కాదిర్ / అబ్దుల్ రహమాన్ / అబ్దుల్ షకూర్, ఎవరు బయటివాళ్ళు / ఎవరు దగ్గరవాళ్ళు / ఎవరికి దూరం ఎవరికి దగ్గర / అల్లాహో అక్బర్. / హర హర మహాదేవ."* రచయిత్రికి 22–23ఏళ్ల వయసప్పుడు అప్పుడే ఏర్పడిన పాకిస్థాన్‌లోని గుజరాత్ నగరాన్ని విడిచిపెట్టి హిందుస్థాన్ గుజరాత్‌కు తరలివచ్చే సమయంలో జరిగిన యథార్థ సంఘటన నలనే ఆమె ఈ నవలలో కూర్చారు. ఆమె జీవిత శకలమే ఈ నవల. దేశ విభజన, అ తర్వాతి పరిస్థితులే నవల నేపథ్యం.

కృష్ణా సోబతీ సాహిత్యం హిందీ–పంజాబీ–ఉర్దూ భాషల మేలు కలయికతో, భిన్న సంస్కృతులకు సంగమంగా, దేశ విభజన నాటి సంఘటనలకు ప్రత్యక్ష సాక్ష్యంగా మనముందు నిలుస్తాయి. ఆమె రచనల్లోని స్త్రీ పాత్రలు చైతన్యానికి చిరునామాలు, ధైర్యానికి దిక్సూచీలు, ఆత్మగౌరవానికి ఆనవాళ్ళు. స్త్రీలలో మనోధైర్యాన్ని నింపి, వారిని అస్తిత్వ పోరాటం సలిపే దిశగా, సమస్యల నెదిరించగలిగే స్థైర్యాన్ని, ధైర్యాన్ని ఇచ్చే సాహిత్య సృజన చేశారు. కృష్ణా సోబతీ రచనలలో స్త్రీ పాత్రలు నిస్సహాయులుగాకాక కష్టనష్టాలను ధైర్యంగా ఎదుర్కొంటాయి. తమకు జరిగే అన్యాయాలకు తలవంచకుండా ప్రశ్నిస్తాయి. ఆమెతన రచనలన్నింటా ఉత్సాహము, తెగింపుగల స్త్రీలనే సమర్థించటం కనబడుతుంది. వైవాహిక బంధం, పిల్లల్ని కని పెంచటంవంటి బాధ్యతలకి దూరంగా ఉండటానికి ఇష్టపడే స్త్రీల మానసిక సంఘర్షణ ఆమె రచనల్లో ద్యోతకమౌతుంది.

సుదీర్ఘ కాలం అలుపెరుగని సాహిత్య సేద్యం కొనసాగించిన కృష్ణా సోబతి తన ఉత్కృష్ట రచనలకుగాను ఎన్నో గౌరవాల్ని, ఎన్నెన్నో పురస్కారాల్ని అందుకున్నారు. సాహిత్య అకాడెమి పురస్కారం (1980), సాహిత్య శిరోమణి పురస్కారం (1981), హిందీ అకాడెమీ పురస్కారం (1982), కథా చూడామణి పురస్కారం (1999), సాహిత్య అకాడెమి ఫెలోషిప్ (1996), శలాకా సమ్మాన్ (2000–2001), వ్యాస సమ్మాన్ (2008) మొదలైనవి ఆమె సాహిత్య ప్రతిభకు దక్కిన గౌరవాలు. ఆమె పురస్కారాల కోసం ఎప్పుడు పాకులాడలేదు అనటానికి రెండు ఉదాహరణలు – 2010లో భారత ప్రభుత్వం ఇవ్వజూపిన 'పద్మభూషణ్' బిరుదును ఆమె "ప్రభుత్వం ఇచ్చే అవార్డులు రచయిత భావాలపై ప్రభావాన్ని చూపుతాయి, రచయితగా నేను ఇలాంటివాటికి దూరంగా ఉండటం మంచిది అనుకుంటున్నాను" అని చెప్పి తిరస్కరించారు. దాద్రిలో జరిగిన దాడిపై ప్రభుత్వ వైఖరికి స్పందనగా, రచయితల వాక్స్వాతంత్ర్యానికి సమర్థనగా, హిందీ రచయితలను కించపరుస్తూ ఒక కేంద్ర మంత్రి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆమె తాను గతంలో స్వీకరించిన సాహిత్య అకాడెమి అవార్డును, సాహిత్య అకాడెమీ ఫెలోషిప్‌ను 2015లో తిరిగి ఇచ్చేశారు. ఇప్పుడు జ్ఞానపీఠం ఆమెను వెతుక్కుంటూ వచ్చింది. సోబతీని జ్ఞానపీఠ పురస్కారానికి ఎంపిక చేసిన కమిటీ ఆమె రచనా వైశిష్ట్యం గురించి చేసిన వ్యాఖ్య – "కృష్ణా సోబతీ తన రచనల్లో ఉపయోగించిన భాష హిందీ, ఉర్దూ, పంజాబీ సంస్కృతుల అనుసంధానం. ఆమె సృష్టించిన పాత్రలు ఎప్పుడూ ఏ దాపరికం లేకుండా కుండ బద్దలుకొట్టినట్టు మాట్లాడేవిగాను, ధైర్యంగా సమాజంలోని ఎటువంటి సవాళ్లనైనా స్వీకరించేవిగాను, ఆత్మవిశ్వాసంతో మెలిగేవిగాను ఉంటాయి" ఆమెను అసాధారణ రచయిత్రిగా నిరూపిస్తుంది.

**డా. వెన్నా వల్లభరావు**
**విజయవాడ, ఫోన్** : 949 033 7978.



# నిత్య తత్త్వం

– కస్మూరి అలెగ్జాండర్

*'యో భూతం చ భవ్యం చ సర్వం యశ్చాధి తిష్ఠతి*
*స్వర్యస్య చ కేవలం తస్మై జేష్ఠాయ బ్రహ్మణే నమ:"*

*– అధర్వణవేదం*

*ఏ పరమేశ్వరుడు భూత భవిష్యద్వర్తమాన కాలములను అతిక్రమించి విరాజిల్లుతున్నాడో, ఆ మూడు కాలములందును జరుగు వ్యవహారములను అన్నింటిని సరిగా ఎరుగునో, ఎవడు సమస్త జగత్తును తన విజ్ఞానముచే ఎరుంగునో, పుట్టించి, పోషించి, లయమొనర్చునో మరియు విశ్వమందలి పదార్థములకు అదిష్ఠాత స్వామియో, కేవల సుఖమే ఎవనికి స్వరూపమో, ఎవడు మోక్షమును, వ్యవహారిక సుఖమును ఇచ్చువాడో, ఎవనికి లేశమాత్రమైన దుఖ:ంకలుగదో, ఎవడు ఆనందుడో, అందరికంటె పెద్దయు సర్వ సామర్థ్య యుక్తుడును అగు ఆ పరమాత్మను అత్యంత ప్రేమతో నమస్కరించెదను.*

దేశ కాలము అనే పదాలు ఉచ్చరించినంతనే మన మనస్సులో ఆ పదాలను గురించిన ఒక స్పష్టమైన అవగాహన రూపుదిద్దుకుంటుంది. మనం చెప్పుకునే పురాణ కథలలోనూ ఈ పదాలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. ఉదాహరణకు: "ఒకానొక కాలంలో చాలా సుదూర ప్రాంతంలో ఒక రాజు ఉండేవాడు..." అని మొదలైన కథలను ఎన్నో విన్నాం. సామాన్యులు ప్రాధాన్యం ఇచ్చే ఈ దేశకాల పదాలలోని భావాలు చాలా పరిమితమైనవిగా తాత్వికులు పరిగణిస్తారు. మన మనస్సులో కదిలే కాలం అనే భావానికి ఆది అంత్యాలు ఉన్నట్టుగా కనిపిస్తాయి. నిజానికి కాలానికి ఆది అంత్యాలు ఉన్నాయా? అందుకు అనుకూల ప్రతికూల సమాధానాలు రెండు ఉన్నాయి. ఇవి మనల్ని ఇబ్బంది పెడతాయి కూడా. ఇక నిత్యత్వాన్ని గురించి ప్రశ్నించుకుంటె దానికి జవాబు కాలం కంటె ఇంకా సంక్లిష్టంగా ఉంటుంది. ఒక ప్రదేశాన్ని గురించి మనం మాట్లాడేటప్పుడు ఆ ప్రదేశపు హద్దులపై కొంత అవగాహన కుదురుతుంది. అయితే ఈ ప్రదేశానికి ఆవల ఏమున్నదని తర్కిస్తే మళ్లీ సమస్య మొదటికే వస్తుంది. అందుకే బ్రిటిష్ తత్వవేత్త జార్జ్‌బర్క్లీ వ్యాఖ్యానిస్తూ ఇలాంటి ప్రశ్నలు వేయడం "మైదానంలో దుమ్మురేపి, ఆ దుమ్ములో తనకు ఏమీ కనిపించడం లేదు" అని వాపోవడం లాంటిదని చెప్పాడు.

ఇప్పటివరకు మనం ప్రస్తావించిన దేశకాలాలకు సంబంధించిన అంశాలు మనకూ, ప్రపంచ తాత్వీకులకు అన్వేషణకై పురికొల్పే మార్గదర్శకాలవుతాయి అన్నది వాస్తవం. ప్రస్తుతానికి మన ఆలోచనలను కాలం–నిత్యత్వాలకు పరిమితం చేసుకుందాం. కాలానికి సంబంధించి: భూత, భవిష్యత్తు, వార్తమానాల విభజనను వ్యవహారికంగా అందరూ అంగీకరించిన విషయమే. భవిష్యత్తు అనేది మన ప్రమేయం లేకుండానే ముందు నిర్ణయించబడిన ఒక వాస్తవమని మనం గ్రహించాలి. నిజానికి మనం భవిష్యత్తు నిర్మాతలము కాము. భవిష్యత్తును నిర్దేశించే శక్తి మనకు లేదు. దాని సహజ ధర్మాన్ని బట్టి అది కొనసాగుతుంది. ఈ భావనను ఒకవైపు ఉంచి, మరొక దృక్కోణం నుంచి ఆలోచిస్తే మనం కూడా ప్రకృతిలోని భాగమే కనుక భవిష్యత్తు నిర్మాణంలో కొంత పరోక్షంగాను, అపరోక్షంగాను మనం కూడా భాగస్తులము అవుతామన్నది విజ్ఞుల అభిప్రాయము.

మన జీవితాన్ని... ఈ చరాచర జగత్తును ప్రభావితం చేసే కాలం పాత్ర ఏంటో లోతైన పరిశీలన చేద్దాం. మనం వ్యవహారంలో కాలానికి కొలమానంగా చూపించే ఈ "రోజు" లేక "దినం" మనిషి జీవితాన్ని ఖండాలుగా విభజించే కత్తి వంటిదని తిరుక్కురల్ వివరిస్తుంది. మరొక వైష్ణవ ఆచార్యుడు

"రోజులనేవి మన జీవితాన్ని చిన్న చిన్న ముక్కలుగా తరిగే రంపాల వంటివని వ్యాఖ్యానిస్తాడు.

ఈ ఉదాహరణలన్నీ కాల స్వరూపాన్ని చూపిస్తూ కాలం నిరంతర ప్రవాహ సమమని అన్నిటిని మార్చగల "శక్తిరూపం" అని వివరిస్తున్నాయి. కాలం అన్నిటిని మార్చివేస్తుంది. శాశ్వతమైనది ఏదీ లేదు అన్న వాస్తవాన్ని గ్రహించి ఆ విజ్ఞతతో శాశ్వతమైనదేదో దానిని సాధించేందుకు ఈ కాలాన్ని సక్రమంగా ఉపయోగించుకోవడం, కాలంతో కరిగిపోకుండా కాలాన్ని అధిగమించి శాశ్వతమైన పరతత్వాన్ని సాధించగలగడమే మానవ జీవిత పరమార్థంగా భావిద్దాం. ఉదాహరణకు: సౌందర్య భావన ప్రకృతి మనిషికి ప్రసాదించిన అపూర్వ వరం. మానవుడు అందమైన కళాకృతులను నిర్మించగలడు. దివ్యమైన కవిత, శ్రావ్యమైన సంగీతం, జీవం ఉట్టిపడే చిత్రలేఖనం, సజీవమైన శిల్పకళాకృతులను సృష్టించగల ధీశాలి మానవుడు తనలోని శక్తులన్నింటిని ఏకాగ్రం చేసి నిశ్చలతతో పారలౌకికమైన అనుభూతిని అనుభవిస్తూ, తన చుట్టూ స్వర్గ కళాకాంతులను వెదజల్లడంలో మానవుడు నేర్పరి. మనిషి కాలాన్ని అధిగమించి నిత్యత్వంలో ప్రవేశించడం అంటే ఇదే. క్షణికమైన కాలంలో నిత్యత్వాన్ని ప్రవేశ పెట్టడమంటే ఇదే. ఈ జీవకళను ప్రతి ఒక్కరం నేర్చుకోవాలి. మనం మన వివేకంతో ఏవి నశించే గుణం కలవో వాటిపై మమకారం వీడి నిత్యమై, సత్యమై, ప్రకాశించే వాస్తవమైనదేదో దానిని ఊతగొని నశించగల ఈ కాలంలోనే అమరత్వాన్ని సాధించగలగడమే మానవుని ప్రధాన కర్తవ్యం. మానవుడు కదిలే కాలాన్ని అధిగమించి నిత్యత్వాన్ని సాధించి అమరుడు కాగలడు అన్నదానికి మార్కండేయ పూరాణంలోని కథను గుర్తు చేసుకోవడం అవసరం అనుకుంటాను. వరపుత్రుడైన మార్కండేయుడు కేవలం పదహారేండ్లు మాత్రమే జీవించగలడు. ఆ తరువాత అతన్ని మృత్యువు కబళించడం విధి నిర్ణయం. బాలునికి పదహారేండ్లు నిండగానే కాలుడైన యముడు బాలున్ని మృత్యులోకానికి తీసుకుపోవడానికి వస్తాడు. అది గ్రహించి భయంతో శివుణ్ణి ఆశ్రయించి శివలింగాన్ని గట్టిగా ఆలింగనం చేసుకుంటాడు. కాలుడైన యముని ప్రయత్నాన్ని పరమేశ్వరుడైన శివుడు నివారించి మార్కండేయునికి పూర్ణాయుష్షును అనుగ్రహిస్తాడు అన్న విషయం మనకు తెలిసినదే. భక్తితో కూడా మనిషి కాలాన్ని జయించగలడు అన్నదానికి ఇదొక ఉదాహరణ.

భగవత్ ప్రణాళికలో కాలం పాత్ర చాలా ప్రధానమైనది. శైవసిద్ధాంతం ప్రకారం అశుద్ధమాయారూపమే ఈ కాలం. ఉత్పన్నమయ్యే ప్రతివస్తువుకు మూలకారణం ఈ మాయయే. పరిణామక్రమంలో ఈ అశుద్ధ మాయ నుండి కాలం – నియతి చోటు చేసుకుంటాయి. కాలం అంటే గమనంతో అన్నిటిని మార్చేది. నియతి అనగా జరిగే ప్రతి క్రియకు ఖర్మ ఫలాన్ని నిర్ణయించే ఒక వాస్తవం. బుద్ధితో గ్రహించగల శక్తి (Cognitive) అనుభవంతో కూడిన విషయాన్ని తెలియజేసే శక్తి (Conative) ఈ రెండింటి వల్ల గ్రహించి మానవుడు ప్రవర్తించే తీరు (Affective facalties)ను, అశుద్ధ మాయాజనితమైన కాలం–నియతి జరిగే ఈ కార్యకలాపాలను నియంత్రిస్తాయని మనం గ్రహించాలి. ఒకవిధంగా చెప్పాలంటే విధి నిర్ణయంతో జీవి తన కర్మానుసారము కాలం పరిధిలోనే అనేక అనుభవాలను చేర్చుకుంటాడు. ఈ నియతి ఆధ్యాత్మిక, నైతిక పరిణామ దశలకు కూడా వర్తిస్తుందని చెప్పక తప్పదు. కొన్ని కొన్ని సందర్భాలలో జీవుడు తాను సాధనతో సంపాదించని కర్మఫలాలను ఆపేక్షించే గుణం కలవాడు. అదేవిధంగా తాను చేసిన దుష్కర్మల ఫలితముల నుండి తప్పించుకోజూడటం కూడా ఉంది. ఈ విపరీతాలను నివారించడానికే పరమాత్మ కాలం, నియతిని నియమించాడు. తత్ఫలితంగా సత్కర్మకు సత్ఫలితం, దుష్కర్మకు ప్రతిఫలం లభించడం అనే నియమాన్ని నిర్దేశించాడు పరమాత్మ. అయితే ఇప్పుడు

మనం వ్యవహరించే ఈ కాలం అశుద్ధ మాయాజనితమా? ఈనాడు జరిగే పరిణామ క్రమమంతా కాల ప్రభావం వల్లనేనా? శైవ సిద్ధాంతం ఇలా చెబుతుంది: అశుద్ధ మాయా ప్రభావంవల్ల ఇది ముందు, ఇది వెనుక, ఇది తరువాత అనే గ్రహింపునకు అవకాశం కలిగింది. అయితే ఇక్కడ మనం గ్రహించవలసిన విషయం ఏమిటంటే ఈ అశుద్ధమాయ కూడా స్వయంకృతం కాదు. ఇది శుద్ధమాయాజనితం అవ్వడం వల్ల.... శుద్ధమాయే అన్నిటికి అధికారిణి. అందువలన వేదాంతులు శుద్ధమాయను పరమాత్మకు ప్రతిరూపంగా అభివర్ణిస్తారు.

అశుద్ధజనితమైన ఈ కాలము కూడా పరమాత్మకు సంబందించిన రూపాలను సూచనప్రాయంగాను, కొంత అస్పష్టంగాను చూడడానికి మనకు సహకరిస్తుంది. అది ఎప్పుడు జరుగుతుందంటే... కదిలే కాలంలో పుట్టి, పెరిగి, గతించే భౌతిక పదార్థాల వాస్తవ స్థితిని అనుభవపూర్వకంగా గ్రహించినప్పుడు, క్షరమైన లక్షణాలను విజ్ఞతతో పసిగట్టినప్పుడు. కాలంలో కనిపించే ఈ గుణాలన్ని పరమాత్మచే పరికల్పితాలు అని గ్రహించగలగాలి. ఈ పుట్టి, పెరగడం, గతించడం అనే గుణాలలోని ఆంతర్య మర్మాన్ని ఒడిసి పట్టగలగాలి వివేకవంతుడైన మానవుడు. అయితే ఇక్కడ ఓ అనుమానం రావచ్చు... కాలం ఈ 3 గుణాల సమ్మిళితం అన్నాం కదా! మరి కాలమే ఈ పరిణామ క్రమానికి కారణభూతం అని భావించడానికి ఆస్కారం ఉంది కదా! అందుకు శైవసిద్ధాంతులు ఏమంటారంటే, “కాలం తనంతటతాను బుద్ధి గ్రాహ్యం ఉన్న అంశం కాదు తనంతటతాను కాలం ఈ మార్పులను నిర్వహించగల స్తోమతకలదికాదు అని అంటారు. ఇంకావారు ఏమంటారంటే కాలంలో సంభవించే ఈ మార్పులు: ఉత్పత్తి, ఉనికి, లయ అనేవి పరమాత్మునిచే నియమించబడి విధి నిర్ణయానుసారంగా కాలంలో ఓ చేతనా శక్తి ఈ కార్యాలను నిర్వహిస్తుంది.

అంతేగాక పరమాత్ముని ఆయన పరికల్పించిన ఈ రూపాలను, ఈ కార్యకలాపాలను మానవులైన మనం గ్రహించడానికి సాధ్యంకాదు అని హితవు పలుకుతున్నారు.

ఇదే విషయాన్ని సామాన్యులకు అర్థం అయ్యేలా ఉపమానాలతో కవితాత్మకంగా గానం చేశారు వివిధ సంప్రదాయాలకు చెందిన ఆచార్యులు. శైవసిద్ధాంతులు, వైష్ణవ ఆచార్యుల ప్రభోదంలో ప్రయోగించిన పదాలు, భావాలు ఒకే పోలికగా ఉండడం గమనార్హం. మణిక్యవాచకర్, నమ్మాళ్వార్ ఇరువురు దైవాన్ని కాలస్వరూపంగా సంభావించి సంకీర్తనం చేశారు.

*మాణిక్యవాచకర్: ఓ దివ్య సౌందర్య రూపమా! సకల దేవగణముల అధినేత!*
*ఓ నటశేఖరా! నీ పరిపాలనలో నన్ను నిలిపి దీవించుము!*
*ఓ భూతలమా! ఓ ఆకాశమా! ఓహో కాలమా...*
*సమస్త భూతములకు కారణమైన నీ నిజస్వరూపమును గాంచుట ఎన్నడో!*

*నమ్మాళ్వార్: ఓ దివ్య మంగళ స్వరూపమా! నీలవర్ణుడా! పద్మనయనా!*
*జీవులన్నింటిని సౌందర్యంతో ఆకర్షించువాడా!*
*గతమై, వర్తమానమై భవిష్యత్తుగా రూపొందే పరాత్పరా!*
*కాలస్వరూపమైన నిన్ను దర్శించుట ఎన్నడో!*

ఇద్దరు ఆచార్యులు ఒకవైపు కాలమహిమను స్తుతిస్తూ, మరొకవైపు కాలం యొక్క నిష్ప్రయోజనాన్ని స్పష్టం చేస్తున్నారు. కాలం యొక్క ఉపయోగం ఎంతవరకు అంటే వివేచనతో కాలాన్ని తెప్పలా వినియోగించి సంసార సాగరాన్ని పరమాత్మ కృపతో దాటేంతవరకే! ఇదే విషయమై విష్ణు కృపను చవిచూచిన భక్తులు దీనిని విశ్వగానం చేశారు... వెలుగొందు వెలుగొందు కలిశాపము తొలగించబడింది, కలి మాయతెర కరిగిపోయింది. కలి నేస్తాలైన వ్యాధి బాధలు, మరణము తొలగిపోయాయి. విష్ణుని కృపను పొందిన భక్తులం మనం. ఒక దీపం మరొకదీపాన్ని వెలిగించులాగునా విశ్వమంతా విష్ణుని

కాంతిని ప్రసరింపచేద్దాం అంటూ పరవశగానం చేశారు ఆళ్వార్‌లు.

స్వర్గం – నిత్యత్వం అనే వాస్తవాలు ఎక్కడో సుదూరంలో ఉండే అందరానివి కావు, దుర్లభం అంతకన్నా కావు. దైవకాంతిని, దైవ అనుగ్రహాన్ని, బ్రతుకు గుడిలో భక్తి దీపంతో ప్రకాశింపజేయి... ఇక్కడే... ఇప్పుడే... పరమాత్మ కాంతి వలయంలో నీవు పునీతమవుతావు. తిరుజ్ఞాన సంబంధార్ సంకీర్తనతో ఈ వ్యాసాన్ని పూర్ణంగావిద్దాం.

*"ఓ చెంచలమైన మనస్సా! ఎన్నాళ్లని ఈ పరుగులాట!*
*స్థిరమై... ప్రేమాస్పదుడైన దేవదేవుని ఆశ్రయించు*
*దేవదేవుని నామాన్ని గానముచేయి!*
*ఆ నామ మహిమ నిన్ను కలిబంధం నుండి విడిపించి దేవదేవుని ముంగిట నిన్ను నిలుపుతుంది.*
*అహంకారమును వదిలి శివపాదముపై నీ శిరస్సు వంచి శరణువేడుమా!"*

*Time thus gets transformed into Eternity when we worship the lord and serve him. Thus we grow into His Image.*

మి


కస్తూరి అలెగ్జాండర్
నల్లగొండ, ఫోన్: 918 265 0230.


---

## Statement about ownership and other particulars of **MISIMI**

**FORM IV (SEE RULE - 8)**

| | | | |
|---|---|---|---|
| 1. | Place of Publication | : | Hyderabad |
| 2. | Periodicity of Publication | : | Monthly |
| 3. | Printer's Name | : | ALAPATI BAPANNA |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P. |
| 4. | Publisher's Name | : | ALAPATI BAPANNA |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P. |
| 5. | Editor's Name | : | VALLABHANENI ASWINI KUMAR |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P. |
| 6. | Names and Addresses of Individuals who own the News Paper and Partners or share holders holding more than one percent of the total capital | : | Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. T.S. |

I, ALAPATI BAPANNA, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

**ALAPATI BAPANNA**
Publisher

March-31, 2018

# అడవి బతుకులు

– వై. సుభాషిణి

ఆధునిక సాహిత్యాన్ని ప్రభావితం చేసిన అంశాలలో గిరిజన సాహిత్యం ఒకటి. అందులో జన జీవన చిత్రణకు పెద్దపీట వేసిన ఆధునిక సాహిత్య ప్రక్రియ కథ. సాహిత్యంలో గిరిజన సమస్య చిత్రితం కావటం నవ్యం. స్వాతంత్ర్యం వచ్చినా భూస్వాముల సంపన్నుల కబంధ హస్తాలకు చిక్కి సతమతమవుతూ అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతున్న తెగలే ఆదివాసీలు. వీరికి ప్రభుత్వం ఇస్తున్న పథకాలు, రిజర్వేషన్లు తెలియవు. అక్షరజ్ఞానం లేకపోవడంతో దోపిడీకి గురవుతున్నామని తెలియక జీవిస్తున్న వాళ్ళు. అందుకే ఈ గిరిజన జీవితాన్ని, సమస్యల్ని, సంస్కృతిని చిత్రించే కథలు ఆధునిక కాలంలో ఎన్నో వెలువడ్డాయి. అందులో డా. దిలావర్ రచించిన రెండు కథా సంపుటాల్లో ఒకటి కొండా... కోనల్లో...! ఈ సంపుటి దిలావర్ గారిని గొప్ప గిరిజన కథా రచయితగా నిలబెడుతుందనటం అతిశయోక్తి కాదు. 'కారడవిలో కాంతి కిరణం' నుంచి "ఆ ఏడు మండలాలు" వరకూ ఉన్న పన్నెండు కథల్లో అన్నీ గిరిజన జీవితాల్ని చిత్రించినవే.

చెప్పాలనుకున్న విషయం పట్ల అవగాహన, చెప్పే తీరులో నేర్పు సంఘటనల కూర్పులో సహజత్వమూ ఉన్న రచయిత దిలావర్ గారు. ఆదివాసీల మధ్య పెరిగి, వారి జీవితాలెలా ఉంటాయో ప్రత్యక్షంగా చూసినవారు. ఇతరులకంటే భిన్నంగా తన చూపునంతా ఆదివాసీల వెతల మీదనే ప్రసరింపజేశారు. అడవిబతుకుల జీవితాన్ని కళ్ళకు కట్టినట్లుగా చిత్రీకరించారు. ఆదివాసీల మధ్య తిరిగిన అనుభవమే వారి జీవన్మరణ సమస్యలను కథల్లో చూపించే అవకాశాన్నిచ్చింది. ఆదివాసీల ప్రపంచాన్నే తన సాహిత్యప్రపంచంగా, తనెరిగిన తన అనుభవాలకు ఆలోచనలకు కేంద్రబిందువైన ఆదివాసీల జీవితాన్నే కథలుగా తీసుకున్నారు. కొండా కోనల్లో జీవిత వాస్తవికతను విమర్శనాత్మకంగా విశ్లేషించి ఆదివాసీల బతుకు వెతల్ని కథా చిత్రంగా మలిచారు దిలావర్ గారు.

ఆదివాసీలు అంటే 'మూలవాసులు'. ఆదిమానవుడి జీవితం మొదట కొండకోనల్లోంచే ఆరంభమైంది కాబట్టి 'ఆది' నుండి 'గిరి' ప్రాంతాల్లో నివసించిన జనులే ఆదివాసీలు గిరిజనులు అన్నది స్పష్టం. అడవిబిడ్డలుగా ఆదిమవాసులుగా... ప్రపంచ వ్యాప్తంగా కొన్ని రకాల జాతులు విభిన్నమైన సంస్కృతీ సంప్రదాయాలతో జీవిస్తున్నారు. వీరిని సాధారణంగా ఆటవికులు, వనవాసులు, అడవిబిడ్డలు, ఆదివాసీలు, గిరిపుత్రులు వంటి పలు పేర్లతో పిలుస్తున్నారు.

అడవి బిడ్డలైన ఆదివాసీలు కొండకోనల్లో నివసించి నాగరిక సమాజానికి ఎక్కడో దూరంగా, కొన్ని వేల సంవత్సరాలుగా జీవిస్తున్నారు. వీరు చాలా అమాయకులు.



సమాజ జీవితానికి భౌగోళికాది కారణాల వల్ల దూరంగా ఉన్నవారు. అనాగరికులు. నాగరికలోకపు వినోదాలేమీ తెలియనివారు. వీరి తాపత్రయమంతా కడుపునిండడం మాత్రమే. ఆకలిని దాటి ఏమీ వీరిని దరిచేరలేదు. కారణం వేరే

ప్రపంచం తెలియని అభాగ్యులు. వీరు ఎలాంటి దోపిడీ, దౌర్జన్యం, పీడనకు గురి అవుతారో, ఎలాంటి పాట్లు పడతారో తెలిపే కథా సంపుటే "కొండా .... కోనల్లో ...."! స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళయినా భూస్వామ్య విధానాలు పోలేదు. అసమాన ప్రాంతీయ అభివృద్ధికి వలసవాద విధానం గట్టి పునాది వేసింది. ఆనకట్టలు, నీటిపారుదల సౌకర్యాలు కలిగివున్న ప్రాంతాలు అభివృద్ధిపథంలో నడుస్తుంటే అటవీప్రాంతంలో జీవించే వారి స్థితి దీనికి భిన్నంగా ఉంది. అధికారుల స్వార్థ ప్రయోజనాలు ఒకవైపు, ప్రకృతి పరాచికం మరోవైపు, దానికి తోడు భూస్వామ్య పెత్తందారీ విధానం దోపిడీ, దౌర్జన్యాలు, పీడనలు ప్రజల జీవితాల్ని మరింత దుర్భరం చేశాయి. ముఖ్యంగా అడవుల్ని నమ్ముకుని బతికే గిరిజనులు ఎంతగా కష్టాలు, కడగండ్లు పాలుకావాలో అంతగా నలిగి మరిగిపోతున్నారు. నానాటికీ గిరిజన తండాలు అంతరించుకుపోతున్నాయి. దళారీ వర్గ దోపిడీ ఒకవైపు పీడన మరో వైపు, ప్రకృతి వైపరీత్యాలు ఇంకోవైపు చాపకింద నీరులా వాళ్ళ జీవితాలను ముంచేస్తున్నాయి. అదే ఈ కొండా కోనల్లో .. స్పష్టంగా కనబడుతుంది.

**జీవన విధానం :**

ఆకులు, అలములు, కందమూలాలే వారికి ఆహారం. అడవులలో ప్రవహించే వాగు నీరు, గుంతలలో ఉండే మురికి నీరే వారికి త్రాగే నీరు. ప్రతిక్షణం ప్రకృతి ఒడిలో తలదాచుకుంటూ జీవిస్తున్నారు ఆదివాసీలు. ఆధునిక నాగరిక ప్రపంచానికి పూర్తిగా దూరంగా ఉంటున్న వీరు ఇప్పటికీ ఆదిమకాలపు జీవన విధానాన్ని కొనసాగిస్తున్నారు. ఏరోగం వచ్చినా ఆకుపసర్లు చెట్లమూలికలే వారి ప్రాణాలను కాపాడే మందులు. ఇలా జీవనం సాగిస్తున్న వారి జీవితాలను ప్రకృతి వైపరీత్యాలు, అడవి మృగాలు అతలాకుతలం చేస్తున్నాయి. వీరి ఈ సమస్యలన్నింటికీ ప్రధాన కారణాలు అమాయకత్వం, అజ్ఞానం, నిరక్షరాస్యత, మారుతున్న నాగరిక పరిస్థితులే ! ఎందుకంటే అవే వీరిని సమస్యల వలయంలోకి నెట్టేస్తున్నాయి.

గిరిజనులు జంతువుల దాడిలో గాయపడితే వైద్య సదుపాయాలు అందక నాటువైద్యమే గతిగా ఉంది. ఒక్కోసారి రోగాలొచ్చినా వైద్యం దుర్లభమే. గిరిజనుల్లో నిరంతరం ప్రసూతి, శిశుమరణాలు ఎక్కువ. వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో ఎన్నో అనర్థాలకి దారితీస్తోంది. ఆసుపత్రికి తీసుకుపోవడానికి కనీస సౌకర్యాలు లేకపోవడం గమనార్హం. ప్రాణాలు కోల్పోయిన స్థితులే ఎక్కువ. డాక్టరు అందుబాటులో ఉన్నా మూఢనమ్మకాల వల్ల మందులు వేసుకోక ప్రాణాలు కోల్పోవడం కూడా ఉంది. అమీబియా సోకిన గిరిజనులను ఆసుపత్రికి వచ్చి మందులు తీసుకోమని డాక్టర్ కిరణ్ ప్రాధేయపడినా వాటిని విసిరేసిన వైనం 'కారడివిలో కాంతి కిరణం'లో కనబడుతుంది. మరోవైపు ఆసుపత్రికి వెళ్ళడానికి సరైన రహదారులు లేక ప్రాణాలు కోల్పోయే స్థితి 'ఆ ఏడు మండలాలు'లో ఉంది. ఇలా సకాలంలో వైద్యం అందక కొందరు, మూఢనమ్మకాలతో మరికొందరు మృత్యువాత పడుతున్న అమాయకపు అడవి బిడ్డల దయనీయ పరిస్థితులు వారెంతటి అజ్ఞానంలో జీవిస్తున్నారో తెలుపుతాయి.

అడవి బిడ్డల బతుకులు దుర్భరం కావడానికి కేవలం అమాయకత్వమే కాదు. అధికారుల నిర్లక్ష్యం, చేతగానితనం, లంచగొండితనం కూడా ! అడవిబిడ్డలని తనలో పొదువుకొని రక్షణ కల్పించే అడవినే స్మగ్లర్లు నాశనం చేస్తుంటే, అటవీ అధికారులే లంచాలు తీసుకొని చోద్యం చూస్తుంటే వారి గోడు ఆ అమాయకులు ఎవరితో మొరపెట్టుకోగలరు. అందుకే వారి బతుకులు అంధకారంలోకి నెట్టబడుతున్నాయి. అటవీ ఉత్పత్తులు లేవు. చేతిపనులు లేవు. కనీసం నిలబడటానికి చోటు కూడా లేదు. ఎక్కడికెళ్ళాలనే అయోమయస్థితిలో నిలబడ్డారు అడవిబిడ్డలు. తాగడానికి నీళ్ళుకూడా లేని దుర్భర పరిస్థితి ఎదురై అష్టకష్టాలు పడుతున్న తీరు "చెట్లు కూలుతున్న దృశ్యం"లో చిత్రితమైంది.

**దోపిడి:**

గిరిజన జీవితాలలో దోపిడి ఒక భాగం. అమాయకత్వం, నిరక్షరాస్యత, నిష్కాపట్యం వల్ల గిరిజనులు అడుగడుగునా దోపిడీకి గురవుతున్నారు. వారి కష్టం, సంపద, శరీరాలను సైతం దోచుకొంటున్న వారే అధికం.

వారి బతుకు వారే జీవిస్తున్నా, దౌర్జన్యంతో విప్లవగీతాలు పాడి, అందరినీ రెచ్చగొడుతున్నావంటూ అమాయకులను బలి తీసుకున్న సందర్భాలూ లేకపోలేదు. "సమాజంలో ఒక భాగం మరొక భాగాన్ని దోపిడీ చేయటం అనే సామాజిక సూత్రానికి ప్రాచీన తెలుగు సాహిత్యం అంతా నిదర్శనంగా ఉంది. (సాహిత్యంలో వస్తుశిల్పాలు – త్రిపురనేని మధుసూధనరావు, 109). ప్రాచీన సాహిత్యమే కాదు గిరిజన సాహిత్యమూ అందుకు తార్కాణమేనన్నది కొండా.... కోనల్లో.. కనబడుతుంది. ఎందుకంటే కష్టించే స్వభావం ఆదివాసీలది. ఎంత కష్టానికైనా ఓర్చి పని చేయగలిగే కష్టజీవులు వీరు. అడవులలో కొండలలో నివసిస్తున్న గిరిజనులను దోచుకోవడం ఎన్ని రకాలుగా ఉంటుందో ఆదివాసీల కథలు చాటాయి. పచ్చని చెట్ల మధ్య ఉన్న దాంతో తృప్తిగా ఆటపాటలతో గడిపే గిరిజనులపై గిరిజనేతరుల ప్రభావం చాలా ఎక్కువైంది. ప్రశాంతంగా సాగుతున్న వారి జీవనంలో ఎన్నో కష్టాలు...కడగండ్లునూ! ఎటుచూసినా ఇబ్బందులే! ఒక్కసారిగా వారిని చుట్టుముట్టి అంధకారంలోకి నెట్టేశాయి. వారి సామర్థ్యాన్ని ఖనిజాలు దోచుకోవడానికి వచ్చిన ఓపెన్ కాస్ట్ గనుల పేరుతో సింగరేణి యాజమాన్యం ఆదివాసీలకు ఆశలు చూపి వారి శ్రమను, ఆరోగ్యాన్ని దోపిడి చేశారన్నది ఈ కథలో స్పష్టంగా ఉంది. పచ్చని చెట్ల మధ్య జీవిస్తున్న వారి బతుకులు ఎలా మారిపోయాయో వారెలాంటి బాధలకు గురయ్యారో తెలిపింది. అంతేకాదు మనిషి చేసే అరాచకం తెలియని అమాయకులు ఆ మాయదారి వోసి వారి జీవితాలను మార్చివేసిందని నిరాశ పడటం, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవించాల్సిన స్థితి దాపురించిందని దుఖించడం వారి వంతైంది.

గిరిజన స్త్రీలు అమాయకులు, నిరక్షరాస్యులు. అటవీ పరిరక్షణ నిమిత్తం ప్రాజెక్టు నిర్మాణ పథకాల కోసం గనుల తవ్వకాల నెపంతో వస్తున్న అధికారులు, వర్కర్లు స్త్రీలను మోసం చేసినతీరు

'రాళ్ళు రప్పలూ ' కథలో చిత్రితమైంది. గిరిజనస్త్రీలు చాలా సులభంగా సమస్యల వలయంలో చిక్కుకొంటారనడానికి నిదర్శనం సమ్మక్క. ఆమె తన అమాయకత్వంతో డ్రైవరు వలలో పడిపోతుంది. అతను పెళ్ళి చేసుకుంటానన్నాడని అతని చుట్టూ తిరుగుతుంది. కాని చివరికి ఆమె పిచ్చిదై డైబర్ బాబూ అంటూ అదే లోకంగా జీవించడం నాగరికుల కుతంత్రాలు తెలియక బలైపోయిన స్థితికి నిదర్శనంగా ఉంది. పుట్టిన బిడ్డ తండ్రి లేని వాడుగా జీవించడానికి కారణమైంది. 6.2 గిరిజనులపై లైంగిక దోపిడీ మరో అకృత్యం. హింసా సంస్కృతి ఎక్కువైన ఈ సమాజంలో ముందుగా దోపిడీకి గురయ్యేది స్త్రీలే నన్నది నిజం. స్త్రీ మీద లైంగిక దోపిడి నిరంతరం జరుగుతోంది. చంద్రి అన్నను పోలీసులు పట్టుకెళ్ళినప్పుడు తనని విడిపించుకోవడానికి పోలీస్ స్టేషన్ కెళ్ళి లైంగిక దోపిడీకి గురవుతుంది. ఆమె శీలాన్ని దోచుకొని హింసిస్తారే తప్ప వదిలిపెట్టరు. అన్నమీద ఆశతో మళ్ళీ మళ్ళీ అదే పులి నోట్లో వేలుపెట్టి మరీ జీవితాన్ని నాశనం చేసుకొంటుంది చంద్రి (పాటకు మరణం లేదు). గిరిజన స్త్రీల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వారు చేసున్న ఆగడాలతో బలైన స్థితులు స్పష్టంగా కొండా.....కోనల్లో కనబడుతున్నాయి.

**బతుకు పోరాటం:**

"నిరంతర పోరాటం గిరిజనుల జీవనశైలి. ఆకలితో పోరాటం. ఆకలిగొన్న మృగాలతో పోరాటం. మృగాలలాంటి నాగరికులతో పోరాటం" (126). ప్రతి నిమిషం పోరాటంతోనే జీవితాన్ని సాగిస్తూ బ్రతుకు జీవుడా! అనుకొంటున్న వారి వెతలు ప్రతి ఒక్కరి మనసునూ కదిలించకమానవు. ఆ స్థితి నుండి తప్పించుకొనే మార్గాలు అన్వేషించాల్సిన అవసరమూ తప్పదు. నాగరికపు మనుషుల్లో స్వార్థం ఎక్కువ. నేను బాగుండాలి. నావాళ్ళు బాగుండాలనుకొనే బాపతే ! కాని అడవి బిడ్డలు ఎలాంటి కల్మషం లేని నిస్వార్థపరులు. దాచుకోవాలనే ఆశ, ఆలోచన కూడా లేని వాళ్ళు. అడవుల్లో జంతువులతో సహవాసం చేసే ఈ అడవి బిడ్డలు జంతువుల్లాగే ఆరోజు కడుపు నిండితే చాలనుకునే స్వభావం కలవారని రచయిత చెప్పిన మాట అక్షర సత్యం. కాని పరిస్థితులు తారుమారయ్యాయి. అడవులలో ఉన్న సంపద కొల్లగొట్టుకుపోవడం వల్ల ఆహారం కరవైంది. ఎలా జీవించాలనే అయోమయ స్థితిలో

కొట్టుమిట్టాడాల్సిన పరిస్థితి ఆదివాసీల వంతైంది. కేవలం నాగరికులతో మాత్రమే కాదు అడవిలో నివసిస్తున్న ఆదివాసీలు జంతువులతో సైతంపోరాటం చేయాల్సిన స్థితి. జంతువుల బారినుండి తమను కాపాడుకోవటానికి నానాయాతనలు పడిన వైనం 'నిర్జీవావరణం'లో స్పష్టంగా తెలుస్తుంది. మనిషి జీవించడానికి నిరంతరం పోరాటం తప్పదని నిరూపించిన కథ ఇది.

**ఘర్షణ:**

ఇద్దరు వ్యక్తుల మధ్యా, ఒకే వ్యక్తిలోని రెండు అంశాల మధ్యా, రెండు భావాల మధ్యా, రెండు వర్గాల మధ్యా, రెండు సిద్ధాంతాల మధ్యా, రెండు దృక్పథాల మధ్యా ఇలా ఎన్నిటి మధ్యనైనా ఉండవచ్చు. అంతేకాకుండా ఈ సంఘర్షణ భౌతికంగా గాని మానసికంగాకాని ఉండవచ్చు" (వల్లంపాటి వెంకటసుబ్బయ్య కథాశిల్పం, పుట. 15). ఇక్కడ గిరిజనులు, సమాజం మధ్య ఘర్షణ. ఆరితేరిన తెలివితేటలు గల నాగరిక సమాజం, లోకం లౌక్యం తెలియని అమాయకపు గిరిజనుల మధ్య తరతరాలుగా సాగుతున్న ఘర్షణ ఇది. గనుల తవ్వకాలను జరపడానికి వచ్చిన అధికారులను గిరిజనులు మా భూముల్లో మా అనుమతి లేకుండా ఎలా తవ్వుతారు? మాకు హక్కులు ఇవ్వకుండా వేరే వాళ్ళకు ఎలా ఇస్తారని వాపోతారు. వారితో ఎవరికిస్తే ఏంటి? పని చేస్తే వచ్చే ఆదాయం మీకు సరిపోదా అంటూ మాయమాటలతో వంచించారు. దీనితోగిరిజనుల జీవనోపాధి సంక్షోభంలో పడింది. గిరిజనుల అమాయకత్వాన్ని, భూములను దోపిడీ చేయడంలోనూ మోసం ఉంది. భూముల్లో దొరికే ఖనిజాలను తవ్వినందుకు కూలి మాత్రమే మిగిలింది. ఆ ఖనిజాలను దోచుకోవడం మాత్రం అధికారులే! రాత్రీ పగలూ బండచాకిరీ గిరిజనులది కాగా లాభం అధికారులదే అయింది. కష్టానికి తగిన ఫలితం కూడా అనుభవించని దౌర్భాగ్యం అడవి బిడ్డలదే. కనీసం తినడానికి ఫలసాయాలు దొరకని స్థితి. తాగడానికి నీళ్ళు కరువై మంచినీటి కోసం రెండు మూడు కిలోమీటర్లు నడచి వెళ్లాల్సిన పరిస్థితి. కనీసావసరాలను తీర్చుకోలేక సతమతమై ఘర్షణ పడాల్సిన గతి ఆదివాసీలదయ్యింది.

**దురాక్రమణ:**

ఆదివాసీలకు జీవనాధారం భూమి. ఆకలిమంటలు చల్లార్చుకోవడానికి ఉన్న ఒకానొక ఆధారం భూమి. "భూమి దేశ ప్రజల సంపద. భూమి ఆదివాసులకు, రైతులకు జీవనవారసత్వం" (రాబర్ట్‌ముగాటే). ఆ భూమిని కూడా గిరిజనేతరులు బినామీ పేరుతో పట్టాలు సంపాదించి, కష్టపడి సాగులోకి తెచ్చుకొన్నా ఆక్రమణ జరుగుతోంది. వారి నివాసంలోనే ఆవాసాలు ఏర్పరచుకొని మరీ గిరిజనేతరులు భూమిని లాక్కోవడం ఉంది. ప్రభుత్వం పట్టాలిచ్చిన భూమిని ఆక్రమించుకొని, గిరిజనుల పొట్టకొట్టే నాగరికుల దుండగాలు అన్నీ ఇన్నీ కావు. అలాంటి దురాగతాన్ని 1/70×420 కథలో చిత్రీకరించారు. అధికార బలంతో వచ్చే వాళ్ళనే కాక బ్రతుకు దెరువు కోసం వచ్చే వారిని సైతం గిరిజనులు ఆదరిస్తారు కాని అభ్యంతరం చెప్పరన్నది ఈ కథలో స్పష్టమైంది. వారికున్న మంచితనానికి నిదర్శనమే ఈ కథ. సుదూరం నుంచి కోయగూడేనికి వలసవచ్చిన రాజారాంను ఆదరిస్తారు గిరిజనులు. వచ్చిన కొత్తలో అందరితో కలివిడిగా ఉండే రాజారాం నన్ను మీలో ఒకనిగా భావించండని చెప్తూనే కాలక్రమంలో దొరగా మారతాడు. అయన మీద జనులకు ముందున్న జాలి స్థానంలో భయం, భక్తి చేరుకున్నాయి. గూడెం వాళ్ళనే తన దగ్గర నమ్మిన బంటు చేసుకున్నాడు. తనకి నచ్చిన భూమిని లాక్కోవడం మొదలు పెట్టాడు. ఇవ్వకపోతే వాళ్ల పెళ్ళాం బిడ్డలని మాయం చేసేవాడు. దాంతో భయపడి పత్రాలను దొరకిచ్చేసేవారు. ఈ పని జరగడానికి ఆదివాసీలలోనే కొందరిని పావుగా వాడుకొనేవాడు. ఈ విషయం తెలుసుకున్న నమ్మినబంటు సింగన్నకు దొర అసలు రూపం తెలుకొని దొరమీదికి గూడెంలో వాళ్ళందరినీ ఉసికొల్పి అది మా ఆస్తి. దాన్ని మేమేమైనా చేసుకొంటామంటూ యుద్ధానికి తలపడటమే ఇతివృత్తం. పిల్లిని బోనులో బంధించిన ఒక నాటికి పులిలా తిరగబడుతుందని సామెత. అదే జరిగింది ఈ కథలోనూ! అందులోనే ఎవరు ఇంకొకరని ఎక్కువ రోజులు వంచించలేరనే సత్యం బోధపడింది. ఎంతటివారైనా ఒకనాటికి తగ్గాల్సిందేనని కాలం నిరూపించింది.

నిష్కల్మషమైన, నిర్మలమైన స్వభావం ఆటవికులది. కుట్రలు కుతంత్రాలు చేయటం రాదు. అమాయకంగా దొరలు చెప్పిన మాటలు నమ్మడమే తెలుసు. దాని పర్యవసానం తన కులం వాళ్ళకే అన్యాయం జరగడం. గిరిజనుల భూములను లాక్కోవడానికి దొరవారినే ఆయుధాలుగా, పావులుగా వాడుకోవడం, రూల్స్ తెలిసి మాట్లాడిన కన్నయ్య కూతురిని మాయం చేయడంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో కన్నయ్య భూమిని వదులుకోవాల్సిన గత్యంతరం కల్గింది. క్రౌర్యం దొరల్లో వేళ్ళూనుకొని ఆదివాసీల జీవితాలతో ఆడుకొంది.

అది ఈ కొండా.. కోనల్లో .... స్పష్టమైంది. అంతేకాదు గిరిజన చట్టాలున్నా వారి దగ్గర భూములు ఎలా కొనగలిగావని ప్రశ్నించిన షడ్డకుడితో దొర “డబ్బు నాగస్వరం లాంటిది. అది వూదితే ఎలాంటి ఆఫీసు పాములైనా పడగలెత్తి ఆడాల్సిందే....” అన్న మాటలు గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని చేస్తున్న దురాక్రమణకు ప్రత్యక్ష నిదర్శనంగానూ, లంచగొండితనానికి తార్కాణంగానూ నిలిచింది.

**ప్రకృతి:**

ఆదివాసీలు ప్రకృతిలో భాగం కాగా ప్రకృతి వారి జీవితాలతో మమేకం అయింది. తిండినిచ్చింది. సేదతీర్చింది. కష్టమొస్తే ఆదుకొంది ప్రకృతే. నాగరిక ప్రపంచం తెలియకపోయినా ప్రకృతి గురించి అణువణువూ తెలుసు. ప్రకృతిని వారి అవసరాలకు ఎలా వినియోగించుకోవాలో కూడా తెలుసు. అలాంటిది ఈ రోజు ఆదివాసీలకు ప్రకృతి దూరమవుతోంది కారణం



కొందరి స్వార్థపరుల దురాలోచనే. జలయజ్ఞం పేరుతో ప్రాజెక్టులు నిర్మించాలనుకొన్న ప్రభుత్వం గిరిజన గూడేలను ఖాళీ చేయించగా, పునరావాసం లేక పట్టణానికి వెళ్ళిన వారి జీవితం ఎలాంటి ఇబ్బందులకు గురి అయిందో తెలుపుతూ రాసిన కథ ‘అరణ్యరోదన’. ఈ కథలో అడవిలో సంతోషంగా జీవితాలను సాగించే అడవి బిడ్డల జీవితం నరకప్రాయమైంది. పిల్లల పెళ్ళిళ్ళు ఆగిపోయాయి. వేటలో నిపుణుడై ఉండి కూడా తిండి దొరకక కొందరు దొంగలుగా మారిన బాధామయస్థితి. మరికొందరు బతకడానికి రకరకాల పనులతో వారి జీవితాలను నాశనం చేసుకున్న వైనం, దయనీయ స్థితిని చాటింది.

తరతరాలుగా మూలపురుషుల దగ్గరనుండీ బతుకుతున్న గిరిజనుల ఆవాసాలు అంతమై వారి సంస్కృతీ సంప్రదాయాలు అడుగంటుతున్నాయి. అవి కేవలం జ్ఞాపకాలుగా మాత్రమే మిగిలిపోయే స్థితి దాపురించింది. పోలవరం ముంపు ప్రాంతాలన్నీ విలీనం చేయాలన్న ఆర్డినెన్స్‌తో అడవిబిడ్డల మనోభావాలు దెబ్బతిన్నాయి. ఎవరి నిర్ణయంతో పని లేకుండా తీసుకున్న ఏకపక్ష నిర్ణయం అందరి మనసులలోని సంతోషాన్ని మింగేసింది. ఆశలను ఛిద్రం చేసింది. గిరిజనుల బతుకుల్ని ఛిన్నాభిన్నం చేసి వారి ఆశలను ఆవిరి చేసింది. వారి మనసు అల్లకల్లోలమై తల్లడిల్లింది. అడవిలోనే తమ జీవితాలను ముగించే ఆదివాసీలకు నేడు అలాంటి అవకాశమే లేకుండా పోతోంది. వారి మనుగడే ప్రశ్నార్థకంగా నిలిచింది. “ప్రకృతితో పెనవేసుకున్న జీవన విధానం కాలక్రమేణ ప్రకృతిని లోబరచుకొనే ప్రయత్నంలో ప్రకృతికి దూరం కావడం మానవ జాతి ఆవిర్భావంతోనే మొదలైనదేమో – కాని ఇటీవలి చరిత్ర దాని వేగాన్ని పెంచింది” (కొండాకోనల్లో తెలుగు గిరిజనులు – పుట. 94) అన్న శివరామకృష్ణ మాటలు అక్షర సత్యాలుగా అనిపించక మానవు. ఎందుకంటే ఈ కథల్లో అదే స్పష్టమైంది.

**దళారీల మోసం:**

గిరిజనులు అటవీ ఉత్పత్తులైన తునికాకు వంటివి కోసి గిరిజన కార్పోరేషన్ కేంద్రాల్లో అమ్మి తిండి గింజలు నిత్యావసర వస్తువులు కొనుక్కునేవారు. ఇప్పుడు రెక్కలు

ముక్కలు చేసుకొని జీవిస్తున్న ఆదివాసీలకు ఇంటిల్లిపాదీ కష్టపడితే గాని రెండు వందలు రావటం లేదు. కారణం కాంట్రాక్టర్లు. నాణ్యమైనవైనా సరే నాసిరకంగా ఉన్నాయని మోసం చేసి అతిచౌకగా కొనడం, దళారీలు లేకుండా నేరుగా గిరిజనులే అమ్మినపుడు బాగానే గిట్టుబాటు ధర వచ్చేది. ఎప్పుడైతే కాంట్రాక్టర్లు, బ్రోకర్లు వచ్చారో అప్పటి నుండి వాళ్ళకు తగిన ఆదాయం రావడం లేదు. మధ్యలో ఉన్న దళారీలు తినడం వల్ల ఇబ్బందులు తప్పని పరిస్థితి చోటు చేసుకుంది.

**గనులు తవ్వకాలు:**

పచ్చని ప్రకృతి ఒడిలో జీవనోత్సాహంతో కళకళలాడిన అడవి బిడ్డల బతుకులు సింగరేణి ఓపెన్ కాస్ట్‌గనుల తవ్వకాల వల్ల బొందల గడ్డలు, మట్టి దిబ్బల మధ్య నిస్సారంగా మారిపోయింది. అప్పటి వరకు ఆరోగ్యంగా ఉన్న వారి జీవితాలలో అనారోగ్యాలు చుట్టుముట్టాయి. ఉన్న ఇళ్ళను, భూములను లాక్కొని చీపుర్లు, తట్టా చెమ్మాన్‌లు అందించి యాజమాన్యం జేబులు నింపుకున్నాయి. అడవులన్నీ నరికి, భూముల్ని కబ్జా చేసి మరీ తవ్వకాలు జరిపారు. దానితో వంకలు వాగులు ఎండి, నీళ్ళు లేక రోగాలతో జీవిస్తున్న అడవి బిడ్డల బతుకులు చిందరవందరయ్యాయి. వారి జీవితం అడవిగాచిన వెన్నెలే అయింది. కనుక "విద్యావంతులు, నిరక్షరాస్యులు తేడా లేకుండా జాతి బాగుకోసం ఆలోచిస్తున్న వారి కలలు నెరవేరాలంటే ప్రభుత్వాలు కూడా చొరవ చూపించాలి. ప్రభుత్వానికి జాతి ప్రజలు కూడా సహకరించాలి (కుర్రు చరిత్ర – మాలకొండయ్య , పుట. 52). అపుడే ఆదివాసీల జీవితాలకి ఒక ఆసరా లభిస్తుంది, శాంతి కలుగుంతుంది.

ప్రశాంతంగా సాగుతున్న అమాయకులైన అడవి బిడ్డల పచ్చని బతుకులు అల్లకల్లోలమయ్యాయి. అటవీ సంపద, వనరులు దోచుకోబడ్డాయి. వాళ్ళ భూములు అన్యాయంగా లాగేసుకున్నారు. ఒకరిని మించి ఒకరు బలాన్ని ప్రయోగించి జీతం బత్తెం లేని కూలీలుగా, సేవకులుగా, బానిసలుగా మార్చివేశారు. అందరి స్వార్థానికి బలైపోయాయి అడవి బతుకులు. ప్రపంచమంతా జీవిస్తున్న ఆదివాసీలందరిలోనూ అదే భావం ఆలోచన అనుభూతి ఆవేదన సంవేదనా కూడా ! వీరి జీవితాలలో మార్పురావాలని బాగుపడాలనే ప్రగాఢ కాంక్ష రచయితలో వ్యక్తమవుతుంది. అందుకే ప్రపంచంలోని పీడిత ఆదివాసీలదంతా ఒకే చరిత్ర అని వాపోతాడు రచయిత.

**వేట:**

వేటకు వెళ్ళడం గిరిజనుల సాంప్రదాయం. అడవిలోని మెకాలను వేటాడి రావడం ఆచారం. ఆ సాంప్రదాయంతోనే వేటకు వెళ్ళి తెచ్చిన జంతువుల మాంసాన్ని సమానంగా పంచుకొని విందుభోజనాలు చేయడం పద్ధతి. ఇప్పుడు వేటకు వెళ్లిన మగాళ్ళకు ఆ వైభోగం చూడగలమా? అనే సందేహం. వేటకెళ్ళిన పాయం బుచ్చయ్యను అడవిలో అన్నలకోసం వెదుకుతున్న సిఆర్‌పి జవాన్లు చితగ్గొట్టారు. అన్నలకు సుద్దులు మోస్తున్నది, కాంట్రాక్టర్‌ల దగ్గర నుంచి డబ్బు సంచులు తెచ్చి ఇచ్చేది, పోలీసుల సమాచారం అందించేది నువ్వేనని గద్దిస్తాడు కమాండర్. కాని బుచ్చయ్యకు నేను కాదని చెప్పే ధైర్యం లేక బిత్తర చూపులు చూస్తున్న అతనిని తుపాకితో కాల్చేస్తారు. ఆ శవాన్ని తీసుకొచ్చి గూడెంలో పడేసి మీరెవరైనా అన్నలతో రాసుకుపూసుకుని తిరిగినా, సమాచారమిచ్చినా మీకూ ఇదే గతి పడుతుందని బెదిరిస్తారు జవానులు. ఈ సంఘటననుండి తేరుకోకముందే మరో సంఘటన. ఇప్పపువ్వు, తునికాకు, చింతకాయలు, తేనె, వెదురుబుట్టలు వంటి అడవి ఉత్పత్తులను సంతలో అమ్ముకొని జీవిస్తున్న సమ్మయ్యను నువ్వే మా విషయాలను పోలీసులకు చేరవేస్తున్నది. నీలాంటి విప్లవద్రోహులు వుండటంవల్ల మా మనుగడ కష్టమవుతుందని మరణశిక్ష విధిస్తారు. అందుకే వారికిప్పుడు వేటకెళ్ళడానికి భయం. ఆ భయంతోనే వేటకు బయలుదేరిన గిరిజనులు ఒక చోటనే ఉంటే అందరికీ సరిపడామెకాలు దొరకక పోవచ్చని రెండు గుంపులుగా చీలిపోతారు. దక్షిణ దిక్కుకు వెళ్ళిన వారిని సీఆర్‌పి పోలీసులు పిట్టల్ని కాల్చినట్లు కాల్చేస్తారు. మరోవైపు ఉత్తర దిక్కుకు వెళ్ళిన వాళ్ళను అన్నలు కాల్చేస్తారు. గిరిజనుల స్థావరమైన అడవిలో వారినే దోషులుగా భావిస్తూ ఇటు సర్కారు వాళ్ళు, అటు అన్నలు ఇద్దరూ

వాళ్ళ ప్రాణాలు తీసేస్తారు. ముందు నుయ్యి వెనుక గొయ్యిలా వారికి ప్రాణభయం ఎక్కువై “మన బతుకులు ఎప్పుడేమైతవో తెల్వని ఆగం బతుకులైపోయినయ్” (31) అంటూ కుప్పకూలిపోవడం వారి వంతైంది. మనిషికి వున్నది జానెడు పొట్ట దానికై పడరాని పాట్లు పడే అమాయకపు జీవితాలను చూస్తే హృదయం ద్రవించక మానదు.

**పేదరికం:**

ఆదివాసీలకు పేదరికం ప్రతిక్షణం వెంటాడుతూనే ఉంది. ఈ పేదరికాన్ని జయించడానికి పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. ఒక్కోసారి ఆకలి తీరటమే గగనం. ఎంత కష్టపడి పనిచేసినా ఫలితం దక్కని సందర్భాలూ ఎన్నో. ఆకలి బాధలతో అలమటించిన దాఖలాలు మరెన్నో. ఇవన్నీ వారినెన్నో బాధలకు గురిచేసిన స్థితి ఉంది. జీవితాలకు భరోసా లేక మండుటెండల్లో పని చేసుకొని జీవించాల్సిందే తప్ప వారికి ఎలాంటి రక్షణా లేని స్థితిని ఈ కథల్లో చూపించారు. కొండాకోనల్లో నివసిస్తున్న ఆదివాసీలకు అక్షరజ్ఞానం లేకపోవడం వల్ల వచ్చిన ఇబ్బందులే ఇవి. కనుక అడవిలో జీవిస్తున్న వీరిని అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ప్రజలు వారి జీవన విధానంలో ఎంతో ఒకింత మార్పుకోసం చైతన్యం తీసుకురావాల్సిన అవసరాన్ని చాటుతున్నాయి. అక్షరజ్ఞానం అందించాల్సిన ఆవశ్యకతను వక్కాణిస్తున్నాయి.

ఈ కథలను చదువుతూ ఉంటే గిరిజన జీవితాలు ఇట్లా ఉన్నాయా? అనే ఆశ్చర్యంతో కూడిన ఆలోచన కలగక మానదు. వారి దుఃఖం, బాధ, కష్టాలు, కన్నీళ్ళు, చావులు... ఒక్కటేమిటి ప్రతిదీ

వ్యథాభరితమే ! ఆలోచనాత్మకమే.

డా. వై. సుభాషిణి
తిరుపతి, ఫోన్ : 900 010 2394.

---

*తెలుగు సాహిత్యంలో దేశభక్తి, స్వాతంత్ర్య సప్తతి, నవతి* వ్యాస సంపుటి. తెలుగు భాషావికాస పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. తూమాటి సంజీవరావు దీని ప్రధాన సంపాదకులుగా చెన్నైలోని తెలుగు భాషావికాస పరిషత్తువారు దీనిని ప్రచురించారు.




14–8–2017 నాటికి స్వాతంత్ర్యం సిద్ధించి, 70 సంవత్సరాలు గడిచిన సందర్భంగా తెలుగు సాహిత్యంలో దేశభక్తి అనే అంశంమీద తీసుకొని వచ్చిన పుస్తకం. అనుకున్నదానికన్న వ్యాసాల విస్తృతి విపరీతంగా పెరగటంతో ఇది 724 పేజీలతో ఇంపైన, నిండైన పుస్తకంగా రూపుదిద్దుకుంది. తెలుగు భాషలో మనమింతవరకూ గుర్తించని లోటు ఈ విధంగా పూరించబడింది. ఈ మహత్ప్రయత్నం బృహత్ప్రయత్నంగా మారింది. దానిలోనివి 1. దేశభక్తి, 2. దేశభక్తులు, 3. జాతీయోద్యమ సాహిత్యం, 4. రాష్ట్రోద్యమ సాహిత్యం, 5. అమరజీవి సాహిత్యం, 6. సాహితీ స్రష్టలు – దేశభక్తి, 7. చారిత్రక కావ్యాలు దేశభక్తి నాటకరంగం, సినీ సాహిత్యం. స్త్రీలు దేశభక్తి ఇలా 16 చాప్టర్లుగా విభజించే వ్యాసాలను ప్రచురించారు. రచయితలందరూ పేరుమోసినవారే కావటంతో ప్రతి వ్యాసం విషయ సాంద్రతతో నిండిపోయింది. దేశభక్తికి సంబంధించి కనుమరుగైపోతున్న ఎన్నో విషయాలను సేకరించి, కాపాడి పుస్తకరూపంలో ఒద్దికగా అందించినందుకు మనం తప్పనిసరిగా కృతజ్ఞతాభినందనలు తెలియజేయాలి.

**ఈ పుస్తకం ఖరీదు ₹ 500/-**

**లభించు స్థలం - తూమాటి సంజీవరావు, నెం. 35/18, 2వ అంతస్తు, 15వ వీధి, అశోక్‌నగర్, చెన్నై-600 080. ఫోన్: 988 444 6208.**

"Respected,

Sri. Ashwini kumar garu,Sri. K. Nageswara Rao garu and sri. Vijay Choudary garu

Thro: Respected Madam Vemula Rani Garu.

At First let me convey my profound Namaskaras!

It was a miracle, having met you all – The mixture of MISIMI, the essence, the literary nectar, what not! It is a pot of springing lively spirit, With it, the Telugu beings –The fortunate to share, savor and move towards their respective vital periods (at Hyderabad Book Festival).

I am envious of Sri. Karaturi Choudary garu for the way he lives, the saturated inert element, the moving Buddha. I wish I would have led that royal life, But still moving as an unsaturated element –the crazy android' steps on unknown voids towards oasis less Sahara' hot sands.



I.V.R.

Sri.Aswini kumar garu — The siren of living lord Byron –a moving artistic ion. .

Sri. K. Nageswara Rao garu - My lovely living Sanjeeva Dev, his each word, as if freshly heard! And Madam Vemula Rani garu - her sincere receiving each time, unforgettable. I am sorry for not having met Sri. M. Pardha Saradhi garu, Kindly convey my respects... In fact, wishing to meet all those writers, Contributing for The Telugu miracle magazine – 'Misimi', It is like those missing Oases, not mirrored in mind, but within my hands –bind, possible only to read every creation(all Misimies) of that ever rising Sun— Sri,Alapati Ravindranadh.

I wish, as a Teulgu –Tongue -son, every one may read 'Misimi' Missing a Misimi is missing my very –Me(the real touch of life), Worried a lot the way Mr. Choudary was shouting to attract at that book fair, It was like reminding people, you buy your very own breathing air.

Sirs, I would like to be only a reader of Misimi, not as a writer, I fear I may become a fighter to create an unnecessary mess that I do not wish now, just read, read and read only.

I have brought all your gift of books. With love and respects..."

- I.V. Rama Raju, Congo

Dear friend and philosopher, Ram garu,

Your greetings mail is a touching poem..

Your assessment of people reflects your rich experience of life's long logistic journey... About Vijay..he is our powerhouse,a human hill and undisturbed battered soul.. Our dear Nag..he is our moralrock, never ever perturbed.. his knowledge of art, history and philosophy is above any University.. Our Raany is one-man army with always a pleasant smile.. With our ever supporting Sri Bapanna, we do persue our passion. I wonder how you are wandering for decades ... I don't think it is for material gain but in self searching..I should have given my Sidharth,by Hermen Hesse.. Unfortunately I don't have a soft copy.. if you can get it on net you must read.. We should have spent more time with your family,, keep sending mails..we can answer in Telugu for your pleasure.. Every month we can send a soft copy of Misimi for your reading..if you want.. Please feel free to ask.. Once again thank you for your affluent greetings in your fluent poetic style..yes I'm absorbing your poems slowly.. (A spark from the Sky)... Bye for now.. what's the time at your place,send some photos.. of your work,home and people..

- Sreyobhlaashi

Aswinikumar

## పిప్పర

*చిన్ననాటి స్మృతి బింబాలు (1977-1982)*
*(జిల్లా పరిషత్ హైస్కూలు, పిప్పర)*
ఆ(ఈ) ఊరు -పిప్పర,
మధుర జ్ఞాపకాల దొంతర,
మదించిన జ్ఞానరస పాకశాల,
అది మే(ము) చదివిన పాఠశాల,
కదిలే కరగని మా టంకశాల,
నదిలో ఊగే కార్తీక దీపాల మాల,
అదిరే అంబర మబ్బుల కల,
చెదిరే మెరుపుల ఫల్గుణి- రథశిల,
అది మా పసిడి చిత్తడి నేల,
ఎదిగే తర- తరాల తరంగాల,
మెదిలే ధగధగ వజ్రాల గెల- ఓ కాంతి-కళ.
ఎదలో పొదిగన పాఠశాలున్న ఆ నోరు,
మదిగా ఎదిగే పిప్పలి-వృక్షపు-దాగిన వేరు,
అదే పిప్పరఃసరస్సు-వతి కట్టిన-చీర,
ప్రక్క గ్రామసంతతికి పక్కనయ్యే వెన్నెలతెర,
రెక్కలిచ్చే మా లేత మట్టికి,
ఎక్కడెక్కడో ఎగురుతూ దాగిన ఉట్టికి,
ఇదే మా పదానారు లోపు నారు/నీరు పోసిన మా ఊరు-కాటను
దొర-సెలయేరు.
ఆ సుబ్బలక్ష్మి-అవధానిగార్ల తెనుగు-పదును,
ఆవకాయ-ధ్వనుల-పమ్మి సూరీడు-రజను,
శ్రీరామమూర్తి మాస్టారి ఆంగ్లపు-చదును
జార్జ్ సారు సాంఘికశాస్త్ర టీ-కప్పులో-అశోక
చక్రపు-తడి, రాఘవాచారిగారి కవితల హడావుడి,
ముదునూరి మాస్టారి లెక్కల వడి-వడి,
హిందీ మాస్టారి బలవంతపు రాత్రి బడి,
శాస్త్రీగారి కునుకులు చెనుకులు దండపు దడి,
రెడ్డిగారి చందమామ కథ-కళా కాంతులు,
ముసునూరి వారి నోరూరే లలిత గీత ముద్ద బంతులు,
డ్రిల్ మాస్టారు -హైదర-బాదు విహార యాత్రలు,
డ్రాయింగు మాస్టారి రంగు-రంగుల గీత-జాతరలు,
మొప్పర్తి పాడు ఎమ్.ఎస్. రెడ్డి తీయని పాటలు,
అమాయకపు అమ్మాయిలు, తెలియని మాటలు,
అవి మూగ మాటలు, ఎన్నటికి నీటి మూటలు,
శెలవల్లో గోళీలు, బచ్చాలు కలక్షన్లు,
మాయదారి మల్లిగాని మూడుముక్కల గారిడీలు,
జవ్వాది కుర్రాడి సోడాబుడ్డి-బురిడీలు,
కాలువ గట్టున పసిడి-పండిత పమ్మి కృష్ణమూర్తి,
ఆయన ఉచిత ఆంగ్ల వ్యాకరణ-తోరణాలు,
కాగలవు నేటి పంతుళ్ళకు -మెరుపు-స్ఫూర్తి,
భావితరాలకు వరాల-వరాలు ఎన్నో ఆభరణాలు,
గడచి పోయాయి మూడన్నర దశాబ్దాలు,
ఇంకా ఇంకని భావాలు, తెలియని అర్థాలు,
ఏదో తెలియని ఆరాటం,
దేనికోసమో మన పరుగు-పోరాటం,
ఏదో తెలియని తృష్ణ, దొరకని, ఆగని, ఓ గని,
తెగని మా లేత విద్యార్థి జీవన కన్నెపొర,
దాగుందిలే ఇంకా ఇక్కడ - ఆ అంతరాల దొంతర,
అదే మనం కలసి చదివిన స్కూలున్న-ఊరు-పిప్పర,
ఎన్నో జ్ఞాపకాలు బుర్రగుంజుల-పాతర,
"పిప్పర" అవును-మా ఊరు,
కాటను దొర కన్నీరు, వయ్యారి వంపు-వయ్యేరు,
నడుమ పుట్టిన హరిహర-హోరు-మా ఊరు,
మము కన్న పుత్తడి బొమ్మ, మాలక్ష్మమ్మ, కొండాలమ్మలు,
మాకు తరాలుగా ఆ ముగ్గురమ్మలు,
మంగళ సత్యం బ్యాండు మేళం,
ఎరుకల గిజ్జిగాడి కర్ర సాములు,
వడ్డీల వీధిలో వినాయక చవితి విన్యాసాలు,
హరిజన వాడలు, బాల ఏసు నడక నీడలు,
మురిసే మేరీ మాతలు, ఆ విధాత జాడలు,
కాబోయే అంబేద్కరుని బోధి-ఊడలు,
కోమటి బ్రాహ్మణ పడచుల ఆగని నోములు,
తుమ్మలపల్లి వంశపు సేవాతత్పరతలు,
సూర్నా-సూరయ్య సందుకో గుడి-ఎందరో దాతలు,
మేడ సుబ్బరాజుగారి కొడుకుల-పొడుగు,
రాజుల-నల్లాయన తెల్లని పంచె-తొడుగు,
రిక్షా సత్తిగాడి మైకపు చావు-రాగం,
అబ్బాయిగారి కోడిపుంజల అశ్వమేధ యాగం,
బాసుగారింట్లో అందమైన భోగం-మేళం,
శనివారపు సంతతో రసమయ జీవన తాళం,
అయ్యో! లేవు నేడు, కాదు-వాడు,
జీవించ లేదు తోడు అదాని/అంబాని,
కదులుతున్నాయి, చెదురుతున్నాయి,
కరుగుతున్నాయి మనలో జ్ఞాపకాల గని.
రెండు దశాబ్దాలు ఆఫ్రికా చీకటి వనవాసంలో, మూడున్నర దశాబ్దాల
చిన్ననాటి గుర్తులు తడుముకొంటూ,

ప్రేమతో... ఐ.వి. రామరాజు... కాంగో.

D R S A H J I V A D E V

TUMMAPUDI
GUNTUR DT
522330
15.9.95

రామరాజు గారు,

మీరు ఆంగ్లంలో వ్రాసిన ఉత్తరం, దానితో జత చేసిన నా ఇదివరలోని ఉత్తరం కాపీ అందినాయి. సంతోషం. నా విషయంలో మీరు ఏవేవో వ్రాశారు. అందుకు ధన్యవాదాలు. మీరు సిమెంటు కర్మాగారంలో వుంటున్నందుకు సంతోషం. వృత్తి ప్రధానం కాదు. మనిషి జీవించటానికి ఏదో ఒక వృత్తి అవసరం. అయితే ఆ వృత్తి ప్రవృత్తి కాకూడదు. నా జీవితంలో అటువంటి స్థితి కనిపిస్తుంది కనుక అది మీకు చెప్పాలనిపించిన విషయమే. 9 సంవత్సరాల క్రిందట నా పుస్తకాలు చదివి నను వ్రాశారు. మంచిది. నా తాలూకా పుస్తకాలు ఇప్పుడు లభ్యం కావటం లేదు. వాటి ప్రథమ ముద్రణలు అయిపోయినవి. ఆ ప్రచురణకర్తలు వాటి రెండవ ముద్రణలు ఎప్పుడు వేస్తారో తెలియదు

చేతితో వ్రాయటం కంటే నోటితో ప్రసంగించటం నాకు ఎక్కువ ఇష్టం. అందువల్ల నా సాహిత్య రచనలకంటే నా సాహిత్య ప్రసంగాలు ఎక్కువ పేరును తెచ్చాయి. రచయితకు మంచి పాఠకులు అవసరమైనట్లే వక్తకు మంచి శ్రోతలు అవసరం. ప్రక్కవాని రమ్యపరచటానికి శ్రోతలు అవసరం.

మీ ఉత్తరంలో మీరు కవితారూపంలోని ఇంగ్లీషు వాక్యాలు వ్రాశారు. మున్ముందు సాధన ద్వారా అటువంటివి ఇంకా మంచివి వ్రాయగలరని విశ్వాసం. ఎప్పుడో ముందులో మంచివి వ్రాయాలని ఇప్పుడు మంచివి వ్రాయకుండా అశ్రద్ధ చేయటం మంచిది కాదు. భవిష్యత్ నిమిత్తం వర్తమానాన్ని అశ్రద్ధ చేయటం వాంఛనీయం కాదు. భవిష్యత్తు ఉజ్జ్వలంగా వుండాలి, వర్త

మానవులు ఉజ్జ్వలంగా వుండాలి. ఇక జరిగి పోయిన జీవితాన్ని గురించి ఆలోచించటం అవసరం లేదు.

మీరు నన్ను చూచిపోవాలని వ్రాశారు. వద్దు అనను. కాని తేదీని నిర్ణయించటం మీకు కష్టం. నాకు కొన్ని ప్రయాణాలున్నాయి. అందువల్ల ఫలాని రోజున రమ్మనమని నేను నిర్ణయించి చెప్పటానికి కొంత ఆలస్యం జరుగుతుంది. అక్టోబర్ లో మొదటివారం గాని ఆఖరు రోజులలో ఏది ఏదైనా అయితే బాగుంటుందేమో ఆలోచించి తెలుపండి, నిదానంగా. నా వయసుతో పాటు పెరుగుతున్నాయి నా ప్రయాణాలు కూడా! మిగతా విషయాలు కూడా పెరగటం తప్పటంలేదు.

ఈ నెల 22 వ తేదీన రాత్రి 9-16 న విజయవాడ ఆకాశవాణి లో నా ప్రసంగం అడవి బాపిరాజు మీదది వినండి. రాత్రి సమయం లో ఏమైనా మార్పు వుంటే ముందుగానే రేడియో లో వారు చెప్పుతారేమో.

సృష్టిలో ఎన్నో విషయాలు. అన్నీ అందరికీ తెలియవు. కొన్ని మాత్రమే కొందరికి తెలుసు. ఎవరికీ తెలియంది ఏమీ వుండదు.

సెలవ్,

మీ ——

సంజీవదేవ్

# ఓ తమాషా కుటుంబం

ఒకప్పుడు భోజరాజు పాలనంలో కట్టుకొయ్యి కూడా కవిత్వం చెప్పగలదనే భరోసా బాగా ఉండేదట. ఆ బరవసంతోనే కవిత్వం నాకు రాదు మొర్రో నేను నేతపని చేసుకుంటూ బతుకుతున్నవాణ్ణి అని ఎంత మొత్తుకున్నా చెవికి పట్టని రాజభటులు ఆ నేతవృత్తికారుణ్ణి రాజు ఎదుట నిలబెట్టారట. నా రాజ్యంలోనూ కవిత్వం చెప్పలేనివారున్నారా అంటూ ముక్కుమీద వేలేసుకోవటం ఆ రాజువంతయిందట. ఆ మాటకు రోషపడ్డ ఆ సాలె అతను సమాధానం ఇలా చెప్పాడట:

***కావ్యం కరోమి న హి చారుతరం కరోమి / యత్నాత్కరోమి యది చారుతరం కరోమి / భూపాల! మౌళిమణిరంజిత పాదపీఠ! / హే సాహసాంక! కవయామి వయామి యామి!!***

ఓ రాజా! నేను కావ్యాన్ని కూర్పగలను. అయితే అది మొదట్లో అంత ఒడుపుగా ఉండకపోవచ్చు. దానికి పూనుకుంటే మాత్రం ఎంతో రసవత్తరంగా వర్ణించి తీరగలను. రాచకిరీటంలో మిలమిల మెరిసే మణులు పొదిగిన మేలిమి పసిమి కాలిపీట కలవాడా! కవిత్వం అల్లనూగలను, పగ్గంబట్టి నేయనూగలను, ఇంటి తోవ పట్టనూగలను.

ఈ ఆశువుకి రాజు పరవశుడయ్యాడట. దీనికితోడు ఎన్నో ఎన్నెన్నో ఘటనలు ఉజ్జయిని పరంపరలో వసుధైక కుటుంబ ఇచ్ఛాశక్తికి ప్రేరణమై అది 'కవయామి వయామియామి' కుటుంబంగా పేరుపడింది. భోజచరితంలోని ఈ శ్లోక భావాన్ని తెలుగులకు తెలిపి తనివిని పొందింపజేసింది అవధాన కవిత. అవధానంలో ప్రధానంగా పేర్కొనేవాటిలోనివి 'కవిత్వాంశ, ఉభయ భాషా కవిత్వం, భాషాంతరీకరణ' అనే అంశాలు. ఈ అంశాలు ఉభయ భాషల్లో ఆరితేరిన తత్త్వానికి నిదర్శనలు. ఇందుకు ఈ శ్లోక భాషాంతరీకరణం ఒకటి.

***ఉ. నేనొరింతు కబ్బమును నేర్పుగ చెప్పగజాలనాదిలో***
***పూనివచింతునేని రసపుష్టిగలట్టు చెప్పంగనేర్తునో***
***మానవనాథ! మౌళిమణిరంజితహాటక పాదపీఠ! ఓ***
***యీ! నవసాహసాంక! కవయింతు వయింతు నయింతునింటికిన్***

***– కాశీ కృష్ణాచార్య***

అంతేకాదు ఈ శ్లోకంలోని 'కరోమి, కవయామి, వయామి, యామి' అనే క్రియాపదాలు విష్ణువుని స్తుతించే దత్తపది అంశంగాను రూపుకట్టాయి. ఈ పదగమనంతో కొప్పరపు కవుల అవధానకవనం ఇలా సాగింది:

***మ. గరిమన్నిల్వ కరో మిటారివలె గుల్కన్‌సాగె దుర్మేధధీ***
***వర! హృత్సాంకవ యామికుండునిశంబ్రో వంజూచినట్లేయబో***
***ధరహింపంగను దేవ! యామిడిని బొందంజేయకేయెందుశ్రీ***
***ధర! యామిన్యధిపాన్వయేశ! సురవంద్యా! కృష్ణ! భక్తావనా!***

శ్లోకంలోని సంస్కృత క్రియాపదాలను (దత్తపదులు) అవధాని మామూలు తెలుగు సాహిత్య పదాలుగా ఎలా పరికల్పించుకున్నారో నిగిడించి చూడండి. కరోమి = నిల్వకరో, మిటారివలె; కవయామి = సాంకవయామికుండు; వయామి = దేవ! యామిడిని; యామి = యామిని; అధిపాన్వయేశ!

లక్ష్మీధరుడవు! చంద్రవంశం నేతవు! దేవతాస్తుతిపాత్రుడవు! కృష్ణుడవు! భక్తపాలకుడవు అయిన ఓ విష్ణూ! ఘనతను నిలిపి ఉంచుకోని విలాసవతివలె మందకొడితనం వగలు పోసాగింది. ఓ జ్ఞానశ్రేష్ఠుడ! తలారి జవ్వాది పరిమళాలు ఎదురు రొమ్ముకు బాగా దట్టించి రాత్రిపూట కావలి కాయబూనుకున్నట్లుగా అజ్ఞానం శోభిల్లింది. ఓ దేవర! మిడిసిపాటును ఎక్కడనూ కలిగింపనీయకు సుమా!' అనే భావం కలది.

ఇలా దత్తపదుల సంవిధానంతో కాక ముక్తకంగా దూరాన్వయంగా ఈ పద్యభావం నడిచినా ఆ భావుకతలోని చిక్కదనం, ఆ పదాల కూర్పు అబ్బురం అనిపించకపోదు. 'ఓ సామి! ఆ పొగరుబోతుతనం దరిచేరితే, మందమతినవుతా! నిక్కులాడివలె తలారివలె ఆత్మశక్తిని కోల్పోతా' అనే సందేశాత్మకమైన వస్తువుకలది. ఈ ఇంతటి కల్పనకు పాత్రం సంస్కృత కావ్యప్రయోగ దక్షతగల పృచ్ఛకత్వమేగదా.

కాదెవరు కవితకనర్హులు అనుకునేలా ఏ కవితా వాసనలేనివాడు ఆశువుగా కవిత్వం చెప్పగలగడం ఆ భావాలు దేశ భాషలోనూ ప్రాచుర్యం పొందటం, ఆ క్రియాపదాలు స్వార్థాన్ని వీడి శబ్దమాత్ర ఆభాసతో విష్ణుస్తుత్యంశం (నావిష్ణుః పృథివీపతిః) కావటంవంటి వస్తువృత్తాంతాలు మరికొన్నింటిని కలుపుకుంటే ఈ పరిమిత కుటుంబీకులు మూలపురుషుడూ మంచి ధీమాపరుడైన ఆ దేశీయవృత్తికారుడే. అయితే ఈ తెలుగు కుటుంబం పెద్దలు అవధానులు. సాహితీవేత్తలు, సభ్యులు, ప్రాశ్నికులు, పాఠకులు, ఈ కుటుంబ శ్రేయోభిలాషులు, మిత్రులు, పోషకులు, పండితులు, సభాసదులు. ఇలా ఇది తెలుగుల 'కవయింతువయింతు, నయింతు కుటుంబమే'కదా మరి.

దావులూరి కృష్ణకుమారి, తిరుపతి, ఫోన్: 996 368 0940.

# నాగేశ్వరరావు సినిమాల ప్రభావం

అది 1958–'68 మధ్య కాలం. నా వయస్సు పన్నెండేళ్ళ నుండి 22 ఏళ్ళ వరకు సాగిన కాలం. హైస్కూలు, కాలేజీల విద్య ఆ దశాబ్దంలోనే



పూర్తయింది. జీవితంలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల తర్వాత ప్రాధాన్యత హృదయంలో సినిమాలకే అందునా నాగేశ్వరరావు సినిమాలకే, మనం కూడా ఇలా ఉండొచ్చు. ఇలా త్యాగాలు చేసి గొప్పవాళ్ళం కావచ్చు. కులాంతర వివాహాలు చేసుకోవచ్చు. ప్రేమలో కూడా ఆదర్శంగా ఉండాలి. కష్టపడి చదివి 'పెద్దవాడు' కావాలి. ఆయన పాత్రలన్నీ అవే. ఎన్టీఆర్ సినిమాలు ఇష్టమే అయినా రాజులు, రాజకుమారులు, కత్తియుద్ధాలు, యువరాణీలతో ప్రేమలు 'మనకు' సాధ్యపడవని కేవలం 'సినిమా వినోదం' కోసం చూసేవాణ్ణి. జయసింహ, జయం మనదే, రాజనందిని, రాజమకుటం వంటివన్నమాట. నాగేశ్వరరావు సినిమాలు అలా కాదు. రోజులు మారాయి, తోడికోడళ్ళు, ఇల్లరికం, దొంగరాముడు, పెళ్ళికానుక, మాంగల్యబలం, మనసే మందిరంవంటి చిత్రాలు జీవితంలో భాగాలయిపోయాయి. కథానాయకుడిలో మనం పరకాయ ప్రవేశం చేసి కష్టనష్టాలు అనుభవించి ఉన్నతమైన స్థానాన్ని సంపాదించాలన్న తపన. ట్రాజెడీలయినా పర్వాలేదు. నాగేశ్వరరావు దేవదాసు నుండి పెళ్ళికానుక దాకా జీవంచేవాడుకదా! ఈ ఆదర్శ పురుషుని నటనాగ్నికి తగ్గట్టుగా పాటలు, మాటలూ అప్పచెప్పేవాణ్ణి నాలో 'భవిష్యత్ రచయిత' కాగల లక్షణాలకు ప్రారంభించినమాట. అవి రాసింది ఆత్రేయా, సముద్రాలా, నాగేంద్రరావా, శ్రీశ్రీనా, ఆరుద్రా అని కాదు 'మా' నాగేశ్వరరావే అలా మాట్లాడుతున్నాడు. మా హీరోయిన్ అలా పాడుతున్నాడు..... అనుకుంటూ ఆ కీర్తిని కూడా ఆయన ఎకౌంట్‌లోనే వేసేవాళ్ళం. తోడికోడళ్ళు సినిమాలో 'నిన్ను మించిన కన్నెలెందరో మండుటెండలో మాడిపోతే వారి బుగ్గల నిగ్గు నీకు వచ్చి చేరెనో తెలుసుకో... కారులో షికారుకెళ్ళే ఓ పాలబుగ్గల పసిడిదానా' అని ఎంత గొప్పగా పాడాడు నాగేశ్వరరావు.. (!) ఎంతటి కవిత్వం... ఎంతటి మానవత్వం. అనుకునేవాణ్ణి. సినిమాల్లో 'సీన్లకుసీన్లు' మిత్రులతో అప్పచెప్పేవాణ్ణి. 'రేడియో సౌండ్ ట్రాక్'గాడని మిత్రులు పేరుపెట్టారు. ఇవ్వాళ సినిమాకు వెళ్ళటానికి డబ్బుల్లేవురా చందూని పిలవండి. తోడికోడళ్ళు, పెళికానుక, సువర్ణసుందరి బెటరేమో అనుకునేవాళ్ళు... సువర్ణసుందరిలో నాగేశ్వరరావు పెద్ద గుహలో ప్రవేశిస్తాడు. అక్కడ మనిషి తల, సర్పదేహంతో ఉన్న మునితో సంభాషణ:

"ఎవరు నాయనా నీవు....?"

"మానవుణ్ణి...."

"సామాన్య మానవుడివేనా?"

"సార్వభౌముని కుమారుణ్ణి..."

"దేశ సంచారం చేస్తున్నావా....."

"దేశ బహిష్కృతుడినయ్యాను...."

"ధర్మం విడిచి సంచరించావా?"

"ధర్మానికి హాని కలుగకుండా సంచరించాను..."

"వివాహితుడివా....? సద్బ్రహ్మచారివా....."

"ఏమిటి స్వామీ ఈ రూపం?"



"దేవేంద్రుని శాపం..." ఇదీ సన్నివేశం.

పురాణ చిత్రాల / జానపద చిత్రాల సంభాషణలోని సంస్కృత సమాసాలు యథాతథంగా వినిపించేవాణ్ణి శ్రీకృష్ణార్జున యుద్ధంలో చివరి దెప్పిపొడుపుల

సీను ఎన్టీఆర్ నాగేశ్వరరావుల మధ్య రసవత్తరంగా సాగుతుంది. ఆ సీను పద్యాలతోసహా, కాలేజీ హాస్టళ్ళ మిత్రులకు వినిపిస్తుంటే, మధ్యలో 'ఇప్పుడు ఇంటర్వెల్..' సిగరెట్లు త్రాగి మళ్ళీ వస్తామన్నమాట అని జోకు వేసేవాళ్ళు. పెళ్ళికానుక సినిమాలో 'వాసంతీ... వాసంతీ... నన్ను అన్యాయం చేయకు వాసంతీ....... నీకన్నిటికి కానుకగా నా జీవితాన్నే సమర్పిస్తున్నాను. తీసుకో...' అనే డైలాగ్ ఆత్రేయ అనలేదు. మీ 'నాస్మావే' అన్నాడన్నట్లు చెప్పేయటం! ఆ సినిమా ఎండింగ్‌లో ప్లేబాక్ సాంగ్ 'తీరెనుగా నేటితో ఈ తీయనిగాథ... మిగిలిపోయెనీమదిలో మాయని బాధా.... ఏకాకివై నీవు వెడలిపోయావా?' అంటుంది. అయ్యో, మా భాస్కరం (పాత్ర పేరు) ఏమైపోయాడో అని కొన్ని ఏళ్ళు బాధపడ్డాను. 'కళ అలా కదిలిస్తుంది. నిజమని భ్రమింపచేస్తుంది. నీ జీవితంపైకి ప్రసరిస్తుంది. నీలోని కల్మషాన్ని కడిగివేస్తుంది. కడిగిన ముత్యంలా మనస్సును కల్పన వేపు మళ్ళిస్తుంది' ఆవటా అని అనంతర దశతో చదువుకున్నామనుకోండి.. అలనాటి పదహారేళ్ల వయసులో అవన్నీ తెలియవు. 'మా నాగ్రావుని ఆ బి. సరోజాదేవి మోసం చేసింది. దొంగ పిల్ల' అని మాత్రమే భావించాను.

మనసే మందిరం సినిమాలో ఆదర్శ డాక్టరుగా జీవించి చివరకు ప్రేమలో దగ్ధమైన హృదయంతో మరణిస్తాడు. సావిత్రీ, జగ్గయ్యలు డాక్టరు విగ్రహావిష్కరణకు వచ్చి కారు దిగుతారు. నేపథ్యంలో ఘంటసాల 'ఒకరినే ప్రేమించి, పలువురికై జీవించే ప్రాణాలు బాసిన అమర జీవిదీమందిరం... రూపులేనామందిరం.. మీకు లేనానందనం.. ఒకరికేయిది అంకితం. యుగయుగాలకు శాశ్వతం. కరుణ దేవతకరము చాచి కలత బాపే మందిరం. మమతవెలసీ. మనసు విరిసే దివ్యజీవీమందిరం' అన్న పాటలోని కవితా మాధుర్యం ఇంకా గుర్తుండటానికి కథానాయకుడు సృష్టించిన పాత్ర చిత్రణేతప్ప సాహిత్య తత్వం కాదు ఆనాటికి. చాలా ఏళ్ళకుగాని తెలియలేదు. రచయిత పాత్ర! రైతుగా, కాలేజీ విద్యార్థిగా, ఆదర్శ ఉద్యోగిగా, త్యాగశీలిగా, భక్తుడిగా, ప్రజానాయకుడిగా, ప్రేమికుడిగా, నిరుపేదగా, నిస్సహాయుడిగా ఏయన్నార్ రాణించటానికి ఎన్ని కారణాలైనా ఉండవచ్చును. ఆ లక్షణాలను 'నాబోటి బలహీనులు (!) హృదయాల్లో నాటటానికి ఆయన పాత్రలు విజయవంతం కావటమే కారణం. మంచి మనసులు సినిమాలో బొద్దుగా ఉండే సావిత్రిలోసైతం యుగళగీతాలు, నృత్యాలు చేసి ప్రేక్షకుల్ని రంజింపచేయటం ఆయనకే సాధ్యపడింది. దర్శకుల ప్రతిభ ఎంత ఉన్నా పాత్రలో లీనమైపోయి గొప్ప ఔచిత్యాన్ని చూపించగలగటం తనకే సాధ్యపడింది.



సువర్ణసుందరిలో 'హాయిహాయిగా ఆమనిసాగే.. ఓలలూగెమది ఉయ్యాయలగా... జంపాలగా...' అనే పాట చివర్లో అంజలీదేవితో సహా పుష్పంలోనికెళిపోతే, దళాలు మూసుకుపోయే సన్నివేశంలోని 'లోపల మా నాయకుడికి ఊపిరి ఆడుతుండలేదు' అని బెంగపడ్డాను. 'లోన'వాళ్ళిద్దరూ ఎంతటి రసమయజగతిని రాసక్రీడకు ఉసిగొలిపే తరుణంలో ఉన్నారు. ఆనాటికింకా అర్థంకాలేదు. అలాంటి నాగేశ్వరరావుగారిని విశాఖ విమానాశ్రయంలో సి.నా.రె. గారు పరిచయం చేయగా కరచాలనం చేసినప్పుడు హృదయం పులకించగా దశాబ్దాలనాటి అనుభూతులు దహించివేయగా మౌనంగా అలనాటి ఆదర్శపురుషుడివంక చూస్తూ ఉండిపోయాను!! 'జోరుగా, హుషారుగా, షికారుపోదమా – హాయిహాయిగా – తీయతీయగా' అని ఆయన వేసిన నృత్యం కళ్ళముందు కదలాడుతోంది!

ప్రొ. చందుసుబ్బారావు
విశాఖపట్నం, ఫోన్: 944 136 0083.




# కవితారస 'పానశాల'

**– కోడూరు ప్రభాకర రెడ్డి**

*ప్రఖ్యాత చిత్రకారులు బాపూ ఒకనాడు హైదరాబాద్ వచ్చి అక్కడ ఆలపాటి బాపన్నగారి అతిథిగా ఉన్నారు. నేను, అశ్వినీకుమార్ ఆయనను కలిశాం. **మిసిమి** అట్టమీద బొమ్మల ప్రసక్తి వచ్చింది. వాటిని శ్లాఘిస్తూ అప్పటి మే పత్రికలో వచ్చిన బుద్ధుని చిత్రం గురించి ప్రత్యేకించి ప్రశంసించారు. ఆ చిత్రంలోని రేఖలు, రంగులు ఆయనను విపరీతంగా ఆకర్షించాయి. ఆ ప్రత్యేక అభిమానానికి పాత్రుడయిన ఆ చిత్రకారుని పేరే తల్లావజ్ఝల శివాజి. మరీ అంతగా పాపులర్‌కాని చిత్రకారుడు. ఆయన మృదుస్వభావి. ఆ స్వభావ సంస్కారం ఆయన చిత్రాలలో రేఖలలో, రంగులలో మనకు కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి. ఉమర్‌ఖయామ్ రుబాయిలు అనేక పుస్తకాలుగా (ఇంగ్లీషు) మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. ఎక్కువ వాసిలో వేసిన చిత్రాలు కాలెండర్ ఆర్ట్‌కు అటు ఇటుగా ఉంటాయి. నిజమైన ఘజల్ రూపానికి ప్రతినిధిగా అనిపించవు. ఆ లేని లోటు శివాజీ తీర్చారు. పూర్తిగా అవ్యక్తంగా అనిపించని ఆధునిక రేఖలు, అలతి పొలతి రంగులు గజల్‌లోని భావాన్ని నిబిడీకృతం చేస్తూ వేసిన చిత్రాలు చదువరికి స్వాంతన కలిగిస్తూ పానశాలలోని ద్రాక్షసవాన్ని మనకు రుచి చూపిస్తుంది. వ్యక్తిగతంగా 'hats of to his brush work'.*

*– ఎన్నార్కె*

***అంతములేని ఈ భువనమంత పురాతన పాంథశాల, వి***
***శ్రాంతి గృహంబు, నందు నిరుసంజలు రంగులవాకిటుల్, ధరా***
***క్రాంతులు పాదుషాలు బహరామ్ జమిషీదులు వేనవేలుగా***
***కొంత సుఖించిపోయిరెటకో పెఱవారికి చోటంసగుచున్!***

కవిగా, విమర్శకునిగా, సినిమా స్క్రిప్టు రచయితగా, చలనచిత్ర పద్య – గేయ రచయితగా, నాటక ప్రయోక్తగా, ప్రకృతి ప్రేమికునిగా, దర్శకునిగా, అనువాదకునిగా, శిల్పిగా, చిత్రకారునిగా, ప్రకృతి ప్రేమికునిగా, జాతీయోద్యమ భావ ప్రచారకునిగా, అటు వైజ్ఞానిక జిజ్ఞాస, ఇటు సృజనాత్మక పిపాస సమర్థవంతంగా అక్షరరూపంలో సంగమించిన అసాధారణ వ్యక్తి 'కవికోకిల' దువ్వూరి రామిరెడ్డి గారి 'పానశాల' కావ్యంలోనిదీ పద్యరత్నం. 'కారే రాజులు...' అన్న పోతన పద్యంలోని 'విరక్తి'కి ధీటుగా ఈ పద్యంలో మధురమైన 'శక్తి' భావం అతి రమ్యంగా రూపుకట్టించటమే దువ్వూరి వారి ప్రతిభ (పానశాలను పారశీక భాషలో 'సరాయి' అంటారు). చివరికి ఒక చలనిచిత్రంలో (ప్రేమనగర్) కూడా చోటు సంపాదించి గాన గంధర్వుడు ఘంటసాల గళంలో అమరత్వాన్ని పొందినదీ పద్యం.

భావ కవితా రసాల కిసలయాన్ని తనివితీరా మెసవి మనకు బ్రహ్మానంద సదృశ కవితా గానామృతాన్ని అందించిన 'కవికోకిల' దువ్వూరి రామిరెడ్డి కావ్యరత్నమే 'పానశాల'. పానశాల రచనకు ముందే 1924లో వ్రాసిన 'కుంభరాణా' నాటకంలో ఈ పద్యం సొంతం కనిపిస్తుంది. అసలు పానశాల ఆంధ్రీకరణమే చిత్రంగా జరిగింది. కళత్ర వియోగ దుఃఖ భాజనుడయిన రామిరెడ్డికి అతని మిత్రుడు పిశుపాటి వేణుగోపాల్ హైదరాబాదు నుండి ఉమర్‌ఖయ్యాం 'రుబాయితు'ను పంపించాడు (ఖయ్యాం కాలానికే పర్షియాలో భౌతిక విజ్ఞానం పెరిగి మత మౌఢ్యం మీద

తిరుగుబాటు ప్రారంభమయ్యింది. అప్పటికే 'ఇబిక్ సీనా' అనే ప్రతిభాశాలి పర్షియాలో జన్మించి భోగ, యోగ జీవితాలకు ఒక సమన్వయం చూపాడు. అతని భావనాముద్ర ఖయ్యాంపై పడగా పుట్టిందే రుబాయత్). 1927 సెప్టెంబర్‌లో ఒక రాత్రి ఒంటిగంటకు కూడా రామిరెడ్డికి నిద్రపట్టలేదు. రామిరెడ్డి హృదయావస్థకు సరిపోయినట్లుగా ఆకాశం కూడా మేఘావృతమై ఉంది. దీపం వెలుగులో రుబాయతు చదువుతూ దాన్ని ఆంధ్రీకరిస్తే బాగుంటుందనే ఆలోచన రామిరెడ్డికి కలిగింది. అప్పటికప్పుడే రెండు రుబాయిలు అనువదించాడు. వర్షం మొదలయ్యింది. నిద్ర పట్టక పోవటంతో తెల్లవారు ఝామువరకు అనువాదం కొనసాగించాడు. ఆ రుబాయిల అనువాదమే మొదట 'భారతి'లో ప్రకటించాడు. ఆ తర్వాత మరిన్ని రుబాయిలను తర్జుమాచేసి మళ్ళీ భారతిలో ప్రచురించారు. రామిరెడ్డి దగ్గరున్న రుబాయతులో 692 రుబాయిలు ఉన్నాయి. వాటిని వర్గీకరించి హృద్యాలైన వాటిని గ్రహించి 125 పద్యాలుగా పానశాలను తీర్చిదిద్దాడు.

తన ఆంధ్రీకరణగూర్చి రామిరెడ్డి ఇలా అంటాడు: "నా ఆంధ్రీకరణము మూలమునకు టీకవలెనుండదు. తిక్కన, శ్రీనాథుడు మున్నగు అనువక్తల స్వాతంత్ర్యమును నేను వహించితిని. అట్లనుటవలన నా తర్జుమా మూలమునకంటె భిన్నముగానుండునని చెప్పుటకాదు. పారశీక జాతీయములలో ప్రకటింపబడిన భావము తెలుగులో అట్లే స్ఫురించుటకు ఆవశ్యకములైన మార్పులను, రసపోషణమునకువలయు కూర్పులను కావించితిని." తొలుత ఖయ్యామును గురించి కొన్ని పద్యాలు వ్రాస్తూ కవికోకిల ఇలా అంటాడు:

***ఓయీ ఉమ్రఖయ్యామ! నీవు చని యెన్నో ఏండ్లు పూండ్లాయె, లే***
***బ్రాయంపుంజెలి సాఖియున్ ధరణి గర్భంబందు నిద్రించె, గు***
***ర్తే యూపట్టిక నీ నిషాపురము జీర్ణించెంగదా! నీదు గో***
***రీయైనన్ సడలున్ రుబాయతొకటే నృత్యంకమై నిల్చెడున్!***

అతని చెలి సాఖిచూపులలోని మనోహరమైన ఆశారేఖ జీవితార్తి పరితప్త స్వాంతులకు ఎంతో సాంత్వనాన్ని కలిగిస్తున్నది. అదొక్కటి ఈ జీవితానికి చాలునంటూ–

***తెలుగుందోటల పచ్చబీళ్ళననురక్తిం బానశాలాప్రతి***
***ష్ఠలుగావించి త్వదీయ కావ్యరసభాండంబుల్ గులాబీలు, బు***
***ల్బులుపిట్టల్, మధుపాన పాత్రికలు, సొంపుల్ గుల్కుసాఖీయుభూ***
***తలనాకం బొనరింప నిల్పి రసికాంధ్ర ప్రీతిగావించెదన్!***

అని నిజంగానే భూతలస్వర్గం చేసి ఉమర్‌ఖయ్యాం రుబాయతును ఆంధ్రంలో అజరామరం చేశాడు.

*పానశాల* అనువాదం 1927 సంవత్సరాంతంలోనే పూర్తయినా అది 1928లో 'భారతి'లో ప్రచురింపబడింది. కానీ పుస్తక రూపంలో 1935 వరకు వెలుగు చూడలేదు. రామిరెడ్డి కృతుల్లో 'పానశాల'కు వచ్చినంతటి కీర్తి 'కృషీవలుడు'కు తప్ప మరి దేనికీ రాలేదు. ఉమర్‌ఖయ్యాం క్రీ.శ. 11వ శతాబ్ది ఉత్తరార్థంలో పారశీక దేశంలో 'రుబాయతు' రచించాడు. ఇంగ్లీష్‌లో ఫిట్జెరాల్డ్, ఫ్రెంచిలో జె.బి. నికోలె ఖయ్యాంను పాశ్చాత్యులకు పరిచయం చేశారు.

'పానశాల' అనువాదం 45 రోజుల్లో పూర్తయిందని రామిరెడ్డి డైరీలో వ్రాశాడు. దీనికై పూర్వరంగంలో రామిరెడ్డి ఎంతో శ్రమించాడు. 'ఫస్ట్ స్టెప్ ఇన్ పెర్షియన్' అనే పారశీ పుస్తకంలో రామిరెడ్డి ఇలా వ్రాసుకున్నాడు– "I began to study persian on 1-11-1919 and learnt to read well on 6-11-1919." పారశీ భాష నేర్చుకోవటానికి దర్భా సుబ్రహ్మణ్యశర్మ నెల్లూరులోని హబీబుల్లా సాహెబ్‌తో రామిరెడ్డికి పరిచయం కల్పించాడు. ఈ సాహెబ్ పరిచయంవల్ల రామిరెడ్డి సంప్రదాయసిద్ధమైన ఉచ్చారణ నేర్చుకున్నాడు.

'పానశాల' విశిష్టత ఏమంటే– ఖయ్యాంను సొంతం చేసుకొని, మూలంలో లేని సొగసులు జతచేసి దేశీయమనిపించేటంత స్వతంత్రంగా అనువదించాడు రామిరెడ్డి. కానీ రాయప్రోలువారి 'మధుకలశము' ఫిట్జెరాల్డ్ అనువాదానికి అనువాదం – అంటే ప్రతిధ్వనికి ప్రతిధ్వని కాబట్టి సారహీనంగా కనిపిస్తుంది. రామిరెడ్డి ఖయ్యాంను ఉద్దేశించి చెప్పిన పద్యం అక్షరసత్యం.

***పారసికన్న శ్రావ్యమయి పల్లవ కోమలమై సుధారసం***
***బూరెడు మా తెనుంగునుడి నొప్పిదమౌనటు నీదు భావముల్***
***ఏరిచి చేర్చి కూరిచితి నింపగు కావ్యము నో ఖయామ, నీ***
***పేరిక యావదాంధ్ర పృథివీస్థలి శాశ్వతమై తనర్చుతన్!***

తనలో పదకొండేళ్ళ బ్రతుకును పంచుకొని స్మృతిలో నిలిచిపోయిన ప్రథమ కళత్రం శేషమ్మకు పానశాలను అంకితం చేశాడు రామిరెడ్డి. *పానశాల* కావ్యవైశిష్ట్యాన్ని కూలంకషంగా తెలుసుకోవాలంటే ముందుగా పారశీక సాహిత్యాన్ని, ఖయ్యాం జీవితాన్ని – వ్యక్తిత్వాన్ని సింహావలోకనం చేసుకోవాలి. పారశీక వాఙ్మయం ప్రపంచ సాహిత్యంలో తలమానికమైంది. మృదుమధుర శబ్ద సారళ్యం, శ్రవణపేయమూగల ప్రాచ్యభాషల్లో పారశీక భాష ఒకటి. పారశీక ఛందస్సు మాత్రాగణ బద్ధమైంది. మస్నవి, కసీదా, గజల్, రుబాయ్ అనే నాలుగు కావ్యభేదాలు పారశీకంలో ప్రసిద్ధాలు. రుబాయి మన తేటగీతికి సరిపోలుతుంది. అది తేటగీతికి సరిపోలుతుందనీ, వేమన కూడా ఖయ్యాంవలెనే సుబోధకమైన తేటమాటలతో నిరలంకార సుందరంగా వ్రాశాడని అంటూనే రామిరెడ్డి ఎక్కడో తప్ప తేటగీతులను వాడక వృత్తాలనెందుకాశ్రయించాడో అనూహ్యం. రుబాయి ఆవిర్భావకాలంలో మన ద్విపదలాగే రెండు పాదాలను కలిగి ఉండేది. కానీ భావాన్ని వెలిబుచ్చుటానికి రెండు పాదాలు సరిపోవని రెండు ద్విపదలను ఒకటిగా చేర్చారు. అందువల్ల రుబాయికి నాలుగు పాదాలుంటాయి. ఒకటి, రెండు, నాలుగు పాదాలకు అంత్యనియమముంటుంది.

ఉమర్‌ఖయ్యాం 'నిషాపూరు'లో జన్మించాడు. ఆయన జన్మదినాన్ని నిర్ణయించడానికి ఖచ్చితమైన ఆధారాలులేవు. క్రీ.శ. 1015 నుండి 1035 లోపల ఖయ్యాం జన్మించి ఉండవచ్చని కొందరు ఊహించారు. కానీ హైదరాబాద్‌లో ఉండిన గోవింద తీర్థ స్వామిగారి పరిశోధనల ఫలితంగా ఉమర్‌ఖయ్యాం క్రీ.శ. 1048 మే 16 తేదీన జన్మించాడని ప్రపంచానికి తెలిసింది. ఖయ్యాం పూర్తిపేరు 'గియాసుద్దీన్ అబుల్ ఫతహ్ ఉమ్రబిన్ ఇబ్రహీమ్'. పారశీకులు తమ పేరు చివర తండ్రిపేరు జోడించుకుంటారు కాబట్టి ఈయన తండ్రి పేరు ఇబ్రహీమ్ అని తెలియవస్తున్నది. ఇతని కలంపేరు (తఖల్లుస్‌నామము – పెన్ నేమ్) ఖయ్యాం. ఖయ్యాం అనే పేరునుబట్టి అతను డేరాలు కుట్టేవాడని కొందరి భావన. ఖయ్యాం ముదివయస్సును మన శ్రీనాథ కవిసార్వభౌముని అంత్యకాలంతో పోల్చవచ్చు. ఆనాడు వీరభద్రారెడ్డి మరణించగా శ్రీనాథుడెలా రోదించాడో ఖయ్యాం కూడా అలాగే రోదిస్తూ తన హృదయ స్థితిని ఇలా చెప్పుకున్నాడు.

*మనమునకెక్కినట్టి యభిమానులు, మిత్రులు చెల్లినారు, యౌ*
*వనమధుమాసముం కుసుమ భారమురాలిచిపోయె, జీవితం*
*బను నరకంబు నందు నడుగంటె మధూళియు, నే దినంబు వ*
*చ్చెనొ మఱియెప్పుడేగెనొ దినింపదు హర్షవిహంగమిప్పుడున్!*

ఖయ్యాం క్రీ.శ. 1123లో నిషాపూరులో నిర్యాణం చెందాడు. తన మరణాన్నిగూర్చి ఆయనిలా అన్నాడు–

*పూవు జెక్కిళులందంబు తావిరంగు*
*నిక్కునీటునుగలదు వర్ణింపనేల?*
*భావి భూగర్భ విశ్రాంతి భవనమందు*
*మృత్యువెట్లు నన్నునలంకరింపగలదొ!*

ఖయ్యాం ఇతర పారశీక కవులలాగా గొప్ప కావ్యమేదీ వ్రాయలేదు. తన శాస్త్రపరిశ్రమలో అలసట, విసుగు కలిగినప్పుడు పద్యం వ్రాసి మిత్రులకో, పండితులకో వినిపిస్తుండేవాడు. ప్రత్యేక గుణాలతో అంతస్సారాలైన ఆ పద్యాలు ప్రజల రసనాగ్రాలమీద నాట్యమాడేవి.... కానీ పండితులు ఖయామును గొప్ప కవిగా ఎంచలేదు. పారశీక వాఙ్మయ చరిత్ర వ్రాసిన సి.పి. బ్రౌన్ కూడా ఆ పండితుల అభిప్రాయంతో ఏకీభవించి ఖయ్యాంను మూడవ తరగతి కవుల జాబితాలో చేర్చడం బాధాకరం. ఉద్గ్రంథం వ్రాయనంతమాత్రాన మహాకవి కాకపోతాడా? 'నిక్కమైన మంచి నీలమొక్కటిచాలు తళుకుబెళుకురాళ్లు తట్టెడేల?'

ఒకటి రెండు విషయాల్లో తప్ప ఖయ్యాంతో సరిపోల్చదగినవాడు ఆంధ్ర కవుల్లో వేమన ఒక్కడే కనబడుతున్నాడు. ఖయ్యాం భోగి – వేమన యోగి, ఖయ్యాం శాస్త్రోపాసకుడు – వేమన ఆత్మసాధకుడు, ఆయనది రక్తిమార్గం – ఈయనది విరక్తి మార్గం. పారశీక పండితులు ఖయ్యాంను లెక్కచేయనట్లే ఆంధ్ర పండితులు కూడా వేమనను కవిగా పరిగణించలేదు. నిరాడంబరమైన సహజ సౌందర్యంతో నేరుగా ప్రజల హృదయాంతరాల్లోకి చేరే పద్యాలు చెప్పిన కవి వారి దృష్టికి ఆనలేదు. అయినా పూర్వ ప్రబంధ కవులు రచించిన కావ్యాలెన్నో కొనవూపిరితో ఉండగా వేమన పద్యాలు సామాన్య ప్రజల నాల్కలమీద

నాట్యమాడుతూ సూక్తులై, సామెతలై ప్రచారంలో ఉండటమే వాని యోగ్యతకు అచ్చమైన నిదర్శనం. సాంఘిక దురాచారాలను, కపట గురువుల మతవ్యాపారాలను, భక్తుల కపట వేషధారణను నిర్భయంగా తెగనాడటంలో ఇద్దరికీ ఆవంతైనా మొగమాటంలేదు.

*'చిరిగిన బొంతలందొడిగి సిద్ధులమంచవివేకలోకమున్*

*మొఱగి చరించు దుర్జనుల........'*

అని ఉమర్‌ఖయ్యాం అంటే

*'మతపు వేషధార్లు మహిలోన పదివేలు*

*మూఢజనుల గలుప మూగుచుంద్రు'*

అంటాడు వేమన. ఖయ్యాం భోగలాలసుడు, 'రసపిపాస కావటంవల్ల ప్రకృతి రామణీయకతను – నిరాడంబరంగానైనా – అద్భుతంగా వర్ణించాడు. ఈ నిరాడంబరత్వమే ఖయ్యాం కవిత్వానికంతటి విశిష్టతను, ఖ్యాతిని చేకూర్చింది. ఒక్కొక్కసారి అలంకార ప్రియులకు, ఛాందసవాదులకు 'ఇదీ ఒక కవిత్వమేనా?' అనే సందేహం కలుగుతుంది. అతని నిరలంకృతంగా ఖయ్యాం రచన సాగిపోతుంది.

వేమన పద్యసంపుటంలాగా రుబాయత్ కూడా కలగూరగంప. విషయంలో ఏకత్వముండదు. ప్రతి పద్యం దేనికదే స్వతంత్రంగా ఉంటుంది. వేమన పద్యాలు కాలానుగుణ్యంగా రెండువందల నుండి నాలుగైదువేలవరకు పెరిగినట్లుగానే ఖయ్యాం రుబాయీలు 158తో మొదలై క్రమక్రమంగా 900 వరకు పెరిగిపోయాయి. మొట్టమొదట ఖయ్యాం రుబాయతు అనేది ఒకటుందని 1856లో కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో చరిత్రాధ్యాపకునిగా ఉండిన ఇ.బి. కోవెల్ అనే ఆయన కనుగొన్నాడు. 1859లో ఎడ్వర్డ్ ఫిట్జెరాల్డ్ రుబాయతును 75 పద్యాలలో ఆంగ్లంలోకి అనువదించాడు. మళ్ళీ 1868లో ఇంకా కొన్ని రుబాయిలను ఆంగ్లీకరించి 101 పద్యాలతో ద్వితీయ సంస్కరణాన్ని ప్రకటించాడు. అలా ఫిట్జెరాల్డ్ మొత్తం అయిదు సంస్కరణలను ప్రకటించాడు. చివరిదైన అయిదవ సంస్కరణంలో కూడా 101 పద్యాలే ఉన్నాయి. ఎందరో ఆంగ్లేయులు రుబాయతును తర్జుమా చేశారు. కానీ కళానైపుణ్యంలోనైతేనేమి, కవితా మాధుర్యంలోనైతేనేమి ఫిట్జెరాల్డ్ అనువాదమే శ్రేష్ఠమైనది. 'ఖయ్యాం రుబాయతు తేనెతుట్టె అయితే ఫిట్జెరాల్డ్ ఆంగ్లీకరణం తేనె నింపిన గిన్నె' అంటాడు రామిరెడ్డి. పై నేపథ్యంలో 'పానశాల' కావ్యాన్ని పరిశీలనగా చదివితే ఉమర్‌ఖయ్యాం జీవనసరళి, జీవన వేదాంతం మనకు అర్థమవుతుంది.

భూత, భవిష్యత్కాలాలను పట్టించుకోకుండా వర్తమానం గురించే ఆలోచించాలి అంటూ ఖయ్యాం ఇలా చెబుతాడు–

*గతము గతంబె, యెన్నటికి కన్నులగట్టదు, సంశయాంధ సం*

*వృతము భవిష్యదర్థము, వివేకవతీ! యొక వర్తమానమే*

*సతతమవశ్యభోగ్యమగు సంపద, రమ్ము విషాద పాత్ర కీ*

*మతమున తావులేదు క్షణమాత్ర వహింపుము పానపాత్రికన్!*

ఖయాము జీవన సరళిని ఈ క్రింది పద్యంలో విశదీకరిస్తున్నాడు–

*నిరతము పానమత్తులము, నీతులు గీతులు తెల్పంబూన కో*

*విరసుడ! పానపాత్ర మలివెచ్చని ద్రాక్షరసంబు దప్ప మా*

*సరసపు గోష్ఠి వేరొక విచారములేదు – ప్రియాంగనామనో*

*హర మధురాధరామృతము నానుటొ, యాసవ మానుటోగదా!*

ఒకరికి బానిసగా బ్రతకనవసరంలేదు అంటున్నాడు ఉమర్‌ఖయ్యాం–

*రెండు దినములకొకతూరి యెందురొట్టె*

*బోసిముంతెడు చలినీళ్ళు పుట్టునేని*

*ఏలనినుబోలువానికి కేలుమోడ్చు*

*నొకనికి గులామలై యెందుకూడిగింప?*

బ్రహ్మరాతను దాటడానికి ఎవ్వరికీ సాధ్యంకాదు. ఎవరికి ఎంత ప్రాప్తమో అంతటితోనే తృప్తిపడాలి అంటాడు ఖయ్యాం–

*విషమునమృతంపు మనిబుద్ధ విధి కలంబు*

*ముంచి లోకుల నుదుట లిఖించు మొదట*

*కరగ దబుబేద కన్నీటి కాల్వనదియు*

*పరమ భక్తుని యనుతాప వహ్నివెదదు!*

*కాన నెదిప్రాప్తమైనను గారవించ*

*వలయు – వలదని యేర్పరుపంగలేవు,*

*అంబరంబును నీకు సహాయపడదు–*

*తానె తలక్రిందుగాగ్రేలు తడవునిలదు!*

మనిషి మరణానంతరం మన్నులో కలిసిపోతాడు.

ఆ మన్నును బాగా కలిపి కుండలుగా చేస్తాడు కుమ్మరి. ఈ సత్యాన్ని ఖయ్యాం వివరించిన వైనం చూడండి–

*నిన్నటిరోజు కుమ్మరిని నే గనుగొంటి బజారువీధిలో*
*మన్నొక ముద్దజేసి మదమం జెడఁద్రొక్కుచునుండ వానితో*
*తిన్నగమందలించెనదిదీనత మెల్లగ నల్ల త్రొక్కుమో*
*యన్న! యెరుంగవేనను? నొకప్పుడు నీవలెనందగాడనే!*

ధరణీనాథుడు, దరిద్రుడు మరణించిన తర్వాత ఒకేచోట పూడ్చబడతారంటాడు–

*మానగదోయి! యెందనుక మానవ మృత్తికదెచ్చిముంతలున్*
*బానలు చేసెదీవు, మరవందగదందరునట్టియాట, య*
*జ్ఞానముచే నిజం బెఱుగజాలవు – నేను గ్రహించితిన్, ఫరీ*
*దూను శిరంబు కాంచుమ యదో! దరిచేసి కరంబు దగ్గరన్!*

తానొక తత్త్వవేత్తనని ప్రజలు భ్రమిస్తుంటారంటూ ఖయ్యాం అంటాడిలా–

*నేనొక తత్త్వవేత్తనని నిందయొనర్చిరికాని వారు, నా*
*మానసవృత్తి వారలణుమాత్రమెరింగిన అట్టులందురే?*
*కాని, మఱేమి దేవుడెరుంగడె మనంబు, వృథాకులాయమౌ*
*యీ నిలయంబుచేరితి, గ్రహింపకనసాధ్యము జన్మమర్మముల్!*

దొంగ సన్యాసులు, దొంగ గురువులు చేసే దౌష్ట్యాలకంటె ప్రియవధూటి అందించే మధుసేవనం మేలుకాదా? అంటున్నాడు ఖయ్యాం.

*చిరిగిన బొంతలందొడిగి సిద్ధులమంచవివేకలోకమున్*
*మొఱిగి చరించు దుర్జనుల మోసముకంటెను మేలుగాదె యో*
*గురువరా! కామినీ ప్రణయగోష్ఠుల వాసవసేవ, త్రావినన్*
*నిరయముదప్పదన్న మరి నీ సురలోకముపాడుగాదొకో?*

భర్తృహరి చెప్పినట్లుగా ఖయ్యాం 'జ్ఞానుల్లో జ్ఞాని.' రామిరెడ్డి మాటల్లోనే వినండి–

*జీవితంబెల్ల బహుశాస్త్రసేవలందు*
*గడిపితి, రహస్యములు కొన్ని గ్రాహ్యమయ్యె*
*నిపుడువివేక నేత్రమ్ము విప్పిచూడ*
*తెలిసికొంటి నాకేమియు తెలియదంచు!*

'ప్రపంచాన్ని ప్రస్తుతమున్నట్లు కాకుండా మరొక రీతిలో సృష్టించమ'ని దేవుని కోరుతూ, 'ఇలా అన్నానని నన్ను అల్పాయుష్కుని చేస్తావో లేక శతాయుష్కున్ని చేస్తావో' అని అడుగుతున్నాడు ఖయ్యాం–

*ఈ విషవృక్ష లోకమును నింకొకరీతి పునఃసృజింపుమం*
*చే వినతిన్ వచింతు నది ఇష్టమయేని రచించు చెచ్చెరన్*
*దేవ! మదీయ నామమును దెప్పున బట్టిక కొట్టివేతువో*
*నా వయసున్ శతాధికమనన్ సవరింతువొ చూడగావలెన్!*

ఏదేమైనా ఖయాం వయస్సును శతాధికం చేశాడు దేవుడు. ప్రఖ్యాత ఆంధ్రకవులెందరో ఖయ్యాంను ఆంధ్రీకరించాలని ప్రయత్నించి ఆశాభంగం పొందగా రామిరెడ్డి మాత్రం రసికాంధ్ర జన ప్రీతికావించినాడు. దానికి ముఖ్యకారణం తాను ఖయ్యాం హృదయ ప్రవేశం చెయ్యడమేకాక ఆ ఖయ్యాంను తన హృదయావిష్టుణ్ణి చేసుకోవడమే! రామిరెడ్డి ప్రకృతి సౌందర్యారాధనకు ఖయ్యాం రసవాహిని సంపూర్ణ సంజీవిని అయ్యింది. రామిరెడ్డి 'పానశాల' తెలుగు రసికుల పానశాల అంటారు శ్రీపాద గోపాలకృష్ణమూర్తి. పానశాల కావ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత మానవ జీవితం 'కష్టాల కడలి' అనేకంటే 'సంతోష జలధి' అనిపించక తప్పదు. ఇది కేవలం కామప్రవృత్తి కలిగిన కాల్పనిక కావ్యం కాదు – ఒక ఆధ్యాత్మిక సందేశమున్న రసమయి చిత్రకావ్యం. సూఫీ మతసంప్రదాయంలో 'ద్రాక్షాసవం' బ్రహ్మానందానికి ప్రతీక. అందుకే 'సుర', 'మద్య' శబ్దాలను రామిరెడ్డి కావ్యంలో ఎక్కడా ప్రయోగించలేదు.

'మన మాతృభాష అయిన తెలుగులో చెప్పిన 'పానశాల' మాతృకకే వన్నెతెచ్చింది.'

* * *

*పానశాల*

*రచయిత : 'కవికోకిల' దువ్వూరి రామిరెడ్డి*

*పేజీలు : **131** (మల్టీ కలర్)*

*వెల : ₹ **299/-***

*ప్రతులు : ఆర్ట్ & లెటర్స్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, నవచేతన పబ్లిషింగ్ హౌస్, నవోదయ బుక్‌హౌస్, తెలుగు బుక్‌హౌస్‌లలో లభ్యం.*

**డా. కోడూరు ప్రభాకరరెడ్డి**
**ప్రొద్దుటూరు, ఫోన్: 944 017 0808**

# చదవండి...

- ఎన్నార్కె




**సుదర్శనంగారికి :** (సాహితీ బంధువులు వ్రాసిన కొన్ని ఉత్తరాలు). ఇందులో వ్రాసిన వారి ఆలోచనల మూలలలో, ఆనాటి సాహితీ వాతావరణం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. సాహిత్య ప్రియులు ఇష్టపడే పుస్తకం.

*పేజీలు : 192, వెల ₹ 150/- ప్రతులకు : నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ మందిరం ఎదురుగా, బడిచౌడి, హైదరాబాద్.*




**స్నేహగీతాలు :** కబీర్ హిందీ దోహాలకు డాక్టర్ భూసురపల్లి వేంకటేశ్వర్లు చేసిన స్వేచ్ఛానువాదం. రచయిత డోలు ఘటం వాయిద్యంలో తనదంటూ ప్రత్యేకతను సాధించుకున్న వాద్య నిపుణుడు. సంగీత సాహిత్యంలో నిష్ణాతుడైన భూసురపల్లి నిజమైన భూసుర కల్పవల్లి. మంచి సాహిత్యం చదివామన్న భావనను కలగజేస్తాయి ఈ 508 ఆటవెలదులు.

*పేజీలు : 102, వెల ₹ 120/- ప్రతులకు : డా. భూసురలపల్లి వేంకటేశ్వర్లు, గవర్నమెంటు మహిళా డిగ్రీ కళాశాల, గుంటూరు. ఫోన్: 984 836 1627 మరియు అన్ని విశాలాంధ్ర అన్ని బ్రాంచ్‌లు.*




**గుంటూరు జిల్లా ప్రముఖ కవులు :** (క్రీ.శ. 1100 నుండి 1900 వరకు) రచయిత డాక్టర్ వెన్నిసెట్టి సింగారావు. ఆనాటి తరానికి చెందిన కవుల గురించి తెలియజెప్పే రచన. అమరావతీయం శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురింపబడ్డ వ్యాసాల సంపుటిది.

*పేజీలు : 60, వెల ₹ 80/- ప్రతులకు : డా. పి. సూర్యకుమారి, ఇం.నెం. 371, పార్క్ రోడ్, కృష్ణా నగర్, 6వ లైన్, గుంటూరు-522 006. ఫోన్: 93930 15584, 0863-235238.*




**బ్లాగు పుస్తకం :** రచయితలు సుజాత, రహమాన్లు. టెక్నికల్ ఎడిటరు కిరణ్‌కుమార్. బ్లాగును ఎలా ప్రారంభించాలి, బ్లాగుల గురించి మంచి చెడులాంటి విషయాలపై వివరణ తెలిపే పుస్తకం.

*పేజీలు : 104, వెల ₹ 230/- ప్రతులకు : ఫోన్: 944 040 9160.*

**మల్లెచెట్టు చౌరస్తా కవిత్వం :** కరీంనగర్‌లో ఉన్న కవిత్వ వాతావరణంలోంచి, కవితా వారసత్వం నుంచి వస్తున్న కొత్త కవి మమత వేణు. సామాజిక స్పృహ ఉంది. ముందు తరాలకు అందించే కవితాభినివేశం ఉంది.

*పేజీలు : 100, వెల పేర్కొనబడలేదు. ప్రతులకు : మమత కంచె, ఇం.నెం. 5-5/3/2, శాతవాహన కాలని, రేకుర్తి, కరీంనగర్.*




**ఎందరో గురువులు! :** (కథలు - కథనాలు - కవితలు) కె. సాంబశివారెడ్డి - చరిత్ర అధ్యాకులు. డా. తమటం రామచంద్రారెడ్డి తెలుగు అధ్యాపకులు పదవీ విరమణవేళ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాకల చిత్తూరు జిల్లావారి ప్రచురణ. సంపాదకులు డా. జి. శ్రీనివాసులురెడ్డి, రీడర్, గణితశాస్త్రం. విద్యార్థులలో విజ్ఞానాన్ని పెంచటంకోసం ఎంపిక చేసిన 15 వ్యాసాల సంపుటి.

*పేజీలు : 96. మిగిలిన వివరాలు లేవు.*




**ఎందుకు? :** ఆటలు, కథలు, డ్రామాలు, పాటలు, క్రాఫ్ట్, పిల్లలకు ఎందుకు? సమాధానం కోసం వై. మాలతీకృష్ణ రాసిన ఈ పుస్తకం చదవవలసిందే!

*పేజీలు : 39, వెల ₹ 20/- ప్రతులకు : మంచి పుస్తకం, 12-13-439, వీధి నెం. 1, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్: 949 074 6614.*

*అపురూప పబ్లిషర్స్, ప్లాట్ నెం. 494/ఎ, రోడ్ నెం. 22, జూబ్లీ హిల్స్, హైదరాబాద్ వారు ఈ మధ్య డా. అమృతలతగారు ఇంతకుముందు 2005 సంవత్సరాల ప్రచురించిన 5 పుస్తకాలను తిరిగి ప్రచురించారు. 'ఓటెందుకు?' అన్న ఆరవ పుస్తకం మొదటిసారిగా సెప్టెంబర్ 2017లో ప్రచురితమైంది.*

*రచయిత్రి అమృతలత పేరుప్రఖ్యాతులుగల బెస్ట్ ఎడ్యుకేషనిస్టు. ఆమె ఎన్నో అవార్డులు దక్కించుకోవటమేకాక, తానుగా అమృతలత అపురూప అవార్డు పేరుతో 2013 నుండి అనేకమంది కృషీవరులకు పురస్కారాలు ప్రదానం చేస్తున్నారు. ఆమె నిజామాబాద్‌లోని, ఆర్మూర్ నివాసం.*



**ఓటెందుకు? :** ఇందులో 12 సందేశాత్మక నాటికలున్నాయి. మధ్యమధ్యలో కార్టూన్లను కూడా ప్రచురించారు. విషయాన్ని సూటిగా వ్యంగ్యాత్మకంగా చిత్రించారు. అట్టమీద బొమ్మ బాలిది. వెనుక కవరు డిజైన్లు మన్నెం శారదవి.

*పేజీలు : 61, వెల ₹ 50/-*



**స్పందన :** కథాసంపుటి. మనుషుల బలహీనతలపై, సామాజిక, ఆర్థిక, స్త్రీ, పురుష అసమానతలపై మనోవిశ్లేషణతో సాగిన తీరు మనోహరంగా ఉంది.

*పేజీలు : 206, వెల ₹ 150/-*



**చుక్కలలోకం చుట్టొద్దాం! :** పిల్లల నాటికలు. పిల్లలు వేసే ప్రశ్నలకు సమాధానమిచ్చుకోలేక తికమకపడే పెద్దలనే మనం చూస్తున్నాం. సరదాగా సాగిన 11 చిన్న నాటికల సంపుటి. బాలి, బాబు, శారద కవర్ డిజైన్ చేశారు.

*పేజీలు : 126, వెల ₹ 100/-*



**గోడలకే ప్రాణముంటే:** నాటికల సంపుటి. సామాజిక చైతన్యం కలిగించే హాస్యనాటికలు. బాలి, మన్నెం శారద కవరు డిజైన్ చేశారు.

*పేజీలు : 120, వెల ₹ 100/-*



**సృష్టిలో తీయనిది :** అందం, చదువు, కళారాధన, మంచితనం కలబోసిన అనురాగాల్ని చిత్రించిన నవల. అట్టమీద బొమ్మ బాలి, అట్టచివరి డిజైను మన్నెం శారద.

*పేజీలు : 104, వెల ₹ 100/-*



**అమృతవర్షిణి :** రచయిత్రి ఇంతకు పూర్వం 'అమృత్ కిరణ్' పక్షపత్రికలో వివిధ అంశాలపై సంపాదకీయాలను రూపొందించారు. మొత్తం 45 వ్యాసాలు.

*పేజీలు : 140, వెల ₹ 100/- పై ఆరు పుస్తకాల కోసం డా. అమృతలత, విజయ హైస్కూల్, ముబారక్ నగర్, నిజామాబాద్-503 003. ఫోన్: 08462 - 237887, 984 886 8068.*



**హృద్యమైన భావం - పద్యమైనవేళ:** రచయిత బోసు మాష్టారు అని అందరిచేతా పిలువబడే గోపు చంద్రరావు. రచయిత అందరి మన్ననలను పొందిన ఉత్తమ ఉపాధ్యాయుడే కాక గొప్ప మానవతావాది కూడా. తన చుట్టూ ఉన్న సమాజం, మిత్రుల గురించి ఆయన రాసిన చక్కటి కవితల సంపుటిది. బోస్ ట్రస్టు వారి ప్రచురణ.

*పేజీలు : 35, వెల పేర్కొనబడలేదు. ప్రతులకు: ఫోన్: 986 676 4373.*



**సాహితీ దీపికలు :** రచయిత్రి సంప్రదాయం పల్లెగౌరవం, అభ్యుదయకరమైన ఆధునికతపట్ల సమాదరణ కలిగిన కె. అరుణా వ్యాస్. 'నా భావన' పేరుతో రేడియో శ్రోతలను ఆకట్టుకున్న ప్రసంగ రచనలతోబాటు మరికొన్ని వ్యాసాల సంపుటిది.

*పేజీలు : 62, వెల ₹ 40/- ప్రతులకు: నవచేతన బుక్ హౌస్, విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవ తెలంగాణా బుక్ హౌస్‌ల అన్ని బ్రాంచిలు.*

# మిసిమి

మాసపత్రిక

**మీరు చందాదారులుగా చేరండి** **బహుమతిగా పంపండి**

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీకు – మీ స్నేహితులకు కలిపి రెండు సంవత్సరాల చందా కట్టి మీరూ మా నుంచి బహుమతి పొందవచ్చు. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా **మిసిమి** పేర ₹ 720/- (రెండు సంవత్సరాలకు) పంపి, చిరునామా వివరాలు మాకు ఫోన్ ద్వారా, ఇ-మెయిల్ ద్వారాగానీ, వాట్సాప్ (నెం : 99 49 51 65 67) ద్వారా గానీ తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని మంచి సారస్వతంతో పలకరించినట్లే......



**రెండు సంవత్సరాల చందాదారులకు**
**(₹ 720+50/-)**
***నోబెల్ సాహిత్య పురస్కారోపన్యాసాలు***
**గ్రంథం బహుమతి**

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | **STATE BANK OF INDIA** |
| Account | : | **MISIMI** |
| A/c. No. | : | **10261569316** |
| Branch | : | **Saifabad, Hyderabad, INDIA** |
| IFS Code | : | **SBIN0007315** |

(ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు రూ. 50/- బ్యాంకు ఛార్జీలు కలపండి.)



**రెండు సంవత్సరాల చందాదారులకు**
**(₹ 720+50/-)**
***పురస్కార సాహిత్యం***
*(కేంద్ర సాహిత్య అకాదెమీ పురస్కారం పొందిన గ్రంథాల విశ్లేషణ)*
**గ్రంథం బహుమతి**



**మూడు సంవత్సరాల చందాదారులకు**
**(₹ 1080+50/-)**
***బైరన్ (జీవిత కథ)***
**గ్రంథం బహుమతి**



**నాలుగు సంవత్సరాల చందాదారులకు**
**(₹ 1440+50/-)**
***నా కథ చార్లీ చాప్లిన్***
**గ్రంథం బహుమతి**






**అయిదు సంవత్సరాల చందాదారులకు**
**(₹ 1800+50/-)**
***మిసిమి చిత్ర కళా నీరాజనం***
**పుస్తకం బహుమతి**

**మిసిమి**
మాసపత్రిక
Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. **040-27645536.**



నిన్నటి కల

MISIMI / మిసిమి
RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2018-20
Date of Posting: On 29th & 30th of every month.
Date of Publication: 25.02.2018



అమాయకత్వం